ఆర్షవిద్యా తరంగాలు - 13

Inspired by the teachings of

**SWAMI PARAMARTHANANDAJI**

# KAIVALYOPANISHAD
# కైవల్యోపనిషత్

స్వామి పరమార్థానంద



మయ్యేవ సకలం జాతం

స్వామి పరమార్థానంద బోధనల స్ఫూర్తితో

వారి ఆశీస్సులతో

తెలుగు సేత - మద్దూరి / కస్తూరి రాజ్యశ్రీ

First edition - Year 2020 1000 copies
Title - KAIVALYOPANISHAD
Sanskrit Support - Sri Desu Chaitanya Krishna

For Copies

Sri Sai Ganesh Book House
Plot No: 124, Road No 4,
Opp, Hanuman Temple Rd,
Ramakrishnapuram, L. B. Nagar,
Hyderabad, Telangana 500035
Mobile: 099496 60465

K V Raghava Rao
C - 804 Aparna Cyberzon
Nallagandla, Hyderabad 500019
Mobile: 9849092368
Email: raghavkasturi@gmail.com
for softcopy www.telugubhakti.com

Price Rs. 150

# కృతజ్ఞతలు

## ఆకాశంలో మెరిసిన స్నిగ్ధ మనోహరం
## కస్తూరి పరిమళాల కుందనపు చందనం

'పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది,' అంటారు. శ్రీస్నిగ్ధ పాలుగారే వయస్సులోనే దైవభక్తిని అలవరుచుకుంది. తెలుగుభక్తిపేజెస్ అనే వెబ్‌సైట్‌కి ప్రేరణ అయింది. తరువాత విష్ణుసహస్రనామం, శ్రీసూక్తం, హనుమాన్ చాలీసా నేర్చుకుని, రోజూ వాటిని పారాయణ చేస్తుంది. తన మొదటి సంపాదన భగవంతునికి సమర్పించింది.

భక్తికి తోడు ఆర్తికూడా మెండుగా ఉంది. అన్నార్తులను చూస్తే చలించి పోయి చేతిలో ఉన్నది ఇచ్చేస్తుంది. బంధుకోటి మీద ప్రేమ ఎక్కువ. స్నిగ్ధ పేరుకు తగ్గట్టు స్నేహశీలి. ఎవరికి ఏ అవసరమున్నా నేనున్నానని స్నేహహస్తం చాస్తుంది. పిల్లుల్ని, కుక్కల్ని చూస్తే మైమరిచి పోతుంది. తన జీతంలోంచి కొంతభాగం వీటన్నిటికీ ఖర్చు చేస్తుంది. తనకు ఆ విధంగా తెలియకుండానే పంచమహాయజ్ఞాలు చేసే మంచి మనసుంది.

పూవుకు తావి అబ్బినట్టుగా, ఆమె మంచి మనసుకు చలించి పోతాడు స్నిగ్ధ జీవితభాగస్వామి కుందన్. స్నిగ్ధను అత్తారుబత్తెంగా కుందన్ చూసుకుంటే, కుందన్ కనుసన్నలలో మెలుగుతుంది స్నిగ్ధ.

మా కంటిపాప శ్రీస్నిగ్ధ, మా కంటివెలుగు కుందన్ వయస్సులో చిన్నవారైనా ఈ బ్రహ్మయజ్ఞంలో మేము సైతం అంటూ ముందుకు వచ్చారు.

మా అమ్మాయి **శ్రీస్నిగ్ధ**, మా అల్లుడు **ఆకాశం కుందన్ కుమార్‌లు కైవల్యోపనిషత్** పుస్తకప్రచురణ అనే **బ్రహ్మయజ్ఞానికి** ఆర్థికసహాయాన్ని అందించారు.

మా చిన్నారులకు ఆ భగవంతుడు ఆయురారోగ్య ఐశ్వర్యాలను, ఆధ్యాత్మిక చింతనను సమృద్ధిగా ఇవ్వాలని వేడుకుంటున్నాము.

**–రాఘవరావు, రాజ్యశ్రీ**

# విషయసూచిక


| | |
|---|---|
| 1. కృతజ్ఞతలు | 3 |
| 2. ముందుమాట | 5 |
| 3. జీవితపరమార్థం బోధించే పరమార్థానంద స్వామి | 8 |
| 4. మయ్యేవ సకలం జాతం | 10 |
| 5. స్పందన | 13 |
| 6. కైవల్యోపనిషత్ ఉపోద్ఘాతము | 15 |
| 7. శాంతిపాఠం | 36 |
| 8. కైవల్యోపనిషత్ | 41 |
| 9. కైవల్యోపనిషత్ – సారాంశము | 165 |
| 10.కైవల్యోపనిషత్ – మంత్రములు | 174 |

# ముందుమాట

ఋషీకేశ్ సన్న్యాసులకు ఒక సంప్రదాయమున్నదట. అదేమిటంటే కైవల్యోపనిషద్ పారాయణమొకటే మోక్షానికి చాలునని. అంటే ఆ ఉపనిషద్‌ని శ్రవణ, మననాల ద్వారా అర్థం చేసుకుని, రోజూ పారాయణ చేయడమే నిదిధ్యాసన అయితే, జ్ఞాననిష్ఠ ద్వారా కైవల్యం (అద్వైతజ్ఞానం) లభిస్తుందని చెప్తారు. అందుకే ఈనాటికీ అనేకమంది సన్న్యాసులు దీనిని పారాయణం చేస్తుంటారట. ఈశ్వరానుగ్రహం వలన మా గురువుగారు పూజ్యశ్రీ స్వామి దయానంద సరస్వతిగారు నాకు సన్న్యాసదీక్షనిచ్చి, కైవల్యోపనిషద్ పారాయణం చేయమని ఆదేశించారు. అప్పటినుంచీ రోజూ చదువుతూ, శ్రీ పరమార్థానందస్వామివారి, పూజ్య స్వామీజీవారి వివరణలు వింటుంటే, ఉపనిషత్తుల ఏకవాక్యత తెలియజేస్తున్న జీవబ్రహ్మైక్యజ్ఞానం స్పష్టమవుతున్నది. భగవంతునికి, గురువులకు నాయొక్క కృతజ్ఞతలు.

ఈ ఉపనిషత్తులో ఋషి ఆశ్వలాయనుడు, తన గురువు చతుర్ముఖ బ్రహ్మాజీని భక్తితో సమీపించి – సత్పురుషులు ఏ బ్రహ్మవిద్యను సదా పఠించినందువలన పరాత్పరుడైన బ్రహ్మను తమ స్వరూపంగా తెలుసుకుని కైవల్యాన్ని పొందుతారో అటువంటి బ్రహ్మవిద్యను "అధీహి భగవః" అని కోరుకుంటాడు. ఆ శిష్యుని పురుషార్థ నిశ్చయాన్ని గ్రహించి బ్రహ్మవిద్యను బ్రహ్మాజీ "శ్రద్ధాభక్తిః ధ్యానయోగాదవైహి" అంటే శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారానే ఈ జ్ఞానాన్ని పొందాలి అని తెలియజేసారు. అంతేగాక, ఈ ముఖ్యసాధనమైన జ్ఞానానికి కావలసిన సహాయకారి సాధనాలు చెప్పబడ్డాయి.

ఈ జ్ఞానం కర్మలచేత గాని, సంతానము వలన గాని, ధనము వలన గాని కలుగదు; సన్న్యాసము వలన మాత్రమే (వివిదిషా సన్న్యాసము గాని, ఆంతర సన్న్యాసం గాని) లభిస్తుంది.

సంశయ, విపర్యయరహిత జ్ఞానం కోసం సగుణ ఈశ్వరధ్యానం (ఇందులో నీలకంఠుడు, త్రిలోచనుడైన సాంబశివధ్యానం) నిదిధ్యాసన కోసం బ్రహ్మలక్షణాలను వివరించాడు. స్వగురువుని ధ్యానించి, ఈశ్వరధ్యానం చేయాలని చెప్పబడింది.

అంతేకాక ఓంకార విచారణ అనే జ్ఞానాభ్యాసం ద్వారా అవిద్యాపాశం దహింపబడి, ఆ సనాతన పూర్ణబ్రహ్మనే తన స్వరూపమని తెలుసుకున్న ముముక్షువు తనే సత్యం, తక్కినవేవైనా మిథ్యే అని తెలుసుకుని కైవల్యాన్ని పొందుతాడు. తక్కిన ఉపనిషత్తులలా కాక, మొదట బ్రహ్మస్వరూపాన్ని వివరించి, ఆ బ్రహ్మయే మాయాఉపాధితో, జీవునిగా మూడు అవస్థలలో స్థూల, సూక్ష్మ, కారణ ప్రపంచాలను అనుభవించి, సుషుప్తిలో స్థూల, సూక్ష్మప్రపంచాలు లీనమై, తమస్సు చేత కప్పబడినందువలన ఆనందాన్ని పొంది, మళ్ళీ కర్మవశాత్ మేలుకుంటాడు అని తెలియజేసారు. ఈ విధంగా జీవుడు శరీరత్రయంలో క్రీడిస్తూ మూడు రకాల అనుభవాలను పొందుతాడు. ఈ మూడు అవస్థలలో మార్పు లేకుండా ఉన్న సచ్చిదానంద ఆధారమే బ్రహ్మ అనీ, ఆ బ్రహ్మమే నీవు – "తత్త్వమేవత్వమేవతత్" అని గురువు మహావాక్య ఉపదేశము చేస్తే ఉత్తమ అధికారి అయిన ఆశ్వలాయనుడు ఉపనిషద్ వాక్యంలో శ్రద్ధ కలవాడు గనుక తానే మూడు అవస్థలకు ఆధారమైన సచ్చిదానంద బ్రహ్మ అని నిశ్చయంగా గ్రహించి, తన జ్ఞానం ఈ క్రింది విధంగా వ్యక్తీకరించాడు.

1) మూడు శరీరాలతో, మూడు అవస్థలలో అనుభవించే భోగ్యం, భోక్తా, భోగాల కన్నా విలక్షణమైన సాక్షి, చిత్స్వరూపుడైన నేను; సదాశివుడను.

2) నానుండే సర్వం పుట్టి, ప్రతిష్ఠింపబడి లయమవుతుంది కనుక, జగత్కారణ బ్రహ్మను నేనే. అద్వయుణ్ణి (కార్యం అంతా మిథ్య కనుక).

3) ఉపాధులైన జ్ఞానేంద్రియాలు, మనస్సు, బుద్ధితో నేను అన్నింటినీ తెలుసు కుంటాను గాని, వాటికి ఉనికినీ, శక్తినీ ఇచ్చే చిత్స్వరూపమైన నన్ను ఏ ఇంద్రియాలు తెలుసుకోలేవు.

4) అనేక వేదాంత వాక్యాల ద్వారా నేనే వేద్యుణ్ణి, వేదాంతకృత్, వేదవిత్‌ని.

5) నేను అకర్తాభోక్తా కనుక నాకు పుణ్యపాపాలు, నాశములేదు. పంచభూతాలు (మిథ్యారూపంలో) నాలోనే ఉన్నాయి. నేను వాటి మీద ఆధారపడని సత్యాన్ని.

ఈ విధంగా జ్ఞానం ద్వారా తానే పరమాత్మనని తెలుసుకుని ముక్తుడవుతాడు. ఈ జ్ఞానం సప్రతిబంధమైనదైతే, ప్రతిబంధాలు తొలగడానికి, ఎల్లప్పుడూ, లేక రోజుకి ఒక్కసారైనా రుద్రపారాయణం చేయాలని ముముక్షు సన్న్యాసికి ఉపనిషద్ ఆదేశమిచ్చి, ప్రతిబంధరహిత బ్రహ్మాత్మైక్యజ్ఞానం ద్వారానే కైవల్యం లభిస్తుందని ముగించబడింది (జ్ఞానాదేవతు కైవల్యం).

అంతరంగ, బహిరంగ సాధనల నుండి గమ్యమైన మోక్షం వరకూ చాలా క్లుప్తంగా తెలియజేసిన ఈ ఉపనిషద్ సమగ్రమైనది. దీనిని సరళశైలిలో, తెలుగువారికి సులభంగా అర్థమయ్యేలా అనువదించిన శ్రీమతి మద్దూరి రాజ్యశ్రీగారిని గురువులు, భగవంతుడు జ్ఞాననిష్ఠతో ఆశీర్వదించాలని ప్రార్థిస్తున్నాను.

ఓం తత్ సత్

**స్వామిని శివాత్మానంద సరస్వతి**
హైదరాబాద్

# జీవితపరమార్థం బోధించే పరమార్థానంద స్వామి

**యద్యప్యస్మా ఇమామద్భిః పరిగృహీతాం ధనస్య పూర్ణాం**
**దద్యాదేతదేవ తతో భూయ ఇత్యేతదేవ తతో భూయ ఇతి॥**
**ఛాందోగ్యం 3-11-6**

శ్రద్ధలేని వ్యక్తి, ఒకవేళ చుట్టూ సముద్రం ఉండి, ధనంతో నిండి ఉన్న ఈ భూమండలాన్ని గురువుకు ఇచ్చినా, అతనికి బ్రహ్మవిద్యను బోధించకూడదు. ఎందుకంటే ఈ బ్రహ్మవిద్యే దానికంటే గొప్పది.

ఇది శ్రద్ధలేని వ్యక్తి గురించి! శ్రద్ధ ఉన్నవాళ్ళు నేర్చుకోవాలంటే పరమార్థానంద స్వామీజీని మించిన గురువు మీకు ఎక్కడా దొరకరని నేను నొక్కివక్కాణించి చెపుతున్నాను. మేము ఉపనిషత్తులను బోధిస్తూ, వాటిని పుస్తకరూపంలో (ఇప్పటికి 12 వచ్చాయి) మీ ముందుకు తీసుకు రాగలుగుతున్నామంటే దానికి కారణం అనన్యగురువు, శ్రోత్రియ బ్రహ్మ నిష్ఠ అయిన **పరమార్థానంద స్వామీజీ** మాకు గురువుగా లభించటమే. స్వామీజీ ఈ పుస్తకాల విషయంలో మమ్మల్ని దీవిస్తూ, 'కైవల్యోపనిషత్ రాశావా?' అని అడిగారు. అంతకన్నా గొప్ప భాగ్యమూ, ఆశీస్సులు ఏమున్నాయి? వారి ఆశీర్వాద బలమే ఈ పుస్తకము.

మావారూ, నేనూ గత 15 సంవత్సరాలుగా స్వామీజీ శిష్యులం. ఆయన బోధించిన భగవద్గీత, ప్రకరణ గ్రంథాలు, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, ఆయన చెప్పిన వరుసక్రమంలో విన్నాము; ఇద్దరమూ మూడు సత్సంగాలలో చెపుతున్నాము. మా వారు భగవద్గీత భాష్యం ఒకచోట, భగవద్గీత మూలం మరో చోట చెపుతున్నారు. స్వామీజీ ఒక క్రమపద్ధతిలో, ఒక క్లాసురూమ్ టీచింగ్‌లా చెపుతారు. ఇది విని మీరు భగవద్గీత మీద పరీక్ష రాయవచ్చు.

స్వామీజీ చెన్నైలో అనేక ప్రాంతాల్లో ప్రతిరోజూ ఉదయం, సాయంకాలం – ఉపనిషత్తులు, భగవద్గీత బోధిస్తూ ఉంటారు. అన్ని సీడీల జాబితా, అవి కొనే విధానం https://www.yogamalika.org లో పొందుపరిచారు. ఆయన గొప్పతనం ఏమిటంటే ఒక్కొక్క ఉపనిషత్తు రెండు, మూడుసార్లు చెప్పారు. ఆర్షఅవినాష్ బృందం ఆయన చేసిన ఎన్నో బోధలకు ఒక వెబ్‌సైట్‌లో అక్షర రూపం ఇచ్చారు. ఆయన బోధను యధాతథంగా వ్రాశారు. క్లాసు 1,2,3 అంటూ. దానిపేరు http://arshaavinash.in వాళ్ళకు ఈ సందర్భంలో నా జోహార్లు.

మా దగ్గర స్వామీజీ చెప్పిన సీడీలు వేరే ఉన్నాయి. విషయం ఒక్కటే అయినా స్వామీజీ రెండింటిలోనూ అద్భుతంగా చెప్పారు. ఒకదానిమించి ఒకటి ఉన్నాయి. ఒకే ఉపనిషత్తు మీద రెండురకాలు బోధలు ఉన్నా కొత్తగా విన్నట్టే ఉంటుంది. ఇందులో కొన్ని అంశాలు హత్తుకు పోయేలా ఉంటే, రెండోదాంట్లో ఇంకొన్ని ముగ్ధలను చేస్తాయి. అసలు స్వామీజీ బోధను విన్న కొద్దీ వినాలనిపిస్తుంది. అంతకంతకూ ఆయన మీద ఆరాధనా భావం పెరిగిపోతుంది.

ఉదాహరణకు కార్యకారణ సంబంధం లాంటి కాన్సెప్టును కాని, ఆత్మను అనుభవించలేము అనే అంశాన్ని కాని ఎన్ని రకాలుగా చెపుతారో నేను చెప్పలేను. ఒక్కొక్క ఉపనిషత్తులో, ఒక్కొక్కసారి అదే అంశాన్ని అనేక కోణాల్లోంచి చెపుతారు. మనం ఎలా ఆనంద స్వరూపులమో, ఎలా శుద్ధచైతన్యాన్ని అనుభవించలేమో, ఎలా కార్యమంతటా కారణం ఉందో ఈ ఉపనిషత్తు ఆసాంతం చదివితే మీరే ఒప్పుకుంటారు స్వామీజీ ఎంత అద్భుతంగా చెప్పారో! అద్భుతం చాలా చిన్నమాట! ఇంతకన్నా ఇంకోపదం నాకు దొరకటం లేదు. నిజంగా స్వామీజీ ప్రతిభను ఏమని పొగడను?

**నమో నమః శ్రీ గురుపాదుకాభ్యామ్**

**– మద్దూరి రాజ్యశ్రీ**

# మయ్యేవ సకలం జాతం

**మయ్యేవ సకలం జాతం మయి సర్వం(ప్రతిష్ఠితమ్।**
**మయి సర్వం లయం యాతి తత్ బ్రహ్మాద్వయమస్మ్యహమ్॥**

ఉపనిషత్తులన్నింటిలోనూ ఉన్న సందేశం ఒకటే అని నిరూపించటానికి, శంకరుల వారు నాలుగు వేదాల నుంచి పది ఉపనిషత్తులను ఎంచుకున్నారు.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః।**

ఇది ఉపనిషత్తులు బోధించే బ్రహ్మజ్ఞానం. ఇలా ఒకటే అంశాన్ని అన్ని ఉపనిషత్తులూ బోధించే పద్ధతిని **గతిసామాన్యదర్శనం** అంటారు. ఈ విషయాన్ని వివరించేటప్పుడు పరమార్థానంద స్వామి – 'పెద్ద ఉపనిషత్తు పెద్ద ఆత్మ గురించీ, చిన్న ఉపనిషత్తు చిన్న ఆత్మ గురించీ చెప్పదు,' అని చెప్తారు. అందువల్ల ఏ ఉపనిషత్తును అధ్యయనం చేసినా ఈ ఒక్కటి సరిగ్గా జీర్ణించుకుంటే చాలు ఆత్మజ్ఞానం వస్తుంది అనిపిస్తుంది. అంతేకాదు ఒక్కొక్క ఉపనిషత్తులో కొన్ని మహావాక్యాలు ఉంటాయి.

మహావాక్యం అంటే జీవ – ఈశ్వర ఐక్యాన్ని బోధించేది.

**అఙ్గుష్ఠమాత్రః పురుషో మధ్య ఆత్మని తిష్ఠతి**
**ఈశానో భూతభవ్యస్య న తతో విజుగుప్సతే । ఏతద్వైతత్ – కఠ**

**అఙ్గుష్ఠమాత్రః పురుషః – జీవాత్మ**
**ఈశానో భూత భవ్యస్య – పరమాత్మ**
**న తతో విజుగుప్సతే – ఫలం**

ఇలాంటి మహావాక్యాలు ఒకటి రెండు అర్థం చేసుకున్నా చాలు అనుకుంటాము, కాని కనీసం పది ఉపనిషత్తులు అధ్యయనం చేయాలి అంటారు. శ్రవణం నిర్వచనమే అది. ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా, కొన్ని సంవత్సరాల పాటు, సమర్థుడైన ఆచార్యుని దగ్గర శాస్త్ర అధ్యయనం చేయాలి. ఇలా ఎందుకు చెప్పారో కొన్ని ఉపనిషత్తులు నేర్చుకుంటే తెలుస్తుంది.

కఠోపనిషత్‌లో ఆత్మ నిర్వచనం –

**అనుభవిస్తున్న నేనే ఎప్పటికీ ఆత్మను, అనుభవించబడే వస్తువు ఆత్మ ఎన్నటికీ కాదు.**

**అన్యదేవ తద్విదితాదథో అవిదితాదధి। –కేన**

ఆత్మ తెలిసిన వస్తువు కాదు. తెలియని వస్తువు కాదు అంటే అసలు వస్తువే కాదు అని కేనోపనిషత్‌లో బాగా వివరంగా వస్తుంది.

ముండకోపనిషత్‌లో బ్రహ్మ నిర్వచనం –

**కారణం బ్రహ్మ – ఏకం, నిత్యం, సారం,సత్యం**
**కార్యం జగత్తు – అనేకం, అనిత్యం, అసారం, అసత్యం**

ఇది ఛాందోగ్యంలో బాగా అర్థమవుతుంది.

ఛాందోగ్యోపనిషత్‌లో కార్యం నుంచి కారణానికి ఎలా వెళ్ళాలో, చాలా తేలిగ్గా అర్థమవుతుంది. ముందు పంచభూతాలు సృష్టించబడ్డాయి. వాటి నుంచి తక్కిన సృష్టి జరిగింది. ఛాందోగ్యంలో మూడు భూతాలనే చూస్తాము. అగ్ని, నీరు, పృథివీ. తక్కిన రెండింటినీ కలుపుకోవాలి. ఈ మూడు భూతాలకీ మూడు రంగులు చెపుతుంది ఉపనిషత్తు. అవి – అగ్నికి ఎరుపు, నీటికి తెలుపు, పృథివీకి నలుపు. జగత్తులో ఏ రంగు చూసినా వాటిలో ఈ మూడు రంగులే ఉంటాయి. అంటే ఈ మూడు భూతాల నుంచి అవి సృష్టించబడ్డాయి అని వస్తుంది.

**త్రీణి రూపాణీత్యేవ సత్యమ్**

జగుత్తు అనే కార్యానికి ఈ మూడు రంగుల మూడు భూతాలే కారణం. మనం ఇంకొంచెం వెనక్కి వెళ్ళాలి. ఈ మూడు భూతాలకు కారణం బ్రహ్మ. అందువల్ల **బ్రహ్మ సత్యం జగన్మిథ్యా.**

ఈ విషయం ఛాందోగ్యంలో బాగా అర్థమవుతుంది. అదే ఛాందోగ్యంలో బ్రహ్మ సృష్టి చేసి తానే అనుప్రవేశం చేశాదని వస్తుంది. కాని అది ఐతరేయోపనిషత్‌లో బాగా అర్థమవుతుంది.

బ్రహ్మ జగత్తును సృష్టించాడు కాని, జీవిని సృష్టించలేదు. తానే జీవిలో చైతన్యంగా **అనుప్రవేశం** చేశాడు. ఎందుకు? లోక వ్యవహారార్థం, బ్రహ్మ జ్ఞానార్థం.

ఉన్నదంతా జడం కదా! నన్ను ఎవరు తెలుసుకుంటారు అనుకున్నాడుట. అందుకని తనే జీవాత్మగా ప్రవేశించాడు. ప్రవేశించక ముందు ఆయన ఆలోచన ఇలా ఉంది. ఈ జీవి ముందు తను శరీరం, ఇంద్రియాలు, మనస్సు అనుకుని వ్యవహారం చేస్తాడు. కాని కొన్నాళ్లయ్యాక కన్ను చూస్తోందని తెలుస్తోంది, మనస్సు ఆలోచిస్తోందని తెలుస్తోందంటే **నేను కన్నుకాదు, నేను మనస్సు కాదు, ఇవేవీ నేను కాకపోతే నేనెవరు**? ఈ ప్రశ్న ఎవరు అడుగుతారు? ఒకరోజు జీవాత్మలో ఉదయిస్తుందని పరమాత్మ ఆశిస్తున్నాడు.

దీని ముక్తాయింపు బృహదారణ్యకోపనిషత్తులో వస్తుంది.

**అహం బ్రహ్మ అస్మి** అని ఎవరు తెలుసుకున్నారు? జీవాత్మనా, పరమాత్మనా? రెండూ ఒకరేనా? భిన్నమా? రెండూ ఒకరే అని కైవల్యోపనిషత్‌లో తెలుస్తుంది.

**బ్రహ్మ = జగత్ కారణం; ఆత్మ = బ్రహ్మ;**
**నేను = ఆత్మ; నేను = జగత్ కారణం**

**మయ్యేవ సకలం జాతం**

ఆత్మజ్ఞానం పొంది నేనే బ్రహ్మను అని నిస్సందేహంగా తెలుసుకుని శిష్యుడు సింహంలా గర్జించి చెప్పిన మాట ఇది. శాస్త్రం ఎంత అద్భుతమో చూశారా! కైవల్యోపనిషత్‌లో ఈ వాక్యం చాలా ముఖ్యమైనది. దీనిని తరుచూ గురువుగారు ఉదహరిస్తూంటారు.

**అహోశాస్త్రమహోశాస్త్రమహో గురురహో గురుః**
**అహో జ్ఞానమహో జ్ఞానమహో సుఖమహోసుఖం – పంచదశి 7-279**

**– మద్దూరి రాజ్యశ్రీ**

# స్పందన

గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ గురవేనమః

జన్మని కోరలేము, మరణాన్ని ఆపలేము. రెండింటి పైన మనకు నియంత్రణ లేదు, అయినా ఒకటి సంతోషాన్ని కలిగిస్తే రెండవది దుఃఖాన్ని కలిగిస్తుంది. ఎందుకు? దేహం అశాశ్వతం. జీవితం అశాశ్వతం. జనన మరణ చక్రబంధంలో నుండి బయటపడే మార్గమేదైనా వుందా? ఈ రెండు లేని శాశ్వతమైన సత్యమేదైనా వుందా? ఈ శేష ప్రశ్నలకు సమాధానం వుందని చెబుతుంది శాస్త్రం. గురుముఖత నేర్చుకోవాలి, లేకపోతే అపార్థం చేసుకుని అనర్థం కొనితెచ్చుకుంటాము. పరమార్థానికి దూరంగా జరిగి పోతాము. World understood Rightly is God and God understood wrongly is World. అడపా దడపా లబ్ధప్రతిష్టులైన మహనీయుల ప్రసంగాలు విని కొంత అర్థం చేసుకున్నా, ఆర్తి మాత్రం అసంపూర్తిగానే వుండిపోయింది.

ఓనమాల దగ్గర నుండి నేర్పించే గురువులు వుంటే – వేదాంతం అర్థం చేసుకోవచ్చనే భావన వుండేది. భగవదనుగ్రహం వల్ల మా అపర్ణా సైబర్ కమ్యూన్ (వేదాంత గ్రూప్) సీనియర్ సిటిజెన్ సభ్యుల మనోగతం నెరవేరింది. గురు కటాక్షం లభించింది. మా సైబర్ కమ్యూన్ ముంగిట శ్రీ భ్రమరాంబిక మల్లికార్జునస్వామి గుడి. గుడి వాకిట శ్రీ సిరిగిరి ప్రభాకర్ గారికి, ఓరిమి–కూరిమి జంటగా గురుదంపతులు శ్రీమతి రాజ్యశ్రీ గారు శ్రీ రాఘవరావు గారు దర్శనమిచ్చారు. ప్రభాకర్ గారు "జ్ఞానభిక్ష" నివ్వమని వరమడిగారు – గురుదంపతులు తథాస్తు అన్నారు. అప్పటి నుండి గత రెండు సంవత్సరాలకు పైగా "అద్వైత వేదాంత తరగతులు" అవిఘ్నంగా జరుగుతున్నవి.

పూజ్యశ్రీ గురుదేవులు స్వామి పరమార్థానంద గారి శైలిలో సరళంగా–వివరంగా ఆంగ్లభాషలోనే ఉపనిషత్తుల బోధనా కార్యక్రమం జరుగుతుండడంతో తెలుగు భాషేతర సభ్యులు కూడా శ్రద్ధగా తరగతులకు

వస్తున్నారు. ఇప్పటివరకు "తత్త్వబోధ" మొదలు – "కైవల్యోపనిషత్" వరకు ఏడు ఉపనిషత్తులను వివరించడమైనది. ప్రతిదినం "స్వాధ్యాయనం" కొరకు రుద్రం–పురుషసూక్తం–గణపతి అథర్వశీర్షం స్వరసహితంగా వల్లె వేయించారు. తెలుగులోకి అనువదించిన 'ఉపనిషత్తులు' సులభగ్రాహ్యాలు. గురుముఖతః నేర్చుకున్న తరువాత ఈ అనువాదాలు బహు అనుకూలంగా వుంటున్నాయి. వేదాంతజ్ఞానాన్ని అనేకులకు అందిస్తూ పరోపకారాన్ని మించిన పుణ్యకార్యం లేదని నిరూపిస్తున్న గురుదంపతులకు శతాధిక వందనములు.

ఉపనిషత్తుల సారాన్ని ఏకవాక్యంగా ముఖచిత్రంపై ప్రచురించి జిజ్ఞాస కల్పించడం వారి ప్రత్యేక శైలి. శ్రవణ–మనన–నిదిధ్యాసనం ద్వారా మోక్ష సాధన–కైవల్యోపనిషత్తు సారాంశము. "కైవల్యోపనిషత్"ను తెనుగించి పుస్తకరూపం యిస్తున్న గురుమాత శ్రీమతి రాజ్యశ్రీ గారికి కృతజ్ఞులం.

వేదాంతంలో ఓనమాలు నేర్పించి – పదాలను స్వరయుక్తంగా మాతో పలికించి – పదనిసలతో పరమార్థం వైపు ప్రయాణం చేయిస్తున్నారు. ఆధ్యాత్మిక సేవయే పరమోత్కృష్ట కార్యంగా భావించి – అనునిత్యం శ్రమిస్తున్న కృషీవలులు శ్రీమతి రాజ్యశ్రీ శ్రీయుతులు రాఘవరావు గార్లు. పూజ్య గురుదంపతులకు సర్వదా కృతజ్ఞులం.

పాదాభివందనములతో

ఓం శాంతిః శాంతిః శాంతిః

**డా॥ యం. జయంత్‌కుమార్**

అపర్ణా సైబర్ కమ్యూన్ వేదాంత గ్రూప్

# కైవల్యోపనిషత్

## ఉపోద్ఘాతము

**యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై ।**
**తం హ దేవం ఆత్మబుద్ధిప్రకాశం ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే ॥**

**శ్వేతాశ్వతర ఉపనిషత్ 6.18**

పరమాత్మ అందరికన్నా ముందు బ్రహ్మను సృష్టించాడు. బ్రహ్మను సృష్టించాక, పరమాత్మ బ్రహ్మకు సృష్టికార్యం అప్పజెప్పినప్పుడు, వేదాలు కూడా ఇచ్చాడు. అంటే దీన్ని బట్టి, సృష్టింపబడిన మనిషి నుంచి వేదాలు రాలేదు; సాక్షాత్తూ ఆ పరమాత్మ నుంచే వచ్చాయని తెలుస్తున్నది.

**తస్మాదృచః సామయుజూంషి దీక్షా - ముణ్డక 2.1.6**

ఆయన్నుంచే, అంటే ఆ పరమాత్మ నుంచే ఋగ్వేదం, సామవేదం, యజుర్వేదం, అథర్వణ వేదం వచ్చాయి అందుచేత అవి అపౌరుషేయాలు. మనిషి సృష్టించలేదు వేదాలను. మనిషితోపాటు పరమాత్మచేత సృష్టించబడ్డాయి.

పరమాత్మ వేదాలను మనిషితో పాటు ఎందుకు సృష్టించాడు? ఎందుకంటే, వేదాలు మానవ మనుగడకు ఒక మార్గదర్శకంగా నిలవాలని. ఇప్పుడు మనం ఏవైనా వస్తువులను కొంటే, వాటిని ఎలా వాడాలో సూచించే ఒక మాన్యువల్ ఇచ్చినట్టుగా, పరమాత్మ మానవాళికి ఒక మాన్యువల్‌ని ఇచ్చాడు. ఇప్పుడు జిపియస్ ఎలా దోవ చూపిస్తుందో, అలా వేదాలు మన జీవన విధానానికి దోవ చూపిస్తాయి.

వేదాలను తన జీవితానికి మార్గదర్శిగా అంగీకరించిన వ్యక్తిని వైదికుడు అంటారు. తన లక్ష్యాలను, వాటిని పొందే మార్గాలను వేదం నిర్దేశించిన తీరులో తీర్చిదిద్దుకునే వ్యక్తిని వైదికుడు అంటారు. ఈ వైదికుడినే, ఆధునిక రీతిలో చెప్పాలంటే హిందువు అంటారు.

అతను భారతదేశంలోనే పుట్టాలని లేదు. ఎక్కడ పుట్టినా, వేదాన్ని పాటిస్తే వైదికుడు అవుతాడు.

వేదాలను శాస్త్రం అంటారు. **శాసనాత్ త్రాయతే ఇతి శాస్త్రమ్** శాస్+త్రమ్= శాస్త్రం. శాసనం అంటే జీవితం గురించీ, దాని లక్ష్యాల గురించీ, ఆ లక్ష్యాలను పొందే మార్గాలను గురించి చేసే బోధ లేదా సూచన. వేదాలు ఇలా సూచనలివ్వటం ద్వారా మనిషి కష్టాల పాలవకుండా కాపాడబడతాడు. పట్నంలో ఏదైనా ఇల్లు ఎక్కడుందో సరిగ్గా తెలుసుకోకుండా వెళితే, ఎంత తిరిగినా ఒక పట్టాన ఆ ఇల్లు దొరకదు. అదే ఎవరైనా మీకు దగ్గరుండి మార్గం చూపిస్తే, చిటికెలో కనుక్కుంటారు. అందుకే వేదాలను శాస్త్రం అంటారు. అది మనిషికి మార్గం చూపుతుంది.

**సత్యం సత్యం పునః సత్యం ఉధృత్యాభుజముచ్యతే।**
**వేదాత్ శాస్త్రం పరం నాస్తి న దైవం కేశవాత్ పరమ్॥**

**ఉధృత్యాభుజం –** చెయ్యెత్తి పెట్టి, మానవాళికి గట్టిగా చెప్తున్నాము. ఏమని? **సత్యం సత్యం పునః సత్యం–** ఇదే సత్యం, పూర్తి సత్యం. సత్యం వినా మరొకటి లేదు. ఏమిటా సత్యం?

**వేదాత్ శాస్త్రం పరం నాస్తి–** మానవాళికి వేదాలను మించిన గొప్ప మార్గదర్శి లేదు.

ఈ విధంగా హిందువులైన మనం, వేదాలను మన మార్గదర్శిగా అంగీకరించాలి.

ఈ వేదాలు నాలుగు – ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణ వేదం. వేదం ఒకటే అయినా, అది రెండు శాస్త్రాలుగా విభజించబడింది. వేద పూర్వశాస్త్రం, వేద అంతశాస్త్రం. అందువల్ల ఇద్దరు గొప్ప ఋషులు వీటిని విశ్లేషించారు. జైమిని మహర్షి వేద పూర్వమీమాంస సూత్రాలను రచిస్తే, వ్యాసాచార్యులు ఉత్తరమీమాంస సూత్రాలను రచించారు. పూర్వ మీమాంస పూర్వభాగం మీద, ఉత్తరమీమాంస ఉత్తర భాగం మీద ఆధారపడి చేయబడ్డాయి. ఒకే శాస్త్రాన్ని రెండు భాగాలుగా ఎందుకు విభజించారు?

ఏమిటి దీనికి ఆధారం? వేదాన్ని ఒక్క శాస్త్రంగా చూడాలా, రెండుగా చూడాలా?' శంకరాచార్యులు తన భాష్యంలో ఈ ప్రశ్న వేశారు. ఐక్యశాస్త్ర వాదం, శాస్త్రద్వయ వాదం లోతుగా సాగింది. చివరికి శంకరాచార్యులు, అనేక ఆచార్యులు మీమాంస చేసి, అవి రెండు శాస్త్రాలని తేల్చారు. ఏమిటాకారణం?

**అనుబన్ధ చతుష్టయభేదాత్, శాస్త్రభేదః॥**

వేద పూర్వభాగానికీ, వేద అంతభాగానికీ అనుబంధ చతుష్టయంలో భేదం ఉంది.

అనుబంధ చతుష్టయం అంటే ఏమిటి? సంబంధాన్ని నిర్ణయించే అంశాలు అనవచ్చు. విజ్ఞానశాస్త్రానికి చెందిన ఏ శాస్త్రం గురించి విన్నా మనకు వచ్చే ప్రశ్న ఏమిటి? 'ఈ శాస్త్రానికీ, మనిషికీ ఏమిటి సంబంధం?' అలాగే వేదం గురించి వినగానే వేదం 21వ శతాబ్దానికి పనికి వస్తుందా? అందువల్ల మనిషి మనసు ఎప్పుడూ 'సంబంధం' గురించే ఆలోచిస్తూ ఉంటుంది. ముందు, ఈ రోజుల్లో పనికి వస్తుందా అన్న ప్రశ్న వచ్చాక, నాకు పనికి వస్తుందా అన్న ప్రశ్నకు దారితీస్తుంది.

శాస్త్రం యొక్క అనుబంధం నిర్ణయించటానికి సాంప్రదాయం నాలుగు అంశాలను నిర్దేశించింది. మనిషికి శాస్త్రం యొక్క సంబంధాన్ని నాలుగు అంశాలు నిర్ణయిస్తాయి కాబట్టి దాన్ని అనుబంధ చతుష్టయం అంటారు. చతుష్టయం అంటే నాలుగు. ఈ నాలుగు అంశాల్లో వేద పూర్వభాగానికీ, వేద అంతభాగానికీ భేదాలున్నాయి. అందుకే వేదం రెండుగా విభజించబడింది.

ఏమిటా నాలుగు అంశాలు?

1. **విషయం - శాస్త్రం దేని గురించి చెపుతున్నది?**
2. **ప్రయోజనం - శాస్త్రం చెప్పే విషయాన్ని నేర్చుకుంటే కలిగే ప్రయోజనం ఏమిటి?**
3. **సంబంధం - విషయానికీ, ప్రయోజనానికీ మధ్య ఉన్న**

**సంబంధం ఏమిటి?**

**4. అధికారి - శాస్త్రం నేర్చుకోవటానికి కావాల్సిన అర్హత ఏమిటి?**

ఇప్పుడు ఈ నాలుగు అంశాలనూ వేద పూర్వభాగానికి అన్వయించి చూద్దాము.

**1. విషయం –** వేద పూర్వభాగం అనేక రకాల కర్మలను గురించి వివరిస్తుంది. అందుకే వేద పూర్వభాగాన్ని కర్మకాండ అని కూడా అంటారు. కర్మలు మూడు రకాలు– త్రివిధం కర్మ–

ఎ. కాయిక కర్మ – శరీరంతో చేసేవి

బి. వాచిక కర్మ – వాక్కుతో చేసేవి

సి. మానస కర్మ – మనసుతో చేసేవి

**కరచరణకృతం వాక్కాయజం కర్మజం వా శ్రవణ నయనజం వా మానసం వాఽపరాధమ్ (శివమానస పూజ)**

జమ్ అంటే వీటి నుంచి పుట్టినవి. ఏమిటవి? కాయిక, వాచిక, మానస కర్మలు. కాయిక, వాచిక చర్యలను కర్మ అంటే, మానస చర్యలను ఉపాసన లేదా ధ్యానం అంటారు.

**2. ప్రయోజనం –** మూడు ప్రయోజనాలున్నాయి. త్రివిధం కర్మఫలం – అర్థం, కామం, ధర్మం.

**ఎ. అర్థం –** ధనం సంపాదించటానికి అనేక వైదిక కర్మలు చెప్పబడ్డాయి. తైత్తిరీయోపనిషత్తులో **'ఆవహన్తీ హోమం'** అని ఒక హోమం చెప్పబడింది. ఆ హోమం చేస్తే అంతులేని ఐశ్వర్యాన్ని, ఆహారాన్ని పొందుతారు.

**ఆవహన్తీ వితన్వానా కుర్వాణాఽచీరమాత్మనః వాసాగ్ంసి మమ గావశ్చ।**
**అన్నపానే చ సర్వదా తతో మే శ్రియమావహ॥ – తైత్తిరీయం**

సిరి అంటే ఐశ్వర్యం. ఇవన్నీ అర్థం అంటే ఐశ్వర్యంలోకి వస్తాయి. ఐశ్వర్యం ఉంటే భద్రత వస్తుంది అనుకుంటారు. కాటికి చేరే వరకే కాసుకు

విలువ అని ఒక ఆటోమీద రాసి ఉంటుంది. కాని కాటికి చేరాలన్నా కాసు కావాలి అంటారు కొందరు.

**బి. కామం –** సరదాలు, వేడుకలు. మన ప్రాథమిక అవసరాలు తీరాక, సరదాల కోసం వెంపర్లాడతాము. అది కామం కిందకి వస్తుంది.

**సి. ధర్మం –** ధర్మం అంటే పుణ్యం. మనం అమెరికాలోకి అడుగుపెట్టాలంటే ఏం చేస్తాం? మన రూపాయలను మార్చి, వాళ్ళ డాలర్లని తీసుకుంటాం. అలాగే వచ్చే జన్మలో అర్థకామాలు పొందటానికి ఈ జన్మలో మనం మార్చే నోట్లు మన పుణ్యఫలం. ఎందుకంటే వచ్చే జన్మలో కూడా మనం వెంపర్లాడేది అర్థకామాల గురించే. దానికి తగ్గ డబ్బు మనం చేసిన పుణ్యం. ఆ పుణ్యం పొందటానికి అనేక కర్మలు సూచించబడ్డాయి. ఆ పుణ్యం ఇంకా మంచి ఉపాధిని, మంచి వాతావరణాన్ని, మంచి కుటుంబాన్ని పొందటానికి తోడ్పడుతుంది.

అర్థ,కామ,ధర్మాలు మూడింటినీ కలిపి ప్రేయస్సు అంటారు. ఇవి కర్మఫలాలు.

**శ్రేయశ్చ ప్రేయశ్చ మనుష్యమేతః తౌ సమ్పరీత్య వివనక్తి ధీరః॥**
**కఠ 1–2–2**

**3. సంబంధం –** వేద పూర్వభాగ అధ్యయనానికీ, ప్రయోజనానికీ మధ్య ఉన్న సంబంధం ఏమిటి? చదివినంత మాత్రాన ప్రత్యక్షంగా ఫలితం కలుగదు. ఉదాహరణకు యోగాభ్యాసం తీసుకోండి. యోగాలో వారం రోజుల కోర్సుకి వెళ్ళి అనేక ఆసనాలు నేర్చుకుని వస్తే సరిపోతుందా? లావు తగ్గిపోతారా? కోర్సుకు వెళితే చాలదు. వెళ్ళటం వల్ల కలిగిన జ్ఞానాన్ని అనుష్ఠానంలో వాడాలి. కర్మజ్ఞానం ఫలాన్ని ఇవ్వదు. కర్మ అనుష్ఠానం లేదా అభ్యాసం మాత్రమే ఫలాన్నిస్తుంది. అందువల్ల అధ్యయనం ప్రత్యక్షంగా ఫలితాన్నివ్వదు, అనుష్ఠానం ద్వారా ఇస్తుంది. దీన్ని పరంపర సంబంధం అంటారు. అంటే పరోక్ష సంబంధం అంటారు.

మధ్యలో ఉన్న అంశం ఏమిటి? అనుష్ఠానం. అన్ని వైదిక కర్మల్లోకీ

సంధ్యావందనం శ్రేష్ఠమైనది. కాని దీని ఫలం ఎప్పుడు కలుగుతుంది? సంధ్యావందనం చేస్తేనే! లేకపోతే లేదు! దీన్ని పరంపర సంబంధం అంటారు.

**4. అధికారి –** అధికారి ఎవరు? అధికారికి ఈ క్రింది లక్షణాలు ఉండాలి.

**ఎ. కోరిక:–** యద్యదపి కురుతే కర్మ తత్తత్ కామస్య చేష్టితమ్. కోరిక ఉండాలి. దేనిమీద కోరిక? ధర్మ, అర్థ, కామ పురుషార్థాల మీద. నాకు డబ్బు కావాలి. నాకు ఈ వస్తువులు కావాలి వగైరా. అంటే ధర్మ ఇచ్ఛ, అర్థ ఇచ్ఛ, కామ ఇచ్ఛ. 'ప్రేయోర్థి' అంటుంది కఠోపనిషత్తు.

ప్రేయః అర్థ్యతే ఇతి ప్రేయోర్థి.

విష్ణుసహస్రనామంలో ధర్మార్థి, అర్థార్థి అని వస్తుంది.

**ధర్మార్థీ ప్రాప్నుయాత్ ధర్మమ్, అర్థార్థీ చ అర్థమ్ ఆప్నుయాత్।**
**కామార్థీ ఆప్నుయాత్ కామీ, ప్రజార్థీ చాప్నుయాత్ ప్రజామ్॥**

**బి. శ్రద్ధ:–** వైదిక కర్మల మీద శ్రద్ధ ఉండాలి. వేదం మీద శ్రద్ధ; వేద పూర్వభాగం మీద శ్రద్ధ; వైదిక కర్మల మీద శ్రద్ధ ఉండాలి. 'శ్రాద్ధం' అన్న పదం శ్రద్ధ నుంచి వచ్చిందే. శ్రాద్ధ కర్మల మీద శ్రద్ధ ఉంటేనే, ఎవరైనా శ్రాద్ధం పెడతారు. 'నాకు పితృదేవతలు ఉన్నారన్న నమ్మకం లేదు. పునర్జన్మ మీద నమ్మకం లేదు,' అంటేనో 'ఇక్కడ అగ్నిలో వేసింది ఎక్కడో ఉన్న వాళ్ళకి ఎలా వెళుతుంది?' అంటేనో శ్రాద్ధ కర్మలు చేయరు. శ్రద్ధ లేకపోతే, వేదాన్ని పట్టించుకోరు. అందుకని వనరులలో ముఖ్యమైన అంశం శ్రద్ధ.

**'శ్రద్ధాం మేధాం యశః ప్రజ్ఞాం విద్యాం బుద్ధిం శ్రియం బలం**
**ఆయుష్యం తేజ ఆరోగ్యం దేహి మే హవ్యవాహన।**

బ్రహ్మచారి ప్రార్థన ఇది. ఓ దేవా నాకు మేధస్సుని ఇయ్యి. నాకు శ్రద్ధని ఇయ్యి.

**సి. దక్షత్వం:–** వనరులలో ఇంకో ముఖ్యమైన అంశం దక్షత్వం. కర్మ ఎంత పెద్దదైతే, అంత ఐశ్వర్యం కావాల్సి ఉంటుంది. అదీ కాక దానికి సంబంధించిన జ్ఞానం, ప్రజ్ఞ కూడా కావాలి. ఐశ్వర్యం, జ్ఞానం, ప్రజ్ఞ–

ఈ మూడింటినీ కలిపి దక్షత అంటారు.

**డి. అపర్యుదస్తత్వం:-** వేదం లైసెన్సు ఇవ్వాలి. మనం ఒక ఇల్లు కట్టుకోవాలంటేనే, కార్పొరేషన్ నుంచి లైసెన్సు తెచ్చుకోవాలి. అలాగే వైదిక కర్మలు చేయటానికి కూడా వేదం మనకి లైసెన్సు ఇవ్వాలి. వైదిక లైసెన్సు అంటే సాంప్రదాయంలో వర్ణాశ్రమ ధర్మం. ఉదాహరణకి, రాజసూయ యాగం క్షత్రియుడే చేయాలి. బ్రాహ్మణుడు చేయకూడదు. ఏ వర్ణానికి చెందిన వ్యక్తి ఆ వర్ణానికి సంబంధించిన యాగాలే చేయాలి. అలాగే ఆశ్రమ ధర్మం కూడా ఉంటుంది. పుత్రకామేష్టి యాగం సన్యాసి చేయకూడదు. గృహస్థే చేయాలి.

ఇక్కడ ఒక ముఖ్యమైన సూత్రం గుర్తుంచుకోవాలి మనం. వైదిక కర్మలు పురుషులకు మాత్రమే నియమించినవి కావు. వేదం పురుష పక్షపాతి అన్న అపోహ ఉంది చాలామందిలో. కాని అది నిజం కాదు. వైదిక కర్మల్లో 95% దంపతులు చేయాల్సినవి ఉంటాయి. దంపతులు అంటే భార్యాభర్తలు. భార్యాభర్తల విధులు భిన్నంగా ఉన్నా, ఇద్దరూ కలిసి చేయాలి. చాలా కర్మలకు ఒకరు లేకుండా ఇంకొకరు చేయటానికి అర్హులు కారు. అందుకని వర్ణాశ్రమ ధర్మం ముఖ్యం. దాన్ని అపర్యుదస్తత్వం అంటారు. కోరిక, శ్రద్ధ, దక్షత్వం, అపర్యుదస్తత్వం అనే ఈ నాలుగు లక్షణాలూ ఉన్న వ్యక్తిని అధికారి అంటారు.

ఇప్పుడు ఈ నాలుగు అంశాలనూ వేద అంతభాగానికి అన్వయించి చూద్దాము.

**1. విషయం-** ఇక్కడ కర్మతో సంబంధం లేదు. వేద అంతభాగంలో విషయం జ్ఞానం. దేని గురించిన జ్ఞానం? **నా స్వస్వరూప జ్ఞానం.** దీన్నే **ఆత్మవిద్య** అని కూడా అంటారు. నా స్వరూప జ్ఞానం గురించిన విద్య ఇది. వేదాంతం ఆత్మజ్ఞానం గురించి ఎందుకు చెపుతున్నది? మన గురించి మనకు తెలియదని శాస్త్రానికి తెలుసు కాబట్టి. నా గురించి నాకు తెలియక పోవటమేమిటి, నా గురించి నా భార్యకు తెలియకపోవచ్చేమో కాని

అనుకోవచ్చు మనం. నా గురించి నాకు తెలుసు అని మనం అనుకుంటున్నాము కాని అది కేవలం మన ఊహ మాత్రమే అంటున్నది వేదం. మనం పట్టించుకోని విషయం అంటూ ఏదైనా ఉంటే, అది మన గురించిన జ్ఞానమే. 'నేనెవరు?' అన్న ప్రశ్నను మనకు మనం ఎన్నడూ వేసుకోము. అందుకని మన గురించి మనకు తెలుసు అనుకుంటున్నది నిజం కాదు.

అందరం అనుకుంటున్నంత మాత్రాన అది నిజమైన జ్ఞానం అవాలన్న నియమమేం లేదు. 'పదుగురాడు మాట పాడియై ధరణిజెల్లు,' అన్నమాట అన్నివేళలా నిజం కాదు. కొన్ని వేల సంవత్సరాలు భూమి చుట్టూ సూర్యుడు తిరుగుతున్నాడనుకున్నారు అందరూ. 'సూర్యుడు భూమి చుట్టూ తిరగటం లేదు. భూమే సూర్యుని చుట్టూ తిరుగుతోంది,' అన్న నిజాన్ని అర్థం చేసుకోవటానికి మానవాళికి చాలా కష్టమయింది. ఆ విషయం కనుగొన్న శాస్త్రజ్ఞుడిని పరిహసించింది కూడా.

**అవిద్యాయామన్తరే వర్తమానాః స్వయం ధీరాః పణ్డితం మన్యమానాః**

**- ముణ్డక 1.2.8**

మానవాళి అంతా ఆత్మ అజ్ఞానంలోనూ, ఆత్మ అపోహలోనూ కూరుకుపోయి ఉంది. అజ్ఞానం, అపోహ తొలగాలంటే జ్ఞానం కలగాలి. అందువల్ల విషయం ఏమిటి? ఆత్మజ్ఞానం.

**2. ప్రయోజనం:-** ఆత్మజ్ఞానం పొందటం వల్ల ప్రయోజనం ఏమిటి? విముక్తి. మోక్షాన్ని శ్రేయస్సు అని కూడా అంటారు. వేదపూర్వభాగంలో ప్రయోజనాన్ని ప్రేయస్సు అన్నాము. ఇక్కడ ప్రయోజనం శ్రేయస్సు. దేన్నించి విముక్తి? ధర్మ, అర్థ, కామాల మీద ఏర్పరచుకున్న వ్యామోహమనే బంధం నుంచి విముక్తి.

వేద పూర్వభాగంలో ధర్మ, అర్థ, కామాల వెంట పరుగులు తీస్తాము. ఎందుకు? అవి లేకపోతే మన జీవితం వృధా అనుకుంటాము. అవి ఉంటే మన విలువ పెరుగుతుంది. ఒక మంచి ఇల్లు, ఒక ఖరీదైన కారు,

అందమైన భార్య ఇవన్నీ ఉంటేనే మనను అందరూ గౌరవిస్తారన్న ఆశ. అందువల్ల ధర్మార్థకామాల మీద వెంపర్లాట భద్రత కోసం. నా అహంకార, మమకారాలు వాటికి మూలం.

కాని ఆత్మజ్ఞానం దగ్గరకి వచ్చేసరికి, నా విలువ పెంచుకోవటానికి నేనేం పొందనవసరం లేదంటుంది. నా అసలు స్వరూపంలో నేనే సృష్టి మొత్తానికి ఆధారం అంటుంది. సృష్టికే నేను అధిష్ఠానం. నా నుంచే మూడు అంశాలు జగత్తుకు ఆధారమవుతున్నాయి.

**1 సత్ –** నేను జగత్తుకు ఉనికినిస్తున్నాను

**2 చిత్ –** నేను దేహేంద్రియ మనోబుద్ధులకు చైతన్యాన్నిస్తున్నాను

**3 ఆనందం –** నేను ప్రతిబింబ చైతన్యం ద్వారా ఆనందాన్ని పొందటానికి కారణాన్నవుతున్నాను

**సచ్చిదానన్దస్వరూపః అహమస్మి**

అందువల్ల నేను ధర్మ అర్థ కామాల మీద ఆధారపడటం లేదు. ఈ ఆధారపడకపోవటాన్ని అనపేక్ష అంటారు. ఆపేక్ష అంటే ఆధారపడటం. నాకు ఎవరూ ఫోన్లు చేయటం లేదు అని వాపోతూ ఉంటాము. ఎదుటివారు నన్ను ప్రేమించాలి, నా మీద అక్కర చూపాలి. ముగ్గురు పిల్లలు ప్రేమ చూపించినా, నాలుగోవాడు ప్రేమ చూపించకపోతే బాధ! ఏదో తక్కువైన బాధ. అలా ఏదో తక్కువైందన్న బాధ నుంచి ముక్తి పొందటమే మోక్షం.

**అనపేక్షః శుచిర్దక్షః ఉదాసీనో గతవ్యథః।**
**సర్వారమ్భపరిత్యాగీ యో మద్భక్తః స మే ప్రియః॥ గీత 12-16**
**ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్।**
**ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే॥ గీత 2-55**
**యస్త్వాత్మరతిరేవ స్యాత్ ఆత్మతృప్తశ్చ మానవః।**
**ఆత్మన్యేవ చ సన్తుష్టః తస్య కార్యం న విద్యతే॥ గీత 3-17**

అందువల్ల ప్రయోజనం ఏమిటి? మోక్షం. శారీరకంగా ఆధారపడటం

తప్పదు. కాని మానసికంగా ఆధారపడటం నుంచి విముక్తి పొందుతాము.

**3. సంబంధం:–** విషయం ఆత్మజ్ఞానం; ప్రయోజనం మోక్షం. ఈ రెండింటికీ మధ్య సంబంధం ఏమిటి? కర్మకాండ విషయంలో జ్ఞానం పొందినంత మాత్రాన ప్రయోజనం కలుగదు. మనం సాధన చేయాలి. కాని జ్ఞానకాండ విషయంలో అలా కాదు. కేవలజ్ఞానమే ప్రయోజనాన్ని ఇస్తుంది. ఎందుకంటే, 'నేను పూర్ణుడను, నేను జగత్కారణ బ్రహ్మను,' అన్న జ్ఞానం కలుగుతుంది. 'మీరు పేరు ప్రతిష్ఠలు, ఆస్తిపాస్తుల వెంట ఎందుకు పరుగులు తీస్తారు? మీకేమీ అవసరం లేదు. మీరు పరిపూర్ణులు,' అంటుంది వేదం. అందుకని సంబంధం ఏమిటి?

**జ్ఞానమాత్రేణ మోక్షః**

సంబంధం పరంపర సంబంధం కాదు. సాక్షాత్తు సంబంధం అంటే మధ్యలో కర్మ అవసరం లేదు. కర్మకాండలో జ్ఞానం–కర్మ–ప్రయోజనం. అదే జ్ఞానకాండకొస్తే జ్ఞానం–ప్రయోజనం. ఇదీ సంబంధం. సాక్షాత్ సంబంధం.

**4. అధికారి:–** జ్ఞానాన్ని పొందటానికి అర్హులెవరు?

**ఎ. కోరిక ఉండటం –** ఇక్కడ కూడా మొదటి అర్హత కోరిక. వేద పూర్వభాగానికీ, వేద అంత భాగానికీ కూడా మొదటి అర్హత కోరికే. కాని ఆ కోరికలో తేడా ఉంది. వేద పూర్వభాగంలో కోరిక దేనిమీద? ధర్మ–అర్థ–కామముల మీద. వేద అంతభాగంలో కోరిక దేనిమీద? మోక్షం మీద.

**బి. కోరిక లేకపోవటం –** ధర్మ–అర్థ–కామాల పరిమితులను తెలుసుకో గలగాలి. వాటి పరిమితులు తెలియకపోతే, వాటి మీద మనకు కోరిక ఉంటుంది. అందుకని ధర్మ–అర్థ–కామముల పరిమితులను తెలుసుకుని, కోరిక లేకుండా ఉండాలి.

ఒక పక్క కోరిక ఉండాలంటున్నారు, ఇంకోపక్క కోరికలేకుండా

ఉండాలంటున్నారు. ఏమిటీ వైపరీత్యం? ఇదేమీ వైపరీత్యం కాదు. మోక్షం మీద కోరిక ఉండాలి. ధర్మ–అర్థ–కామముల మీద కోరిక లేకుండా ఉండాలి. అదీ తేడా. ధర్మార్థకామాల మీద కూడా కోరిక ఉంటే జోడు గుఱ్రాల మీద స్వారీ చేస్తున్నట్టుంటుంది. అలా చేస్తే కిందపడతాము. అందుకని శ్రేయస్సు మీద ఇచ్ఛ, ప్రేయస్సు మీద వైరాగ్యం ఉండాలి. కోరికని కలిగి ఉండటం వివేకం; కోరిక లేకపోవటం వైరాగ్యం. మోక్షం మీద ఇచ్ఛను వివేకం అనీ, ధర్మార్థకామాల మీద వైరాగ్యాన్ని విముక్తి అనీ అంటారు.

వైరాగ్యాన్ని పెంచుకోవటమెలా? పరిమితులు తెలుసుకోవటం ద్వారా! ఏమిటా పరిమితులు? కర్మఫలాలన్నీ అశాశ్వతం. కర్మఫలాలకు మూడు దోషాలున్నాయి.

**దుఃఖ మిశ్రితత్వం** – దుఃఖంతో కలిసి ఉన్నాయి.

**అతృప్తికరత్వం** – పూర్తి తృప్తిని ఎన్నడూ ఇవ్వలేవు. ఎంత పొందినా ఇంకా కావాలనిపిస్తుంది.

**బన్ధకత్వం** – వాటి మీద ఆధారపడేలా చేస్తాయి.

అందుకని ఈ పరిమితులను తెలుసుకుని, వాటి మీద కోరికను పోగొట్టుకోవాలి. మోక్షం మీద కోరికను పెంచుకోవాలి.

**సి. శమాది షట్కసమ్పత్తిః –** వేద అంతభాగం జ్ఞానానికి చెందినదని, ఇది కర్మకి చెందనిదని చూశాము. జ్ఞానం పొందటానికి ఒక క్రమపద్ధతిలో జ్ఞానసాధన చేయాలి. శాస్త్ర అధ్యయనం చేయాలి. అధ్యయనం చేసినదాన్ని విశ్లేషణ చేయాలి. విశ్లేషణ చేసిన దాన్ని జీర్ణించుకోవాలి. అందువల్ల ఒక క్రమపద్ధతిలో శ్రవణ, మనన, నిధిధ్యాసనలు చేయాలి. దానికి ఏకాగ్రత కావాలి, శ్రద్ధ కావాలి. మనో నిగ్రహం కావాలి. వీటన్నింటినీ కలిపి శమాది షట్కసంపత్తి అంటారు.

**డి. ముముక్షుత్వం–** మోక్షం మీద తీవ్రమైన ఇచ్ఛ ఉండాలి. వీటిని మళ్ళీ ఒకసారి టూకీగా చూద్దాము.

**వివేకం** – ధర్మ అర్థ కామాలకూ, మోక్షానికీ మధ్య ఉన్న భేదాన్ని గ్రహించటం.

**వైరాగ్యం** – ధర్మ అర్థ కామాల మీద వైరాగ్యం పెంచుకోవటం.

**శమాది షట్కసమ్పత్తి** – శాస్త్రం మీద శ్రద్ధ, ఏకాగ్రత కలిగి ఉండటం.

**ముముక్షుత్వం** – మోక్షం పొందాలన్న తీవ్రమైన ఇచ్ఛ కలిగి ఉండటం.

ఈ నాలుగు లక్షణాలనూ కలిపి సాధన చతుష్టయ సంపత్తి అంటారు. వీటిని కలిగిన వ్యక్తిని సాధన చతుష్టయ సంపన్నుడంటారు.

ప్రతి ఒక్క హైందవుడి దృషిని వేద పూర్వభాగం నుంచి, వేద అంతభాగానికి మరల్చటమే హైందవధర్మం. వేద పూర్వభాగం మీద మనకు సహజంగానే శ్రద్ధ ఉంది. ఎందుకు? ధర్మ–అర్థ–కామాల మీద కోరిక మనకు ఉండనే ఉంది. వేదపూర్వ అధికారి స్థాయి నుంచి వేద అంతభాగ అధికారి స్థాయికి ఎదగాలి. వేదపూర్వభాగంలో అనేక కర్మలు ఉంటాయి. అంటే అవి మనని బహిర్ముఖులను చేస్తాయి. కాని వేద అంతభాగం మనని అంతర్ముఖులని చేస్తుంది.

**అన్తర్ముఖ సమారాధ్యా బహిర్ముఖ సుదుర్లభా – లలితా సహస్రనామమ్**

వేద పూర్వభాగానికి అంకితమైన వాళ్ళను మతపరమైన ప్రాపంచిక చింతన ఉన్నవాళ్ళు అనవచ్చు. వాళ్ళకు మతం మీద శ్రద్ధ ఉంది. కాని వాళ్ళు మతానికి చెందిన ప్రార్థన, పూజ, జపం, తీర్థయాత్రలు అన్నీ ధర్మ అర్థకామాలకు వినియోగిస్తారు. వేద అంతభాగానికి అంకితమైన వాళ్ళు కూడా మతాన్ని వాడుతారు కాని వాళ్ళ ప్రయోజనం వేరు. వాళ్ళు తాము ఆధ్యాత్మికంగా ఎదగటానికి వినియోగిస్తారు మతాన్ని. వాళ్ళను మతపరమైన ఆధ్యాత్మిక చింతన ఉన్నవాళ్ళు అనవచ్చు. ఇప్పుడు మతపరమైన ప్రాపంచిక చింతన ఉన్నవాళ్ళకు మతపరమైన ఆధ్యాత్మిక చింత కలిగేటట్టు చేయాలి.

అసలు మతపరమైన చింతనే లేనివాళ్ళ మాటేమిటి? వాళ్ళకి మార్పు రెండు దశల్లో జరగాలి. ముందు వాళ్ళలో మతపరమైన ప్రాపంచిక చింతన ఏర్పరచి, అక్కడితో ఆగిపోకుండా, దాన్నించి మతపరమైన ఆధ్యాత్మిక చింతన చేసేలా ఎదగటానికి తోడ్పడాలి. ఈ మార్పు కలగటానికి కొంతమందికి కొన్ని రోజులు పడితే, మరి కొంతమందికి కొన్ని సంవత్సరాలు పట్టవచ్చు.

మతపరమైన ఆధ్యాత్మిక చింతన కలిగేలా చేయటమెలా? దానికి ఎన్నో మార్గాలున్నాయి కాని, శాస్త్రం నాలుగు మార్గాలను నిర్దేశించింది. అవి–

**1. భజగోవిన్దమ్ –** శంకరాచార్యులు రచించిన భజగోవిందాన్ని పదే పదే క్రమం తప్పకుండా చదవండి. పారాయణం చేయటం కాదు. దాని అర్థం లేదా వివరణతో పాటు చదవండి. ఎందుకంటే మనలో అంతర్గత మార్పు రావటం కోసం రాశారు శంకరాచార్యులు.

**2. గీత 16వ అధ్యాయం –** పదే పదే, క్రమం తప్పకుండా గీత 16వ అధ్యాయాన్ని చదవండి. దైవాసుర సంపద్విభాగ యోగం అని దీనికి పేరు. ఈ అధ్యాయాన్ని మనలో అంతర్గత మార్పు తీసుకురావటానికి సమకూర్చాడు కృష్ణభగవానుడు.

**3. గీత 17వ అధ్యాయం –** పదే పదే, క్రమం తప్పకుండా, గీత 17వ అధ్యాయాన్ని చదవండి. శ్రద్ధాత్రయ విభాగయోగం అని దీనికి పేరు. మనకున్న శ్రద్ధని మార్చాలి. ప్రస్తుతం మనకు దేనిమీద శ్రద్ధ ఉంది? ధనమే దైవం. అంటే మనలో శ్రద్ధకు లోటు లేదు. కాని దేని మీద శ్రద్ధ ఉండాలి? అంతర్గత మార్పు రావాలంటే శ్రద్ధ ఉండాలి. ఈ మార్పు గురించి కృష్ణభగవానుడు 17వ అధ్యాయంలో ప్రస్తావించాడు. అందుకని 17వ అధ్యాయం పదే పదే, క్రమం తప్పకుండా చదవాలి. చదవాలి అంటే గుడ్డిగా పారాయణం చేసేసి, అల్పాహారం గురించి ఆలోచించటం కాదు. అది కాదు ఇక్కడ చెప్పేది. ఆ అధ్యాయం గురించిన వివరణ చదవండి.

**4. అనుష్ఠానం –** పైన ఉదహరించిన మూడూ మీరు పాటించటానికి లేదా సాధన చేయటానికి కొన్ని సూచనలు ఇస్తాయి. వాటిని కేవలం

చదివితేనో, అర్థం చేసుకుంటేనో చాలదు. వాటిని సాధన చేసి, అమలులో పెట్టగలగాలి. మనం నేర్చుకున్నదానికీ, మనం ఉన్న తీరుకీ సమన్వయం చూసుకోవాలి. అధ్యయనం, ఆచరణం – ఈ రెండింటికీ మన దైనందిన జీవితంలో, మన రోజువారీ దృక్పథంలో పొత్తు కుదరాలి. వాటిమధ్య ఉన్న అగాధం తగ్గుతూ రావాలి. ఎంత త్వరగా మారుతున్నామన్నది ముఖ్యం కాదు. ఎందుకంటే ఆ మార్పు స్థాయి మనిషి మనిషికీ మారుతుంది. అందుకే తోటివారు ఎంత మారుతున్నారో చూడకండి; వాళ్ళకన్నా మీరే స్థాయిలో ఉన్నారో అసలే చూడకండి; కేవలం మారటానికి మనస్ఫూర్తిగా ప్రయత్నించండి. అంతేచాలు. దీనిని అనుష్ఠానం అంటారు. అందువల్ల ఈ మూడు అధ్యాయాల స్వాధ్యయనం, అనుష్ఠానం మీలో క్రమేపీ మార్పు తెచ్చి మిమ్మల్ని మతపరమైన ప్రాపంచిక వ్యక్తిస్థాయి నుంచి మతపరమైన ఆధ్యాత్మిక వ్యక్తి స్థాయికి తీసుకువెళ్తుంది.

ఈ మార్పు వస్తే ఏమవుతుంది? శరీరంలో మెరుపు వస్తుందా? దాన్ని బ్రహ్మతేజస్సు అంటారు. నిజమే, బ్రహ్మతేజస్సు కూడా వస్తుంది. కాని దాని కోసం ఎదురుచూడకండి. మన లక్ష్యం అది కాదు. మరి అంతర్గత మార్పు కలిగినట్లు ఎలా తెలుస్తుంది?

**1. కోరిక – తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషన్తి**
**యజ్ఞేన దానేన తపసా అనాసకేన – బృహదారణ్యకమ్**

అంతర్గత మార్పు కలిగిన కొద్దీ, మీలో ఆత్మజ్ఞానం మీద శ్రద్ధ అంతకంతకూ పెరుగుతుంది. శాస్త్రాల మీద శ్రద్ధ ఎక్కువవుతుంది. కృష్ణభగవానుడు దీనిని జిజ్ఞాసు భక్తి అన్నాడు. బృహదారణ్యకం దీన్ని వివిధిషా అంది. రెండింటి అర్థం ఒకటే. శాస్త్రాధ్యయనం మీద శ్రద్ధ. ఎటువంటి అధ్యయనం? క్రమం తప్పకుండా, ఒక క్రమపద్ధతిలో, కొన్నేళ్ళపాటు ఆధ్యాత్మికగ్రంథాలను అధ్యయనం చేయటం.

ఆధ్యాత్మికగ్రంథాలు ఏవి? వీటిలో మూడు ముఖ్యమైనవి. వీటిని ప్రస్థానత్రయం అంటారు. త్రయం అంటే మూడు.

**ఎ. భగవద్గీత –** 16,17వ అధ్యాయాలు ఆత్మజ్ఞానం గురించి మాట్లాడవు. జాగ్రత్తగా చూడండి. 16,17 అధ్యాయాలు దేనికి సంబంధించినవి? అంతర్గత మార్పుకు చెందినవి మాత్రమే. మనం తక్కిన అధ్యాయాలు చదవాలి. ఉదాహరణకు – 13,14,15,2,7,9. వాటిలో 'నీవెవరు? సత్యపరంగా'; 'దేవుడంటే ఎవరు? సత్యపరంగా'; 'జగత్తంటే ఏమిటి? సత్యపరంగా' అన్న విషయాల విశ్లేషణ ఉంటుంది. జీవ జగత్ ఈశ్వర స్వరూప జ్ఞానమే ఆధ్యాత్మిక జ్ఞానం. భగవద్గీత ఈ అంశాన్ని బోధిస్తుంది. ఇది డిగ్రీ స్థాయి లాంటిది.

**బి. ఉపనిషత్తులు –** ఉపనిషత్తుల అధ్యయనం పీజీ స్థాయి లాంటిది.

**సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనన్దనః**

గీతను అన్ని ఉపనిషత్తుల సారంగా అభివర్ణిస్తారు. ఉపనిషత్తు నుంచి గీత ఆత్మజ్ఞానం బోధిస్తుంది కాబట్టి గీతాధ్యయనం చేసాక ఉపనిషత్తులను అధ్యయనం చేయాలి.

**సి. బ్రహ్మసూత్రాలు –** బ్రహ్మసూత్రాల అధ్యయనం పి హెచ్ డి స్థాయి లాంటిది. డిగ్రీ స్థాయిలోనే ఆపినా ఆపవచ్చు.

ఈ మూడింటినీ కలిపి ప్రస్థానత్రయం అంటారు. వీటిని డిగ్రీలు తెచ్చుకోవటానికి చేసే తక్కిన కోర్సులలా అధ్యయనం చేయకూడదు. వీటిని ఆత్మజ్ఞానం పొంది, ఆత్మజ్ఞానం నిలుపుకుని, ఆత్మజ్ఞానాన్ని జీర్ణించుకోవటానికి లోతుగా అధ్యయనం చేయాలి. అప్పుడే మోక్షం కలుగుతుంది.

ఈ ప్రస్థానత్రయ అధ్యయనం మీద శ్రద్ధ ఎప్పుడు ఏర్పడుతుంది? అంతర్గతమార్పు కలిగితేనే. అంటే శ్రద్ధ ఏర్పడిందంటే, మీలో మార్పు వచ్చినట్టే. అది ఒక సూచన. మీరు ఉపనిషత్తుల బోధలకు వెళుతున్నారంటేనే, మీలో కొంత మేరకన్నా మార్పు వచ్చినట్లు లెక్క. మార్పు రాకపోతే ఈ బోధలకు వెళ్ళినా, ఎక్కువ రోజులు కొనసాగలేరు. ఒక్కోసారి మీ స్నేహితులను మీతోపాటు తీసుకువెళ్తారు. వాళ్ళకు వెంటనే వైరాగ్యం కలుగుతుంది. దేనిమీద? ఈ ఉపనిషత్తు బోధల మీద! ఏముంది ఇందులో

అనేస్తారు. అందుకే అంతర్గత మార్పు రానిదే మీరు బోధలకు వెళ్ళలేరు. వెళ్ళినా క్రమం తప్పకుండా వెళ్ళలేరు. అందుకని కోరిక ఒక సూచన. అధ్యయనం మీద కోరిక.

**2. అవకాశం –** మీలో అంతర్గత మార్పు కలిగిందనటానికి రెండో సూచన అవకాశం. అదీ ఈశ్వరానుగ్రహం వల్ల కలుగుతుంది.

**దుర్లభం త్రయమేవైతత్ దేవానుగ్రహహేతుకమ్ ।**

**మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుషసంశ్రయః॥ వివేకచూడామణి**

కొంత మేరకు అంతర్గత మార్పు గనుక కలిగితే శాస్త్ర అధ్యయనం మీద కోరిక, దానికి తగ్గ అవకాశం – రెండూ వస్తాయి. మార్పు పూర్తిగా కలుగనక్కరలేదు. కొంతమేరకు కలిగితే చాలు. అవకాశం లేకుండా కోరిక ఉంటే ప్రయోజనం లేదు. అవకాశం ఉండి కోరిక లేకపోయినా లాభం లేదు. రెండూ ఉండాలి.

**ఈశ్వరానుగ్రహాత్ ఏవ పుంసాం అద్వైతవాసనా॥**

కోరిక, అవకాశం రెండూ ఉన్నాయి. ఇప్పుడేం చేయాలి?

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।**

**ఉపదేక్ష్యన్తి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః ॥ – గీత 4.34**

సమర్థవంతమైన గురువు దగ్గరకి వెళ్ళి శాస్త్రాన్ని అధ్యయనం చేయాలి. గురువు చెప్పింది కాదు. గురువు తన స్వంత సిద్ధాంతం బోధిస్తే, ఎన్నడూ వెళ్ళవద్దు! శాస్త్రం చెప్పిన దాన్ని గురువు బోధించాలి. అందుకే గురువును శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అన్నారు. శ్రోత్రియ అంటే శాస్త్రంలో ఉన్న జ్ఞానాన్ని జీర్ణించుకున్న వ్యక్తి అని అర్థం. ఎలా? తన గురువు నుంచి నేర్చుకున్న వ్యక్తి మళ్ళీ తన శిష్యులకు బోధించాలి.

**పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేదమాయాన్నాస్త్యకృతః కృతేన।**
**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్ సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్॥**
**ముణ్డక 1.2.12**

సమర్థవంతమైన గురువు, శ్రద్ధ ఉన్న శిష్యుడు కలిస్తే, జ్ఞానప్రవాహానికి దారి ఏర్పడినట్లే. ఈ జ్ఞానాన్ని ఆత్మజ్ఞానం అంటారు. అలా ప్రతి ఉపనిషత్తు లోనూ ఒక శిష్యుడిని చూస్తాము. ఎటువంటి శిష్యుడు? అంతర్గత మార్పు చెందిన శిష్యుడు. అతను సమర్థవంతమైన గురువు దగ్గరకి వెళితే, గురుశిష్య సంవాద రూపంలో ఆత్మజ్ఞాన బోధ జరుగుతుంది. ఉదాహరణకు ముండకోపనిషత్తులో శౌనకుడు శిష్యుడు, అంగిరసుడు ఆచార్యుడు.

నాలుగు వేదాల సారంగా ముఖ్యంగా 10 లేదా కనీసం 6 ఉపనిషత్తులను అధ్యయనం చేయాలి. ఏ వేదానికి చెందిన ఏ ఉపనిషత్తుని తీసుకున్నా, అన్నిటిలోనూ, బోధించే జ్ఞానమొక్కటే. అందులో భేదం లేదు. 'ఉపనిషత్తులు ఒకదాన్నొకటి వ్యతిరేకించవు. వాటి సారం ఒకటే,' అన్న అంశాన్ని నిరూపిస్తూ బ్రహ్మసూత్రాల్లో ఒక అధికరణం ఉంది. ఛాందోగ్యోపనిషత్తు కూడా సామవేదానికి చెందినదే.

ముండక ఉపనిషత్తు 'ముండక' పదంతో మొదలవలేదు. ముండక అంటే ప్రాథమికమైనది అని ఒక అర్థం. ముండక అంటే తల అని కూడా అర్థం. ఉపనిషత్తుల బోధ సాధారణంగా ముండకోపనిషత్తుతో మొదలుపెడతారు ఆచార్యులు. స్వామీ దయానందసరస్వతి కూడా అలాగే చెప్పేవారు.

కొంత మంది ఈశావాస్యోపనిషత్తుతో మొదలుపెడతారు కాని అది మంచి పద్ధతి కాదు. అది ముందు వింటే తక్కిన ఉపనిషత్తుల మీద వైరాగ్యం కలుగుతుంది. ఎందుకంటే ఈశావాస్యోపనిషత్తులో ప్రతి పదమూ ప్రత్యేకమైనది, విశిష్టమైనది. నిఘంటువు అర్థానికి సరిపోలనిది. కేనోపనిషత్తు, కఠోపనిషత్తుతో కూడా మొదలు పెట్టవచ్చు కాని, ముండకోపనిషత్తు ముందు నేర్చుకుంటే మంచిది.

## గురుశిష్య సంవాదం

సాధారణంగా ఉపనిషత్తులు గురుశిష్య సంవాదం రూపంలో ఉంటాయి. ప్రశ్నోపనిషత్తులో ఆరుగురు శిష్యులు ఒకరి తర్వాత ఒకరు పిప్పలాద ఋషిని ప్రశ్నలు అడుగుతారు. ఆయన వారికి జవాబులు చెపుతారు. వాదం అంటే కోపంగా వాదించుకోవటం. సంవాదం అంటే గౌరవ పూర్వకమైన చర్చ. అందువల్ల సంవాదంలో వేడి పుట్టదు, జ్ఞానం పుడుతుంది. ఇలా సంవాద రూపంలోనే ఎందుకు ఉంటుంది? దానికి అనేక కారణాలు చెప్పవచ్చు.

**1. సంప్రదాయ పద్ధతి –** బ్రహ్మవిద్య గురువు నుంచే నేర్చుకోవాలి. స్వతంత్రంగా నేర్చుకోకూడదు. అర్థం కాకపోయినా ఫర్వాలేదు. కొంత సమయం, శ్రమ వృధా అవుతుంది. అంతే. దాన్ని తప్పుగా అర్థం చేసుకుంటేనే ప్రమాదం. అది కాక, దాని తర్వాత గురువు దగ్గరకు వెళితే, గురువు బాధ్యత రెట్టింపు అవుతుంది. శిష్యుని మనసులో ఉన్న అపోహలు, తప్పుడు జ్ఞానం తొలగించి, ఆత్మ గురించిన నిశ్చయజ్ఞానం నిలబెట్టాలి. నారదుల వారికి తెలియని విద్య అంటూ లేదు. అయినా ఆత్మ విద్య నేర్చుకోవటానికి ఆయన సనత్కుమారుని దగ్గరకు వెళ్ళారు.

**2. సుఖార్థ ప్రతిబోధనార్థం –** సంభాషణ రూపంలో ఉంటే విషయం తేలిగ్గా అర్థమవుతుంది. విజ్ఞానశాస్త్రంలో మనకు వచ్చే సందేహాలు నివృత్తి అవవు. కాని వేదాంత శాస్త్రంలో అనంతం బ్రహ్మ గురించి శాస్త్రం చాలా స్పష్టంగా చెపుతుంది. శాస్త్రమే అనేక ప్రశ్నలు వేసి, జవాబులు ఇస్తుంది. అందువల్ల మనకు వచ్చే సందేహాలు, రాని సందేహాలు కూడా శాస్త్రం గురుశిష్యుల సంవాదం ద్వారా తీరుస్తుంది.

**3. గురుశిష్య పరంపర –** వేదాలను శృతి అంటారు. ఋషులు విని తమ తర్వాత తరంలోని శిష్యులకు అందజేశారు. అలా వేదాంత బోధ గురుశిష్యుల పరంపరగా వస్తున్నది. సాంప్రదాయ తాళం చెవితో తెరుస్తారు వేదాంతాన్ని. అందువల్లనే ఏ గురువు బోధ చేసినా, మా గురువు ఇలా చెప్పారు అని

తమ గురువు గురించి చెపుతారు. పరమార్థానంద స్వామీజీ కూడా తమ గురువైన  స్వామి దయానంద సరస్వతీజీ (పూజ్యస్వామీజీ అంటారు) గురించి చెప్పకుండా ఉండరు. కేనోపనిషత్‌లో కూడా గురువు ఈ విద్య చెప్పటం చాలా కష్టం కాని, మా గురువులు మాకు చెప్పిన పద్ధతిలో చెపుతాను అంటారు.

**ఇతి శుశ్రుమ పూర్వేషాం యే నస్తద్వ్యాచచక్షిరే   కేన 1-4**

అంతేకాదు, ఉపనిషత్తుల్లో కొన్ని పదాలకు వాచ్యార్థం ఉంటే, కొన్ని పదాలకు లక్ష్యార్థం ఉంటుంది. ఏ సందర్భంలో ఏది తీసుకోవాలో గురువే చెప్పాలి. ఈశావాస్యోపనిషత్తు స్వంతంగా అర్థం చేసుకోవటం కష్టం. సందర్భాన్ని బట్టి శంకరుల వారి భాష్యం పుణ్యమాని, మన గురువులు స్వామి పరమార్థానంద  వారి పుణ్యమాని, వాటిని నేడు మనం అధ్యయనం చేయగలుగుతున్నాము.

కేనోపనిషత్‌లో పదాల గారడి చూస్తాము

శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనో యద్   1-2

అన్యదేవ తద్విదితాదథో అవిదితాదధి   1-4

నాహం మన్యే సువేదేతి నో న వేదేతి వేద చ।   2-3

ఇవన్నీ గురువే విడమర్చి చెప్పాలి.

## కైవల్యోపనిషత్

కైవల్యోపనిషత్‌కు ఆ పేరు ఎందుకు వచ్చింది?

ఒక్కొక్క ఉపనిషత్తుకు ఒక్కొక్క పద్ధతిలో పేరు వచ్చింది. కఠోపనిషత్‌ను కఠ ఋషి, మాండూక్యోపనిషత్‌ను మాండూక్య ఋషి, ఐతరేయోపనిషత్‌ను ఐతరేయ ఋషి దర్శించటం వల్ల వాటికి ఆ పేర్లు వచ్చాయి. కాని

ప్రశ్నోపనిషత్‌కు ఆరుగురు శిష్యులు ఒక గురువును ప్రశ్న వెయ్యటం వల్ల ఆ పేరు వచ్చింది. ఈశావాస్యో పనిషత్ ఈశావాస్యమిదగ్ం సర్వం తోనూ, కేనోపనిషత్ కేనేషితం పదంతోనూ, మొదలయ్యాయి.

కైవల్యోపనిషత్ కేవల ఆత్మ గురించి బోధిస్తుంది కాబట్టి ఆ పేరు వచ్చింది. కేవలం అంటే సంస్కృతంలో అద్వైతం అని అర్థం. అద్వైతం అంటే ఏకాత్మవాదన. జీవాత్మ, పరమాత్మల ఐక్యాన్ని బోధిస్తుంది. అంతే కాదు అనాత్మ నామరూపాలు మాత్రమే అనీ, అది మిథ్య అనీ, ఆత్మకు భిన్నంగా దానికి ఉనికి లేదనీ చూపిస్తుంది. అందువల్ల జీవాత్మ, పరమాత్మల ఐక్యం చూపించాక, అనాత్మను కూడా అందులో లయం చేస్తుంది.

**బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః.**

ఆ విధంగా ఉపనిషత్తు నేర్చుకునేసరికి ఏకాత్మే ఉందని అర్థమవుతుంది. కేవల ఆత్మను కైవల్యం అంటారు. కైవల్యం అంటే మోక్షం. ఈ కైవల్యం పదాన్ని అభయం, అసంగం పదాలకు కూడా వాడతారు. భయం ఎప్పుడు వస్తుంది?

**ద్వితీయాద్వై భయం భవతి – బృహదారణ్యకం**

నాకు భిన్నంగా ఇంకోటి ఉంటే, అది భయాన్ని కలుగజేయవచ్చు. ఎలా? దాని మీద నాకు రాగం ఉంటే, దాన్ని పోగొట్టుకుంటానేమోననే భయం కలుగవచ్చు. దాని మీద నాకు ద్వేషం ఉంటే అది వస్తుందేమోననే భయం. ఏ క్యాన్సరు లాంటి వ్యాధో వస్తుందేమోనని భయం.

**రాగవిషయః వియోగః ద్వేషవిషయః సంయోగః.**

అద్వైతంలో నాకు భిన్నంగా మరొకటి లేదు. అందువల్ల ఒకటి వస్తుందేమోననే భయమూ లేదు, ఇంకోటి పోతుందేమోననే భయమూ లేదు.

ఆ విధంగా ఈ ఉపనిషత్తు కేవల ఆత్మ గురించి, కైవల్యం(మోక్షం) గురించీ చెపుతుంది కాబట్టి దీన్ని కైవల్యోపనిషత్తు అంటారు. అంతేకాదు,

ఇది కైవల్యపదంతో ముగుస్తుంది కాబట్టి కూడా దీనికి కైవల్యోపనిషత్తు అని పేరు వచ్చింది.

**కైవల్యం పదమశ్నుతే కైవల్యం పదమశ్నుత ఇతి**

ముండకోపనిషత్ లాగా, కైవల్యోపనిషత్ కూడా అథర్వణ వేదానికి చెందినది. ఒక్కొక్క వేదానికి ఒక్కొక్క శాంతిపాఠం ఉంటుంది.

| **ఉపనిషత్తు** | **వేదం** | **శాంతిపాఠం** |
|---|---|---|
| ప్రశ్న, ముండక, మాండూక్య, కైవల్య | అథర్వణ వేదం | భద్రం కర్ణేభిః |
| ఛాందోగ్య, కేన | సామవేదం | ఆప్యాయంతు మమాంగాని |
| కఠ, తైత్తిరీయ | కృష్ణయజుర్వేదం | సహనావవతు |
| బృహదారణ్యక, ఈశావాస్య | శుక్లయజుర్వేదం | పూర్ణమదః |
| ఐతరేయ | ఋగ్వేదం | వాఙ్మేమనసి ప్రతిష్ఠితా |

# శాంతిపాఠం

**ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః । భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః ।**
**స్థిరైరంగైస్తుష్టువాగ్ంసస్తనూభిః । వ్యశేమ దేవహితం యదాయుః ।**
**స్వస్తి న ఇన్ద్రో వృద్ధశ్రవాః । స్వస్తి నః పూషా విశ్వవేదాః ।**
**స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః । స్వస్తి నో బృహస్పతిర్దధాతు ॥**
**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

ఏ పని ప్రారంభించాలన్నా కూడా దానిలో మూడు అంశాలుంటాయి. మన ప్రయత్నం, సమయం, దైవకృప. వీటికి తోడు ఆరోగ్యం సహకరించాలి. ఏ విధమైన ఆటంకాలు కలుగకూడదు. అందువల్ల ఉపనిషత్తు నేర్చుకునే ముందు విధిగా ఈ శాంతిపాఠం పఠిస్తారు. శాంతిపాఠాన్ని గురుశిష్యులిద్దరూ కలిసి గట్టిగా పఠిస్తారు.

పెద్ద పూజలలో ఈ శాంతిపాఠం మొత్తం చెప్పకుండా **భద్రం దధాతు** అంటారు. అంటే మొదటి పదం, ఆఖరిపదం మాత్రమే పలుకుతారు. అలా చెప్పినా అది పూర్తి వాక్యమే అవుతుంది.

ఈ శాంతిపాఠంలో శిష్యుడు భగవంతునుని మూడు కోరికలు కోరుతున్నాడు.

**1. కార్యకరణ సంఘాత యోగ్యత –** కార్యకరణ సంఘాతం అంటే శరీరం, మనస్సు, ఇంద్రియాల సముదాయం. ఇవన్నీ బాగుండాలి. శారీరక ఆరోగ్యం బాగుంటేనే ఎక్కడో ఉన్న ఉపనిషత్తు క్లాసుకి వెళ్ళి, ఒక గంట కుదురుగా కూర్చుని రాగలము. పైగా ఉపనిషత్తులు నేర్చుకోవటానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది. అంతవరకూ ఆరోగ్యాన్ని ఇయ్యి.

**స్థిరైః అంగైః తుష్టువాగ్ంసస్తనూభిః –** బ్రహ్మవిద్యా జ్ఞానం పొందటానికి అనేక దేవతలను ప్రార్థించాలి. ఆ ప్రార్థన చెయ్యటానికి ఆరోగ్యకరమైన అంగాలనియ్యి.

**భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః –** ఇంద్రియాలు పదునుగా ఉండాలి. బ్రహ్మ గురించి శ్రద్ధగా వినగలుగు గాక. ఒక చెవితో విని ఇంకో చెవితో వదిలేసేలా ఉండకూడదు. సరిగ్గా వినాలి. ఇది మోక్షానిచ్చే శాస్త్రం. దేవాః అంటే మన ఇంద్రియాలకు అధిష్టాన దేవతలను ప్రార్థిస్తున్నాము. ఉదాహరణకు చెవులకు అధిష్టాన దేవతలు దిగ్దేవతలు.

**భద్రం పశ్యేమ అక్షభిః యజత్రాః –** యజత్ర అన్నా కూడా దేవతే. మంగళరూపాన్ని కంటితో చూడనీ. బ్రహ్మ నిజానికి ఇంద్రియ అగోచరం కాని బ్రహ్మ గురించి చెప్పే ఆచార్యుని మీద దృష్టి నిలిపి, చెవితో శ్రద్ధగా వినాలి. అంతేకాదు, కన్ను చూసేదానికన్నా ఎక్కువగా బుద్ధితో అర్థం చేసుకునేలా చెయ్యి.

**ఈశావాస్య మిదగ్ం సర్వం –** అంతటా ఈశ్వరుడే ఉన్నాడు అన్న బుద్ధితో జగత్తును చూసేలా చెయ్యి. అలాగే మనస్సులో రాగద్వేషాలు ఉంటే శ్రద్ధ పెట్టి వినలేము. దాన్ని **ఫిల్టర్డ్ లిజనింగ్** అంటారు. అంటే కొన్ని వదిలేసి, కొన్నే వింటాము. ఆ వదిలేసే దాంట్లో ముఖ్యమైన విషయాలే వదిలేసే ప్రమాదముంది.

ఉదాహరణకు వేదాంతంలో జ్ఞానయోగాన్ని స్తుతించటానికి అప్పుడప్పుడు కర్మనింద జరుగుతుంది. కాని కర్మను పూర్తిగా వదిలివేయమని చెప్పదు వేదాంతం. కర్మలు అవసరమే కాని ఎంతవరకు? చిత్తశుద్ధి పొందటానికి. దాని తర్వాత అక్కడితో ఆగిపోకుండా జ్ఞానకాండకు వచ్చి, జ్ఞానం పొంది, మోక్షం పొందాలి. ఇదీ వేదాంతసారం. కాని చాలామంది ఏం చేస్తారు? రెండు విపరీతధోరణులు చూపిస్తారు. అయితే కర్మకాండలోనే ఆగిపోతారు, లేదా అసలు కర్మలే చేయకూడదు అనుకుంటారు. తెలివైన విద్యార్థి కర్మలను ఎంతవరకు చెయ్యాలో సరిగ్గా అర్థం చేసుకుంటాడు. కర్మ విలువా, కర్మ పరిమితీ – రెండూ తెలుసుకుంటాడు. కర్మచేసి, జ్ఞానానికి వస్తాడు. అందువల్ల కర్మస్తుతిని, కర్మనిందను సరిగ్గా అర్థం చేసుకునే మనస్సును ఇయ్యి.

అలాగే బుద్ధి కూడా ఆరోగ్యంగా ఉండాలి. తార్కికంగా ఆలోచించ గలగాలి. వేదాంతానికి రాకముందు మనకున్న అపోహలను పారద్రోలటానికి సిద్ధపడాలి. ఉదాహరణకు మోక్షం పొందటానికి అనేక మార్గాలున్నాయి అనుకుంటారు చాలామంది. జీవితంలో రెండురకాల లక్ష్యాలు ఉంటాయి–

ఏక సాధన సాధ్యం – ఒక మార్గంలోనే సాధించగలిగిన లక్ష్యం

అనేక సాధన సాధ్యం – అనేక మార్గాల్లో సాధించగలిగిన లక్ష్యం

ఒకచోటికి చేరటం – అనేక సాధన సాధ్యంలోకి వస్తుంది. అనేక మార్గాల్లో వెళ్ళవచ్చు. కాని చీకటిని తొలగించటానికి ఒకటే మార్గముంది. అది **కాంతి**. ఆ కాంతిలో అనేక రకాలుండవచ్చు – కొవ్వొత్తి, ట్యూబులైటు, వగైరా.

అలాగే చిత్తశుద్ధి పొందటానికి అనేక సాధనాలున్నాయి. కాని మోక్షం పొందటానికి మాత్రం ఒకటే మార్గముంది.

**జ్ఞానాత్ ఏవ కైవల్యం**

కాని దీన్ని అందరూ వెంటనే జీర్ణించుకోలేరు. ఎందుకంటే వాళ్ళు మోక్షం పొందటానికి అనేక మార్గాలు ఉన్నాయనుకుంటారు. ఉదాహరణకు కర్మ, భక్తి, ఉపాసన, యోగాసనం, వగైరా. ఇవన్నీ చిత్తశుద్ధిని కలుగజేస్తాయని, జ్ఞానమార్గం ఒక్కటే మోక్షాన్ని కలుగజేస్తుందనీ మనం అర్థం చేసుకోవాలి.

అంటే ఒక్కముక్కలో చెప్పాలంటే మనం శరీరం, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి పదునుగా ఉండాలని ప్రార్థన చేస్తున్నాము.

**2. అపమృత్యు బాధ పొందకుండా చెయ్యి** – దేవుడిచ్చిన పూర్ణాయుష్షును అనుభవించనీ. అపమృత్యు బాధ పొందకుండా చెయ్యి. ఈ విద్య నేర్చు కోవటానికి ఎన్నో సంవత్సరాలు కావాలి. దేవుడిచ్చిన ఆయుష్షు అంటే ఆయన ఇష్టప్రకారం ఇచ్చినది అని కాదు అర్థం. మన ప్రారబ్దకర్మ ఫలంగా దేవుడు మనకు నిర్దేశించిన కాలం. దాన్ని పరిపూర్ణంగా అనుభవించనీ.

పూర్ణాయుష్షు ఉండి, అన్ని అంగాలు స్థిరంగా ఉంటే ఆత్మవిద్య కోసం ప్రయత్నం చేస్తాడు. ఈ సందర్భంలో అనేక దేవతలకు ప్రార్థన చేస్తున్నాడు.

**స్వస్తి నః ఇంద్రో వృద్ధశ్రవాః –** వృద్ధశ్రవుడు అంటే ఇంద్రుడు. ఆయన మాకు మేలు చేయుగాక.

**స్వస్తి నః పూషా విశ్వవేదాః –** పూషా అంటే సూర్యదేవత. మన పోషణ కర్త సూర్యుడు. ఆయన కిరణజన్య సంయోగక్రియ వల్ల చెట్లలో ఆహారం ఏర్పడుతోంది. ఆయనకు విశ్వమంతా తెలుసు. సర్వజ్ఞుడైన ఆయనను కొలిస్తే మనకు కూడా జ్ఞానం కలుగుతుంది.

**స్వస్తి న బృహస్పతిః దధాతు –** దేవతలకు రాజైన ఇంద్రునికి గురువు బృహస్పతి. ఆయనను వాక్పతి అని, బుద్ధికి బృహస్పతి అనీ అంటారు. అందుకని నా బుద్ధిని పదునుగా చేసి నేను అర్థం చేసుకునేలా చెయ్యి.

**3. ప్రతిబంధకాలను తొలగించు –** ప్రతిబంధకాలు లేకుండా చెయ్యి.

**స్వస్తి నః తార్క్ష్యః అరిష్టనేమిః –** గరుడుని కదలికను ఎవరూ ఆపలేరు. నా ఆధ్యాత్మిక ప్రయాణం కూడా ఆటంకం లేకుండా చెయ్యి.

ఓం శాంతిః శాంతిః శాంతిః

త్రివిధ ప్రతిబంధాల నుంచి నన్ను కాపాడు. ఆదిదైవిక, ఆదిభౌతిక, ఆధ్యాత్మిక ఆటంకాలను తొలగించు.

**ఆదిదైవికం –** ప్రకృతి వైపరీత్యాల నుంచి వచ్చే ఆటంకాలు. సునామీలు, భూకంపాల లాంటివి. వాటి మీద మనకు ఏమీ అధికారం ఉండదు.

**ఆదిభౌతికం –** కుటుంబ సభ్యులు, చుట్టుప్రక్కల వాళ్ళ నుంచి వచ్చే ఆటంకాలు. సరిగ్గా మనం ఉపనిషత్తు క్లాసుకి వెళుతున్నప్పుడే ఎవరైనా రావచ్చు. దానిమీద మనకు కొంతమేరకు అధికారం ఉంటుంది. మన ఇంటికి తరచు వచ్చేవాళ్ళకు నేను సోమ, మంగళవారాలు సాయంకాలం ఉండను, దయచేసి వేరే రోజులు రండి అని ముందే చెప్పుకోవచ్చు.

**ఆధ్యాత్మికం –** మన నుంచి వచ్చే ఆటంకాలు. నేనేమిటి బ్రహ్మవిద్యను

అర్థం చేసుకోవటమేమిటి అనుకుని వెనుకంజ వేస్తాము. అసలు బ్రహ్మవిద్యే కాదు ఏది నేర్చుకోవాలనుకున్నా కూడా మనం మూడు అడుగులు ముందుకు వేస్తే మనస్సు ఆరు అడుగులు వెనక్కి లాగుతుంది. ఇది కాక, ఆరోగ్య సమస్యలు రావచ్చు. ఈ ఆటంకాల మీద మనకు చాలావరకు అధికారం ఉంటుంది. మనం తలుచుకుంటే వాటిని అదుపులో పెట్టుకోగలము.

చిన్మయానందస్వామి ఛలోక్తిగా ఈ ఓం శాంతిః శాంతిః శాంతిః మూడు రకాలుగా పలకాలని చెపుతారు. మొదటి శాంతి ఆదిదైవికం, ఆటంక నివృత్తి కోసం కాబట్టి గొంతెత్తి; రెండోది తోటి మానవుల కోసం కాబట్టి కొంచెం గట్టిగాను; మూడవది మన మనస్సుకు చెప్పేది కాబట్టి చాలా చిన్న గొంతుతోనూ చెప్పాలంటారు.

మనం శాంతిపాఠం చెప్పి మన ప్రతిబంధకాలకు తాత్కాలికంగా స్టే ఆర్డర్ తెచ్చుకున్నాము కాబట్టి ఇంక ఉపనిషత్తులోకి అడుగు పెడదాము.

# కైవల్యోపనిషత్

**అథాశ్వలయనో భగవంతం పరమేష్ఠినముపసమేత్యోవాచ**
**అధీహి భగవన్ । బ్రహ్మవిద్యాం వరిష్ఠాం ।**
**సదా సద్భిః సేవ్యమానాం నిగూఢామ్ ।**
**యయాఽచిరాత్ సర్వపాపం వ్యపోహ్య ।**
**పరాత్పరం పురుషం యాతి విద్వాన్ ॥** 1

సాధారణంగా ఉపనిషత్తులోని బోధ గురుశిష్యుల సంవాద రూపంలో ఉంటుంది అని చూశాము.

ఈ సంవాదం ఒక గురువు ఒక శిష్యుని మధ్య ఉండవచ్చు. ఉదా – ముండకం.

ఒక గురువు, అనేక శిష్యుల మధ్య ఉండవచ్చు. ఉదా – ప్రశ్న.

అనేక గురువులు, అనేక శిష్యుల మధ్య కూడా ఉండవచ్చు. ఉదా – బృహదారణ్యకం.

కైవల్యోపనిషత్తులో కూడా గురుశిష్యుల సంవాదరూపంలో వస్తుంది. ఒక్కోచోట వారి పేర్లు ఉండవు. ఉదాహరణకు కేనోపనిషత్తు. ఇక్కడ పేర్లు వస్తాయి. అశ్వలాయన ఋషి శిష్యుడు. ఆయన సాక్షాత్తూ బ్రహ్మదేవుని దగ్గరికే వెళ్ళాడు. ఒక్కోచోట గురుశిష్యులను పరిచయం చేసేముందు ఒక కథ వస్తుంది. ఉదాహరణకు కఠోపనిషత్తు. ఛాందోగ్యంలో కూడా అలా కొన్ని కథలు వస్తాయి. ఇది చిన్న ఉపనిషత్తు. ఇందులో 25 మంత్రాలే ఉన్నాయి. అందువల్ల మొదటి మంత్రంలోనే చాలా వివరాలు వచ్చేస్తాయి. ఆ కథల ద్వారా శిష్యుని అర్హత, గురువు అర్హత, గురువును సమీపించి, ప్రశ్నించాల్సిన తీరుతెన్నులు వస్తాయి. అవన్నీ ఇక్కడ మనకు మొదటి వాక్యంలో వచ్చినట్టు అర్థం చేసుకోవాలి.

అర్హత ఉన్న శిష్యుడు, అర్హత ఉన్న గురువు దగ్గరకు బ్రహ్మవిద్య నేర్చుకోవటం కోసం వెళ్ళాడు. ఇదీ సందర్భం. శిష్యునికి ఉండాల్సిన

అర్హతలేమిటి? సాధన చతుష్టయ సంపత్తి. అంటే వివేకం, వైరాగ్యం, ముముక్షుత్వం, శమాదిషట్క సంపత్తి. ఈ నాలుగు లక్షణాలు ఉన్న శిష్యుడిని అధికారి అంటారు. గురువుకు ఏం లక్షణాలుండాలి?

**శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్** – బ్రహ్మనిష్ఠ అంటే బ్రహ్మలో రమించాలి. గురువే నేను సంసారిని అనుకుంటే, అతను సద్గురువు అయ్యే బదులు శాడ్ గురువు అవుతాడు. శ్రోత్రియం అంటే తనకు తెలిసిన విద్యని బాగా అర్థమయ్యేలా చెప్పగలిగే నేర్పుండాలి. (మన స్వామీజీ శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువు).

**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్**

బ్రహ్మవిద్య నేర్చుకోవటానికి శిష్యుడే గురువు దగ్గరికి వెళ్ళాలి. గురువును రమ్మని పిలవకూడదు. ఎలా వెళ్ళాలి?

**సమిత్పాణిః** – సమిధలు తీసుకుని వెళ్ళాలి. అంటే వినమ్రంగా వెళ్ళాలి. అహంకారం ఉన్నచోట విద్య రాదు. అతను అణకువగా ఉన్నాడని చూపటానికి నమస్కారం చెయ్యాలి. వెళ్ళి గురువును వినమ్రంగా ప్రశ్న అడగాలి.

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా** – గీత 4.34

ఈ నేపథ్యంతో ఈ మంత్రాన్ని చూద్దాము.

**ఆశ్వలాయనః** – ఆశ్వలాయన అనే ఋషి. ఆయన ఋగ్మంత్రాలను అందుకున్నాడు.

**భగవంతం పరమేష్ఠినం, ఉపసమేత్య** – ఆయన బ్రహ్మ దగ్గరకు వెళ్ళాడు. ఏ బ్రహ్మ? సగుణ బ్రహ్మనా, నిర్గుణ బ్రహ్మనా? సగుణ బ్రహ్మే. చతుర్ముఖ బ్రహ్మ దగ్గరకు వెళ్ళాడు.

**బ్రహ్మా దేవానాం ప్రథమః సంబభూవ**

**విశ్వస్య కర్తా భువనస్య గోప్తా** – ముండకం 1.1.1

ఆయన సృష్టి, స్థితి, లయ కారకుడు. ఇక్కడ భగవంతం, పరమేష్ఠినం

పదాలు వేసింది ఉపనిషత్తు. ఎప్పుడు వెళ్ళాడు?

**అథ** – దాని తర్వాత. దేని తర్వాత? సాధన చతుష్టయ సంపన్నుడయ్యాక.

**అథాఽ తో బ్రహ్మజిజ్ఞాసా** – బ్రహ్మసూత్రాలు–1

బ్రహ్మసూత్రాలు ఈ సూత్రంతో మొదలవుతాయి. అథ పదాన్ని చాలా కూలంకషంగా చర్చించాక, శంకరాచార్యులు సాధన చతుష్టయ సంపన్నుడయ్యాక అని నిర్ణయిస్తారు. సాధన చతుష్టయ సంపన్నుడు ఎలా అవాలో, ఉపనిషత్తు చెప్పదు. ఇవి పొందటానికి వేద పూర్వభాగంలో రెండు సాధనలున్నాయి – కర్మయోగం, ఉపాసనయోగం. వేదాల సారం అయిన భగవద్గీత – వేద పూర్వ భాగం, వేద అంతభాగాల సారాంశాన్ని క్రోడీకరిస్తుంది. నిజానికి భగవద్గీత తేలికగా అర్థమవుతుంది. ఆత్మవిద్యకు మార్గం ఏమిటి?

కర్మయోగం పాటించి చిత్తశుద్ధి పొంది; ఉపాసనయోగం పాటించి చిత్త ఏకాగ్రత పొంది; జ్ఞానయోగం పాటించి జ్ఞానం పొంది; మోక్షం పొందాలి. చిత్తశుద్ధి పొందాక, జ్ఞానయోగానికి రావాలంటే, మనం చిత్తశుద్ధి పొందామా లేదా ఎలా తెలుస్తుంది? జ్ఞానయోగంలో ఆత్మజ్ఞానం అర్థమయితే మనం అధికారి అయినట్టు అర్థం. లేకపోతే శ్రవణం, మనస్సును సిద్ధం చేస్తుంది. ఆ విధంగా వేదాంత శ్రవణం, అధికారి కాని వ్యక్తికి కర్మయోగం అయితే, అధికారికి జ్ఞానయోగం అవుతుంది.

**ఉవాచ** – బ్రహ్మ దగ్గరకు వెళ్ళి ప్రశ్న వేశాడు. శిష్యుడు ప్రశ్నవేస్తే గురువు చెపుతాడు అని చూశాము.

**కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి**

– ముండకం 1.1.3

ఏ ఒక్కదాన్ని గురించి తెలుసుకుంటే, అన్నీ తెలిసినట్టు అవుతుందో ఆ విద్యను బోధించమని శిష్యుడు శౌనకుడు, గురువు అంగిరసుని అడిగాడు ముండకోపనిషత్తులో. ఇక్కడ ఆశ్వలాయనుడు ఏమని అడిగాడు?

**అధీహి భగవన్ బ్రహ్మవిద్యాం** – బ్రహ్మవిద్యను బోధించమన్నాడు.

**భగవన్** – గురువు ఇక్కడ సాక్షాత్తూ భగవంతుడే. భగవంతుడు కాకపోయినా, ఉపనిషత్తులలో గురువును భగవన్ అనీ, శిష్యుడిని సోమ్య అని సంబోధిస్తుంటారు. అధీహి అంటే అక్షరాలా తీసుకుంటే స్వగతంగా చెప్పటం. అంటే స్మరణం అనవచ్చు. మీరు నేర్చుకున్న ఆత్మవిద్యను పైకి గట్టిగా గుర్తు తెచ్చుకోండి అంటున్నాడు. ఎందుకు? దీని ఉద్దేశం ఏమిటంటే గురువు విద్యను బోధించగలడు కాని, దాన్ని జీర్ణించుకోవటం శిష్యుడే చెయ్యాలి. శిష్యుడు సిద్ధంగా లేకపోతే గురువు బోధ అరణ్యరోదనం అవుతుంది. ఏం చెప్పమన్నాడు?

బ్రహ్మవిద్యాం – శిష్యుడు నాకు కైవల్యం కావాలి అనలేదు. నాకు బ్రహ్మవిద్య చెప్పండి అన్నాడు. అంటే దీన్ని బట్టి మనం గ్రహించాల్సింది ఏమిటి? శిష్యుడికి తనకు కావాల్సింది ఏమిటో తెలుసు. కైవల్యం బ్రహ్మవిద్య వల్ల మాత్రమే వస్తుందని తెలుసుకున్నాడు.

**పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో**

**నిర్వేదమాయాన్నాస్త్యకృతః కృతేన** – ముండకం 1.2.12

లోకాన్ని పరీక్షించి, కర్మ వల్ల మోక్షం రాదని తెలుసుకుంటాడు అని చెపుతున్నది ఈ మంత్రం. ఉపనిషత్తు ప్రతి వ్యక్తిలోనూ ఈ పరిపక్వతను ఆశిస్తుంది. వేదాంతశాస్త్ర అధ్యయనం ఒకటే మోక్షానికి మార్గమనే విషయం ముందుగా అర్థం చేసుకోవాలి.

**నాన్యః పంథా అయనాయ విద్యతే**

ఈ విషయం అర్థం చేసుకుంటే ద్రౌపది కృష్ణపరమాత్మ మీద చూపిన అనన్య భక్తిని మనం శాస్త్రం మీద చూపిస్తాము. ద్రౌపది వేరే మార్గాలన్నీ మూసుకు పోయాయని గ్రహించగానే, రెండు చేతులూ ఎత్తి కృష్ణపరమాత్మను మనసారా వేడుకుంది. దీన్నే సర్వస్య శరణాగతి అంటారు. శాస్త్రం మీద మనకు అంత శ్రద్ధ ఉండాలి. ఆ శాస్త్రాన్ని బోధించే గురువు మీదా ఉండాలి. అంటే మోక్షమార్గం గురుశాస్త్ర ఉపదేశం మాత్రమే అని గ్రహించాలి.

ఆశ్వలాయనుడు బ్రహ్మవిద్య గొప్పతనం గుర్తించాడు కాబట్టి తనే దాన్ని ఐదు విధాలుగా కీర్తిస్తున్నాడు. ఏమిటవి?

**1. వరిష్ఠాం –** వరః, వరీయాన్, వరిష్ఠాం. వరిష్ఠాం అంటే శ్రేష్ఠతమమైనది. సృష్టిలోనే శ్రేష్ఠమైన జ్ఞానం.

**అధ్యాత్మవిద్యా విద్యానాం –** గీత 10.32

విద్యలలో నేను బ్రహ్మవిద్యను అన్నాడు కృష్ణపరమాత్మ. అంటే తక్కిన జ్ఞానాలన్నీ అపరావిద్యలోకి వస్తాయి. బ్రహ్మవిద్య ఒక్కటే మోక్షాన్నిచ్చే పరావిద్య. సంధ్యావందనం ప్రార్థనలో బ్రహ్మవిద్యను కలుగజేయి అని వస్తుంది.

**2. సద్భిః సేవ్యమానాం –** ప్రతి ఒక్కరూ పొందాల్సిన జ్ఞానం. కాని దురదృష్టవశాత్తు బ్రహ్మవిద్యను ఉచితంగా బోధించినా కూడా, అందరూ దానికి రారు. ఎందుకు? ఈ జ్ఞానానికి ఉన్న విలువ తెలియక, మనస్సు పరిపక్వత చెందక. ఒక చిన్న పిల్లవాడికి 500 రూపాయల నోటు, ఒక చాక్లెట్టు చూపిస్తే ఏది తీసుకుంటాడు? ఖచ్చితంగా చాక్లెట్టే! ఎందుకు? అతని దృష్టిలో అది ఒక కాగితం మాత్రమే. దానితో అనేక చాక్లెట్లు కొనుక్కోవచ్చని అతనికి తెలియదు. మన పరిస్థితీ అలాగే ఉంది. చాక్లెట్టు లాంటి ధర్మ అర్థ కామాల వెంట పరుగులు తీస్తున్నాము కాని, రూ 500 నోటు లాంటి మోక్షం కోరటం లేదు. అందువల్లనే ఎక్కువగా వేదాంతబోధకు వయస్సు మళ్ళినవారు వెళతారు కాని యువకులు వెళ్ళరు.

**వృద్ధాశిష్యా గురుర్యువ**

శిష్యులు వృద్ధులుగా, గురువు యువకుడుగా ఉంటారు. సద్భిః అంటే ఆధ్యాత్మిక ఆకలి ఉండాలి. అంటే సాధన చతుష్టయ సంపన్నులయి, తీవ్ర ముముక్షుత్వం ఉండాలి. ముముక్షుత్వం ఎంత ఎక్కువగా ఉంటే, అంత ఎక్కువ శ్రద్ధ ఉంటుంది. సేవ్యమానం అంటే జ్ఞానం పొందటానికి సాధన చెయ్యాలి. ఎప్పుడు? సదా – ఎల్లప్పుడూ. జ్ఞానం వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా పొందాలి.

**3. నిగూఢం** – ఈ జ్ఞానం సృష్టిలోనే అత్యంత రహస్యమైన విద్య. కృష్ణపరమాత్మే దీనిని **రాజవిద్యా రాజగుహ్యం** అన్నాడు. అంటే ఇది అన్ని విద్యలలోకి తలమానికం, అత్యంత గొప్ప రహస్యం. అది ఎందుకు అత్యంత రహస్యమైనది అంటే మన అపోహలే ఆత్మజ్ఞానాన్ని కప్పివేస్తున్నాయి. జ్ఞానం అందుబాటులో లేకపోవటం కాదు సమస్య. శ్రద్ధ ఉన్నవారికి ఉచితంగా పంచిపెట్టటానికి గురువులు సిద్ధంగా ఉన్నారు, కాని మనమే నేర్చుకుని, స్వీకరించటానికి సిద్ధంగా లేము. 33% మనుష్యులు అహం బ్రహ్మ అస్మి తర్కానికి విరుద్ధంగా ఉంది, దాన్ని స్వీకరించలేము అంటారు. బ్రహ్మ అంటే ఏమిటో నాకు తెలియకపోవచ్చు కాని నేను బ్రహ్మను కాదని మాత్రం నాకు తెలుసు అంటారు వాళ్ళు. ఇంకొక 33% మనుష్యులు బ్రహ్మవిద్య తర్కానికి అందేటట్టు ఉంది కాని, అది ఆచరణయోగ్యంగా లేదంటారు. నేను బ్రహ్మను అని తెలిసినా, నా వ్యక్తిగత సమస్యలు, కుటుంబ సమస్యలు ఉంటూనే ఉన్నాయి కదా అంటారు. మిగిలిన 33% శాతం అది తర్కానికి అందేటట్టు ఉంది, ఆచరణయోగ్యంగా కూడా ఉంది కాని నాకు వర్తించదు అంటారు. అందువల్ల వాళ్ళు వేరే మార్గాలు వెతుక్కుంటారు.

**శ్రవణాయాపి బహుభిర్యో న లభ్యః శృణ్వన్తోఽపి బహవో యం న విద్యుః।**
**ఆశ్చర్యో వక్తా కుశలోఽస్య లబ్ధా ఆశ్చర్యో జ్ఞాతా కుశలానుశిష్టః॥** కఠ – 1.2.7

ఆత్మజ్ఞానం వినేవాళ్ళు తక్కువ. విన్నా అర్థం చేసుకునేవాళ్ళు తక్కువ. గురువుకూ ఇది ఆశ్చర్యంగానే ఉంటుంది. ఆత్మ గురించి తెలుసుకునే శిష్యునికీ ఇది ఆశ్చర్యంగానే ఉంటుంది. పైన చూసిన ప్రకారం ఒక్క శాతం మనుష్యులే ఆత్మజ్ఞానం తర్కానికి అందుతుంది, ఆచరణ యోగ్యంగా ఉంది, అందుకునేటట్టు ఉంది అంటారు. అందువల్ల ఈ జ్ఞానాన్ని రహస్య విద్య అంటారు.

**4. యయా సర్వపాపం వ్యపోహ్య** – ఈ జ్ఞానం పొందితే, పాపాలన్నీ తొలగుతాయి. ఈశ్వరుడు, గురువు, శాస్త్రాల మీద శ్రద్ధ ఉంటే చాలదు, అది ఆత్మస్థైర్యానికి దారితీయాలి. అప్పుడే అది అన్ని పాపాలనూ నాశనం

చేస్తుంది. అది పరోక్షఫలం. ఆత్మజ్ఞానం ప్రత్యక్షంగా అజ్ఞానాన్ని నాశనం చేస్తుంది. అజ్ఞానం పోవటం వల్ల అజ్ఞానజనిత కర్మలు కూడా పోతాయి. పాపం అంటే అజ్ఞానజనిత కర్మలు – సంచిత, ఆగామి, ప్రారబ్ధకర్మలు.

**జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా** – గీత 4.37

జ్ఞానమనే అగ్ని అన్ని కర్మలను భస్మం చేస్తుంది. సంచితకర్మలు దగ్ధమయి పోతాయి; ఆగామి కర్మలు పుట్టవు; ప్రారబ్ధ కర్మ ఉంటుంది గాని జ్ఞాని వాటికి చలించడు. దాన్ని అతను మిథ్యగా చూస్తాడు కాబట్టి ప్రారబ్ధకర్మ ఉన్నా లేనట్టే!

**5. విద్వాన్ పరాత్పరం పురుషం యాతి** – అన్ని కర్మలనూ జ్ఞానంతో దగ్ధం చేసుకున్న జ్ఞాని, అహంబ్రహ్మ అస్మి అని నమ్మకంతో స్వీకరించి, బ్రహ్మతో ఐక్యం అవుతాడు. పురుష అంటే బ్రహ్మ. పురుష పదానికి రెండు అర్థాలున్నాయి. **పూరయతి సర్వం ఇతి పురుషః** – సర్వవాపకుడు. **పురే శరీరే శేతి ఇతి పురుషః** – శరీరమనే పురంలో ఉండే పురరాజు, ఆ పురుషుడు ఎలా ఉన్నాడు? **పరాత్పరం** – మొదటి పరం అంటే మాయ. ఈ జగత్తు మాయ. రెండవ పరం అంటే అతీతం. అందువల్ల పరాత్పరం అంటే మాయాతీతం. మాయాతీతం అంటే బ్రహ్మ ఎక్కడో మాయకు దూరంగా ఉన్నాడని అర్థం తీసుకోకూడదు. సృష్టిలో ఏం జరిగినా, బ్రహ్మకు అంటదు అని అర్థం. పశ్యన్, శృణ్వన్, స్పృశన్, జిఘ్రన్, అహం నైవ కించిత్ కరోమి అని వస్తుంది గీత ఐదవ అధ్యాయంలో. చూస్తున్నా, వింటున్నా, ముట్టుకున్నా, వాసన చూస్తున్నా, నేనేమి చెయ్యటం లేదు.

**నాదత్తే కస్యచిత్పాపం న చైవ సుకృతం విభుః ।**

**అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యంతి జంతవః ॥** – గీత 5.15

ఆత్మ అసంగం. ఆత్మకు పుణ్యపాపాలు అంటవు.

ఆత్మజ్ఞానం పొందితే చాలు మోక్షం పొందుతాడు. లౌకిక విద్యకు, ఆత్మ విద్యకు అదే ముఖ్యమైన భేదం. లౌకికవిద్యలో జ్ఞానం పొందాక,

కర్మ చెయ్యాలి. కర్మ చేశాక ఫలం పొందుతాడు. ఉదాహరణకు అమరావతి గురించి వింటే సరిపోదు. అక్కడికి వెళితేనే పుణ్యం వస్తుంది. కాని ఆత్మ విద్యలో వింటేనే ఫలం వస్తుంది. మధ్య దశ అయిన కర్మ చెయ్యనవసరం లేదు. అదెలా సాధ్యం? ఒక్క విషయంలోనే సాధ్యం.

అజ్ఞానం వల్ల ఏదైతే లేదు అనుకుంటున్నారో, దాని గురించిన జ్ఞానమే, మీకూ ఆ వస్తువుకూ మధ్య ఉందనుకున్న దూరాన్ని మటుమాయం చేస్తుంది.

**అప్రాప్తవత్ అవిద్యయా, విద్యయా ప్రాప్తవత్ భాతి**

ఉదాహరణకు మీ జేబులోనే తాళంచెవిని పెట్టుకుని మర్చిపోయారు. ఆ తాళంచెవి పోయిందనుకుని, దానికోసం అంతటా వెతికారు. ఎవరో మీ జేబులోనే ఉందని చెప్పారు. అంటే అది పోలేదన్న జ్ఞానం పొందారు. దీన్ని **కంఠచామీకరన్యాయం** అని కూడా అంటారు. ఒక రాణీగారు ఆవిడ నగ పోయిందని అంతటా వెతికిస్తూ ఉంటుంది. మంత్రిగారు వచ్చి, అమ్మా మీ మెడలోనే ఉంది అన్నారు. కంఠంలోనే ఉన్న నగ ఎక్కడో దూరంగా ఉందనే అజ్ఞానంలో ఆవిడ వెతికించింది. తన కంఠంలోనే ఉందనే జ్ఞానం, సాధ్య వస్తువును సిద్ధవస్తువు చేసింది.

ఆ విధంగా ఆత్మవిద్య ఆత్మ గురించిన అజ్ఞానాన్ని పారద్రోలుతుంది. జీవాత్మ వేరు, పరమాత్మ వేరు కాదని నిరూపిస్తుంది. జ్ఞాని బ్రహ్మను పొందుతాడు. **పొందుతాడు** మాటను అక్షరాలా తీసుకోకూడదు. బ్రహ్మను పొందటానికి అది బాహ్యవస్తువు కాదు. పొందుతాడు అంటే తను బ్రహ్మ కాదు అనుకున్న అజ్ఞానం తొలగి, తన స్వరూపజ్ఞానం పొందుతాడు.

ఈ విధంగా బ్రహ్మవిద్య శ్రేష్ఠమైనదనీ, అందరూ పొందాల్సినదనీ, నిగూఢమైనదనీ, సర్వపాపాలు తొలగి, జీవ ఈశ్వర ఐక్యం పొందుతాడని ఆశ్వలాయనుడు చెప్పి, అటువంటి బ్రహ్మవిద్యను తనకు బోధించమని బ్రహ్మను కోరాడు. దీన్ని బట్టి ఆశ్వలాయనుడు తెలివైనవాడని, అధికారి అనీ మనకు తెలుస్తున్నది.

**2 – 4 మంత్రాలు – జ్ఞానసాధనలు, జ్ఞానఫలం**

**తస్మై స హోవాచ పితామహశ్చ ।**

**శ్రద్ధా భక్తి ధ్యానయోగాదవైహి ॥** 2

మామూలుగా గురువు, శిష్యుని అర్హతను పరీక్ష చేశాకే, బ్రహ్మవిద్య బోధిస్తాడు. కఠోపనిషత్తులో యమధర్మరాజు నచికేతుని అధికారిత్వాన్ని ఎన్నో విధాలుగా పరీక్ష చేశాడు. కాని ఇక్కడ బ్రహ్మదేవుడు, ఆశ్వలాయనుని పరీక్ష చెయ్యలేదు. వెంటనే బోధ మొదలుపెట్టాడు. అంటే ఈ శిష్యునికి అధికారత్వం ఉందని బ్రహ్మదేవుడు గ్రహించాడు.

**సః పితామహః ఉవాచ** – పితామహుడు అంటే మామూలుగా తాత. ఇక్కడ విశ్వానికంతటికీ తాత. అంటే చతుర్ముఖబ్రహ్మ. ఆయన శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ ఆచార్యుడు.

**తస్మై** – ఆశ్వలాయన ఋషితో చెప్పాడు. ఆ ఋషి సాధన చతుష్టయ సంపన్నుడు.

**అవైహి** – ఆ బ్రహ్మను ఈ మూడు అంశాల ద్వారా తెలుసుకోగలవు. ఏమిటవి? శ్రవణం, మననం, నిదిధ్యాసనం. కాకపోతే ఇక్కడ ఉపనిషత్తు వాటికి వేరే పదాలను వేస్తున్నది. అవి వరుసగా శ్రద్ధ, భక్తి, ధ్యానం.

ఏదైనా విద్య నేర్చుకోవాలంటే దానికి రెండు సాధనలుంటాయి. సాక్షాత్ సాధన, సహకారి సాధన. విద్య నేర్చుకునే విషయాలలోనే కాదు అన్ని విషయాల్లోనూ ఉంటాయి. ఉదాహరణకు ఒక చెట్టు పెరగాలంటే, అది విత్తనం నుంచి వస్తుంది. దాన్ని సాక్షాత్ సాధన అంటారు. విత్తనం పాతే ముందు నేల తవ్వటం, విత్తనాన్ని పాతాక నీరు పోయటం, ఎరువులు వేయటంలాంటి పనులన్నీ సహకారీ సాధనలు. అలాగే మనకు అనారోగ్యం వస్తే డాక్టరు దగ్గరికి వెళతాము. ఆయన కొన్ని మందులు రాసిచ్చి, పథ్యం కూడా చెపుతారు. మందులు సాక్షాత్ సాధన, పథ్యం సహకారి సాధన. రెండూ కలిస్తేనే ఫలితం ఉంటుంది. చక్కెరవ్యాధికి మందు వేసుకుంటూ,

తిరుపతి లడ్డు పూర్తిగా తినేస్తే, మందు పనిచెయ్యదు. ఈ మంత్రంలో సాక్షాత్ సాధనను చూస్తున్నాము. అది వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చెయ్యాలి.

**శ్రద్ధ –** శ్రద్ధ అంటే శ్రవణం అని చూశాము. శ్రవణం అంటే **ఒక క్రమపద్ధతిలో క్రమం తప్పకుండా, కొన్ని సంవత్సరాల పాటు, సమర్థవంత మైన గురువు వద్ద వేదాంతవిద్యను అభ్యసించడం.** ఇందులో ప్రతి పదమూ ముఖ్యమే.

ఒక క్రమపద్ధతిలో అంటే శాస్త్రాన్ని ఒక పద్ధతిలో నేర్చుకోవాలి. ముందు భగవద్గీత, ఆ తర్వాత ఉపనిషత్తులు, ఆ తర్వాత బ్రహ్మసూత్రాలు నేర్చు కోవాలి. వీటిని **ప్రస్థానత్రయం** అంటారు. క్రమం తప్పకుండా అంటే వారానికి ఒకరోజో, రెండురోజులో మానకుండా క్లాసులకు వెళ్ళి విద్య నేర్చుకోవడం.

కొన్ని సంవత్సరాలపాటు ఎందుకంటే ఈ ప్రస్థానత్రయం నేర్చు కోవాలంటే చాలాకాలమే పడుతుంది. భగవద్గీతనే వారానికి రెండు క్లాసులు చొప్పున వింటే, నాలుగు సంవత్సరములు కావాలి. అలాంటిది ఇంకా తక్కినవి కూడా నేర్చుకోవాలి కదా!

సమర్థవంతమైన గురువు వద్ద నేర్చుకోవాలి. ఆ గురువు శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ గురువై ఉండాలి. స్వంతంగా నేర్చుకోకూడదు.

వేదాంతశాస్త్ర అధ్యయనం చెయ్యాలి. శాస్త్రం నేర్చుకోవాలి. శాస్త్రం మీద శ్రద్ధ ఉండాలి.

అందువల్లనే ఇక్కడ బ్రహ్మదేవుడు శ్రద్ధ అనే పదాన్ని వాడాడు. వేదాంత శాస్త్రం మీద, గురువు మీద శ్రద్ధ ఉండాలి. వేదాంతశాస్త్రమే ప్రమాణం. దానికి ఇంకొక ప్రమాణం అవసరం లేదు. కాని చాలామంది దాన్ని సైన్సు పరంగా గానీ, ధ్యానపరంగా గాని అనుభవించటానికి ప్రయత్నిస్తారు. ఇవే రెండు పెద్ద ఆటంకాలు. శ్రద్ధ లేకపోవటం వల్ల కొంతమంది సైన్సు పరంగా నిరూపించమంటారు; మరికొంతమంది అద్వైత అనుభవాన్ని సమాధిలో

పొందాలని చూస్తారు. వేదాంతం మోక్షాన్ని ఇస్తుందని ఈ రెండోరకం వాళ్ళు నమ్మరు. వాళ్ళు ఏదో అసాధారణమైన అనుభవాన్ని పొందాలని చూస్తారు. వేదాంతమే ఒక ప్రమాణమైనప్పుడు, అది స్పష్టంగా అహం బ్రహ్మ అస్మి జ్ఞానాన్ని ఇస్తున్నప్పుడు, మళ్ళీ దాన్ని ఇంకో ప్రమాణంలో నిరూపించటానికి ప్రయత్నించటం ఎందుకు? పైగా, వేదాంతశాస్త్ర విషయంలో వేరే ఏ ప్రమాణమూ పనిచెయ్యదు. ఎందుకంటే తక్కిన ప్రమాణాలన్నీ అనాత్మ గురించి చెపుతాయి తప్ప ఆత్మ గురించి బోధించవు.

**భక్తి –** భక్తి అంటే ఇక్కడ మననం అని చూశాము. శ్రవణం ఆత్మ గురించిన జ్ఞానాన్ని ఇస్తే, మననం నిశ్చయ జ్ఞానాన్ని ఇస్తుంది. లవలేశం సందేహమున్నా కూడా ఆ జ్ఞానం ఫలించదు. మననం సంశయ నివృత్తి చేస్తుంది. మననం బుద్ధిలో కలిగే ఆటంకాలను తొలగిస్తుంది.

మననాన్ని భక్తి అని ఎందుకంటారంటే, భక్తిలో భక్తుడు నిరంతరం భగవన్నామజపం చేస్తాడు. కృష్ణపరమాత్మే భక్తిని ఈ విధంగా నిర్వచించాడు.

**మచ్చిత్తా మద్గతప్రాణా బోధయంతః పరస్పరమ్ ।**

**కథయంతశ్చ మాం నిత్యం తుష్యంతి చ రమంతి చ ॥** – గీత 10.9

నా భక్తులు నామీదే తమ మనస్సులను లగ్నం చేస్తారు. నా గురించే మాట్లాడుతూ, నాలోనే రమిస్తారు అన్నాడు కృష్ణపరమాత్మ. మననం కూడా అంతే. నిరంతరం ఆత్మలోనే రమిస్తారు.

**ధ్యానం –** ధ్యానం అంటే నిదిధ్యాసనం. నిదిధ్యాసనం అంటే బ్రహ్మ నిష్ఠలో ఉండటం. నేర్చుకున్న జ్ఞానాన్ని మన వ్యక్తిత్వంలో మలచుకోవాలి. అంటే అహం బ్రహ్మ అస్మి అనే జ్ఞానం మన నరం నరంలోనూ జీర్ణించు కోవాలి. ప్రారబ్ధకర్మ మనను బాధ పెడుతున్నప్పుడు, నేను శరీరాన్ని కాను, ఇంద్రియాలను కాను, మనస్సును కాను. నేను ఆత్మను. నాకు ఇవేమీ అంటవు అని తెలుసుకోగలగాలి. ఒక వేదాంతి ఒక సమస్య వచ్చినప్పుడు 'ఏమిటీ' అని ఖంగారుగా అన్నాడట ముందు. తర్వాత తను నేర్చుకున్న వేదాంతం గుర్తుకువచ్చి 'అయితే ఏమిటి?' అన్నాడట.

అలా మనం ఏమిటి నుంచి అయితే ఏమిటికి ప్రయాణం చెయ్యాలి. అది నిదిధ్యాసనం ద్వారా సాధ్యమవుతుంది.

జీవ–జగత్తు–ఈశ్వరుడు భావనను త్రిపుటి అంటారు. మనం ఇప్పుడు ఉన్నది త్రిపుటిలో. నేను బాధపడుతున్న జీవిని, ప్రారబ్ధం అనే కొరడాతో ఈ ప్రపంచం నన్ను కొడుతోంది. ఈశ్వరుడు మాత్రమే నన్ను రక్షించగలడు అనుకుంటాము.త్రిపుటి నుంచి ద్విపుటికి రావాలి. ద్విపుటి అంటే ఆత్మ–అనాత్మ విభజన. నేను ఆత్మను; ఈ జగత్తు అంతా అనాత్మ. నేను ఆత్మను కాబట్టి అనాత్మ అయిన జగత్తు నన్నేమీ చెయ్యలేదు.

**మయ్యేవ సకలం జాతం మయి సర్వం ప్రతిష్ఠితమ్**

ఈ ఉపనిషత్తులోనే రాబోతున్నది. నేనే సృష్టి, స్థితి, లయ కారకుడిని. జగత్తంతా, ప్రారబ్ధకర్మతో సహా మిథ్య. బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా అని నేర్చుకున్నదాన్ని నిదిధ్యాసనంతో అహం సత్యం జగన్మిథ్యా అని జీర్ణించుకోవాలి.

అనాత్మలో ఐదు విషయాలు వస్తాయి – **వస్తువులు, వృత్తి, కుటుంబం, శరీరం, మనస్సు.** ఈ పంచ అనాత్మలు కేవలం నామరూపాలు మాత్రమే. ఇది జీర్ణించుకోవటానికి కష్టంగా ఉన్నా కూడా ఇది సత్యం. మిథ్య సత్యాన్ని బాధించలేదు. ఎండమావిలోని నీరు ఇసుకని ఎలా తడి చెయ్యగలదు అంటారు శంకరులవారు. అంతేకాదు ఈ సృష్టి అంతా **మరు మరీచికా కల్పం** అంటారు వివేక చూడామణిలో.

**మాయా మాయాకార్యం సర్వం మహదాది దేహపర్యంతం**
**అసదిదమనాత్మకం త్వం విద్ధి మరుమరీచికాకల్పమ్**
**–వివేక చూడామణి 125**

నన్ను ప్రపంచం బాధించలేదు కాబట్టి, నేను బాధింపబడటం లేదు కాబట్టి, నన్ను బాహ్యంగా ఎవరూ రక్షించనవసరం లేదు. నేను బ్రహ్మను, జగత్తు మిథ్య. ఈ జ్ఞానాన్ని నాలో జీర్ణించుకోవటానికి నిదిధ్యాసనం చెయ్యాలి.

ఈ జ్ఞానం అర్థమయినా, దాన్ని తేలిగ్గా జీర్ణించుకోలేము. ఎందుకంటే మనలో సంవత్సరాల నుండి జీర్ణించుకుపోయిన అలవాట్లు అడ్డం పడతాయి. మనలో సంవత్సరాల తరబడీ కూరుకుపోయిన రాగద్వేషాలు, కామక్రోధాలు అంత తేలిగ్గా పోవు. అందువల్ల నిదిధ్యాసనం అంటే భావపరమైన ఆటంకాలను తొలగించుకోవటం.

శ్రవణం అంటే అజ్ఞానాన్ని తొలగించటం – అజ్ఞాన నివృత్తి

మననం అంటే బుద్ధిలో కలిగే సందేహాలను తొలగించటం – సంశయ నివృత్తి

నిదిధ్యాసనం అంటే వాసనలను తొలగించటం – వాసనా నివృత్తి

ఈ మూడింటినీ కలిపి జ్ఞానయోగం అంటారు. ఇదొక్కటే మార్గం. ఇదే సాక్షాత్ సాధన. ఇది కాకుండా వేరేమార్గం లేదు.

**యోగాత్** – యోగ అంటే సాధన. ఈ పదాన్ని ముందు మూడు మాటలకు కలుపుకోవాలి. శ్రద్ధాయోగం, భక్తియోగం, ధ్యానయోగం. ఎంతకాలం చెయ్యాలి అనే సందేహం కలుగుతుంది. మొదటి మంత్రంలో వదిలేసిన అచిరాత్ ఇక్కడికి తెచ్చుకోవాలి.

**అచిరాత్** – త్వరలోనే. ఎంతకాలంలో అంటే ఫలాన కాలంలోపు అని ప్రత్యేకించి చెప్పలేము. ఎందుకంటే అందరికీ ఒకటే కాలం పట్టదు. వారివారి ప్రయత్నాన్ని బట్టి ఉంటుంది.

**న కర్మణా న ప్రజయా ధనేన ।**
**త్యాగేనైకే అమృతత్వమానశుః ॥**
**పరేణ నాకం నిహితం గుహాయాం ।**
**విభ్రాజతే యద్యతయో విశన్తి ॥** 3

ఈ మంత్రం చాలా ప్రసిద్ధి చెందిన మంత్రం. ఎవరైనా సన్న్యాసిని ఇంటికి పిలిచినప్పుడు, ఆయనను పూర్ణకుంభంతో ఆహ్వానిస్తూ పలికే మంత్రం. దీన్ని మహానారాయణోపనిషత్తులో కూడా చూస్తాము.

దేనికన్నా రెండు సాధనలుంటాయనీ, అవి సాక్షాత్ సాధన అనీ, సహకారీ సాధన అనీ చూశాము. ముందు మంత్రంలో సాక్షాత్ సాధనను చూశాము. ఇప్పుడు సహకారీ సాధనను చూస్తున్నాము. సన్న్యాసి వర్ణన ద్వారా సహకారీ సాధనను వర్ణిస్తున్నాడు బ్రహ్మదేవుడు. సాధన చతుష్టయ సంపత్తి కలిగి ఉండటం సహకారీ సాధన క్రింద వస్తుంది. అందులోనూ ఇక్కడ వైరాగ్యాన్ని స్తుతిస్తున్నాడు.

వైరాగ్యం అంటే బాహ్యంగా సన్న్యాసి అవనవసరం లేదు. ఆంతర సన్న్యాసం స్వీకరించాలి. దీన్ని PORT reduction అంటారు.

P-Possessions; O-Obligations; R-Relationships; T-Transactions. వీటన్నిటినీ తగ్గించుకోవాలి. అంటే ఆస్తులు, వస్తువులు పెంచుకోవటం, మొహమాటం కొద్దీ అనేక పనులు చెయ్యటం, బంధుత్వాలు పెంచుకుంటూ పోవటం, అనేక వ్యవహారాలలో తలదూర్చటం. వీటన్నిటినీ వీలున్నంతగా తగ్గించుకోవాలి. పోర్ట్ అనేది ప్రవృత్తి మార్గానికి సరిపోతుంది కాని నివృత్తి మార్గానికి సరిపోదు.

జ్ఞానయోగం సాక్షాత్ సాధన అని చూశాము కదా, వైరాగ్యం పెంపొందించుకోవటం సహకారీ సాధన. అది పాటించకపోతే ఎంతగా శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసినా కూడా అవి ఫలించవు. ఈ పోర్ట్‌ను పూర్తిగా మానలేరు. అందువల్ల వీలున్నంతలో తగ్గించుకోవాలి. మీ బాధ్యతలను నెరవేర్చాక, కొత్త బాధ్యతలను చేపట్టకూడదు. వాటిని తర్వాత వచ్చే తరానికి అందజేయండి. కర్మ చెయ్యాలంటే ఇవన్నీ కావాలి – మనుష్యులు, బంధువులు, ధనం. ఇవి ఎంత ఎక్కువ ఉంటే అంత విజయం సాధించినట్లు అర్థం.

కాని జ్ఞానయోగానికి వచ్చేసరికి ఇవేవీ అవసరం లేదు. బాహ్యంగా కాషాయవస్త్రాలు ధరించేకన్నా కూడా, వైరాగ్యం పెంచుకోవటం ముఖ్యం. సన్న్యాసంలో కూడా రెండు దశలుంటాయి. వివిదిషా సన్న్యాసం, విద్వత్ సన్న్యాసం. వివిదిషా సన్న్యాసి విద్య నేర్చుకునే దశలో ఉంటాడు.

అంటే శ్రవణం, మననాలు చేస్తూ ఉండాలి. ఆ సమయంలో ఆశ్రమకర్మలు కొన్ని పాటించాల్సి ఉంటుంది. దానికి సూచనగా **దండం** ఉంటుంది అతని దగ్గర. విద్వత్ సన్యాసి అంటే విద్య నేర్చుకున్నాడు. అతను నిదిధ్యాసనం చెయ్యాలి. ఈ దశలో దండాన్నీ, దానికి సంబంధించిన కర్మలను కూడా వదిలివేస్తాడు. ఈ నేపథ్యంతో ఈ మంత్రం చూద్దాము –

**న కర్మణా అమృతత్త్వం ఆనశుః** – కర్మ వల్ల మోక్షం రాదు. ఎందుకు మోక్షం రాదు?

1. **కర్మ జ్ఞానం పొందటానికి వాడే ప్రమాణం కాదు** – ఒకవేళ కర్మ చెయ్యటం వల్ల జ్ఞానం వచ్చేటట్టయితే, కాలేజీలో అధ్యాపకుడు చెప్పే ఫిజిక్స్ విననవసరం లేదు. క్లాసురూమును శుభ్రం చేస్తేనో, విష్ణు సహస్రనామం చదివితేనో ఫిజిక్స్ జ్ఞానం వస్తుందా? రాదు. కర్మ ప్రమాణం కాదు, ఇది వేదాంతబోధలో ప్రాథమిక అంశం. ముందు దీన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి.

2. **కర్మ శాశ్వతమైన ఫలితాన్ని ఇవ్వలేదు** – మనం చేసే కర్మ శాశ్వతం కానప్పుడు, దానివల్ల వచ్చే ఫలం ఎలా శాశ్వతమవుతుంది? ఒక యజ్ఞం చేస్తే, స్వర్గలోకానికి వెళతాము. కాని అది శాశ్వతఫలం కాదు.

**క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి –గీత**

మోక్షం అంటే శాశ్వతత్త్వం, పరిపూర్ణత్వం. కాని ఒక కాలంలో చేసే కర్మకు వచ్చే ఫలం కాల పరిమితిలోనే ఉంటుంది.

**ప్లవాహ్యేతే అదృఢా యజ్ఞరూపాః – ముండక 1.2.7**

కర్మలు నిలకడలేని తెప్పల లాంటివి. తెప్పలతో సముద్రం దాటటం ఎలా సాధ్యము కాదో, కర్మలతో సంసారసాగరాన్ని దాటి మోక్షాన్ని పొందటము కూడా సాధ్యము కాదు. అలా పొందగలమనుకున్నవాళ్ళను మూఢులంటున్నది ఉపనిషత్తు. ఇక్కడ ఒక విషయం గమనించాలి – ఉపనిషత్తు కర్మను నిందించటం లేదు. కర్మను మానమనటమూ లేదు. కాని కర్మల దగ్గరే ఆగిపోవద్దంటున్నది.

## జ్ఞానయోగానికి రానిదే కర్మయోగం అసంపూర్ణం
## కర్మయోగం లేనిదే జ్ఞానయోగం అసాధ్యం

కర్మయోగం చిత్తశుద్ధిని ఇస్తుంది. అందువల్ల అది సహకారీ సాధన అయింది కాని సాక్షాత్ మోక్షాన్నివ్వదు. ముందు చెప్పిన పోర్ట్‌లోని 'టి' అంటే వ్యవహారాలను సూచిస్తుంది కర్మ. వ్యవహారాలు తగ్గించుకోవాలి.

**న ప్రజయా –** పిల్లల వల్ల మోక్షం కలగదు. పిల్లలు శ్రాద్ధకర్మలు చేస్తేనో, తర్పణాలు వదిలితేనో మోక్షం రాదు. పిల్లల మీద అనేక ఆశలు పెంచుకుంటారు చాలామంది. వాళ్ళు తమ వృద్ధాప్యంలో తమను బాగా చూసుకోవాలనుకుంటారు. కొడుకు దృష్టి మీనుంచి తన కాపురం మీదకు మళ్ళితే, మా అబ్బాయి మంచివాడే, మా కోడలు వచ్చి వాడిని మార్చివేసింది అంటారు. కాని పిల్లలు మీకు మోక్షానివ్వలేరు. మీకు ఆకలి వేస్తే, వాళ్ళు తింటే మీ ఆకలి తీరుతుందా? వాళ్ళు మీకు ఆహారం తెచ్చిపెట్టగలరు కాని, మీ బదులు వాళ్ళు తిని పెట్టలేరు. మీరే తీర్చుకోవాలి.

అలాగే మీకు ఆధ్యాత్మిక ఆకలి వేస్తే, మీరు క్లాసులకు వెళ్ళటానికి అనువైన వాతావరణం ఏర్పరచగలరు, కాని మీరు వెళ్ళి నేర్చుకోవాలి. పిల్లలు అంటే ఒక్క పిల్లలనే తీసుకోవనవసరం లేదు, బంధువులు అందరూ కూడా వస్తారు. ఇది పోర్ట్‌లోని 'ఆర్' అంటే రిలేషన్‌షిప్స్‌ను సూచిస్తుంది. ఇన్నాళ్ళూ వాళ్ళ బాగోగులు చూశారు, ఇప్పుడు మీకు కొంత సమయం కేటాయించుకుని, మీరు గీతా క్లాసులకు వెళ్ళే సౌకర్యం ఏర్పరచు కోవాలి. అనవసరమైన బాధ్యతలు తగ్గించుకోవాలి. ఇది పోర్ట్‌లోని 'ఓ' అంటే ఆబ్లిగేషన్స్‌ను సూచిస్తుంది.

**(న) ధనేన –** ఇక్కడ 'న' కలుపుకోవాలి. న ధనేన. ధనం వల్ల కూడా మోక్షం రాదు. న కలుపుకోకపోతే కర్మ వల్ల మోక్షం రాదు, పిల్లల వల్ల మోక్షం రాదు, కాని ధనం వల్ల మోక్షం వస్తుందని అర్థం వస్తుంది. అశాశ్వతమైన ధనం, శాశ్వతమైన మోక్షాన్ని ఇవ్వలేదు. ఇది పోర్ట్‌లోని 'పి' అంటే ఆస్తులను సూచిస్తుంది. ఆస్తి మీద మమకారం తగ్గించుకోవాలి.

**త్యాగేన –** ఇక్కడ 'న' కలపకూడదు. త్యాగం వల్లనే మోక్షం కలుగుతుంది. త్యాగం అంటే వైరాగ్యం. ఇంకోవిధంగా చెప్పాలంటే పోర్ట్ రిడక్షన్. ఈ పోర్ట్ రిడక్షన్ చెయ్యమని రెండు కారణాల వల్ల చెపుతాము.

**1. యోగక్షేమాలు –** యోగం అంటే ఒక వస్తువును పొందటం, క్షేమం అంటే పొందిన వస్తువును నిలబెట్టుకోవటం. ఈ రెండింటి కోసమే మన డబ్బు, సమయం వృథా అయిపోతూ ఉంటుంది. ఒక ఇల్లు కొంటే భద్రత కోసం కుక్కను పెంచుతాము, ఇంటిముందు గూర్ఖాను నియమిస్తాము. అలా ఒకదాని కోసం ఇంకొకటి పెంచుకుంటూ పోతాము. వీటిలో ఎంతగా మునిగిపోతామంటే, ఆత్మ విచారణ చేసుకునేందుకు కొంచెం కూడా ఖాళీ సమయమే దొరకదు.

**2. బంధకత్వం –** మనకున్న బంధుత్వాల వల్ల అంతకంతకూ బంధకత్వం పెంచుకుని, వారిమీద భావపరంగా ఆధారపడతాము. అలా పడకుండా, వైరాగ్యం పెంచుకోవాలి. దీన్ని త్యాగం లేదా సన్న్యాసం అంటున్నాడు బ్రహ్మదేవుడు. సన్న్యాసం అంటే అక్షరాలా తీసుకుంటే కాషాయ వస్త్రాలు ధరించి, సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించటం. కాని అసలు అర్థం ఆంతర సన్న్యాసం పెంపొందించుకోవటం. గృహస్థుగా ఉండి ఏదైనా, ఎప్పుడైనా త్యజించగలిగే మనోస్థైర్యం పెంపొందించుకోవాలి.

ఆంతర సన్న్యాసం ఎలా పెంపొందించుకోవాలి?

1. **వివేకం చూపటం ద్వారా–** నిత్యానిత్య వస్తువివేకం చేస్తే, తక్కినవన్నీ అశాశ్వతమైనవని, అశాశ్వతమైనవాటిని శాశ్వతంగా ఉండాలని కోరుకోకూడదనీ అర్థమవుతుంది.

2. **అహంకార, మమకారాలను తగ్గించుకోవటం ద్వారా–** ఈ జగత్తంతా, నా శరీరంతో సహా, నాకు భగవంతుడు తాత్కాలికంగా ఇచ్చాడు. నేను వాటితో ఆడుకోవటానికి, ప్రేమ చూపించటానికి, ప్రేమ పొందటానికి ఇచ్చాడు. వాటిని ఎప్పుడు భగవంతుడు కోరితే, అప్పుడు నేను కృతజ్ఞతా పూర్వకంగా తిరిగి ఇచ్చేయాలి. వాటిమీద నాకు ఏ హక్కూ లేదు. ఆలయంలో

ధర్మకర్తలు ఆలయం యొక్క ఆస్తులను రక్షిస్తారు కాని, వాళ్ళు దానిమీద హక్కు పెంచుకోరు. అలాగే ఒక శాస్త్రజ్ఞుడు ప్రయోగశాలకు వెళ్ళి, అవసరమైనంతసేపు ప్రయోగం చేసి, తర్వాత అక్కడనుంచి బయటకు వచ్చేస్తాడు. ఈ విధంగా అహంకార, మమకారాలను తగ్గించుకోవాలి. దీన్నే త్యాగం అనీ, సన్న్యాసం అనీ, వైరాగ్యం అనీ అంటారు. జ్ఞానం, రాగం ఒకచోట నిలవవు. **జ్ఞానవైరాగ్య సిద్ధ్యర్థం** అంటారు అందుకే.

ఉదాహరణకు చిన్నపిల్లల విషయం తీసుకోండి – వాళ్ళు ముందు వాకర్ సహాయంతో నడుస్తారు. కాని ఎప్పటికీ దానితోనే నడుస్తారా? లేదు. ఎప్పుడో అది వదిలేసి, స్వంతంగా నిలబడతారు. మొదట్లో క్రింద పడుతూనే ఉంటారు, అయినా ఆగరు. నెమ్మదిగా స్వంతంగా అడుగులు వేయటం నేర్చుకుని, కొన్ని రోజుల్లోనే పరుగులు తీస్తారు. అంత చిన్న పిల్లలకే తెలుసు, వాకర్‌తోనే నడుస్తూ ఉంటే స్వంతంగా నడవలేమని.

మన వాకర్ ఏమిటి? మనుష్యుల మీద మానసికంగా ఆధారపడటం. మనం కూడా వాకర్ వదిలేయాలి అంటే మానసిక స్వాతంత్ర్యం సాధించాలి. ఇది రెండు రకాలుగా అవుతుంది. సన్న్యాసం స్వీకరిస్తే ఆస్తులను, మనుష్యులను, అన్నింటినీ వదిలి వేసుకోవాలి. ఆంతర సన్న్యాసం స్వీకరిస్తే, వెంటనే వదిలి వేయనవసరం లేదు కానీ సమయం ఆసన్నమయినప్పుడు చిరునవ్వుతో వదలగలగాలి. మనకు ఆ మానసిక స్థైర్యం ఏర్పడకపోతే భగవంతుని ప్రార్థించాలి. ఓ దేవా! నువ్వు నా హృదయంలో ఉండు. నాకు వాటిని వదులుకునే ధైర్యం లేకపోతే, నువ్వే ఆ ధైర్యాన్ని ప్రసాదించు అని ప్రార్థించాలి. అలా వివేకం ద్వారానైనా వైరాగ్యం పెంచుకోవాలి లేదా భక్తి ద్వారానైనా వైరాగ్యం పెంచుకోవాలి.

**అమృతత్వం ఆనశుః** – మోక్షాన్ని పొందుతారు. ఎవరు? చాలా తక్కువ మంది మాత్రమే. ఇంతకు ముందు చూశాము. 99% మనుష్యులు వేదాంతాన్ని తేలిగ్గా పొందలేరని. మిగిలిన ఒకశాతం వాళ్ళు వస్తారు. కృష్ణపరమాత్మ నామీదే భారం వెయ్యండి, అని చెప్పినా ధైర్యం చాలదు.

**అనన్యాః చింతయంతో మాం యేజనాః పర్యుపాసతే**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం -గీత 9-22**

జ్ఞానయోగానికి సాక్షాత్ సాధన, సహకారీ సాధనలు చూశాము. వాటి ద్వారా జ్ఞానం పొందితే, జ్ఞాని పొందే ఫలమేమిటి?

**యతయః విశన్తి** – యతి అంటే సన్న్యాసి. కాని ఇక్కడ ఆంతర సన్న్యాసం అనీ, ఏకాత్మ భావన అనీ, వైరాగ్యం అనీ చూశాము. విశన్తి అంటే బ్రహ్మతో ఐక్యం చెందుతాడు. ఎలా? జ్ఞానం ద్వారా. ఎటువంటి బ్రహ్మతో?

**పరేణ నాకం** – స్వర్గానికన్నా శ్రేష్ఠమైనది. కం అంటే ఆనందం; అకం అంటే దుఃఖం; నాకం (న+అకం) అంటే దుఃఖంలేని ఆనందం. ఇక్కడ ఆనందం దుఃఖమిశ్రితత్వం. స్వర్గంలో ఆనందం మాత్రమే ఉండి, దుఃఖం లేకపోతే, బ్రహ్మాత్మ దానికన్నా ఎందుకు శ్రేష్ఠం? స్వర్గంలో కూడా కాలపరిమితి ఉంది. పుణ్యం క్షీణించగానే జీవుడు మళ్ళీ పుడతాడు. కాని బ్రహ్మాత్మ నిత్యం. అది నిత్య ఆనంద స్వరూపం. పునరపి జననం, పునరపి మరణం లేదు బ్రహ్మాత్మకు.

బ్రహ్మాత్మ స్వర్గం కన్నా శ్రేష్ఠమైనది అంటే, సహజంగానే ఒక ప్రశ్న ఉదయిస్తుంది? అది స్వర్గం కన్నా ఎంతదూరంలో ఉంది? ఉపనిషత్తు బ్రహ్మ ఎక్కడో లేదు, నీలోనే ఉన్నాడు అంటున్నది.

**నిహితం గుహాయాం** – నీ హృదయమనే గుహలో ఉన్నాడు. హృదయాన్ని గుహ అని ఎందుకన్నారు? గుహలో చీకటి ఉంటుంది, మన హృదయంలో కూడా అజ్ఞానమనే చీకటి ఉంది. బ్రహ్మ ఎలా ఉన్నాడు?

**విభ్రాజతే** – సాక్షి చైతన్యం రూపంలో ఉన్నాడు.

**స్వయం ప్రకాశః చైతన్యరూపేణ విభ్రాజతే**

అందువల్ల బ్రహ్మాత్మ లేదా ఏకాత్మ, స్వర్గం కన్నా శ్రేష్ఠమైన బ్రహ్మ, సాక్షి చైతన్యంగా మన హృదయంలో ప్రకాశిస్తున్నాడు. కఠోపనిషత్తులో పంచకోశవివేకం చేశాక, ఆత్మ గురించి తెలుసుకుంటాము.

### తద్విష్ణోః పరమం పదం – కథ

ఆత్మ అంటే విష్ణు స్వరూపం. విష్ణుమూర్తి అంటే ఎక్కడో కూర్చున్న ఒక మూర్తి కాదు. నిర్గుణ ఆత్మ గురించి అర్థం చేసుకునేదాకా, ఒక సగుణ ఆకారం ఇవ్వాలి. ఆల్జీబ్రాలో ఒక విలువ కనుక్కునేటప్పుడు ముందు × తో మొదలుపెడతారు. అంటే × అనే విలువను తాత్కాలికంగా ఇచ్చి, దాని ద్వారా అసలు విలువను కనుక్కుంటారు. అలాగే విష్ణురూపం తాత్కాలికంగా ఇచ్చిన ఒక × విలువ, తర్వాత సగుణ బ్రహ్మ నుంచి నిర్గుణ బ్రహ్మకు రావాలి.

2, 3 మంత్రాల్లో బ్రహ్మజ్ఞానం పొందటానికి రెండు మార్గాలు చూశాము. అవి సాక్షాత్ సాధన, సహకారీ సాధన. సాక్షాత్ సాధన అంటే శ్రవణ, మనన, నిదిధ్యాసనలు అని చూశాము. బ్రహ్మజ్ఞానం పొందటానికి జ్ఞానమార్గం తప్ప వేరే మార్గం లేదని కూడా చూశాము. నా మొహం చూసుకోవాలంటే అద్దమొకటే ఎలా మార్గమో, అలా నన్ను నేను తెలుసు కోవాలంటే గురుశాస్త్ర ఉపదేశం ఒకటే మార్గం.

భక్తిలో ఎలా శరణాగతి కోరతామో, జ్ఞానంలో కూడా అలా తీవ్ర ముముక్షుత్వం ఉండాలి. జ్ఞానం ఒక్కటే మన ముఖ్యమైన లక్ష్యంగా ఉండాలి. ఒక ఇంటికి స్వామీజీ వెళ్ళినప్పుడు, ఆ ఇంటి ఇల్లాలు తన పిల్లవాడిని ఒక పక్క ఆడిస్తూ స్వామీజీని ఆత్మ గురించి మాట్లాడమని కోరింది. ఆత్మ గురించి నాలుగు రోజుల్లో నేర్చుకోలేము. దానికేమీ క్రాష్‌కోర్స్ లేదు. అది కొన్ని సంవత్సరాల పాటు నేర్చుకోవాలి, అది కూడా తీవ్ర ముముక్షుత్వంతో. విశ్వనాధ్ ఆనంద్ అంత గొప్ప ఛెస్‌ప్లేయర్ అయ్యాడంటే కారణం? గొప్ప తపన వల్ల. అదే ధ్యాసతో ఉండాలి ఎప్పుడూ. లౌకిక వ్యవహారాల్లో కూరుకుపోకూడదు.

గృహస్థుగా ఉన్నా వైరాగ్యం పెంచుకోవాలనీ, అది సహకారీ సాధన క్రిందికి వస్తుందనీ చూశాము. ఒక చెట్టు ఏపుగా ఎదగాలంటే దానికి సరైన వాతావరణం ఉండాలి. అలాగే ఒక సాధకునికి జ్ఞానం రావాలంటే

దానికి వైరాగ్యమనే వాతావరణం ఉండాలి. వైరాగ్యం అంటే త్యాగమని చూశాము. త్యాగమంటే మనకున్న ప్రతిదాన్నీ, మన శరీరంతో సహా దేవుడు కోరినప్పుడు చిరునవ్వుతో తిరిగి ఇచ్చేయగలగాలి. అంటే అహంకార, మమకారాలు ఉండకూడదు.

జ్ఞానయోగం + వైరాగ్యం = జ్ఞానం

జ్ఞానయోగం జ్ఞానాన్ని కలుగజేస్తే, జ్ఞానం మోక్షానిస్తుంది. జ్ఞానయోగానికీ, జ్ఞానానికీ మధ్య ఏమిటి తేడా? జ్ఞానయోగం అంటే జ్ఞానాన్ని శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా పొందే తతంగం. జ్ఞానం అంటే జ్ఞానం కలగటం. ఇది క్షణాల మీద అవదు. ముందు ధర్మార్థకామాల వెంట పరుగులు తీస్తాము. మోక్షం ఆఖరి లక్ష్యం అవుతుంది. అది ముఖ్యమైన లక్ష్యం అయితేనే, త్యాగబుద్ధి అలవడుతుంది. లక్ష్యం గురించిన తీవ్రత ఎంత ఎక్కువ ఉంటే, దేనినైనా త్యాగం చెయ్యటానికి అంతగా సిద్ధపడతాము. ఒక పుస్తకం కొనాలని ఎప్పటినుంచో అనుకుంటున్నాము కాని అది మార్కెట్లో లేదు. ఒకరోజు మార్కెట్లోకి వచ్చిందని తెలిసి, హుటాహుటిన వెళతాము. తీరా అక్కడికెళ్ళాక ఆ పుస్తకం ఖరీదు 700 రూపాయలని వింటాము. దానిమీద మన తపన ఎక్కువగా ఉంటే అంత ఖరీదైనా వెనకాడకుండా కొంటాము. ఒకవేళ వెనకాడితే, తీవ్రత ఎక్కువ లేదన్న మాట. తీవ్రత ఎక్కువ ఉంటేనే ఫలితం త్వరగా వస్తుంది.

చిన్మయానందస్వామి ఆత్మజ్ఞానం ఒక విప్లవం కాదు, ఒక మార్పు అంటారు. ఆ మార్పు రావటానికి కొన్ని దశలు దాటాలి. ఏమిటవి? తర్వాత వచ్చే మంత్రంలో వస్తాయి అవి.

**వేదాంతవిజ్ఞానసునిశ్చితార్థాః ।**
**సంన్యాసయోగాద్యతయః శుద్ధసత్త్వాః ।**
**తే బ్రహ్మలోకేషు పరాన్తకాలే ।**
**పరామృతాః పరిముచ్యన్తి సర్వే ॥** 4

ఈ మంత్రం రెండు, మూడు మంత్రాల సారాంశం. చాలా ముఖ్యమైన ఈ మంత్రంలో మొత్తం సాధనలన్నీ వస్తాయి. దీన్ని కూడా సన్యాసులను పూర్ణకుంభంతో స్వాగతం పలికేటప్పుడు పఠిస్తారు. ముండకోపనిషత్తులో ఈ మంత్రం యథాతథంగా ఉంది. ఈ సాధనలు మంత్రంలో వరుస క్రమంలో లేవు. మనం వాటిని ఏర్చి కూర్చుకుందాము.

**1. యతయః** – యతి అంటే అసలు అర్థం సన్యాసి అని చూశాము. కాని ఇక్కడ ప్రయత్నం చేసేవాళ్ళు అని అర్థం. యత్నం, ప్రయత్నం పదాలు యత్ నుంచే వచ్చాయి. ఏదైనా ఒక లక్ష్యం సాధించాలంటే దాని గురించిన ప్రయత్నం సరైన మార్గంలో చెయ్యాలి, సరైన మేరకు చెయ్యాలి. ఉదాహరణకు మనం ఢిల్లీ వెళ్ళాలనుకోండి–దక్షిణదిశగా వెళ్ళగలమా? సరైన దిశలో వెళ్ళాలి. అంటే ఉత్తరం వైపు వెళ్ళాలి. ఉత్తరం వైపే వెళ్ళి ఆగ్రాలో దిగిపోయినా లాభం లేదు. సరైన మార్గంలో, సరైన మేరకు ప్రయత్నం చెయ్యాలి. రెండూ ముఖ్యమే. కర్మయోగం చేసి చిత్తశుద్ధి పొంది, ఉపాసనాయోగం చేసి చిత్త ఏకాగ్రత పొంది, జ్ఞానయోగానికి వచ్చి ఆత్మజ్ఞానం పొందాలి. కర్మ, ఉపాసనలు చేసి, జ్ఞానమార్గానికి రావటం సరైన మార్గం తెలియటం. జ్ఞానమార్గానికి వస్తే చాలదు, దాన్ని సరిగ్గా అర్థం చేసుకుని జీర్ణించుకోవాలి.

**2. శుద్ధసత్త్వాః** – కర్మ, ఉపాసనయోగాలు చేసి చిత్తశుద్ధి, చిత్తఏకాగ్రత పొందుతాము. చిత్తశుద్ధి అంటే రాగద్వేషాలను తగ్గించటం. సత్త్వం అంటే మనస్సు. ఆధ్యాత్మిక ప్రయాణంలో మొదటిదశ వేదాంత విచారణ కాదు; కర్మయోగం పాటించటం ద్వారా మనస్సును శుద్ధి పరచుకోవటం. ఇక్కడ ఉపనిషత్తు కర్మయోగాన్ని వివరించదు. భగవద్గీతలో కర్మయోగము బాగా వివరంగా ఉంటుంది.

ముందు మంత్రంలో కర్మ వల్ల మోక్షం రాదని చెప్పిందంటే, కర్మ అనవసరం అని చెప్పినట్టు కాదు దానర్థం. క్రమం తప్పకుండా భోజనం చెయ్యటం వల్ల పరీక్షలో విజయం సాధించలేవు అంటే, తిండి మానేయమని కాదు దాని అర్థం. తిండి తినటంతోపాటు సరిగ్గా చదువుకోవాలి. అలాగే

కర్మ వల్ల చిత్తశుద్ధి పొందుతాము కాని, దానివల్ల మోక్షం రాదు. అలాగని చిత్తశుద్ధి లేకపోతే, జ్ఞానం పొందటానికి అధికారి కాలేము.

**జ్ఞానయోగానికి రానిదే కర్మయోగం అసంపూర్ణం**

**కర్మయోగం లేనిదే జ్ఞానయోగం అసంభవం**

కర్మయోగం రాగద్వేషాలను తగ్గించి చిత్తశుద్ధిని ఇస్తుందని చూశాము కదా. రాగద్వేషాలను తగ్గించుకుని, మనస్సును శుద్ధి పరచుకోవటానికి కృష్ణపరమాత్మ గీతలో మూడు దశలు వర్ణించాడు. అవి –

**ఎ. రాగద్వేషాలను సంస్కరించుకోవాలి:** ధార్మికమైన విషయాల మీద రాగం, అధార్మికమైన విషయాల మీద ద్వేషం పెంపొందించుకోవాలి. దీనివల్ల శాస్త్రం విధించిన కర్మల మీద రాగం, శాస్త్రం నిషేధించిన కర్మల మీద ద్వేషం ఏర్పడుతుంది. ఉదాహరణకు, సత్యం వద – శాస్త్రం చెప్పిందని కాకుండా, నేను సత్యం పలుకుతాను. శాస్త్రం చెప్పిందని కాకుండా నేను పొద్దున్నే లేస్తాను. శాస్త్రం చెప్పిందని కాకుండా నేను మాంసభక్షణం, సురాపానం మానేస్తాను **అనే సరైన దృక్పథం** పెంచుకోవాలి.

**బి. రాగద్వేషాలను శక్తివిహీనం చేయాలి:** రాగద్వేషాలను శక్తివిహీనం చెయ్యాలంటే నా ఫ్రీవిల్ సహాయంతో వాటిని నేను అదుపులో పెట్టుకోవాలి. మొదట్లో నేను నా ఫ్రీవిల్‌ను ఉపయోగించి కొన్ని పనులు చేస్తాను. కొన్ని రోజులు గడిచేసరికి, నా రాగద్వేషాలు నన్ను అదుపులోకి తీసుకుంటాయి. ఉదాహరణకు, పొద్దున లేస్తూనే నాకు కాఫీ ఇష్టం కాబట్టి నేను కాఫీ త్రాగటానికి ఎంచుకున్నాను. కాని కొన్ని రోజులు గడిచేసరికి కాఫీ మీద నాకున్న రాగం, దాన్ని ఒక వ్యసనంగా మారుస్తుంది. ఇప్పుడు కాఫీ మీద నా రాగాన్ని నేను అదుపులోకి తీసుకోవాలి. నాకు ఇష్టమయితేనే త్రాగేలాగా నేను నిర్దేశించుకోవాలి. అంటే ఈశ్వరార్పణ భావనతో ఏ పనినైనా చేయాలి. అప్పుడు కర్తగా నా ఫ్రీవిల్ ఉపయోగిస్తాను.

**సి.రాగద్వేషాలను నిరాయుధం చేయాలి:** రాగద్వేషాలను శక్తివిహీనం చేయటం అంటే కర్తగా నా చర్యలను నా ఫ్రీవిల్ ద్వారా నా అదుపులో

పెట్టుకోవటం. రాగద్వేషాలను నిరాయుధం చేయటమంటే భోక్తగా నా స్పందనను నా అదుపులో పెట్టుకోవటం. మామూలుగా ఒక పరిస్థితికి, నా రాగద్వేషాలను బట్టి ప్రతిస్పందిస్తాను. ఆ పరిస్థితి నా రాగద్వేషాలకు అనుకూలంగా ఉంటే, దాన్ని ఇష్టంగా స్వీకరిస్తాను, ప్రతికూలంగా ఉంటే దాన్ని ద్వేషిస్తాను. అంటే నా స్పందనను నా రాగద్వేషాలు నియంత్రిస్తున్నాయి. అందువల్ల నేను నా రాగద్వేషాలను నిరాయుధులుగా చేయాలి. అలా చేయాలంటే నేను ఒక విషయం అర్థం చేసుకోవాలి. జరిగే సంఘటనల మీద నాకు అధికారం లేదు. నేను వాటిని నియంత్రించలేను కాని వాటి మీద స్పందించే నా భావాల మీద నాకు అధికారం ఉంది. ఇది ఎప్పుడైతే నేను అర్థం చేసుకుంటానో అప్పుడు నన్ను రాగద్వేషాలు బాధించలేవు. అంటే భోక్తగా ఏది జరిగినా ఈశ్వరప్రసాద భావనతో స్వీకరించాలి. అప్పుడు భోక్తగా నాకు సమత్వం అలవడుతుంది. దీన్ని కర్మయోగం అంటారు.

**కర్మయోగం = సరైన దృక్పథం + సరైన కర్మ**

**సరైన దృక్పథం = ఈశ్వరార్పణ భావన + ఈశ్వరప్రసాద భావన**

**సరైన కర్మ = సాత్త్విక కర్మలు + పంచమహాయజ్ఞాలు**

**3. సన్న్యాస యోగాత్ –** కర్మ, ఉపాసనలు కొంతవరకే ముఖ్యం. అదయ్యాక జ్ఞానయోగంలోకి అడుగుపెట్టాలి. జ్ఞానంలోకి వచ్చాక క్రమేపీ కర్మ, ఉపాసనలు తగ్గించాలి. కర్మ ప్రధానమైన పారాయణలు అంటే సహస్ర నామాలు తగ్గించుకుని భగవద్గీత, ఉపనిషత్తులు అధ్యయనం చేయాలి. కైవల్యోపనిషత్తు పారాయణం చేయటానికి అద్భుతమైన ఉపనిషత్తు. ఈ ఉపనిషత్తు క్రమం తప్పకుండా పారాయణం చేస్తే చిత్తశుద్ధి కలుగుతుందని చివర్లో వస్తుంది. అలా కర్మయోగం నుంచి జ్ఞానయోగానికి మారటం పాపం కాదు. భగవంతుడు మెచ్చుకుంటాడు కూడా. అహం బ్రహ్మ అస్మి అని చెప్పటం పాపం కాదు. కృష్ణపరమాత్మే స్వయంగా చెప్పాడు– తనకు భక్తులందరిలోకీ జ్ఞానీభక్తుడంటే ఇష్టమని. అందువల్ల

జ్ఞానకాండకు రావటం తప్పు పని ఏమీకాదు.

దానికి రావాలంటే కర్మలు కొన్ని తగ్గించుకోక తప్పదు. పోర్ట్ రిడక్షన్ చేయాలని అంతకుముందు శ్లోకంలోనే చూశాము. కొంతమంది తాము ఆఖరిశ్వాస విడిచేవరకూ పనిచేస్తూనే ఉండాలనుకుంటారు. కాని వేదాంతం దాన్ని హర్షించదు. కర్మలను తగ్గించుకుని, అంతర్ముఖులు అవండి అంటుంది. బాహ్యముఖంగా చూడటం మానేసి అంతర్గతంగా చూడాలి. అందువల్లనే పూర్వం ఆశ్రమధర్మాలను విధించింది. గృహస్థాశ్రమం నుంచి వానప్రస్థానికి వచ్చి ఉపాసన చేయాలి. దాని తర్వాత సన్న్యాసం స్వీకరించి జ్ఞానం పొందాలి. ఇప్పుడు అలా ఆశ్రమాలు మార్చుకపోయినా, మన స్థితిని మార్చుకోవాలి. వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలకు చాలా సమయం కావాలి. దానికోసం సమయాన్ని కేటాయించుకోవాలి. దానికోసం అనవసరమైన వ్యాపకాలు తగ్గించుకుంటే చాలు. సెల్‌ఫోన్ ఒకరోజు పక్కన పెడితేనే బోలెడు సమయం దొరికినట్టు ఉంటుంది.

**4. వేదాంతవిజ్ఞాన సునిశ్చితార్థాః –** వేదాంత విజ్ఞానాన్ని నిశ్చయాత్మకంగా పొందాలి.

**బ్రహ్మసత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః**

ఈ జ్ఞానాన్ని శాస్త్రం నుంచి పొందాలి. వేదాంత విజ్ఞానం అంటే వేదాంత శాస్త్రం. అర్థాః అంటే పైన చెప్పిన వేదాంతసారం. బ్రహ్మ గురించి తెలుసుకుంటే చాలదు. అంటే బ్రహ్మసత్యం, జగన్మిథ్యా అని తెలుసుకుంటే చాలదు. ఆ బ్రహ్మను నేనే అని అర్థం చేసుకోవాలి. అహం బ్రహ్మ అస్మి అని అర్థం చేసుకోవాలి. నేను బ్రహ్మను అంటే ఆ నేను ఎవరో కూడా సరిగ్గా అర్థం చేసుకోవాలి. మోకాళ్ళనొప్పితో బాధపడే శరీరం కాదు, ప్రపంచాన్ని చూసే ఇంద్రియాలు కాదు, రాగద్వేషాలకు లోనయ్యే మనస్సు కాదు, వీటన్నిటినీ సాక్షిగా చూసే సాక్షిచైతన్యాన్ని. అలాంటి ఆత్మను నేను. ఇదీ వేదాంతసారం.

బాహ్యవస్తువులలో శాంతి, భద్రత, ఆనందాలు దొరకవు. అవి నాలోనే

ఉన్నాయి. నేను పూర్ణుడను, నేను ఆనందస్వరూపుడను అనే నిశ్చయజ్ఞానం కలగాలి. ఇది ఋషుల అభిప్రాయం కాదు. ఇది సత్యం, సత్యం, పునః సత్యం. ఈ సత్యం వాళ్ళకు ఎంత స్పష్టంగా అర్థమవ్వాలంటే, చేతిలో ఉసిరికాయ ఉన్నంత స్పష్టంగా. దాన్ని **హస్త ఆమలకవతు** అంటారు. **అహం బ్రహ్మ అస్మి** అనే సత్యం ఎదుటివారు స్వీకరించారా, లేదా అనేది వాళ్ళ బాధ. నాకు స్పష్టంగా అర్థమయితే చాలు. **వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థా** పదం అర్థం జీవాత్మ, పరమాత్మల ఐక్యం గురించిన నిశ్చయ జ్ఞానం కలగాలి. ఈ జ్ఞానం వెంటనే కలగాలని హడావుడి చెయ్యదు ఉపనిషత్తు. ఈ జన్మలో కావచ్చు, జన్మజన్మల తర్వాత కావచ్చు, కాని ఎప్పటికైనా జ్ఞానమార్గానికి వచ్చితీరాలి.

**కర్మయోగం పాటించి చిత్తశుద్ధి పొంది కర్మలను తగ్గించుకుని, జ్ఞాన యోగానికి వచ్చి శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసి జ్ఞాననిష్ఠలో నెలకొనాలి.** ఇదే వేదాంత జీవనం. ఈ సాధన చేసినవాళ్ళకు కలిగే ఫలం ఏమిటి?

**తే పరామృతాః** – వాళ్ళు పరమమైన బ్రహ్మతో ఐక్యం పొందుతారు. అమృతం పొందుతారు అంటే జీవన్ముక్తి పొందుతారు. జీవన్ముక్తి అంటే ఇక్కడే, ఇప్పుడే మోక్షం పొందుతారు. మోక్షం అంటే ఎప్పుడో మరణించాక స్వర్గలోకాలకు వెళ్ళటం కాదు. జ్ఞాని జ్ఞానం పొందాక ప్రారబ్ధకర్మ ఉన్నంత వరకూ జీవిస్తాడు, ఎందుకంటే ప్రారబ్ధకర్మ శరీరానికి చెందినది. దీన్ని పరమ అమృతం అని ఎందుకన్నారంటే సాపేక్షిక అమృతం ఇంకోటి ఉంది. మరణించాక స్వర్గలోకానికి వెళితే, అక్కడ జీవి సాపేక్షిక అమృతత్వాన్ని అనుభవిస్తాడు. కాని –

**క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి – గీత**

**పరాంతకాలే** – జ్ఞాని మరణాన్ని పరాంతకాలే అంటున్నది ఉపనిషత్తు. పరాంతకాలే అంటే అంతిమ మరణం. మరణమే అంతిమయాత్ర కాదా అంటే అజ్ఞాని మరణం అంతిమ మరణం కాదంటున్నది ఉపనిషత్తు. ఎందుకు? అతను పునరపి జననం, పునరపి మరణం పొందుతాడు.

జ్ఞాని విషయానికి వచ్చేసరికి అతనికి పునర్జన్మ ఉండదు. దాన్ని విదేహ ముక్తి అంటారు. ఎలా విదేహముక్తి పొందుతాడు?

**బ్రహ్మలోకేషు పరిముచ్యన్తి** – బ్రహ్మ చైతన్యంతో ఐక్యం చెందుతాడు. బ్రహ్మలోకం అంటే 14 లోకాల్లో ఒకటైన బ్రహ్మలోకం కాదు. బ్రహ్మ చైతన్యంతో అతని శరీరాలు ఐక్యం అవుతాయి. అంటే విదేహముక్తి పొందుతాడు. ఎవరు?

**సర్వే** – జ్ఞానులందరూ. వారు జీవించి ఉండగా జీవన్ముక్తి, మరణించాక విదేహముక్తి పొందుతారు. జ్ఞానులు ఏ వర్ణానికి చెందినా, ఏ ఆశ్రమానికి చెందినా, జ్ఞాననిష్ఠలో ఉంటే మోక్షాన్ని పొందుతారు. అంతకుముందు శూన్యంగా ఉన్న జీవితం ఇప్పుడు పూర్ణంగా మారుతుంది. జ్ఞానం నేను పరిపూర్ణుడిని అనే జ్ఞానాన్ని ఇవ్వాలి. లేకపోతే సంసారం ఒక అంతులేని కథగా సాగుతుంది.

దీనితో సాధనలన్నీ ముగిశాయి.

**కర్మయోగం + ఉపాసనయోగం + జ్ఞానయోగం = మోక్షం.**

**చిత్తశుద్ధి + చిత్త ఏకాగ్రత + శ్రవణ, మనన, నిదిధ్యాసనలు = మోక్షం.**

మరయితే భక్తి మాటేమిటి? భక్తి వీటన్నిటికీ భిన్నంగా లేదు. కర్మ ఈశ్వరార్పణతో చేస్తాము. ఉపాసనలో ఈశ్వరధ్యానం చేస్తాము. జ్ఞానంలో ఈశ్వరునితో ఐక్యం అర్థం చేసుకుంటాము.

**5 – 11 మంత్రాలు – ధ్యానం**

తర్వాత వచ్చే మంత్రం నుంచీ బోధ మొదలవుతుంది. 5–7 మంత్రాలు నిదిధ్యాసన మంత్రాలు.

ఈ ఉపనిషత్తు కర్మయోగం గురించి మాట్లాడదు. ఎందుకంటే, సాధకుడు కర్మయోగం పాటించే దీనికి వచ్చివుంటాడని ఊహించుకుంటుంది. కాని కర్మయోగం గురించి మాట్లాడనందుకు బాధపడి, చివర్లో చెపుతుంది, ఒకవేళ చిత్తశుద్ధి పొందక దీనికి వచ్చివుంటే, వెనక్కి వెళ్ళి చిత్తశుద్ధి పొందిరండి అంటుంది.

ఈ ఉపనిషత్తు ప్రత్యేకంగా ధ్యానంతో బోధ మొదలుపెడుతున్నది. సాధారణంగా ధ్యానం గురించి తర్వాత వస్తుంది. భగవద్గీతలో ఆరవ అధ్యాయంలో వస్తుంది ధ్యానం గురించి. ముందంతా కర్మ, జ్ఞానయోగాల గురించి చెపుతాడు కృష్ణపరమాత్మ. అలాగే అష్టాంగయోగంలో కూడా ధ్యానం ఏడవయోగంగా వస్తుంది. యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యానం, సమాధి ఇదీ అష్టాంగయోగంలోని వరుస క్రమం.

**ధ్యానం రెండు రకాలు –** ఉపాసనా ధ్యానం, నిదిధ్యాసన ధ్యానం. మొదటిది వేదాంతానికి రాకముందు చేస్తే, రెండవది వేదాంత శ్రవణ, మననాలు చేసాక చేస్తాము. ఈ ఉపనిషత్తులో రెండురకాల ధ్యానం గురించీ చూస్తాము. రెండురకాల ధ్యానంలోనూ ధ్యానం చేసేది ఈశ్వరుని మీదే, కాకపోతే ఈశ్వరుడెవరన్నది క్రమేపీ మారుతుంది. భగవద్గీతలో ఈశ్వరుడిని మనం మూడు దశల్లో అర్థం చేసుకుంటామని చూశాము – అవి ఏకరూప ఈశ్వరుడు, అనేకరూప ఈశ్వరుడు, అరూప ఈశ్వరుడు.

**ఏకరూప ఈశ్వరుడు –** ఓం ప్రథమంగా దేవుడిని ఒక వ్యక్తిగా కొలుస్తాము. ఒక పిల్లవాడు దేవుడు ఎవరు అని అడిగితే రాముడనో, శివుడనో, విష్ణువనో చెపుతాము. అలా దేవుడిని ఒక ఇష్టదైవంగా కొలుస్తాము. ఆ దేవుడు ఎక్కడో దూరంగా కైలాసంలోనో, వైకుంఠంలోనో ఉన్నాడంటాము. పూజ కూడా అనేక రకాలుగా చేస్తాము. దాన్ని **నవవిధ భక్తి** అంటారు. అందువల్ల ప్రారంభంలో నామరూపాలు, బంధుత్వం అవసరం. మన సమస్యలు చెప్పుకోవటానికి మనకు ఒక ఆత్మీయుడు అవసరం. మనుష్యులు ఓపికగా విన్నా వినకపోయినా, దేవుడు వింటాడు. మననుంచి వెళ్ళిపోడు. అందువల్ల ఏకరూప ధ్యానంతో భగవంతుడు ఆత్మీయుడుగా, దగ్గరగా ఉన్నట్టుగా అనిపిస్తుంది. మనం ఎవరో ఒక దేవుడిని ఎన్నుకుని మన ఇష్టదైవంగా కొలుస్తాము. కైవల్యోపనిషత్తు కూడా పార్వతితో కూడిన శివుడిని ధ్యానం చేయమంటుంది. **ఉమాసహాయం పరమేశ్వరం.** అందువల్లనే ఈశ్వరుడిని సోమః (సః + ఉమా) అంటారు.

కాని ఈ ఇష్టదేవత ధ్యానంలో ఒక ప్రమాదముంది. ఒక దేవుడు ఇష్టదేవత అవుతాడు; తక్కిన దేవుళ్ళందరూ అనిష్టదేవతలు అవుతారు. వైష్ణవులు, శైవులు ఎలా వారివారి దేవతల మీద ఎక్కువ మమకారం పెంచుకుంటారో చూస్తూ ఉంటాము. అందువల్ల దానినుంచి ఎదగాలి.

**అనేకరూప ఈశ్వరుడు –** క్రమేపీ ఈశ్వరుడు విశ్వమంతటా ఉన్నాడని అర్థం చేసుకోవాలి. జగత్తును ఈశ్వరుడు సృష్టించాడు. అంటే ఈశ్వరుడు కారణం. జగత్తు కార్యం. కార్యం అంతటా కారణం ఉంటుందని చూశాము. అందువల్ల ఈ జగత్తంతా ఈశ్వరుడు నిండివున్నాడు. నేను ఈశ్వరభక్తుడిని అయితే, సర్వం శివమయం జగత్ అని అర్థం చేసుకోవాలి. నేను విష్ణు భక్తుడిని అయితే సర్వం విష్ణుమయం జగత్ అని అర్థం చేసుకోవాలి. దేవీ భక్తుడిని అయితే సర్వం దేవీమయం జగత్ అని అర్థం చేసుకోవాలి.

ఇటువంటి ధ్యానాన్ని విశ్వరూప ధ్యానం లేదా అనేకరూప ఈశ్వరధ్యానం అంటారు. ఈ విశ్వరూపధ్యానం చిత్త విశాలతను పెంచుతుంది. ఎప్పుడైతే చిత్త వైశాల్యం కలుగుతుందో, అప్పుడే నేను అన్నింటిలోనూ ఈశ్వరుడిని చూస్తాను. ఏదీ నాది అనుకోను; ఎవరూ నావాళ్ళు మాత్రమే అనుకోను. దానివల్ల నాకు అహంకార, మమకారాలు తగ్గుతాయి. అహంకార, మమకారాలు తగ్గితే, రాగద్వేషాలు తగ్గుతాయి.

**అరూప ఈశ్వరుడు –** వేదాంత విచారణ చేశాక, అరూప ధ్యానం చేయాలి. దీన్ని అద్వైతధ్యానం అనీ నిదిధ్యాసనం అనీ అంటారు.

ఈ ప్రత్యేక మంత్రంలో మూడురకాల ధ్యానం గురించీ వస్తుంది. మామూలుగా వీటిని విడివిడిగా వర్ణిస్తారు. ఏకరూప, అనేకరూప ధ్యానాలను రెండింటినీ కలపి ఉపాసన అంటారు. అది చిత్త ఏకాగ్రత పెంచి, జ్ఞానయోగ్యతాప్రాప్తిని కలుగజేస్తుంది. ఉపాసన సాక్షాత్తు సాధన కాదు, సహకారీ సాధన. ఈ రెండు ఉపాసనలు చేశాక వేదాంత విచారణ చేసితీరాలి. వేదాంత విచారణ అంటే వేదాంత శ్రవణ, మననాలు చేయాలి. ఒక్క ముక్కలో చెప్పాలంటే సాధనల వరుసక్రమం ఇది –

**ఏకరూప ధ్యానం, అనేకరూప ధ్యానం, వేదాంత విచారణ, అరూప ధ్యానం.**

అంటే అనేకరూప ధ్యానం నుంచి వెంటనే అరూప ధ్యానంలోకి రాకూడదు. వీటి రెండింటి మధ్యలో ఉన్న వేదాంత విచారణ చేసి తీరాలి. అరూపధ్యానంలో ఈశ్వరుని ఒక వస్తువుగా ధ్యానించము. ధ్యానిస్తున్న నేనే ఈశ్వరుడిని. దయానందస్వామీజీ **ధ్యానం చేసే వ్యక్తి(ఆత్మ) మీద చేసే ధ్యానం** అంటారు దీనిని. ద్వైతం అద్వైతానికి దారి తీస్తుంది.

ఐదవ మంత్రంలో ధ్యానం చేసేముందు చేసే సాధనలు వస్తాయి. భగవద్గీత ఆరవ అధ్యాయంలో కృష్ణపరమాత్మ వీటిని విపులంగా చర్చించాడు. వీటిని **బహిరంగ సాధనలు** అంటారు. అందులో ఎనిమిది సాధనలున్నాయి. వాటిని నాలుగు సాధనలుగా పరిగణించవచ్చు. అవి – దేశం, కాలం, ఆసనం, శరీరస్థితి.

**1. దేశం** – సరైన ప్రదేశం. ధ్యానం చేసే ప్రదేశం నిర్జన ప్రదేశంగా ఉండాలి, ప్రశాంతంగా ఉండాలి, శుచిగా ఉండాలి. ఆధ్యాత్మిక ఆలోచనలను పెంపొందించేదిగా ఉండాలి. ఈ రోజుల్లో నిర్జన ప్రదేశం దొరకటం కష్టం కాబట్టి, వీలున్నంత నిర్జన ప్రదేశంగా తీసుకోవాలి. శుచిగా ఉందికదా అని భోజనాల గదిలో కూర్చుని ధ్యానం చేస్తే, అది ఈశ్వరధ్యానం కన్నా ముందు అన్నధ్యానంగా మారే ప్రమాదముంది. ప్రదేశమే కాదు, మనం కూడా శుచిగా ఉండాలి.

**2. కాలం** – సమయం. ధ్యానం ఏ సమయంలోనైనా చేయవచ్చు. ఫలానా సమయంలోనే చేసితీరాలని లేదు. కాకపోతే మనస్సు ఆ సమయంలో సత్త్వగుణ ప్రధానంగా ఉండాలి. రజోగుణ ప్రధానంగా ఉంటే, ఎగిరెగిరి పడుతుంది, అదే తమోగుణ ప్రధానంగా ఉంటే బద్ధకంగా ఉంటుంది. మనస్సు ప్రశాంతంగా ఉండాలి, ఏకాగ్రత చూపగలిగేలా ఉండాలి. ఎవరైనా ధ్యానంకు అనువైన సమయం తెల్లవారుఝామున అని చెపుతారు. ఎందుకంటే అప్పుడు చుట్టూ ప్రశాంతంగా ఉంటుంది, మనస్సు కూడా ప్రశాంతంగా ఉంటుంది.

**3. ఆసనం** – కూర్చునే విధానం. ధ్యానం చేసేటప్పుడు సరాసరి నేల మీద కూర్చోకూడదు. కృష్ణపరమాత్మ సుఖస్థిరాసనం అంటారు. కింద కూర్చోగలిగితే మంచిది. కూర్చోలేకపోతే శరీరాన్ని ఇబ్బంది పెట్టకూడదు. కొంతమంది పద్మాసనం వేయగలరు కాని, దాన్ని తీయటానికి అవస్థ పడతారు. అందువల్ల కుర్చీలో కూర్చున్నా ఫర్వాలేదు. అది మరీ ఎత్తుగా ఉండకూడదు, మరీ కిందకి ఉండకూడదు. మరీ మెత్తగా ఉండకూడదు, మరీ గట్టిగా ఉండకూడదు. ఎక్కడ కూర్చున్నా అందులో స్థిరంగా కాసేపు కూర్చోగలగాలి.

**4. శరీరస్థితి** – అంగాల పరిస్థితి. ధ్యానం చేసేటప్పుడు, సాధకునిలో ఐదు అంగాలు తోడ్పడాలి. అవి శరీరం, ఇంద్రియాలు, శ్వాస, మనస్సు, బుద్ధి.

ఎ) **శరీరం**: ఎక్కడ కూర్చున్నా శరీరం, మెడ, తల – మూడూ నిలువుగా ఒక రేఖలో ఇమిడేలా ఉండాలి. మొహం ఎదురుగుండా చూడాలి.

బి) **ఇంద్రియాలు**: ఇంద్రియాలను బాహ్యముఖం నుంచి అంతర్ముఖం చేయాలి.

సి) **శ్వాస**: శ్వాస పీల్చి, వదలటం నిదానంగా, నెమ్మదిగా, ఒక క్రమపద్ధతిలో చేయాలి.

**స్పర్శాన్కృత్వా బహిర్బాహ్యాన్ చక్షుశ్చైవాంతరే భ్రువోః ।**
**ప్రాణాపానౌ సమౌ కృత్వా నాసాభ్యంతరచారిణౌ ॥ – గీత 5.27**

బాహ్యవస్తువులను బాహ్యంగా వదిలివేసి, దృష్టిని నాసికాగ్రం మీద నిలపాలి.

డి) **మనస్సు**: కైవల్యోపనిషత్తు తాత్కాలికంగా సన్న్యాసులుగా మారమంటున్నది. అంటే అంతకుముందు చూసిన పోర్ట్ రిడక్షన్‌ను పాటించాలి. కాసేపన్నా బంధుత్వాలను, బాధ్యతలను మరచి, ఏకాగ్రతతో ఉండాలి. సన్న్యాసికి ముగ్గురితో తప్ప ఎవరితోనూ సంబంధం ఉండదు. ఆ ముగ్గురూ – గురువు, శాస్త్రం, ఈశ్వరుడు.

గృహస్థు అలాంటి అసంగత్వాన్ని మనస్సులో పెంచుకోవాలి.

ఇ) **బుద్ధి**: ఈ ధ్యానం వల్ల లాభం పొందుతామని బుద్ధికి నచ్చచెప్పాలి. లేకపోతే అనవసరంగా కాలాన్ని వృధా పరుస్తున్నాము అనుకుంటుంది బుద్ధి. ధ్యానం చేస్తున్నప్పుడు, తక్కిన జ్ఞానాన్ని అంటే అపరావిద్యను తాత్కాలికంగా మరచిపోవాలి. ఏకరూపధ్యానం చేసేటట్టయితే ఎవరైనా ఇష్టదేవతను తలచు కోవాలి. అనేకరూప దర్శనానికి కూడా ఇష్టదేవతనే తీసుకోవచ్చు. అరూపధ్యానం చేసేవాళ్ళు –

**బ్రహ్మసత్యం జగన్మిథ్యా అహం బ్రహ్మైవ నాపరః**

ఈ వాక్యం తీసుకుని ధ్యానం చేయవచ్చు. అంటే ఇందులో త్రిపుటి నుంచి ద్విపుటికి వస్తాము. త్రిపుటి అంటే జీవ–జగత్తు–ఈశ్వరుడు అని మూడు ఉన్నాయి. ద్విపుటిలో ఆత్మ–అనాత్మ అని రెండు ఉన్నాయి. తర్వాత నెమ్మదిగా అనాత్మకు విడిగా ఉనికిలేదు కాబట్టి ఉన్నదొకటే ఆత్మ, అది నేనే, అది అద్వైతం అంటాము. దీన్ని నిదిధ్యాసనం అంటారు. ఈ మూడు ధ్యానాలను 5–7 మంత్రాలలో చూస్తాము.

**5 – 11 మంత్రాలు – ధ్యానం**

**వివిక్తదేశే చ సుఖాసనస్థః ।**
**శుచిః సమగ్రీవశిరః శరీరః ।**
**ఆత్యాశ్రమస్థః సకలేంద్రియాణి నిరుధ్య ।**
**భక్త్యా స్వగురుం ప్రణమ్య ।** 5

ఈ మంత్రంలో బహిరంగ సాధనలను చూస్తాము.

**వివిక్తదేశే చ** – ఒక ఏకాంత ప్రదేశాన్ని ఎన్నుకోవాలి. ముందే చూసినట్టుగా మహానగరాల్లో ఏకాంత ప్రదేశం కాని, నిశ్శబ్ద వాతావరణం కాని దొరకటం అరుదుగా ఉంటుంది. అందుకని, వీలున్నంత ప్రశాంతంగా ఉన్న ప్రదేశం ఎన్నుకోవాలి.

**శుచిః** – చేసే ప్రదేశం, ధ్యానం చేసే వ్యక్తి కూడా శుచిగా ఉండాలి.

స్నానం చేసి ధ్యానం చేస్తే మంచిది. ధ్యానం చేసే ప్రదేశంలో ఈగలు, దోమలు స్వైరవిహారం చేయకుండా ఉండాలి. శరీరం, బట్టలు కూడా శుభ్రంగా ఉండాలి.

కాలం, ఆసనం ఇక్కడ చెప్పలేదు. మనం గీతలోంచి ఇక్కడ కలుపుకోవాలి.

**సుఖ ఆసనస్థః** – కింద కూర్చోగలిగితే మంచిది, కూర్చోలేకపోతే కుర్చీలో కూర్చోవచ్చు. ఈజీఛెయిర్‌లో కూర్చుంటే నిద్రలోకి జారుకునే ప్రమాదముంది. అందువల్ల అవస్థ పడకుండా, కుదురుగా అరగంట కూర్చోగలిగేటట్టు ఉండాలి.

**సమగ్రీవ శిరః శరీరః** – శరీరం, మెడ, శిరస్సులను నిటారుగా ఒక సరళరేఖలా ఉంచాలి. దీన్నించే కృష్ణపరమాత్మ సమగ్రీవ శిరోకాయం తీసుకున్నాడు.

**సకల ఇంద్రియాణి నిరుధ్య** – అన్ని ఇంద్రియాలను నిరోధించాలి. ఇంద్రియాలు అంటే కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు రెండూ వస్తాయి. వాటిని బాహ్య ప్రపంచం నుంచి నిరోధించాలి. కృష్ణపరమాత్మ నాసికాగ్రం పదం వేశాడు. కళ్ళతో ముక్కు చివరిభాగాన్ని చూడాలి. అంటే కళ్ళను అర్థనిమీలిత నేత్రాలుగా చేయాలి. కళ్ళతో చూడాలి కాని, మనస్సు అక్కడ పెట్టకూడదు. మనస్సును ధ్యానం చేసే వస్తువు మీద నిలపాలి.

శ్వాస గురించిన జాగ్రత్త మనం కలుపుకోవాలి. ప్రాణం, అపానం సమానంగా ఉండాలి. మనస్థితి ఎలా ఉండాలి?

**అత్యాశ్రమస్థః** – సన్న్యాసి యొక్క మనస్థితి ఉండాలి. సన్న్యాసాశ్రమం అత్యంత ఉన్నతమైన ఆశ్రమం. నిజంగా సన్న్యాసం స్వీకరించనవసరం లేదు. ధ్యానం చేస్తున్నప్పుడయినా అసంగంగా ఉండాలి.

**భక్త్యా స్వగురుం ప్రణమ్య** – తక్కిన బంధాలను తాత్కాలికంగా వదులుకోవాలి అని ముందు పదంలో చూశాము. కాని గురువుతో బంధాన్ని మాత్రం వదులుకోకూడదు అంటున్నది ఉపనిషత్తు. అందువల్ల గురువుకు నమస్కారం

చేయమంటున్నది. గురువు అంటే గురువుతో పాటు శాస్త్రం, ఈశ్వరుడు కూడా వస్తారు. భగవద్గీత ధ్యానశ్లోకంలో మొదటి శ్లోకం గీతాశాస్త్రానికి నమస్కారాల నందజేస్తోంది.

**అంబత్వామనుసందధామి భగవద్గీతే భవద్వేషిణీమ్**

శాస్త్రానికి నమస్కారం చేయటం ద్వారా ధ్యానసమయంలో శాస్త్రంలోని పదాలు గుర్తుకువస్తాయి. లేకపోతే కుటుంబ సభ్యులు చెప్పిన మాటలు గుర్తుకు వస్తాయి. శ్రవణంలో విన్న గురువు మాటలే గుర్తుకు రావాలి. స్వగురుం అంటే నా గురువు. దీన్ని బట్టి ప్రతివారికీ ఒక గురువు ఉండి తీరాలని తెలుస్తున్నది. మానసిక సన్యాసి అవాలి; గురువుకు నమస్కారం చేయాలి – ఈ రెండూ కైవల్యోపనిషత్తులోనే చూస్తాము. తక్కిన మూడూ **– వివిక్తదేశ, సర్వేంద్రియాణి నిరూధ్య, సుఖాసనస్థః –** భగవద్గీతలో కూడా చూస్తాము. వ్యాకరణపరంగా చూస్తే ఈ మంత్రం అసంపూర్ణంగా ఉంది. అందువల్ల **ధ్యానం కుర్యాత్** – ఈ సాధనలు చేశాక, ధ్యానం చేయి అని కలుపుకోవాలి.

**హృత్పుండరీకం విరజం విశుద్ధం ।**
**విచిన్త్య మధ్యే విశదం విశోకమ్ ।**
**అచిన్త్యమవ్యక్తమనన్తరూపం ।**
**శివం ప్రశాంతమమృతంబ్రహ్మయోనిమ్ ।**
**తదాదిమధ్యాన్తవిహీనమేకం ।**
**విభుం చిదానందమరూపమద్భుతమ్ ॥** 6

మొదటిపాదంలో ఇంకొక సాధనను చూస్తాము. మన హృదయం వైపు దృష్టి మరల్చాలి. జాగ్రదావస్థలో, మనస్సు శరీరమంతటా వ్యాపించి ఉంటుంది. ఎందుకంటే అది బాహ్యప్రపంచంతో అప్పుడు వ్యవహారం నడుపుతుంది. సుషుప్తిలో మనస్సు హృదయంలో లయమవుతుంది. అంటే మనస్సు లభించే స్థానం హృదయం. భగవంతుడు సర్వవ్యాపకుడు అయినా, ధ్యానం

చేసేటప్పుడు ఈశ్వరస్థానం హృదయంగా తీసుకోవాలి. ఈశ్వరుడిని మనస్సులో ఆవాహన చేస్తాము. ఎందుకంటే ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును పరమాత్మ సాక్షిచైతన్యంగా చూస్తున్నాడు.

**యో వేద నిహితం గుహాయం**

పరమాత్మ సాక్షి, సాక్షి మనస్సులో ఉంది. మనస్సు హృదయంలో ఉంది; అందువల్ల హృదయమనే గర్భగుడిలో పరమాత్మను ఆవాహన చేయాలి.

**దేహో దేవాలయః ప్రోక్తః**

శరీరం గుడి, పంచకోశాలు వివిధ ప్రాకారాలు; హృదయం గర్భగుడి; పరమాత్మ సాక్షిచైతన్యం. అందువల్ల ధ్యానం చేసేముందు గర్భగుడి అయిన హృదయంలో ఆవాహన చేయాలి.

**మధ్యే** – శరీరం మధ్యలో; **విచిన్త్య** – ఆవాహన చేయాలి; ఎక్కడ?

**హృత్పుండరీకం** – హృదయంలో. హృదయం తలక్రిందులుగా ఉన్న కమలం మొగ్గలాగా ఉంటుంది. ఇక్కడ హృదయం అంటే మనస్సు అని అర్థం చేసుకోవాలి. ఎందుకంటే హృదయం గోళకం, మనస్సు ఇంద్రియం. హృదయంలో మనస్సు ఉంటుంది. అంతేకాదు మనస్సు సత్త్వగుణ ప్రధానంగా ఉండాలని చూశాము. రజోగుణంలో మనస్సు చాలా హుషారుగా ఉంటుంది. ధ్యానానికి కూర్చుంటే అనవసరమైన ఆలోచనలన్నీ దూసుకువస్తాయి. అలాంటప్పుడు దేనిమీద ధ్యానం చేయాలో దానిమీద మనస్సు ధ్యానం చేయలేదు. తమోగుణంలో మనస్సు నిస్త్రాణగా ఉంటుంది. అలా ఉంటే ధ్యానంలో నిద్ర వచ్చేస్తుంది. అందువల్ల సత్త్వగుణ ప్రధానమైన మనస్సు మాత్రమే ఈ మూడు రకాల ధ్యానాల్లో ఏ ధ్యానంకన్నా సరి పోతుంది.

**విరజం** – మనస్సు రజోగుణ రహితంగా ఉండాలి. అంటే ఎక్కడెక్కడికో వెళ్ళిపోయే మనస్సును తిరిగి హృదయంలోకి తెచ్చుకోవాలి. ఎవరితోనో తీవ్రంగా పోట్లాడాక, ధ్యానానికి కూర్చోకూడదు. ఎందుకంటే అప్పుడు మనస్సు చిరాకుగాను, దూకుడుగాను ఉంటుంది.

**విశుద్ధం** – మనస్సు తమోగుణ రహితంగా ఉండాలి. అందువల్లనే మనం హుషారుగా ఉండే సమయాన్ని ఎన్నుకోవాలి.

**విశదం** – మనస్సు సత్త్వగుణ ప్రధానంగా ఉండాలి. నిజానికి కర్మయోగి మాత్రమే ధ్యానాన్ని సరిగ్గా చేయగలడు. ఎందుకంటే అతను మనస్సును సమతుల్యంగా ఉంచుకోగలగుతాడు.

**సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ – గీత 2.38**

సుఖదుఃఖాలను, లాభాలాభాలను, జయాపజయాలను సమానంగా తీసుకుంటాడు కర్మయోగి. కర్తగా ఈశ్వరార్పణబుద్ధితో కర్మ చేస్తాడు; భోక్తగా ఈశ్వరప్రసాద బుద్ధితో కర్మఫలాన్ని స్వీకరిస్తాడు. సమబుద్ధి వల్ల ప్రశాంతత ఏర్పడుతుంది. ధ్యానంలో కూర్చున్నా, ఈ ప్రశాంతత కొన సాగుతుంది. అందువల్ల ధ్యానం తేలిగ్గా చేయగలుగుతాడు కర్మయోగి. ధ్యానం చేయటానికి కర్మయోగం చేసితీరాలని కృష్ణపరమాత్మ ఆరవ అధ్యాయంలో చెపుతాడు. దీన్ని సాంకేతిక పదజాలంతో చెప్పాడు.

**నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్** – గీత 2.45

ఎప్పుడూ సత్త్వగుణంలోనే ఉండు. నీ యోగక్షేమాల కోసం ఆరాట పడవద్దు. మనస్సును అదుపులో పెట్టుకో.

**విశోకం** – మనస్సు ప్రశాంతంగా ఉందని మొహంలో ప్రసన్నతను చూస్తే తెలుస్తుంది. అందువల్ల సంతోషంగా ఉండటానికి ప్రయత్నించండి. ముఖం మీద చిరునవ్వుతో ధ్యానం చేస్తే, ఆ చిరునవ్వు మనస్సుకు కూడా వెళ్ళి, మనస్సు కూడా ప్రశాంతంగా అయ్యే అవకాశం ఉంటుంది.

ఈ నాలుగు పదాలూ అంటే విరజం, విశుద్ధం, విశదం, విశోకం – హృత్పుండరీకానికి విశేషణాలు. దీనితో ధ్యానం చేసేముందు చేయాల్సిన సాధనలు ముగిశాయి. ఇప్పుడు ధ్యానవస్తువును చూస్తాము. ఇక్కడ ధ్యాన వస్తువు ఈశ్వరుడు. మూడు రూపాలలో శివధ్యానం చూస్తాము. శ్రీరుద్రంలో శివుడిని మూడు రూపాలలో చూస్తాము. అంటే ఏకరూప, అనేకరూప, అరూప ఈశ్వరునిగా చూస్తాము.

ఇక్కడ కైవల్యోపనిషత్‌లో కూడా మూడు రూపాలూ చూస్తాము. కాని అవి ఒక వరుసక్రమంలో, విడివిడిగా రావు. అందువల్ల మనం వాటిని సరిగ్గా పేర్చుకోవాలి.

దానికన్నా ముందు ధ్యానం అంటే ఏమిటో చూద్దాము. విజాతీయ ఆలోచనా ప్రవాహం లేకుండా, సజాతీయ ఆలోచన ప్రవాహాన్ని ధ్యానం అంటారు. ధ్యానం అంటే ఆలోచనలు లేకపోవటం కాదు, ఆలోచనల ప్రవాహం ఉండాలి, కాకపోతే అవి ధ్యానవస్తువుకు సంబంధించినవై ఉండాలి. ధ్యేయ సంబంధిత సజాతీయ వృత్తి ప్రవాహం. ఇక్కడ ధ్యేయవస్తువు శివుడు అని చూశాము. ఒకే మంత్రం మూడు రకాల ధ్యానాన్ని ఒకేసారి చెప్పినా, ధ్యానం చేసేటప్పుడు మాత్రం మూడింటి మీదా ఒకేసారి చేయకూడదు. ఒకొక్కసారి ఒకొక్క రూపం మీద ధ్యానం చేయాలి.

**అచిన్త్యం –** ఈశ్వరుడు మనోఅగోచరం. మనస్సుకు అందదు. అప్రమేయం. అంటే ధ్యానం చేసే సాధకుని మీద చేసే ధ్యానం అరూప ధ్యానం. ఇది అరూపధ్యానంలోకి వస్తుంది. అరూప ఈశ్వరుని వర్ణన.

**శాంతం శివం అద్వైతం చతుర్థం మన్యంతే స ఆత్మా – మాండూక్యం**

**అవ్యక్తం –** ఈశ్వరుడు ఇంద్రియ అగోచరం. ఇంద్రియాలకు అందదు. అశబ్దం, అస్పర్శం, అరూపం, అరసం, అగంధం. వస్తువుగా ఇంద్రియాలకు అందదు అంటే ఈశ్వరుడు ధ్యానం చేసే వస్తువు కాదు, ధ్యానం చేసే సాధకుడు. ఇది కూడా అరూప ఈశ్వరుని వర్ణన.

**అనన్తరూపం –** అనేక రూపాలతో ఉన్నాడు ఈశ్వరుడు. ఈ పదం అనేక రూప ఈశ్వరుని వర్ణన. మన ఇష్టదేవత ఈశ్వరుడు అయితే రాముని ఆలయానికి వెళ్ళినా, దేవీ ఆలయానికి వెళ్ళినా శివుడినే వారి రూపాలలో చూడాలి. ఈ విషయం అర్థం చేసుకోకపోతే శివపూజలు మాత్రమే చేసి, వైష్ణవ ద్వేషులమవుతాము. అనేకరూప ఈశ్వర ధ్యానం చేసేది చిత్త విశాలత పెంపొందించుకోవటానికి. రాముడు, శివుడు, దేవి అందరూ ఒకటే.

**శివం –** శివం పదం అన్ని రూపాలకూ వర్తిస్తుంది.

**ఉమాసహాయం, త్రిలోచనం, నీలకంఠం - ఏకరూప ఈశ్వరుడు - కైవల్యం**

**లింగ ఆకాశమూర్తి - అనేకరూప ఈశ్వరుడు - రుద్రం**

**అశబ్దమస్పర్శమరూపమరసం - అరూపఈశ్వరుడు - కఠ**

శివం పదం అర్థం **సర్వదుఃఖనాశకః -** అన్ని దుఃఖాలనూ నాశనం చేసేవాడు. అన్ని అమంగళాలనూ నాశనం చేసేవాడు. అంటే తాను మంగళ స్వరూపుడు. అందువల్ల శివం మూడురూపాలకూ వర్తిస్తుంది.

**ప్రశాంతం** - పూర్తి శాంతస్వరూపుడు. ఇది కూడా మూడు రూపాలకూ వర్తిస్తుంది.

**అమృతం** - శాశ్వతం. ఇది కూడా అన్ని రూపాలకూ వర్తించినా, ప్రాథమికంగా అరూప శివునికి వర్తిస్తుంది.

**బ్రహ్మయోనిం** - బ్రహ్మ అంటే హిరణ్యగర్భః, యోని అంటే కారణం. బ్రహ్మయోని అంటే శివుడు హిరణ్యగర్భకు కూడా సృష్టికర్త. ఆ విధంగా సృష్టికర్త అయిన చతుర్ముఖ బ్రహ్మ, తాను కూడా ఈశ్వరసృష్టి అని చెప్పకనే చెపుతున్నాడు. యోని అంటే సాధారణంగా ఉపాదాన కారణం. ఈశ్వరుడు నిమిత్త కారణం, ఉపాదాన కారణం కూడా. అంటే ఈశ్వరుడు హిరణ్యగర్భ యొక్క నిమిత్త, ఉపాదాన కారణం.

నిర్గుణ బ్రహ్మ + మాయాశక్తి = ఈశ్వరుడు

కేవలం నిర్గుణ బ్రహ్మ కారణమూ కాలేదు, కార్యమూ కాలేదు. శుద్ధ చైతన్యం లేదా నిర్గుణబ్రహ్మ కార్యకారణ విలక్షం. హిరణ్యగర్భ ఈశ్వరుని యొక్క ప్రథమసృష్టి.

**బ్రహ్మో దేవానాం ప్రథమః సంబభూవ - ముండక 1.1.1**

**తథా ఆది మధ్య అంత విహీనం** - ఈశ్వరునికి ఆది, మధ్యం, అంతాలు లేవు. ఈ వర్ణన విశ్వరూప ఈశ్వరునికి, అరూప ఈశ్వరునికి కూడా వర్తిస్తుంది. **ఆదిమధ్యాంతరహిత** పదాన్ని అర్జునుడు కృష్ణపరమాత్మ

విశ్వరూపాన్ని వర్ణించటానికి వాడాడు. దీన్ని ఏకరూప శివునికి వాడలేము. ఎందుకంటే విశ్వరూపదృష్ట్యా ఈశ్వరుడు దేశ, కాల పరిచ్ఛేద రహితం. అంటే ఈశ్వరుడు నిత్యం, సర్వగతం. సర్వం శివమయం జగత్తు. ఈశ్వరుని ఆది, అంతాలు చూడటానికి ప్రయత్నించి బ్రహ్మవిష్ణుమూర్తులు విఫల మయ్యారని పురాణాలలో చూస్తాము.

**ఏకం –** శివుడు సర్వగతం అయితే, ఇంకొక పరమాత్మ ఉండే ఆస్కారం లేదు. అందువల్ల విశ్వరూప శివుడు అన్నా విశ్వరూప విష్ణువు అన్నా ఒకటే. ఈ విషయం అర్థమయితే శివ, విష్ణు భక్తుల మధ్య తీవ్రమైన గొడవలే ఉండవు.

**విభుం –** అనేకంగా విరాజిల్లేవాడు. **వివిధం భాతి ఇతి విభుః. ఆకాశ రూపేణ శివ ఏవ భాతి; వాయురూపేణ శివ ఏవ భాతి; వివిధ రూపేణ ఏకం శివః ఏవ భాతి.** ఎలాగైతే ఒకటే బంగారం అనేక ఆభరణాలుగా ప్రకటితమవుతున్నదో; ఎలాగైతే చెక్క అనేక వస్తువులుగా ప్రకటితమవు తున్నదో, అలాగే శివుడే పంచభూతాలుగా భాసిల్లుతున్నాడు. అందువల్లనే మనకు పంచభూత లింగక్షేత్రాలు ఉన్నాయి. అవి చిదంబరంలో ఆకాశ లింగం; కాళహస్తిలో వాయులింగం; తిరువణ్ణామలైలో అగ్నిలింగం; జంబు కేశ్వరక్షేత్రంలో జలలింగం; కంచిలో పృథివీలింగాలు.

పంచభూతాలలో పరమాత్మ ఉంటే, ఆ పరమాత్మ అంతటా ఉన్నాడు. దేవుని విశ్వరూప దర్శనం చేయకుండా, మనం ఆయన పరిధిని తగ్గించి, ఒక చిన్న గర్భగుడిలో పరిమితి చేస్తాము. అలా కాకుండా **సర్వం శివ మయం జగత్తు** అనగలగాలి. విభుం పదం శివుడిని అనేకరూప ఈశ్వరుడు లేదా విశ్వరూప ఈశ్వరునిగా నిర్వచిస్తుంది.

**చిదానందం –** శుద్ధ చిత్, శుద్ధ ఆనందరూపంలో ఉన్నాడు. శుద్ధ ఆనందస్వరూపం అంటే శుద్ధ చైతన్యానికి చెప్పిన ఐదు సూత్రాలు శుద్ధ ఆనందానికి కూడా వర్తిస్తాయి. అవి –

1. శుద్ధ ఆనందం, మనస్సులో ఒకభాగం కాని, దాన్నించి ఉత్పత్తి చెందింది కాని, దాని లక్షణం కాని కాదు.

2. శుద్ధ ఆనందం, స్వతంత్ర వస్తువు. అది మనస్సు అంతటా వ్యాపించి, మనస్సును అప్పుడప్పుడు ఆనందింపజేస్తుంది.

3. శుద్ధఆనందం, మనస్సు సరిహద్దులకే పరిమితమవలేదు.

4. శుద్ధఆనందం, మనస్సు, మనస్సులోని ఆనందం నాశనమైనా కూడా నాశనమవదు. మనస్సు పతనానంతరం కూడా ఆనందం ఉంటుంది.

5. శుద్ధఆనందం, మనస్సు లేకపోయినా ఉంటుంది కాని తెలియదు. శుద్ధఆనందాన్ని ప్రతిబింబింపచేసే మాధ్యమం లేదు కాబట్టి శుద్ధఆనందం తెలియదు. అంతమాత్రాన శుద్ధఆనందం లేనట్టు కాదు.

ఈ శుద్ధఆనందం అక్షరాలా శుద్ధచైతన్యంలాగా ఉంది కాబట్టి దీన్ని చిదానందం అన్నారు. దీన్నించే వచ్చింది నిర్వాణషట్కం.

**చిదానంద రూపః శివోహం శివోహం**

ఉపనిషత్తులు ఏ.టి.ఎమ్.లాంటివి. వాటినుంచే అనేక కాన్సెప్టులు వస్తాయి.

**అరూపం** – అరూపం అంటే రూపం లేదు. అంటే ఆత్మరూప శివుడు లేదా నిర్గుణబ్రహ్మ. అరూపం అంటే కఠోపనిషత్తులో వచ్చే తక్కిన నాలుగు పదాలూ కలుపుకోవాలి. అవి అశబ్దం, అస్పర్శం, అరసం, అగంధం.

**అద్భుతం** – బ్రహ్మ అద్భుతాలకే అద్భుతం. ఎందుకంటే నిజంగా సృష్టి చేయకుండా సృష్టిచేస్తాడు. మనం స్వప్నప్రపంచాన్ని నిజంగా సృష్టించకుండా, ఆలోచనల ద్వారా సృష్టించినట్టన్నమాట. స్వప్నం కేవలం మనస్సు సృష్టించినది కాబట్టి దానికి నిజంగా ఉనికి లేదు; కాని మనం స్వప్నంలో ఉన్నంతసేపూ అక్షరాలా ఉనికి ఉన్నట్టుగా ఉంటుంది. అలాగే వేదాంతం 25 సంవత్సరాలుగా నేర్చుకుంటున్నా కూడా ఈ జాగ్రత్ ప్రపంచం నిజంగా ఉన్నట్టుగా ఉంటుంది. అందువల్ల అది కేవలం నామరూపాత్మక జగత్తు

అని తెలిసినా కూడా దాన్ని మిథ్యగా కొట్టిపారేయలేకుండా ఉన్నాము. అలా ఉండీ లేనట్టి ప్రపంచాన్ని సృష్టించటం అద్భుతాలలోకెల్ల అద్భుతం.

నిర్గుణబ్రహ్మ ఈ జగత్తును ఎందుకు సృష్టించాడు? తను కిందకి దిగివచ్చి, వ్యవహారం నడపటానికి. ఆ వివరాలు ముందుముందు చూస్తాము. పారమార్థికస్థాయిలో వ్యవహారం కుదరదు. నిర్గుణబ్రహ్మ నేను చిదానంద రూపం, నేను జగదదిష్టానం, మయ్యేవ సకలం జాతం అని చెప్పలేదు. శుద్ధచైతన్యం నేను శుద్ధచైతన్యం అని చెప్పలేదు. బ్రహ్మ ఈ జగత్తు మొత్తాన్ని సృష్టించి తానే జీవునిలోకి అనుప్రవేశం చేశాడు. అంటే నేను జీవునిగా కనిపిస్తున్న పరమాత్మను. కాని నా అసలు స్వరూపం మర్చిపోయి నేను నా జీవితాన్ని భారంగా మలచుకుంటున్నాను. నేను నా అసలు స్వరూపం తెలుసుకుంటే, నా జీవితాన్ని వరంగా మలచుకోవచ్చు. నేను బ్రహ్మను అని నా శరీరం ద్వారానే చెప్పగలను. అందువల్ల అద్భుతం అన్నపదం వచ్చింది. ఈ మంత్రంలో క్రియాపదం లేదు. అందువల్ల మనం **సాధకః ధ్యాయేత్** అని కలుపుకోవాలి. ఒక ఆధ్యాత్మిక సాధకుడు అటువంటి శివుని మీద ధ్యానం చేయాలి.

శివుడిని మూడు రూపాలుగా ధ్యానం చేయవచ్చని చూశాము. ఏ రూపం మీద ధ్యానం చేయాలనేది, మనం ఏ స్థాయిలో ఉన్నామనేదాని మీద ఆధారపడి ఉంటుంది. భగవద్గీత పదకొండవ అధ్యాయంలో అర్జునుడు విశ్వరూప దర్శనం కోరుకున్నాడు. కృష్ణపరమాత్మ అతనికి తన విశ్వరూప దర్శనం చేయగలిగేందుకు దివ్యచక్షువులను ప్రసాదించాడు. కాని అధ్యాయం చివర్లో అర్జునుడు ఆ విశ్వరూప దర్శనం చేసేటంత పరిపక్వత తనకు లేదన్నాడు. విశ్వరూపభక్తిలో వృద్ధాప్యం, అనారోగ్యం, మరణాలను కూడా స్వీకరించాలి. విశ్వరూపభక్తి అంటే అనేక రూపభక్తి. విశ్వరూపభక్తిలో చావుపుట్టుకలను, యవ్వనవృద్ధాప్యాలను, సంయోగవియోగాలను సమానంగా స్వీకరించాలి. వీటిని స్వీకరించలేకపోతే సంసారం తప్పదు. ఈ ద్వంద్వాలకు అతీతంగా ఉంటే అది నిర్గుణ ఈశ్వర భక్తి.

**ఉమాసహాయం పరమేశ్వరం ప్రభుం ।**
**త్రిలోచనం నీలకంఠం ప్రశాంతమ్ ।**
**ధ్యాత్వా మునిర్గచ్ఛతి భూతయోనిం ।**
**సమస్తసాక్షిం తమసః పరస్తాత్ ॥** **7**

ముందు మంత్రంలో ద్వంద్వాలను స్వీకరించే విశ్వరూపభక్తి ఉండవచ్చు; లేదా ద్వంద్వాలకు అతీతంగా ఉండే నిర్గుణభక్తి ఉండవచ్చు అని చూశాము. ద్వంద్వాలను స్వీకరించలేకపోతే సంసారం తప్పదు అన్నాము. విశ్వరూప భక్తికి వచ్చేసరికి, సంసారంలో పడవేసే అహంకార, మమకారాలు తగ్గుతాయి. నిర్గుణభక్తి దీనికి పరాకాష్ట. అహంకార, మమకారాలకు అతీతంగా ఎదుగుతాము. అందువల్ల మనం విశ్వరూపభక్తి నుంచి నిర్గుణ భక్తికి ఎదగాలి. ప్రతి ఆధ్యాత్మిక సాధకునికి ఇది లక్ష్యంగా ఉండాలి. అలా ఎదగనంతవరకూ మనస్సు ప్రశాంతంగా ఉండలేదు. FEDERAL problems ఉంటాయి. F-fear; D-depression; R-regret; L-loneliness. మనస్సు- భయం, నిస్పృహ, పశ్చాత్తాపం, ఒంటరితనాలకు లోనవుతుంది. వీటన్నిటినీ కలపి సంసారం అంటారు.

మనం విశ్వరూపభక్తి లేదా నిర్గుణభక్తికి రానంతవరకూ అవి బాధిస్తాయి. కాని చాలామంది ఈ రెండింటిలో దేనికీ రావటానికి ఇష్టపడరు. ఎందుకంటే వీటికి పరిపక్వత కావాలి. చాలామంది బొద్దింకలను, దోమలను పరమాత్మగా స్వీకరించటానికి ఇష్టపడరు. వాటిని చంపటం మంచిదా కాదా అనేది పక్కన పెట్టినా, వాటిని భగవంతునిగా స్వీకరించటానికి గొప్ప పరిపక్వత కావాలి. అర్జునుడు కృష్ణపరమాత్మ విశ్వరూప దర్శనం చేశాక, నువ్వు చతుర్భుజాలతో, విష్ణురూపంతోనే నాకు దర్శనమియ్యి అన్నాడు. ఓ సహస్రబాహూ, ఓ విరాడ్రూపా! నీ చతుర్భుజ రూపాన్ని నాకు చూపించు అన్నాడు.

**తేనైవ రూపేణ చతుర్భుజేన సహస్రబాహో! భవ విశ్వమూర్తే**
**- గీత 11.46**

అందువల్ల మనం మానసికంగా ఎదిగేదాకా ఏకరూపఈశ్వర ధ్యానం సూచించబడింది. ఈ మంత్రం **ఇష్టదేవతా ఏకరూప శివుని ధ్యానం** గురించి చెపుతున్నది. ఉపనిషత్తు శివుని ఒక ఉదాహరణగా తీసుకుంది. మీరు శివుడు బదులు మీకు ఇష్టదేవత వేరే ఎవరైనా ఉంటే ఆ దేవతను కొలవవచ్చు.

**ఉమాసహాయం** – ఉమాపతి. ఇది శివుని వర్ణన. శివుడిని సాంబ పరమేశ్వరుడు అని కూడా అంటారు. స+అంబ=సాంబ. అంబతో కూడిన పరమేశ్వరుడు. ఉమా అంటే పార్వతి; సహాయం అంటే పతి. ఈ పదం శివుని అర్థనారీశ్వర తత్త్వాన్ని సూచిస్తున్నది.

**అతిభీషణ కటుభాషణ యమకింకర పటలీ**
**కృతతాడన పరిపీడన మరణాగమ సమయే**
**ఉమయా సహ మమ చేతసి యమశాసన నివసన్**
**హరశంకర శివశంకర హరమే హర దురితమ్**

ఓ పరమేశ్వరా, యమధర్మరాజుని కూడా జయించినవాడా, నేను రోగాలతో బాధపడుతూ నా మరణశయ్య మీద ఉన్నప్పుడు, యమకింకరులు వచ్చి నన్ను దుర్భాషలాడుతూ, నన్ను కొడుతున్నప్పుడు, నువ్వు ఉమాసహితంగా వచ్చి నా మనస్సులో నాట్యమాడు. ఇది **శివశంకర అష్టకం** లోనిది. ఇలాంటి శ్లోకాలు ఎనిమిది ఉన్నాయి. అనేకరూప ఈశ్వరుడిని లేదా అరూపఈశ్వరుడిని మీరు ఊహించుకోలేనప్పుడు, ఇలా పరమశివుడు నాట్యమాడుతున్నట్టు ఊహించుకోండి. అదీ కష్టమైతే మీకిష్టమైన దేవతను, మీకిష్టమైన విధంగా ఊహించుకోండి. అదీ కష్టమైతే వచ్చే జన్మలో ప్రయత్నించాల్సిందే.

వేదాంత పరిభాషలో ఉమా అంటే బ్రహ్మవిద్య. ఉమాసహాయం అంటే బ్రహ్మవిద్యా ఆచార్యుడు. అంటే దక్షిణామూర్తి.

**పరమేశ్వరం** – జగత్తులో అత్యంత గొప్ప దేవుడు.

**ప్రభుం** – సృష్టి, స్థితి, లయకారకుడు. ప్రభు అంటే మాయాశక్తి వల్ల

శక్తిమంతుడు అయ్యాడు. అందవల్లనే సౌందర్యలహరి ఈ పదాలతో మొదలవుతుంది –

**శివశక్త్యా యుక్తోః యది భవతి శక్తః ప్రభవితుం।**
**న చేదేవం దేవో న ఖలు కుశలః స్పందితుమపి॥**

శక్తి సహాయం లేనిదే, శివుడు కదలను కూడా లేదు.

**త్రిలోచనం –** మూడు కన్నులు ఉన్నవాడు. ఈ పదాన్ని విశ్వరూప దర్శన వర్ణనగా తీసుకోవచ్చు. సూర్యుడు, చంద్రుడు, అగ్నులను తన మూడు నేత్రాలుగా ధరించినవాడు. సూర్యుడు పగలు, చంద్రుడు రాత్రి, అగ్ని అమావాస్య రాత్రి కాంతిని ప్రసరింపజేస్తారు. ఈ విధంగా ఈశ్వరుడిని ఊహించుకోలేకపోతే, మూడు నేత్రాలు ఉన్న ఏకరూప ఈశ్వరుడిని ధ్యానం చేయవచ్చు. మూడవ నేత్రాన్ని జ్ఞాననేత్రం అంటారు. రెండు నేత్రాలు ద్వైత దర్శనాన్ని చేయిస్తాయి. అంటే లౌకిక ప్రపంచాన్ని చూపిస్తాయి. మూడవ నేత్రం శాస్త్రీయ చక్షువు. అది అద్వైత దర్శనాన్ని చేయిస్తుంది. రెండు నేత్రాలు కత్తెరలాంటివి అయితే, మూడవ నేత్రం సూదిలాంటిది. కత్తెర విడదీసినట్టుగా, ఈ నేత్రాలు ప్రపంచాన్ని రెండుగా చూపిస్తాయి. సూది రెండు వస్తువులను కలిపినట్టుగా, జ్ఞానచక్షువు ఉన్నదంతా ఒకటే అని చూపిస్తుంది.

**నీలకంఠం –** కంఠం నీలంగా ఉన్నవాడు. సాగరమథనంలో హాలాహాలం పుడితే ప్రపంచాన్ని రక్షించటానికి శివుడు ఆ విషాన్ని మింగటం అందరికీ తెలిసిందే. ఇది శివుని యొక్క ఆర్తత్రాణ పరాయణత్వాన్ని సూచిస్తుంది. అంటే స్థితికారకుడు. నీలకంఠం పదాన్ని విశ్వరూప దర్శనానికి తీసుకోవచ్చు. నీలాకాశం ఆయన మెడగాను, భూలోకం పాతాళ లోకాలు ఆయన పాదాలు గాను, ఊహించుకోవచ్చు. నీలాకాశం మెడ అయితే, శివుని శిరస్సు దానికన్నా పైన ఉందని అర్థం.

**ఆపాతాళఽనభః స్థలాంత భువన బ్రహ్మాండమావిస్ఫురత్**
**జ్యోతిఃస్ఫాటిక లింగమౌళి విలసత్ పూర్ణేందు వాంతామృతైః**

రుద్రం ధ్యానశ్లోకాల్లో వస్తుంది ఇది. ఈ విశ్వం మొత్తం శివలింగాకారంలో ఉంది. విశ్వం అంతా శివలింగం అయితే మరి అభిషేకం ఎవరు చేస్తారు? చంద్రుని నుంచి అమృతజలం, ఆయన చల్లని కిరణాల ద్వారా అంతటా ఉన్న శివలింగానికి అభిషేకం చేస్తున్నది. ఆ వర్ణన కొనసాగుతుంది తర్వాత శ్లోకాల్లో. మొత్తం ఆకాశం శివలింగం, నక్షత్రాలు పుష్పమాలలు, సూర్య చంద్రులు నేత్రాలు, సముద్రాలు కుక్షి, పాతాళలోకాలు పాదాలు, వేదాలు రుద్రదేవుని నోరు.

**ప్రశాంతం** – చాలా ప్రశాంతంగా ఉంటాడు. ఎప్పుడూ ధ్యానముద్రలో ఉంటాడు. స్మశానంలో ధ్యానం చేయటం వల్ల మరణమంటే భయం లేదని సూచిస్తున్నాడు.

**మరణభయరాహిత్యం**–ఇంకో గూఢార్థం కూడా ఉంది. చాలామందికి గుడికి వెళ్ళే తీరిక ఉండదు కాబట్టి నాస్తికులతో సహా అందరూ వచ్చి తీరే ప్రదేశాన్ని ఎన్నుకున్నాడు ధ్యానం చేయటానికి.

**భూతయోనిం** – జగత్కారణం. యోని అంటే కారణం; భూత అంటే సకల జీవులు, వస్తువులు. జగత్తుకు సృష్టి కారణం. సృష్టి చేశాడు అన్నప్పుడు మాయాసహిత బ్రహ్మను తీసుకోవాలి. భూతయోనిం పదాన్ని ముండకోపనిషత్తులో కూడా చూస్తాము. అంతేకాదు, ఇది అంతకుముందు మంత్రంలో చూసిన బ్రహ్మయోనిమ్ పదం లాంటిదే.

**సమస్త సాక్షిం** – అన్నిటినీ సాక్షీభూతంగా చూసే ఈశ్వరుడు. సర్వప్రకాశక చైతన్యం. మనస్సును ప్రత్యక్షంగా చూస్తే, మనస్సు ద్వారా ప్రపంచాన్ని చూస్తాడు.

**తమేవ భాంతమనుభాతి సర్వం తస్య భాసా సర్వమిదం విభాతి**
**– కఠ 2-2-15**

ఆత్మ సాక్షిచైతన్యం. ఈ పదం అరూపఈశ్వరుని సూచిస్తుంది.

**తమసః పరస్తాత్** – తమస్ అంటే మాయ; పరస్తాత్ అంటే దానికి అతీతంగా ఉన్నాడు. అంటే మాయాతీతం. ఇక్కడ తమస్సు అంటే తమో గుణాన్ని

తీసుకోకూడదు. అవిద్యను తీసుకోవాలి. అవిద్య అంటే త్రిగుణాత్మకం మాయ. పరస్తాత్ అంటే మాయకు దూరంగా ఎక్కడో ఉన్నాడని తీసుకోకూడదు. మయాతీతం అంటే మాయలక్షణాలకు అతీతంగా ఉన్నాడు. మాయను త్రిగుణాత్మకం అన్నాము. బ్రహ్మ త్రిగుణాతీతం, అంటే గుణాలు అంటవు. ఆకాశం ఎలా అసంగమో, అలాగే నిర్గుణబ్రహ్మ కూడా అసంగం. నిర్గుణబ్రహ్మ జగత్తు అంతటా ఉంది కాని జగత్తులోని మలినాలు అంటవు. సినిమాను చూపించే తెర సినిమా అంతటా ఉంటుంది కాని, సినిమాలో వరద వస్తే తెర తడవదు.

అందువల్ల మోక్షం పొందటానికి మనం ఈ ప్రపంచాన్ని కాని, మన శరీరాన్ని కాని, మనస్సును కాని విడిచి ఎక్కడికో వెళ్ళనవసరం లేదు. మనశ్శరీరాలు మాయ. అవి వ్యావహారిక సత్యానికి చెందినవి. నేను ఆత్మను, అంటే పారమార్థిక సత్యానికి చెందుతాను. ఆత్మ అన్నా బ్రహ్మ అన్నా సాక్షి చైతన్యం అన్నా ఒకటే అని మర్చిపోకూడదు. వేదాంతం సరిగ్గా జీర్ణించుకుంటే, మనస్సు కలత చెందినప్పుడు, నేను వ్యవహారిక సత్యానికి చెందిన మనస్సును కాను, పారమార్థిక సత్యానికి చెందిన ఆత్మను అని గుర్తు తెచ్చుకుంటాము. **అప్పుడు మాయ చేసే మాయ మనలను మాయలో పడవేయదు.**

**వ్యావహారిక ప్రపంచంలో జరిగే ఏ సంఘటనా నన్ను బాధించలేదు**

వేదాంత సూత్రాల్లోని ఒక సూత్రం ఇది. నేను జగత్తుకు దూరంగా లేను. జగత్తు మధ్యలోనే ఉన్నాను కాని సినిమా, సినిమా తెరను బాధించ లేనట్టుగా నన్ను వ్యవహారిక సత్యం బాధించలేదు.

ఇంతవరకూ మనం శివునిని మూడు రూపాల్లోనూ చూశాము – ఏకరూప ఈశ్వరుడు, అనేకరూప ఈశ్వరుడు, అరూప ఈశ్వరుడు.

**ధ్యాత్వా –** మీరు ఉన్నస్థాయిని బట్టి ఈ మూడురూపాల్లో ఏదో ఒక రూపంలో ఈశ్వరధ్యానం చేయండి. నాకు సమయం లేదు అనకండి. సమయాన్ని వెతుక్కోండి. విధులు నిరంతరంగా ఉంటూనే ఉంటాయి. విధులన్నీ

ముగించాక ధ్యానం చేస్తాను అనుకుంటే, అలలన్నీ ఆగిపోయాక సముద్రస్నానం చేస్తాను అన్నట్టు ఉంటుంది. అది జరిగేపని కాదు కాబట్టి మీరే సమయాన్ని ఎలాగోలా కేటాయించుకోండి.

ఈ నాలుగు సాధనలూ చేస్తే నాకేమిటి లాభం అంటారు ఎవరైనా! ఎందుకంటే ఈ వరుసక్రమంలో చేయాలంటే చాలా సమయం పడుతుంది. ఒక్కోసారి వచ్చేజన్మలో కూడా చేయాల్సి రావచ్చు.

**మునిః గచ్ఛతి** – సాధకుడు శివునిలో లయమవుతాడు. ఎటువంటి శివుడు?

అచిన్త్యం, అవ్యక్తం, అనంతరూపం, భూతయోనిం. శివం పదం రెండు సార్లు చదవుకోవాలి. శివుని మీద ధ్యానం చేస్తే, సాధకుడు శివుడిని పొందుతాడు. భూతయోనిం గచ్ఛతి అంటే జీవాత్మ పరమాత్మ ఐక్యం. ఐక్యం అంటే మోక్షం. ఈ ఐక్యం పొందకముందు నేను శివునికి అచిన్త్యం, అవ్యక్తం వగైరా పదాలు వాడాను, ఇప్పుడు ఆ పదాలన్నీ నాకు వర్తిస్తాయి. నేను అచిన్త్యం, అవ్యక్తం. ఈ భక్తి నా మీద భక్తి.

అంతకుముందు నన్ను నేను ప్రేమించుకునేవాడిని. నేను పరిమిత, బాధాతప్త జీవిని అయినా కూడా నామీదే నాకు ప్రేమ. ఇప్పుడు నేను ఆత్మను అని తెలిశాక కూడా, నన్ను నేను ప్రేమించుకుంటాను. కాకపోతే ఈ ప్రేమ వేరు. ఇది **అద్వైతభక్తి**. వ్యష్టిగా నామీద ప్రేమను, సమష్టి ప్రపంచం మీద కురిపిస్తాను. ఎందుకంటే ప్రపంచమంతటా ఉన్నది నేనే. **నేను సర్వ వ్యాపకమైన ఆత్మను.**

**స బ్రహ్మ స శివః సేంద్రః । సోఽక్షరః పరమః స్వరాట్ ।**

**స ఏవ విష్ణుః స ప్రాణః । స కాలోఽగ్నిః స చంద్రమాః ।** 8

పైన చెప్పిన సాధనలు చేయటం వల్ల సాధకుడు బ్రహ్మవిద్యను, బ్రహ్మ విద్యాఫలాన్ని పొందుతాడు. 8-10 మంత్రాల్లో గురువు బ్రహ్మవిద్యా స్వరూపాన్ని వర్ణిస్తున్నాడు. అంతేకాదు, ఒక ముఖ్యమైన సూత్రాన్ని కూడా నొక్కి వక్కాణిస్తున్నాడు. అది – **జ్ఞానం పొందకుండా, మోక్షాన్ని పొందలేము**. మోక్షానికి జ్ఞానమార్గం కాకుండా వేరే మార్గం లేదు. జ్ఞానం ఏమిటి?

### బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః

నిర్గుణ చైతన్యమైన బ్రహ్మ ఒక్కటే సత్యవస్తువు. ఆ బ్రహ్మ ఎవరో కాదు, నేనే. కాకపోతే నేను అన్నప్పుడు ఆ నేను ఎవరో మర్చిపోకూడదు. నేను అంటే మోకాళ్ళనొప్పితో బాధపడే శరీరాన్ని కాదు; విషయవస్తువులకు లోబడే ఇంద్రియాలను కాను; రాగద్వేషాలతో కలుషితమైన మనస్సును కాను; వీటన్నిటినీ సాక్షిగా చూసే సాక్షిచైతన్యాన్ని. నేను సత్యం, జగత్తు మిథ్య. సగుణంగా ఉన్న ప్రతిదీ మిథ్యే. నిర్గుణం మాత్రమే సత్యం.

**సగుణంగా మూడు ఉన్నాయి:-**

1. సగుణ జీవుడు - స్థూల, సూక్ష్మ, కారణశరీరాలు + చిదాభాస / ప్రతిబింబ చైతన్యం

2. సగుణ జగత్తు - జడమైనది. అవి కేవలం నామ, రూపాలు మాత్రమే.

3. సగుణ ఈశ్వరుడు - సగుణ మాయ +చిదాభాస /ప్రతిబింబ చైతన్యం.

బింబచైతన్యం నిర్గుణం. సగుణ జీవుడు రజోప్రధానంగా ఉంటే, సగుణ జగత్తు తమో ప్రధానంగా ఉంటే, సగుణ ఈశ్వరుడు సత్త్వగుణ ప్రధానంగా ఉంటాడు. ఈ మూడూ మిథ్యే. మిథ్య అనే పదం జీర్ణించుకోవటానికి కష్టమైతే దాన్ని వ్యావహారిక సత్యం అనవచ్చు. మూడు కాలాల్లోనూ ఉండే నిర్గుణబ్రహ్మ పారమార్థిక సత్యం అయితే, ఒకకాలంలో వచ్చి, ఇంకోకాలంలో పోయే జీవుడు, జగత్తు, ఈశ్వరుడు వ్యావహారిక సత్యం. నేను పారమార్థిక సత్యమైన ఆత్మను. బ్రహ్మాత్మా అని కూడా అంటారు. అరూప ఈశ్వరుడు అంటే జీవాత్మ, పరమాత్మల ఐక్యాన్ని చూపించేది.

### బ్రహ్మైవ ఆత్మ, ఆత్మైవ బ్రహ్మ

**సః (ఏవ) బ్రహ్మ** - ఆ ఏకాత్మ బ్రహ్మ లేదా నిర్గుణబ్రహ్మ బ్రహ్మదేవునిగా వ్యావహారిక జగత్తులో ఉన్నాడు. ఇక్కడ బ్రహ్మ అంటే చతుర్ముఖ బ్రహ్మ.

**సః ఏవ విష్ణు** - విష్ణుమూర్తి కూడా నిర్గుణబ్రహ్మకు ఇంకో నామరూపం లేదా మాయావేషం. ఈ మాయావేషాలతోనే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు

వరుసగా సృష్టి, స్థితి, లయ కారకులుగా వ్యవహరిస్తున్నారు. నిర్గుణబ్రహ్మకు ఆకారము లేదు కాబట్టి, తను సృష్టి, స్థితి, లయలను చేయలేదు.

**తస్య కర్తారం అపి మాం విద్ధి అకర్తారం అవ్యయం** – గీత

మాయావేషంతో వ్యవహారిక ప్రపంచంలో నేను సృష్టి, స్థితి, లయ కారకుడిని. మాయావేషం తీసేస్తే, నేను నిర్గుణబ్రహ్మను. అకర్తా, అభోక్తను. ఆ విధంగా మనం మాయావేషం వేసుకుని జగన్నాటకం ఆడవచ్చు, లేదా నిర్గుణబ్రహ్మ స్వరూపం అని అర్థం చేసుకుని దానికి అతీతంగా ఎదగవచ్చు. అది మనచేతిలో ఉంది.

**సః ఏవ శివః** – నిర్గుణబ్రహ్మ శివవేషం కూడా వేస్తుంది. చతుర్ముఖ బ్రహ్మ మాయ యొక్క రజోగుణంతో సృష్టి చేస్తే, విష్ణుమూర్తి మాయ యొక్క సత్త్వగుణంతో స్థితికారకుడు అయితే, శివుడు మాయ యొక్క తమో గుణంతో లయకారకుడు అవుతున్నాడు. ఒక నిర్గుణబ్రహ్మే మూడు గుణాలనూ వాడుతున్నది.

ఈ త్రిమూర్తులలో ఎవరు గొప్ప? ఒకటే నిర్గుణబ్రహ్మ వేసుకున్న మూడు వేషాలు ఇవి. అలాంటప్పుడు ఎవరు గొప్ప ప్రసక్తికి చోటే లేదు. ఇది తెలియక శివభక్తులు, విష్ణుభక్తులు అజ్ఞానంతో ఒకరితో ఒకరు గొడవ పడుతున్నారు. అందువల్లనే శంకరాచార్యులు షణ్మతస్థాపన చేశారు. అన్ని నామరూపాలు, నామరూపరహిత బ్రహ్మకు చెందినవని చూపారు. మారాలి అంటే సగుణబ్రహ్మ ధ్యానం నుంచి నిర్గుణబ్రహ్మ ధ్యానానికి రావాలి. దానికి చాలా సూక్ష్మమైన మనస్సు కావాలి.

**సః ఇంద్ర** – ఈ నిర్గుణబ్రహ్మ ఇంద్రునిగా ఉన్నాడు.

**సః ప్రాణః** – ఈ నిర్గుణబ్రహ్మే సమష్టిప్రాణంగా ఉన్నాడు. సమష్టి ప్రాణం అంటే హిరణ్యగర్భ.

**సః కాలః** – కాలః అంటే కాలతత్త్వము. బ్రహ్మకు కాలతత్త్వం లేదు. కాని కాలం నిర్వచనమే మాయాసహిత చైతన్యం.

**సః అగ్నిః** – నిర్గుణబ్రహ్మే అగ్నిగా ప్రకటితమవుతున్నాడు.

**సః చంద్రమా** – నిర్గుణబ్రహ్మే చంద్రునిగా ప్రకటితమవుతున్నాడు.

ఒక్కముక్కలో చెప్పాలంటే నిర్గుణబ్రహ్మ యొక్క విభిన్న వేషాలే దేవతలు అందరూ. వేషం అనకుండా ఉపాధి అనే సాంకేతిక పదం వాడుతుంది ఉపనిషత్తు. సగుణ ఆకారాలన్నిటినీ సోపాధిక స్వరూపాలు అంటారు. ఈ సోపాధిక స్వరూపాలను తీసేస్తే, వాటి వెనక ఉన్నది ఏమిటి? నిరుపాధిక బ్రహ్మ. ఆ నిరుపాధికబ్రహ్మ స్వరూపమేమిటి? అదే ఇప్పుడు చూస్తాము.

**స్వరాట్** – స్వయంప్రకాశకం. నిరుపాధికబ్రహ్మ స్వయంప్రకాశక చైతన్యం. చైతన్య స్వరూపం. సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ. స్వరాట్ అంటే జ్ఞానస్వరూపం. సమష్టిస్థాయిలో మూడూ.

**పరమః** – ఆత్యంతిక స్వరూపం. దాన్ని బ్రహ్మ, విష్ణు శివ అని నామరూపాలతో వర్ణించలేము.

**అక్షరః** – క్షరం కానిది; అంటే నాశనం లేనిది. నిర్వికారం. మార్పు లేనిది. ఆ నిర్గుణబ్రహ్మే సత్యం, ఆ నిర్గుణబ్రహ్మను నేనే. బ్రహ్మసత్యం, జగన్మిథ్యా అని నేర్చుకుంటే జ్ఞానం పూర్తికాదు; ఆ సత్యమైన బ్రహ్మను నేనే అని అర్థం చేసుకోవాలి. నేను ఎవరు?

**అహమేవ ఇదం సత్**

నేను సర్వవ్యాపకమైన, సర్వప్రకాశకమైన ఆత్మను. అది అర్థమయ్యే వరకూ, నేను మామూలు ఆళ్ (మనిషి)ని, జీర్ణించుకున్నాక పెరుమాళ్ (పెరుం ఆళ్)ను. పెరుమాళ్ అంటే పరమాత్మ. ఇదే విషయం రాబోయే మంత్రాల్లో ఇంకా వివరంగా వస్తుంది.

**స ఏవ సర్వం యద్భూతం । యచ్చ భవ్యం సనాతనమ్ ।**
**జ్ఞాత్వా తం మృత్యుం అత్యేతి । నాన్యః పంథా విముక్తయే ॥** 9

**సః ఏవ సర్వం** – ముందు మంత్రంలో కొందరు దేవతల పేర్లు మాత్రమే వచ్చాయి. అంటే తక్కిన దేవతలు బ్రహ్మస్వరూపాలు కారా అనే సందేహం రావచ్చు. అందువల్ల అంతా బ్రహ్మే అని ఈ మంత్రంలో వస్తుంది.

అరూప ఈశ్వరుడే సర్వం. సర్వం బ్రహ్మమయం జగత్.

**సర్వం బ్రహ్మమయం రేరే సర్వం బ్రహ్మమయం**

**– సదాశివ బ్రహ్మేంద్ర కీర్తన**

**యద్భూతం యచ్చభవ్యం** – భూతం అంటే గతం. భవ్యం అంటే భవిష్యత్తు. గతంలో ఉన్నవన్నీ బ్రహ్మే. భవిష్యత్తులో వచ్చేవన్నీ కూడా బ్రహ్మే. యచ్చ అంటే మధ్యలో వదిలేసిన వర్తమానం కూడా వస్తుంది.

**సనాతనం** – ఆ బ్రహ్మ శాశ్వతం. నామరూపాలు వచ్చిపోతాయి కాని బ్రహ్మ నిత్యం. సముద్రంలో అలలు వచ్చి, పోయినా నీరు శాశ్వతం ఎలాగో అలా. ఈ బ్రహ్మవిద్య వల్ల కలిగే ఫలమేమిటి?

**జ్ఞాత్వా తం మృత్యుం అత్యేతి** – ఆ బ్రహ్మను నేనే అని ఎవరు తెలుసు కుంటారో, అతను మృత్యువును అధిగమిస్తాడు. నామరూపాలు వచ్చిపోతాయి, కాని నేను శాశ్వతం అని తెలుసుకుంటాడు. ఒక అల తను చిన్న అల అనుకుంటే మృత్యుభయం ఉంటుంది. తను అల కాదు, నీరు అని తెలుసుకుంటే ఆ భయం పోతుంది. మనిషిని పట్టిపీడించే అనేక భయాల్లో మృత్యుభయం అత్యంత పెద్దది. ఎలాగైతే ఒక చిన్నపిల్లవాడు భయమేస్తే తల్లి చీరకొంగు చాటున దాక్కుంటాడో, అలాగే మనిషి భద్రత కోసం బాహ్యవస్తువుల వెనుక దాక్కుంటాడు. కాని ఇవన్నీ కాలమనే కోరల్లో చిక్కక తప్పదు. మనం పంచ అనాత్మలతో మమేకం చెందుతాము. అవి ఉద్యోగం, ఆస్తులు, కుటుంబం, శరీరం, మనస్సు. వీటిని కోల్పోతామేమోననే భయంతో బ్రతుకుతూ ఉంటాము.

ఈ పంచ అనాత్మలలో మనం దేన్నైనా కొంతమేరకు అదుపులో పెట్టగలం అంటే అది ఒక్క మనస్సునే. మన దృక్పథం మార్చటం ద్వారా దానిని అదుపులో పెట్టగలం. బాహ్యముఖంగా ఉన్నకొద్దీ, మనస్సు మన చెప్పుచేతల్లో ఉండదు. మనం అంతర్ముఖులం అయినకొద్దీ కొంత ఎక్కువగా నియంత్రించగలము. అది కూడా పూర్తిగా అదుపులో పెట్టలేము. ఎందుకంటే మనస్సు మీద కూడా వృద్ధాప్యం ప్రభావం ఉంటుంది.

అందువల్ల మనం మన అనాత్మ బాగుండటానికి తోడ్పడగలమే కాని, దాన్ని అదుపులో పెట్టుకోలేము. అనాత్మను పూర్తిగా మన అధీనంలో ఉంచు కోవటమే మోక్షం అనుకుంటే, మనం మోక్షాన్ని ఎన్నడూ పొందలేము. త్రిపుటిలో ఉంటే అత్యంత శక్తివంతమైనది కర్మ. జీవుడు, జగత్తు, ఈశ్వరుడులలో ఎవరూ కాదు. కాలం, కర్మలు చాలా శక్తివంతమైన అంశాలు. ఎవరూ వాటిని ఆపలేరు. వాటి స్వభావాన్ని తగ్గించాలన్నా, పారద్రోలాలన్నా ఒకటే మార్గం ఉంది. అది ఇవి **మిథ్య** అని అర్థం చేసు కోవటమే. ఒక్కమాటలో చెప్పాలంటే అవసరమైన దానికన్నా ఎక్కువ ప్రాముఖ్యత నివ్వకూడదు అనాత్మకు.

అనాత్మ మిథ్య అని అర్థం చేసుకోవాలి. అలాగని అనాత్మను పూర్తిగా నిర్లక్ష్యం చేయకూడదు; వేదాంతం మనలను బాధ్యతారహితంగా ప్రవర్తించ మనటం లేదు. దానికి ఇవ్వాల్సిన ప్రాముఖ్యతనివ్వాలి అంతే. మరీ ఎక్కువా కాదు, మరీ తక్కువా కాదు.

మూడు సత్యాలు ఉన్నాయి. **అవి ప్రాతిభాసిక సత్యం, వ్యావహారిక సత్యం, పారమార్థిక సత్యం.** మన స్వప్నం ప్రాతిభాసిక సత్యం. అది మనం సృష్టించినది. చాలా తక్కువకాలం ఉంటుంది. పారమార్థిక సత్యం మూడు కాలాల్లోనూ ఉంటుంది. ఉదాహరణకు కుండ, మట్టి విషయం తీసుకుంటే మట్టి మూడు కాలాల్లోనూ ఉంటుంది. మట్టి కుండ పుట్టకముందూ ఉంటుంది, కుండలోనూ ఉంటుంది, కుండ పగిలి పోయాకా ఉంటుంది. అదే కుండ విషయం తీసుకుంటే అది ఒక కాలంలో వచ్చి, ఇంకో కాలంలో పోతుంది. దీన్ని వ్యావహారిక సత్యం అంటారు. దీనికి ఇంకో పేరు మిథ్య. కుండకు మట్టి లేకుండా విడిగా ఉనికి లేదు కాబట్టి అది మిథ్య అయింది.

ఇందాక చూసిన పంచ అనాత్మలూ వ్యావహారిక సత్యంలోకి వస్తాయి. అవి ప్రాతిభాసిక సత్యమూ కాదు, పారమార్థిక సత్యమూ కాదు. వాటికి విడిగా ఉనికిలేదు. వాటికి రాకపోకలు ఉన్నాయి. అందువల్ల ఏదైనా కష్టం వస్తే **నాకే ఎందుకు వచ్చింది** అని బాధపడకూడదు. దాన్ని స్వీకరించక తప్పదు. కష్టాలనేవి తప్పవు, జ్ఞానులకు కూడా తప్పవు.

ఆ మాటకొస్తే అవతారపురుషులైన రాముడు, కృష్ణులకు కూడా తప్పలేదు. అందువల్ల మోక్షం అంటే అభద్రతాభావం నుంచి విముక్తి పొందటం. మోక్షం పొందటానికి జ్ఞానం పొందాలి.

అల నేను అల కాదు, నీరును అని తెలుసుకుంటే మృత్యుభయం పోతుంది. నా స్వరూపం నీరు, నా ఆగంతుక స్వరూపం అల అని తెలుసు కుంటుంది. 'నేను ఆధ్యాత్మిక అనుభవం ఉన్న మనిషిని కాదు; మానవ అనుభవం ఉన్న ఆధ్యాత్మిక జీవిని,' అన్నారెవరో. ఆ జ్ఞానం పొందాలి. అప్పుడు నేను అహంకారం కాదు, నేను మనస్సు కాదు అని తెలుస్తుంది.

దీన్ని **నైబరైజేషన్** అంటారు. మీ అహంకారాన్ని మీ పొరుగువానిగా చూడండి. పొరుగింటి వ్యక్తికి ఏదైనా కష్టం వస్తే మీరేం చేస్తారు? అయ్యో పాపం అంటారు. ఓదారుస్తారు, చేతనైతే ఏదైనా సహాయం చేస్తారు. కాని మీరు దానివల్ల కృంగిపోరు. మనస్సుకొచ్చిన సమస్యను కూడా అలాగే చూడాలి. కృంగిపోకూడదు. **జ్ఞాత్వా తం మృత్యుం అత్యేతి** అంటే అర్థం అదీ. జ్ఞానం వల్ల భయం పోయి అభయం పొందుతారు. **తం జ్ఞాత్వా** దగ్గర **అహం బ్రహ్మ అస్మి** అని కలుపుకోవాలి. అది ఈ మంత్రంలో ఇవ్వలేదు; తర్వాత వచ్చే మంత్రంలో వస్తుంది.

అమ్మో జ్ఞానమార్గం చాలా కష్టంగా ఉంది; ఆత్మ అరూపం, అస్పర్శం అంటున్నారు; ఇంద్రియ అగోచరం, మనో అగోచరం అంటున్నారు; దాని గురించి నేర్చుకోవటానికి అధికారిత్వం పొందాలంటే సాధన చతుష్టయ సంపన్నులు అవ్వాలి, ముఖ్యంగా వైరాగ్యం పెంచుకోవాలి అంటున్నారు. ఇది కాకుండా వేరే ఏదైనా మార్గముందా అని అడిగితే లేదని ఖచ్చితంగా చెపుతున్నది ఉపనిషత్తు.

**న అన్యః పంథా విముక్తయే – విముక్తయే అన్యః పంథాః నాస్తి.** విముక్తి పొందటానికి వేరే మార్గం లేదు. పంథా అంటే మార్గం. రకరకాల మార్గాలు చెపుతారు కొంతమంది. భక్తిమార్గం, కర్మమార్గం, కుండలినీ మార్గం, ధ్యాన మార్గం వగైరా. ఇవేవీ మోక్షాన్ని ఇవ్వవు. సరిగ్గా అర్థం చేసుకోండి.

ఇవేవీ లాభం లేదు అనటం లేదు. ఇవన్నీ చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత, చిత్త వైశాల్యత ఇస్తాయి కాని మోక్షాన్ని మాత్రం ఇవ్వవు.

ఎవరైనా భక్తి మోక్షాన్నిస్తుందా అని అడిగితే, భక్తి అంటే ఏమిటి అని ఎదురు ప్రశ్నించాలి. భక్తి అంటే అహం బ్రహ్మ అస్మి జ్ఞానం అంటే, భక్తి మోక్షానిస్తుంది అని చెప్పవచ్చు. కాని అది ద్వైతభక్తి అయితే మాత్రం మోక్షానివ్వదు. చిత్తశుద్ధిని మాత్రమే ఇస్తుంది.

జ్ఞానమార్గమొక్కటే మోక్షానికి దారి. కాని అది కష్టంగా ఉంది అంటే అది తేలిక అని ఎవరు అన్నారు? అది కష్టమే కాని అసాధ్యం మాత్రం కాదు. జ్ఞానమార్గం కష్టంగా ఉంటే, దాన్ని తేలికగా చేసుకోండి అన్నాడు కృష్ణపరమాత్మ. మురుకు తినాలని ఆశ ఉండి, తినే శక్తి లేనివాళ్ళు ఏం చేస్తారు. దాన్ని పొడి చేసుకునో, ఎందులోనైనా నానబెట్టుకునో తింటారు తప్ప, పూర్తిగా మానేయరు. అలాగే జ్ఞానమనే మురుకును తేలిగ్గా తినే మార్గం వెతుక్కోండి. ఏమిటా మార్గం? దానికి కావాల్సిన అర్హతను సంపాదించుకోండి. మిమ్మల్ని మీరు సంసిద్ధులను చేసుకోండి. ఏదైనా పొందాలంటే ముందు మనస్సును సంసిద్ధ పరచుకోవాలి. కింద కూర్చోవటం కష్టమా, తేలికా? సంసిద్ధపడ్డ మనస్సుకు తేలిక. అమ్మో! కింద కూర్చోవటమా అనే మనస్సుకు కష్టం. జ్ఞానయోగమా? నాకు తల మీంచి వెళ్ళిపోతుంది అనుకునేవారికి కష్టం. నేర్చుకుందామనుకునేవారికి తేలిక.

వేదాంతం మనకు చక్కని రాజమార్గాన్నిచ్చింది. కర్మయోగం పాటించి చిత్తశుద్ధి పొంది, ఉపాసనయోగం పాటించి చిత్త ఏకాగ్రత పొంది, జ్ఞాన మార్గానికి వచ్చి, శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా జ్ఞానం పొంది, తద్వారా మోక్షం పొందాలి. గీతాసారం ఇదే!

**నాన్యః పంథా విముక్తయే - అక్షరలక్షలు విలువ చేసే వాక్యం. జ్ఞానాత్ ఏవ కైవల్యం.**

**సర్వభూతస్థమాత్మానం । సర్వభూతాని చాత్మని ॥**
**సంపశ్యన్ బ్రహ్మ పరమం। యాతి నాన్యేన హేతునా ॥** 10

దాదాపుగా ముందు మంత్రంలో చెప్పిన అంశమే ఇక్కడ కూడా నొక్కి వక్కాణిస్తున్నది ఉపనిషత్తు. ఇవి చాలా ముఖ్యమైన మంత్రాలు. ఎందుకంటే ఇవి ఒక ముఖ్యమైన ప్రశ్నకు జవాబులు. మోక్షానికి ఎన్ని మార్గాలు ఉన్నాయి? ఒక్కటే మార్గముంది. తక్కిన మార్గాలు చిత్తశుద్ధికి అని చూశాము.

**జ్ఞానయోగానికి రానిదే కర్మయోగం అసంపూర్ణం**

**కర్మయోగం లేనిదే జ్ఞానయోగం అసంభవం**

దేన్నీ విమర్శించకూడదు, కాని దేని ఫలం ఏమిటో తెలుసుకోవాలి.

**పరమం బ్రహ్మ సంపశ్యన్ –** పశ్యన్ అంటే చూడటం; ఇక్కడ అర్థం చేసుకోవటం. **సీయింగ్ ఈజ్ బిలీవింగ్** (seeing is believing) అంటారు ఇంగ్లీషులో. కళ్ళారా చూసినదాని విలువ ఎక్కువ ఉంటుంది. అది నిశ్చయ జ్ఞానం అవుతుంది. అందువల్లనే జ్ఞానం పొందటానికి సంపశ్యన్ అంది ఉపనిషత్తు. ఆ జ్ఞానం వల్ల పొందే లాభమేమిటి?

**పరమం బ్రహ్మ యాతి –** బ్రహ్మని తెలుసుకున్న వ్యక్తి, బ్రహ్మతో లయమవుతాడు.

**బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి**

బ్రహ్మతో లయమవటం అంటే బ్రహ్మకు, తనకు మధ్య భేదం ఉందను కోవటం భ్రమ అని తెలుసుకోవటం. ఐక్యం అంటే భేదభావనను వదులు కోవటం.

**భేదభ్రాంతి నివృత్తిః ఏవ అభేద ప్రాప్తిః**

**న అన్యేన హేతునా –** వేరే మార్గం ఏదీ లేదు. ఎక్కడైనా కర్మ వల్ల మోక్షం వస్తుంది అనే వాక్యం వస్తే, దానికి మధ్యలో మనం ఒక వాక్యం కలుపుకోవాలి. కర్మ వల్ల చిత్తశుద్ధి కలిగి, జ్ఞానయోగ్యతాప్రాప్తి కలుగుతుంది. దాని తర్వాత జ్ఞానం పొంది, మోక్షం పొందాలి. అంటే –

జ్ఞానం సాక్షాత్ మార్గం; భక్తి, కర్మ, యోగం పరంపరా మార్గాలు. మనం ఈ భూమిని వదిలేలోపు జ్ఞానం పొందాలి.

**జ్ఞానాత్ ఏవ కైవల్యం**

జ్ఞానమే మోక్షాన్ని ఇస్తుందంటే, ఆ బ్రహ్మను ఎలా చూడాలి నేను? అది మొదటిపాదంలో వస్తుంది.

**సర్వభూతస్థం ఆత్మానం** – ఆ బ్రహ్మ ఆత్మగా అన్ని జీవరాశుల్లోనూ ఉంది. భూత అంటే సర్వశరీరాలు. **సర్వభూతేషు తిష్ఠతి.** ఒక పుష్పమాలలో దారం ఎలా అంతర్లీనంగా ఉంటుందో అలా అన్ని జీవరాశుల్లో అంతర్లీనంగా ఆత్మ ఉంటుంది. పువ్వులు కొన్ని తాజాగా ఉంటే, కొన్ని వాడిపోతూ ఉంటాయి. అలాగే కొన్ని జీవరాశులు యవ్వనంతో మెరిసిపోతుంటే, కొన్ని శరీరాలు శుష్కించి పోతూవుంటాయి. అంటే ఆత్మ అన్నింటిలో ఉంది.

**సర్వభూతాని చ ఆత్మని** – ఇక్కడ ఆత్మ అన్నిటికీ ఆధారంగా ఉంది. అంతకుముందు ఆత్మ అన్నింటిలో ఉంది అంటే ఇక్కడ ఆత్మలో అన్నీ ఉన్నాయి అంటున్నది. మొదటివాక్యం అంతర్యామిత్వం సూచిస్తే, ఈ వాక్యం సర్వ ఆధారత్వం సూచిస్తుంది. ఆత్మను మూడుదశల్లో అర్థం చేసుకోవాలి. దానికి ఆకాశం ఉదాహరణ తీసుకుందాము.

1. ఈ గదిలో ఆకాశం ఉంది.
2. ఈ గదిలోనే కాదు, బయట కూడా ఆకాశం ఉంది.
3. ఆకాశంలోనే అన్ని గదులూ ఉన్నాయి.

(ఖాళీ ప్రదేశంలో అన్ని భవంతులూ కట్టబడుతాయి)

ఇప్పుడు ఈ సూత్రాన్ని ఆత్మకు వర్తింపజేద్దాము.

1. నా శరీరంలో ఆత్మ ఉంది.
2. నా శరీరంలోనే కాదు, బయట కూడా ఆత్మ ఉంది.
3. ఆత్మలోనే అన్ని శరీరాలు ఉన్నాయి.

ఈ మంత్రంలో మొదటిదశ, ఆఖరిదశ చూస్తాము. రెండోదశను ఊహించుకోవాలి.

సర్వభూతస్థ మాత్మానం – అన్ని శరీరాల్లో ఆత్మ ఉంది – మొదటి దశ.

సర్వభూతాని చాత్మని – ఆత్మలోనే అన్ని శరీరాలూ ఉన్నాయి – మూడవ దశ.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. ఆత్మ అన్ని శరీరాల్లో ఉంది అంటే జడవస్తువుల్లో కూడా ఉందా అనే ప్రశ్న వస్తుంది. జడవస్తువుల్లో కూడా ఉంది. వాటిల్లో చిత్ అంశం తెలియదు కాని సత్ అంశం తెలుస్తుంది. ఆత్మను సత్‌చిత్ ఆనందం అంటారు. మూడు అంశాలూ అన్నింటిలోనూ ప్రకటితమవవు. ఉదాహరణకు అగ్నికి వేడి, కాంతి లక్షణాలు ఉంటాయి. నీటిలో అగ్ని యొక్క వేడే తెలుస్తుంది, కాని ఇనుప ఊచను వేడిచేస్తే వేడి, కాంతి రెండూ తెలుస్తాయి.

పదవ మంత్రం వరకూ ఈ క్రింది విషయాలు చూశాము.

1. **బ్రహ్మవిద్యా సాధనలు** – సాక్షాత్ సాధన, సహకారీ సాధనలను చూశాము. అలాగే సగుణ, నిర్గుణ బ్రహ్మధ్యానం కూడా చూశాము.

2. **బ్రహ్మవిద్యా స్వరూపం** – బ్రహ్మ మాత్రమే సత్యం. తక్కినవన్నీ మిథ్య. అవి కేవలం నామరూపాలు మాత్రమే. నిర్గుణబ్రహ్మే వ్యావహారికస్థాయిలో జీవ, జగత్తు, ఈశ్వరునిగా ప్రకటితమవుతున్నది. ఈ వ్యత్యాసం మాయ వల్ల ఏర్పడుతున్నది. మాయను తొలగిస్తే నిర్గుణబ్రహ్మలో అన్నీ లయమవుతాయి. ఆ నిర్గుణబ్రహ్మే నా స్వస్వరూపం.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః॥**

3. **బ్రహ్మ విద్యాఫలం** – సంసారం నుంచి మోక్షం పొందటం బ్రహ్మవిద్యా ఫలం. మిథ్యా జగత్తుకు మనం సత్యత్త్వం ఆపాదించటం వల్ల మనను సంసారం బాధిస్తున్నది. మిథ్య దానంతట అది మనను బాధించదు, దానికి సత్యత్త్వం ఆపాదించటం వల్ల వస్తోంది సమస్య. అందువల్ల మోక్షం అంటే మిథ్యాజగత్తు నుంచి పారిపోవటం కాదు. మిథ్యను మిథ్యగా అర్థం చేసుకోవటం. సినిమాను సినిమాగా చూస్తే ఆనందం కలుగుతుంది కాని, దానిలో మమేకం చెందితే, దుఃఖం కలుగుతుంది. అందువల్ల జగత్తును మిథ్యగా అర్థం చేసుకుంటే, జీవితం బరువుగా అనిపించదు, వరంగా ఆనందిస్తాను.

సర్వభూతస్థం ఆత్మానం – నేనే అన్ని శరీరాల్లోనూ ఆత్మగా ఉన్నాను అని తెలుసుకుంటాను.

4. **బ్రహ్మవిద్యా ప్రాముఖ్యత** – బ్రహ్మవిద్య ఒక్కటే మోక్షమార్గం అని చూశాము. జ్ఞానమార్గం అనేక మార్గాలలో ఒకమార్గం కాదు. అది ఒక్కటే మార్గం. **న అన్యేన హేతునా.**

**ఆత్మానమరణిం కృత్వా । ప్రణవం చోత్తరారణిమ్ ।**

**జ్ఞాననిర్మథనాభ్యాసాత్ । పాశం దహతి పండితః ॥** 11

వేదాంత విచారణ ఈ మంత్రం నుంచీ మొదలవుతుంది. వేదాంత విచారణ లేదా మహావాక్య విచారణ సాధనలు మూడు అని చూశాము. అవి శ్రవణ, మనన, నిదిధ్యాసనలు. మామూలుగా వేదాంత విచారణ ఇదే వరుసక్రమంలో జరుగుతుంది. కాని ఈ ఉపనిషత్తులో ముందు నిదిధ్యాసనం చూశాము. ఇప్పుడు శ్రవణ, మననాలు చూస్తాము.

మొహం చూసుకోవాలంటే అద్దంలో చూస్తాము. ఆత్మను చూసుకోవాలంటే శాస్త్రమనే అద్దంలో చూడాలి. అద్దంలో దేన్ని చూస్తున్నాము? ముఖాన్ని. అందువల్ల దర్పణ దర్శనం = ముఖ దర్శనం. అలాగే శాస్త్ర దర్శనం = ఆత్మ దర్శనం. శాస్త్రవిచారణ అంటే శ్రవణ, మననాలు చేయటం. శ్రవణం అంటే ఒక క్రమపద్ధతిలో క్రమం తప్పకుండా కొన్ని సంవత్సరాల పాటు ఒక సమర్థవంతమైన గురువు వద్ద శాస్త్రాన్ని అధ్యయనం చేయటం అని చూశాము. దీనికి శ్రద్ధపదం వచ్చింది రెండవ మంత్రంలో.

ఈ శాస్త్ర విచారణ ఒక్కోసారి ఏదైనా దృష్టాంతం ద్వారా జరుగుతుంది. కఠోపనిషత్తులో రథకల్పన చూస్తాము. ఇక్కడ అరణి మథనం దృష్టాంతం చూస్తాము. యజ్ఞంలో వెలిగించే అగ్నిని ఏదో ఒక విధంగా వెలిగించ కూడదు. సాక్షాత్తూ సూర్యభగవానుని కిరణాలనుంచే భూతద్దం ద్వారా అగ్నిని సృష్టించాలని శాస్త్రాలు చెపుతున్నాయి. అలా కుదరని పక్షంలో శాస్త్రాలే ఇంకో మార్గాన్ని సూచిస్తున్నాయి. దాన్ని అరణి మథనం అంటారు.

రెండు చెక్కలను ఒక పద్ధతిలో మథిస్తే, ఆ రాపిడికి నిప్పురవ్వలు వస్తాయి. అవి కూడా ఏ చెక్కలు వాడాలో, ఎలా చేయాలో శాస్త్రం సూచిస్తుంది. కిందభాగం చెక్కని అధో అరణి అంటారు. దాన్ని అశ్వద్ధవృక్షం నుంచి తయారుచేస్తారు. ఈ చెక్క మధ్యలో ఒక చిన్న గుంట ఉంటుంది. దాన్ని కదలకుండా ఉంచి, దానిలో ఇంకో పొడవైన చెక్కను కవ్వంలా ఉంచి చిలుకుతారు. దాన్ని ఉత్తర అరణి అంటారు. దాన్ని శమీవృక్షం నుంచి తయారుచేస్తారు. యజమాని పై చెక్కను కవ్వంలా ఉంచి చిలుకుతాడు. వాటి మధ్య ఘర్షణ వల్ల అగ్ని పుడుతుంది. ఆ అగ్నిని హోమకుండంలో వేస్తారు. వేదాంత విచారాన్ని అరణి మథనంతో పోలుస్తున్నది ఉపనిషత్తు.

**జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్ కురుతే తథా।** – గీత

ఈ దృష్టాంతాన్ని ఆధారంగా తీసుకున్నాడు కృష్ణపరమాత్మ. అగ్నిని జ్ఞానంతో పోలుస్తారు కాబట్టి పొద్దున్న లేవగానే దీపం వెలిగించాలి అంటారు. దీపం జ్ఞానానికి సంకేతం. అది మన అంతిమలక్ష్యం అవ్వాలి. దీపంతో ఎందుకు జ్ఞానాన్ని పోలుస్తారు? ఒక వస్తువును ఇంకొక వస్తువుతో పోల్చినప్పుడు వాటిమధ్య సామాన్యధర్మం ఒకటి ఉండాలి. ఇక్కడ రెండు సామాన్య ధర్మాలున్నాయి.

1. **దహనశక్తి** – అగ్ని చీకటిని నాశనం చేస్తుంది. జ్ఞానాగ్ని అజ్ఞానాన్ని నాశనం చేస్తుంది.

2. **ప్రకాశకశక్తి** – చీకటికి ఆవరణశక్తి ఉంది. అంటే అక్కడ ఉన్న వస్తువును చీకటి కప్పేస్తుంది. ఉన్న వస్తువు కనపడకపోతే, అది ఉన్నా లేనట్టే. ఆ వస్తువును మనం వాడలేము. అంటే అగ్ని వెలుగులో చీకటి నాశనం అవుతుందని చూశాము కదా! చీకటి తొలిగేసరికి అక్కడ లేనట్టుగా ఉన్న వస్తువు వచ్చినట్టుగా ఉంటుంది.

అలాగే జ్ఞానం అజ్ఞానాన్ని నాశనం చేస్తుందని చూశాము. అజ్ఞానమనే చీకటి, ఉన్న వస్తువును కప్పేస్తోంది. ఏమిటది? ఆత్మను. మనం ఆనంద స్వరూపులమనే విషయాన్ని అజ్ఞానం కప్పేస్తోంది. అందువల్ల మనం దాని

వల్ల కలిగే ఫలాన్ని అనుభవించలేకపోతున్నాము. మనం ఆనంద స్వరూపులం అని తెలియక, బాహ్యంగా ఆనందం వెతుక్కుంటున్నాము. మనం పూర్ణులం అని తెలియక, ఏదో కొరత ఉంది అనుకుంటున్నాము. శాంతి, భద్రత, ఆనందాలు మనలోనే ఉన్నాయని తెలియక సంసారంలో పడి కొట్టుమిట్టాడుతున్నాము. జ్ఞానమనే అగ్ని వెలిగిస్తే, అజ్ఞానం తొలగు తుంది; అజ్ఞానం తొలిగితే అజ్ఞానం వల్ల కప్పబడిన మన అసలు స్వరూపం తెలుస్తుంది. లేనట్టుగా ఉన్న ఆత్మ కొత్తగా వచ్చినట్టుగా ఉంటుంది. దానివల్ల సంసారం నాశనమవుతుంది.

ఆ విధంగా అగ్ని చీకటిని నాశనం చేసి, అక్కడ ఉన్న వస్తువులను ప్రకాశింపజేస్తే, జ్ఞానాగ్ని అజ్ఞానాన్ని నాశనం చేసి, ఆత్మస్వరూపాన్ని తెలియజేస్తుంది. ఈ నేపథ్యంతో మంత్రాన్ని చూద్దాము.

**ఆత్మానం అరణిం కృత్వా –** ఆత్మ అంటే ఇక్కడ శిష్యుని యొక్క మనస్సు. శిష్యుని మనస్సు కింద చెక్కలా అంటే క్రింద అరణిలా, గట్టిగా, కదలకుండా ఉండాలి. మనస్సు రాగద్వేషాలకు లోనుకాకూడదంటే వైరాగ్యంతో నిండివుండాలి. కదలకుండా ఉండాలంటే మనస్సు నిశ్చలంగా ఉండాలి. పాఠం నేర్చుకునేటంతసేపూ మనస్సు దానిమీద ఏకాగ్రత చూపాలి, చలించ కూడదు. అంటే శిష్యునికి చిత్తశుద్ధి, చిత్తస్థైర్యం ఉండాలి.

**ప్రణవం చ ఉత్తర అరణిం –** ప్రణవం అంటే ఓంకార మంత్రం. ప్రణవ విచారణ చేస్తే ఆత్మజ్ఞానం పొందుతామని కఠోపనిషత్తులోనూ, మాండూక్యోపనిషత్తులోనూ వస్తుంది. ఓంకారంలోని అకార, ఉకార, మకారాలను వరుసగా జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలతో పోల్చి, సాక్షి చైతన్యం అవస్థాత్రయ సాక్షి అని నిరూపిస్తుంది ఉపనిషత్తు. వేదాంత విచారణకు మహావాక్య మంత్రాలను కూడా వాడవచ్చు. అందువల్ల ప్రణవం అంటే ఓంకారం, మహావాక్యం, ఉపనిషత్ మంత్రం అని చెప్పవచ్చు. అంటే ఉపనిషత్ మంత్రాలు ఉత్తర అరణిలాగా పనిచేస్తాయి. మథనం చేస్తూనే ఉండాలి. అంటే శ్రవణం, చేస్తూనే ఉండాలి. మథనం ఎవరు చేస్తారు? గురువు చేస్తాడు, సంసిద్ధమైన మనస్సుతో ఉన్న శిష్యునికి చేస్తాడు.

**జ్ఞాన నిర్మథనం** – నిశ్చయేన మథనం అభ్యాసాత్ – నిర్మథనం అంటే చిలకటం. వేదాంత పరిభాషలో విచారణ చేయటం. ఉదాహరణకు ఒక మహావాక్యాన్ని తీసుకోండి. **తత్త్వమసి.** అందులోని త్వం పద విచారణ, తత్‌పద విచారణ, అసి పదవిచారణ చేయాలి. ఆ పదాల వాచ్యార్థం కాకుండా, లక్ష్యార్థం ద్వారా శుద్ధచైతన్యంగా జీవ, ఈశ్వర ఐక్యం చూపాలి. అభ్యాసాత్ అంటే చేస్తూనే ఉండాలి. స్వామీజీ బోధ కొన్నాళ్ళు విన్నాక శిష్యులు వెళ్ళి ఆయనకు చెపుతారట, 'స్వామీజీ, ఇప్పుడు మీరు బాగా చెపుతున్నారు.' వాళ్ళు బాగా నేర్చుకుంటే అంతే చాలు అని ఆ మాటలను పట్టించుకోరు స్వామీజీ. అసలు రహస్యమేమిటంటే వాళ్ళు పదేపదే వినటం వల్ల, ఆ బోధ వాళ్ళలో బాగా జీర్ణించుకుని, స్వామీజీ మాటల ప్రభావం వాళ్ళ మీద పడుతుంది. అప్పుడు బాగా అర్థమవుతుంది. బాగా అర్థమయ్యేసరికి బాగా చెప్పినట్టు అనిపిస్తుంది.

శ్రవణం దశలో జ్ఞానమనే నిప్పురవ్వలు రేగుతాయి. వాటిని జాగ్రత్తగా కాపాడకపోతే అవి చల్లారిపోతాయి. ఒక చిన్న కుటుంబసమస్య వచ్చినా, ఆ అగ్ని చల్లారిపోతుంది. ఆ చిన్న నిప్పురవ్వలు, పెద్ద అగ్నిజ్వాలలా మండాలంటే దానిని మననమనే విసినకర్రతో విసరాలి. స్వామీజీ బోధ వారానికి ఒకసారి ఉంటుంది. అది విని, బయటకు వచ్చి చెప్పులు వేసుకున్నాక మర్చిపోతే లాభం లేదు. ఆ మధ్యలో మననం చేయాలి. ఆ బోధను పదేపదే గుర్తు తెచ్చుకోవాలి. తర్వాత నిదిధ్యాసనం చేయాలి. నిదిధ్యాసనం ద్వారా మన పాత వాసనలను పారద్రోలాలి. పాత వాసనలను పారద్రోలటమంటే త్రిపుటి నుంచి ద్విపుటికి రావాలి.

త్రిపుటి అంటే నేను జీవుడిని, ఈ జగత్తు నన్ను బాధిస్తోంది అని ఈశ్వరునికి మొరపెట్టుకోవటం. వేదాంతానికి రాకముందు మన పరిస్థితి అది. ఇప్పుడు వేదాంత విచారణ చేశాక ద్విపుటి అంటే ఉన్నవి రెండే అని తెలుసుకోవటం. అవి ఆత్మ, అనాత్మ. అనాత్మకు విడిగా ఉనికి లేదు కాబట్టి అది ఉన్నా లేనట్టే. అంటే ఉన్నది ఒకటే. అది ఆత్మ. అంతవరకూ నేర్చుకుని ఆగితే అది చాలదు. దాన్ని జ్ఞానం అంటారు.

ఆ ఆత్మను నేనే అని అర్థం చేసుకోవాలి. దాన్ని విజ్ఞానం అంటారు. కాకపోతే ఆ నేను ఎవరో సరిగ్గా అర్థం చేసుకోవాలి. నేను అంటే మనశ్శరీరాలు కాదు, నేను అంటే ఆత్మ లేదా సాక్షిచైతన్యం.

శ్రవణంలో ఆత్మజ్ఞానం పొందుతాము; మననంలో నిశ్చయజ్ఞానం లేదా సంశయరహిత జ్ఞానాన్ని పొందుతాము; నిదిధ్యాసనంలో జ్ఞాననిష్ఠలో నిలబడతాము. శ్రవణంలో పూర్తిగా గురువు చెపుతాడు, శిష్యుడు వింటాడు; మననంలో శిష్యుడు గురువును కాని, ఎవరినైనా కాని అడిగి తెలుసుకుని, సంశయాలు తీర్చుకుంటాడు; నిదిధ్యాసనంలో పాత వాసనలు పోగొట్టుకుని జ్ఞాననిష్ఠలో ఉండాలి కాబట్టి అది పూర్తిగా శిష్యునిదే బాధ్యత. ఈ మూడు దశలూ పాటిస్తే గురువు వెలిగించిన అగ్ని జ్వాలలా మండుతుంది. అటువంటి జ్ఞానం వల్ల కలిగే ఫలమేమిటో కూడా ఇక్కడ చూస్తాము.

**పండితః** – జ్ఞాననిష్ఠలో నెలకొన్న శిష్యుడు. ఇటువంటి జ్ఞానిని స్థిత ప్రజ్ఞుడని (రెండవ అధ్యాయంలో), పరాభక్తుడని (పన్నెండవ అధ్యాయంలో), గుణాతీతుడని (పధ్నాలుగవ అధ్యాయంలో) కృష్ణపరమాత్మ పేర్కొన్నాడు. అతనేం చేస్తాడు?

**పాశం దహతి** – పాశాలన్నిటినీ జ్ఞానాగ్నిలో దహించివేస్తాడు. మొట్ట మొదటిగా అతను సమర్పించే ఆహుతి అవిద్య. ఆ తర్వాత అహంకార, మమకారాలు. వాటి వెనక కర్తృత్వ, భోక్తృత్వ, ప్రమాతృత్వాలు. తర్వాత సంచిత, ఆగామి, ప్రారబ్ధకర్మలు దహించివేస్తాడు. చివరికి త్రిపుటిని నాశనం చేస్తాడు. వీటన్నిటినీ కలిపి పాశం లేదా బంధం అంటారు. జీవితంలో మనను ఈ పాశాలే పట్టి బంధిస్తాయి. ఈ బంధాలే సంసారం. జీవితం భారంగా అనిపిస్తే నేను సంసారంలో పడి కొట్టుమిట్టాడుతున్నట్టు. జ్ఞానం పొందిన శిష్యుడు, ఈ పాశాలన్నిటినీ జ్ఞానాగ్నిలో దహింపజేస్తాడు.

**యథైధాంసి సమిద్ధోఽగ్నిః భస్మసాత్కురుతేఽర్జున ।**

**జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా ॥** – గీత 4.37

ఓ అర్జునా! ప్రజ్వలించుచున్న అగ్ని సమిధలను భస్మము చేసినట్లు

జ్ఞానమను అగ్ని కర్మల నన్నింటిని భస్మమొనరించును.

ఈ శ్లోకానికి భావాన్ని ఈ మంత్రం నుంచే తీసుకున్నాడు కృష్ణపరమాత్మ. ఆత్మజ్ఞానాన్ని తరచు అగ్నితో పోలుస్తారు మన శాస్త్రంలో. ముందే చూసినట్టుగా అగ్నికి దహనశక్తి, ప్రకాశకశక్తి ఉన్నాయి. ఇక్కడ అగ్ని యొక్క దహనశక్తిని చూస్తాము. ఈ రెండు అంశాలనూ భగవద్గీతలో ఐదవ అధ్యాయంలో చూస్తాము.

**జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశితమాత్మనః ।**
**తేషామాదిత్యవత్ జ్ఞానం ప్రకాశయతి తత్పరమ్ ॥** – గీత 5.16

ఆ విధంగా బ్రహ్మవిద్యా విచారణ చేస్తే సంసారం నాశనమయి, బ్రహ్మ జ్ఞానం కలుగుతుంది. రాబోయే మంత్రాల్లో ఈ విచారణ చూస్తాము.

**12 – 22 మంత్రాలు – వేదాంత విచారణ**

వేదాంతంలో సృష్టిని తరచు స్వప్నప్రపంచంతో పోలుస్తారు. ఎందుకంటే స్వప్నప్రపంచానికీ, జాగ్రద్‌ప్రపంచానికీ మధ్య అనేక పోలికలు ఉన్నాయి. జాగ్రత్తగా చూడండి – జాగ్రద్ ప్రపంచం కల అనటం లేదు; రెండు ప్రపంచాలకీ పోలికలు ఉన్నాయి అంటున్నాము. వాటి మధ్య వ్యత్యాసాలు కూడా ఉన్నాయి. కాని, ఇప్పుడు మనం విషయం అర్థం చేసుకోవటానికి పోలికలనే చూస్తాము కాని వ్యత్యాసాలను చూడము. అతను స్తంభంలా ఉన్నాడు అంటే అతను స్తంభంలా జడంగా, చలనం లేకుండా, గుండ్రంగా ఉన్నాడని కాదు అర్థం. ఎలా ఒక స్తంభం ఒక భవంతికి ఆధారమో, అలా అతను అతని సంస్థకు ఆధారం అని అర్థం. అలాగే ఇక్కడ జాగ్రద్, స్వప్న ప్రపంచాల మధ్య పోలికలను ఎందుకు చూస్తున్నామంటే, జాగ్రద్ ప్రపంచం కూడా మిథ్య అని చూపించటానికి.

జాగ్రద్‌పురుషుడనైన నేను నిద్రలో ఒక స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తాను. నిద్రాశక్తి అధీనంలో నేను ఉన్నప్పుడు, నా మనోవాసనల ద్వారా స్వప్నాన్ని సృష్టించే శక్తి వస్తుంది నాకు. ఇలా ఒక స్వప్నప్రపంచాన్ని సృష్టించే శక్తిని **విక్షేపశక్తి** అంటారు.

ఇలా స్వప్నప్రపంచాన్ని సృష్టించాక నేను జాగ్రద్‌ప్రపంచాన్ని వదిలి స్వప్నప్రపంచంలోకి అడుగుపెడతాను. ఎప్పుడైతే స్వప్నప్రపంచాన్ని అనుభవించటానికి స్వప్నప్రపంచంలోకి అడుగుపెడతానో, అప్పుడే నేను జాగ్రద్‌ప్రపంచానికి దూరమవుతాను. జాగ్రద్ పురుషుడిని అనే విషయాన్ని విస్మరించి, తాత్కాలికంగా స్వప్నంలో సృష్టించిన స్వప్నశరీరాన్ని ధరించి స్వప్నపురుషుడిని అవుతాను. అంటే నేను స్వప్నప్రపంచపు సృష్టికర్త హోదాను పోగొట్టుకుని, స్వప్నంలో ఒక జీవిని అవుతాను. ఈ మార్పు కూడా నిద్రాశక్తి వల్లనే అవుతుంది. దీన్ని **ఆవరణశక్తి** అంటారు. ఆ విధంగా నిద్రకు రెండు శక్తులున్నాయి. నిద్ర ద్వారా స్వప్నప్రపంచం సృష్టిస్తాను, స్వప్నపురుషుడిని అవుతాను. ఆ విధంగా సృష్టికర్త నుంచి జీవుడిని అవుతాను.

ఎప్పుడైతే స్వప్నంలో ఒక జీవుడిని అవుతానో అప్పుడే నా జాగ్రదావస్థను మర్చిపోతాను. స్వప్నప్రపంచపు సృష్టికర్తను నేను అని మర్చిపోతాను. స్వప్నప్రపంచం మిథ్య అని మర్చిపోతాను. నిజానికి స్వప్నంలో వస్తువులేమీ లేవు. అవి నా ఆలోచనలు మాత్రమే. స్వప్నంలో కనపడే ప్రతి ఒక్క వస్తువు, ప్రతి ఒక్క వ్యక్తి కూడా మిథ్యే. అవి నా వాసనలు మాత్రమే. కాని మిథ్యా వస్తువులను నేను సత్యం అనుకుంటున్నాను. నిద్రయొక్క ఆవరణశక్తి ఈ నిజాన్ని కప్పివేస్తోంది. నిద్ర లేచాక కాని నాకు భిన్నంగా వేరే ప్రపంచం లేదు, నేనే దాన్ని సృష్టించాను అని తెలియదు.

**పశ్యన్నాత్మని మాయయా బహిరివ ఉద్భూతం యథా నిద్రయా –**

దక్షిణామూర్తి స్తోత్రం

ఆ విధంగా ఆ స్వప్నప్రపంచం నాకు భిన్నంగా లేదు. నాకు హాని కలుగజేయలేదు అనే విషయం నేను మర్చిపోతాను. ఈ ఆవరణశక్తి వల్ల, స్వప్నం యొక్క స్వప్నత్వం, జాగ్రద్ పురుషుని యొక్క జాగ్రదత్వం – రెండూ కప్పబడిపోతాయి. **కల** కనే వ్యక్తికి, **కల**లో ఉన్నంతవరకూ, **కల** ఒక **కల** అని తెలియదు. లేచాకే కల అని తెలుస్తుంది. ఇది అందరికీ వర్తిస్తుంది. ఇది కల అని తెలిసి కల కనరు. కలలో ఉన్నంతసేపూ అది నిజం.

ఈ సమస్యకు ఒకటే పరిష్కారం. **స్వప్నప్రపంచం నుంచి లేవటమే.** మీ పక్కన పడుకున్న వ్యక్తి పులి నన్ను వెంటాడుతోంది, రక్షించండి, రక్షించండి అని కేకలు వేస్తుంటే, తుపాకి తేవటానికి పరిగెడతారా? లేదే! అతన్ని కుదిపి నిద్ర లేపుతారు. కాని కలలో ఉన్న వ్యక్తికి అది అసలు సిసలు సమస్యగానే కనిపిస్తుంది. అలాగే మనకు గురువు, జ్ఞానం వల్లనే మోక్షం వస్తుంది, ఈ ప్రపంచం నుంచి లేవండి అంటే మనం అతన్ని నమ్మము. జ్ఞానం అంటే ఒకస్థాయి సత్యం నుంచి ఇంకొకస్థాయి సత్యానికి ఎదగటం.

నేను స్వప్నం నుంచి లేవగానే, నా విక్షేపశక్తి, ఆవరణశక్తి మటుమాయ మవుతాయి. ఒకవేళ నేను లేచాక కూడా కలగనటం కొనసాగించ గలిగితే, అది ఒక సినిమా చూస్తున్నట్టుగా ఉంటుంది. నానుంచే అన్నీ వస్తున్నాయి, నాలోనే లయమవుతున్నాయి అని తెలుస్తుంది.

**మయ్యేవ సకలం జాతం మయి సర్వం ప్రతిష్ఠితమ్**

అప్పుడు అది కల జీవన్ముక్తి అవుతుంది.

ఈ విశేషాలను మళ్ళీ టూకీగా చూస్తే –

1. నేను జాగ్రద్ పురుషుడిని. నేను నా నిద్రకున్న విక్షేపశక్తి వల్ల ఒక స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తాను.
2. నేను ఆ స్వప్నప్రపంచంలోకి అడుగుపెట్టాక నిద్రకున్న ఆవరణశక్తి వల్ల నేను సృష్టికర్తను, జాగ్రద్‌పురుషుడిని అనే విషయం మర్చిపోయి, అందులోని బాధాతప్తజీవిని అనుకుంటాను.
3. కల ఒక కల అని తెలియక, నా అసలు స్వరూపం మర్చిపోయి, కలలో దారుణమైన సంసారాన్ని అనుభవిస్తాను.
4. దీనికి పరిష్కారం నిద్ర నుంచి లేవటమే.

ఇప్పుడు ఇదే సూత్రాలను జాగ్రద్‌ప్రపంచానికి అన్వయించమంటున్నది వేదాంతం. జాగ్రద్‌ప్రపంచం ఒక మహానిద్ర అంటున్నది వేదాంతం.

1. నేను బ్రహ్మను. నా మాయాశక్తికున్న **విక్షేపశక్తి** వల్ల నేను జాగ్రద్ ప్రపంచాన్ని సృష్టించాను.
2. నేను ఈ జాగ్రద్ ప్రపంచంలోకి అడుగుపెట్టాక, మాయాశక్తికున్న **ఆవరణశక్తి** వల్ల, నేను సృష్టికర్త బ్రహ్మను అనే విషయం మర్చిపోయి, అందులోని బాధాతప్త జీవిని అనుకుంటున్నాను.
3. ఈ జాగ్రద్ ప్రపంచం ఒక మహానిద్ర అయిన మాయ వల్ల సృష్టించ బడింది అని తెలియక, నా అసలు స్వరూపం మర్చిపోయి, జాగ్రద్ ప్రపంచంలో దారుణమైన సంసారాన్ని అనుభవిస్తున్నాను.
4. దీనికి పరిష్కారం మహానిద్ర నుంచి లేవటమే. అంటే నా ఉన్నత స్థాయికి లేవటమే లేదా స్వరూపాన్ని తెలుసుకోవటమే.

స్వప్నాన్ని ప్రాతిభాసికసత్యం అంటారు. జాగ్రద్ ప్రపంచాన్ని వ్యావహారిక సత్యం అంటారు. నా ఉన్నతస్థాయిని పారమార్థికసత్యం అంటారు. స్వప్నమనే ప్రాతిభాసిక సత్యం నుంచి వ్యావహారికసత్యానికి లేస్తే, స్వప్నం పెట్టే సంసారం నుంచి విముక్తి పొందుతాము. అలాగే జాగ్రద్ ప్రపంచమనే వ్యావహారికసత్యం నుంచి పారమార్థికసత్యానికి ఎదిగితే ఈ సంసారం నుంచి విముక్తులౌతాము.

**ఆత్మజ్ఞానమహానిద్రా జృంభి తేస్మిన్ జగన్మయే**

**ధీర్ఘస్వప్నే స్ఫురన్త్యేతే స్వర్గమోక్షాది విభ్రమాః – అద్వైతమకరందం**

జాగ్రద్‌ప్రపంచాన్ని దీర్ఘస్వప్నం అంటుంది. అంటే స్వప్నం అల్పస్వప్నం అవుతుంది. ఈ దీర్ఘస్వప్నంలో నేను ఉండటం వల్ల త్రిపుటిలో ఉండి, సంసారంలో కొట్టుమిట్టాడుతున్నాను. నేను పరమాత్మ అనే విషయం మర్చిపోయి, జీవాత్మ అనుకుంటున్నాను. కైవల్యోపనిషత్తు దీన్నించి లేవండి అంటున్నది. వేదాంతజ్ఞానాన్ని ఎలా పొందాలో చెప్పింది ముందు – **వేదాంతవిజ్ఞాన సునిశ్చితార్థాః**

బ్రహ్మస్వరూపమేమిటో చెప్పింది ముందు – **అచిన్త్యమవ్యక్తమ్ ఏకమ్**

బ్రహ్మజ్ఞానాన్ని పొందితే కలిగే ఫలమేమిటో సూచించింది –

**జ్ఞాత్వా తం మృత్యుమ్ అత్యేతి.** ఇప్పుడు వీటిని వివరంగా చూస్తాము.

> **స ఏవ మాయా పరిమోహితాత్మా ।**
> **శరీరమాస్థాయ కరోతి సర్వమ్ ॥**
> **స్త్రియన్నపానాది విచిత్రభోగైః ।**
> **స ఏవ జాగ్రత్ పరితృప్తిమేతి ॥** 12

**సః ఏవ ఆత్మా** – నేను పరమాత్మకు భిన్నంగా లేను. ఆత్మ అంటే నా అసలు స్వరూపం.

**మాయా పరిమోహిత** – మహానిద్ర అయిన మాయ యొక్క శక్తి వల్ల,

**శరీరం ఆస్థాయ** – ఈ శరీరం నేను అనుకుంటున్నాను. బ్రహ్మ అయిన నేను నా మాయకున్న విక్షేపశక్తి వల్ల ఈ జగత్తును, ఈ శరీరాన్ని సృష్టించాను. అందులోకి అడుగుపెట్టాక, నా మాయకున్న ఆవరణశక్తి వల్ల నన్ను అజ్ఞానం ఆవరించింది. మాయయొక్క మహానిద్రలో నేను శరీరంలోకి అనుప్రవేశం చేసిన విషయం మర్చిపోయాను. అందువల్ల నేను నా పరమాత్మస్థాయిని మర్చిపోయి, జీవాత్మను అనుకుంటున్నాను.

**సర్వం కరోతి** – నా పరమాత్మ స్థాయిని మర్చిపోయి, ఈ జాగ్రద్ ప్రపంచం ఒక మహాస్వప్నం అని మర్చిపోయి, జీవాత్మగా వ్యవహారాలు నడుపుతున్నాను. ఈ జాగ్రద్ప్రపంచంలో జరిగే వ్యవహారాలను మహాస్వప్న వ్యవహారాలంటారు. ఆ వ్యవహారాలేమిటో తర్వాత పాదంలో చూస్తాము.

**స్త్రీ అన్న పానాది విచిత్ర భోగైః** – స్త్రీ అంటే భార్య. ఎప్పుడైతే నేను శరీరంతో మమేకం చెందుతానో, అప్పుడే నేను ఒక వ్యక్తిని అనుకుంటాను. పెళ్ళి చేసుకుని భార్యతో గృహస్థుగా జీవనం గడుపుతాను. అన్నపానాదులను ఏర్పరచుకుంటాను. స్త్రీ అంటే ఒక్క భార్యే కాదు. తక్కిన అన్ని అనుబంధాలు కూడా వస్తాయి. వీటివల్ల అనేక విచిత్రమైన భోగాలను అనుభవిస్తాను. అంటే సుఖదుఃఖాలను అనుభవిస్తాను. నేను ఏర్పరచుకున్న బంధాలతో యాంత్రికంగా జీవనం గడుపుతాను. ఇదొక మహాస్వప్నమని మర్చిపోతాను. నేనెవరు, ఎక్కడ్నుంచి వచ్చాను లాంటి ప్రశ్నలే ఉదయించవు నాలో.

**కస్త్వం । కోఽహమ్ । కుత ఆయాతః । కామే జననీ । కో మే తాతః।**

**నువ్వెవరు? నేనెవరు? ఎక్కడ్నుంచి వచ్చాను. నా తల్లి ఎవరు? నా నాన్న ఎవరు?**

**స ఏవ** – జీవాత్మ వేషంలో ఉన్న ఆ పరమాత్మ అయిన నేను.

**జాగ్రత్ పరితృప్తి మేతి** – జాగ్రదవస్థలో పొందే అనుభవాలతోనే తృప్తి పొందుతున్నాను.

ఉన్న ఆత్మ ఒకటే – **ఆప్నోతి సర్వం ఇతి ఆత్మ.** కాని అది ఒక ఉపాధిగా ప్రతిబింబించ బడినప్పుడు, రెండుగా కనిపిస్తుంది. ఉదాహరణకు విద్యుచ్ఛక్తి ఒకటే అయినా ట్యూబ్‌లైటులో ఎక్కువగా ప్రకాశిస్తే, జీరోవాల్ట్ బల్బులో తక్కువగా ప్రకాశిస్తుంది. అలాగే ఆత్మ ఈ శరీరంలో ప్రతిబింబించ బడినప్పుడు జీవాత్మ అవుతుంది; ఉత్కృష్ట ఉపాధిలో ప్రతిబింబించ బడినప్పుడు పరమాత్మ అవుతుంది. జీవాత్మ, పరమాత్మల్లో సమానంగా ఉన్నది ఆత్మ. జీవ, పరమ అనే విశేషణాలు మారుతాయి అంతే.

నీరు ఇంకొక ఉదాహరణ. నామరూపాల దృష్ట్యా చూస్తే చిన్న అల, పెద్ద సముద్రం. అల కార్యం, సముద్రం కారణం అవుతాయి. అదే నీటి పరంగా చూస్తే నీరు చిన్న అలలోనూ ఉంది, పెద్ద సముద్రంలోనూ ఉంది. అంటే నీరు కార్యకారణ విలక్షణం. అలాగే చైతన్యాన్ని కూడా మాధ్యమాల ద్వారా చూస్తే వ్యష్టిలో జీవాత్మ, సమష్టిలో పరమాత్మ. జీవాత్మ కార్యం, పరమాత్మ కారణం. కాని చైతన్యపరంగా లేదా ఆత్మపరంగా చూస్తే అది కార్యకారణ విలక్షణం.

నేను నా స్వరూపం చైతన్యం అని ఆవరణశక్తి వల్ల మర్చిపోయి, జీవాత్మ అనుకుంటున్నాను. నేను శరీరం అనుకుంటున్నాను. నేను శరీరంలో ఉన్నాను అనుకోకుండా నేనే శరీరం అనుకుంటున్నాను. నేను ఇంటిలో ఉన్నాను అనే దానికీ, నేనే ఇల్లు అనుకోవటానికీ తేడా ఉందా లేదా? నేను శరీరం అనుకోవటం వల్ల నేను కర్తా, భోక్తా అనుకుంటున్నాను.

నిజానికి నేను ఆత్మగా అకర్తా, అభోక్తా. కాని ఆ విషయం మర్చిపోయి నేను కర్తా, భోక్తా అనుకుంటున్నాను. భగవంతుడు ధర్మసంస్థాపనార్థం తెలిసి కిందకు వస్తే, దాన్ని అవతారం అంటారు. భగవంతుడు జీవాత్మగా అనుప్రవేశం చేసి, ఆవరణశక్తి వల్ల జీవాత్మగా కిందకు పడిపోతే దాన్ని సంసారం అంటారు. స ఏవ – పరమాత్మ అయిన నేను **మాయా పరిమోహితాత్మ –** మాయాశక్తిలో పడిపోయి, శరీరాన్ని నాకు పరికరంగా వాడాల్సింది పోయి, నేనే శరీరం అనుకుంటున్నాను. ఒక్కముక్కలో చెప్పాలంటే అవస్థాత్రయ సాక్షిచైతన్యం అయిన నేను అవస్థాత్రయంలో తిరుగుతున్నాను. ఇప్పుడు ఈ మంత్రంలో జాగ్రదావస్థను చూశాము. తర్వాత వచ్చే మంత్రంలో స్వప్నావస్థను చూస్తాము.

**స్వప్నే స జీవః సుఖదుఃఖభోక్తా ।**
**స్వమాయయా కల్పితజీవలోకే ।**
**సుషుప్తికాలే సకలే విలీనే ।**
**తమోఽభిభూతః సుఖరూపమేతి ॥** 13

**సః (ఏవ) జీవః –** మహానిద్ర మాయలో ఉన్న జీవాత్మ, ఇప్పుడు రెండవ నిద్ర అయిన అల్పనిద్రలోకి అడుగు పెడుతోంది.

**స్వప్నే –** స్వప్నప్రపంచంలోకి అడుగు పెడుతోంది. అంటే వ్యావహారిక ప్రపంచం నుంచి ప్రాతిభాసిక ప్రపంచంలోకి అడుగు పెడుతోంది. మనస్సు విసీపిలా పనిచేస్తుంది. అంటే జాగ్రదావస్థలో మనస్సులో రికార్డు చేసిన వాటిని, స్వప్నంలో సృష్టిస్తుంది. అందువల్ల స్వప్నంలో కూడా ఇదే కథ.

**సుఖదుఃఖభోక్తా (భవతి) –** జాగ్రద్ ప్రపంచంలో జీవాత్మగా నేను ఎలా సుఖదుఃఖాలను అనుభవిస్తానో, అలా స్వప్నంలో కూడా సుఖదుఃఖాలను అనుభవిస్తాను. అక్కడ కూడా భార్య, పిల్లలు, సమస్యలు అన్నీ ఉంటాయి. కాకపోతే అక్కడ ఈశ్వరసృష్టి లేదు. నేను రెండు ఛానెళ్ళు మార్చిమార్చి చూస్తాను. ఈశ్వరుడు సృష్టించిన జగత్తు, నేను సృష్టించిన జగత్తు.

**స్వమాయయా కల్పిత జీవలోకే** – స్వప్నప్రపంచాన్ని ఎలా సృష్టిస్తాను? **స్వమాయయా** – నా యొక్క నిద్రాశక్తి వల్ల. ఇంతకుముందు చూశాము మాయకు విక్షేపశక్తి, ఆవరణశక్తి ఉన్నట్టే, నా నిద్రాశక్తికి కూడా విక్షేపశక్తి, ఆవరణశక్తి ఉన్నాయి. నా విక్షేపశక్తి వల్ల నేను నా స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తాను. జాగ్రద్ ప్రపంచంలో ఎదురైన అనుభవాలు వాసనల రూపంలో నా మనస్సులో నిక్షిప్తమై ఉంటాయి. ఆ వాసనల ద్వారా స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తాను. అది నాకే స్వంతం. వేరే ఎవరికీ కనపడదు. ఆఖరికి నా పక్కన పడుకున్న వ్యక్తి కూడా నా స్వప్నంలోకి తొంగిచూడలేడు. అందుకని స్వప్నాన్ని **జీవలోకే** అన్నారు.

నేను స్వప్నం సృష్టించాక, అందులోకి ప్రవేశిస్తాను. అందులోకి ప్రవేశించగానే నా నిద్రాశక్తి యొక్క ఆవరణశక్తి వల్ల నేను సృష్టికర్తను అని మర్చిపోతాను. అందులో ఒక జీవిగా వ్యవహరిస్తాను. స్వప్నంలో ఉన్న వ్యక్తికి స్వప్నంలో ఉన్నంతసేపూ స్వప్నం ఒక స్వప్నం అని తెలియదు. అతను స్వప్నంలో ఉండగా రక్షించండి, రక్షించండి, పులి నన్ను వెంటాడుతున్నది అని అరిస్తే, మనం కర్ర తీసుకువెళ్ళి లాభం లేదు. పక్కమీద ఉన్న అతను నిద్రలో చూసిన పులిని మనం చూడలేము. దానికి పరిష్కారం ఒక్కటే. దాన్నించి అతన్ని నిద్ర లేపటమే!

ఇప్పుడు జగత్తులో ఉన్న మనం అది నిజమనుకుని మన జీవితాన్ని, పులి తరిమినట్టుగా భయపడుతున్నాము. ఇక్కడా అదే పరిస్థితి. ఇంకొక వ్యక్తి కర్ర పట్టుకుని వస్తే లాభం లేదు. ఒక గురువు వచ్చి మనను ఈ మహానిద్ర నుంచి లేపాలి. వ్యావహారికసత్యం నుంచి పారమార్థిక సత్యానికి తీసుకువెళ్ళాలి. పారమార్థికసత్యం అంటే అద్వైతస్థితి.

**అహరహర్ బ్రహ్మ గమయతి**

ఆ అద్వైతస్థితిని సుషుప్తిలో రోజూ అనుభవిస్తున్నాము. బృహదారణ్యకోపనిషత్తులో, స్వయంజ్యోతి బ్రాహ్మణం అని ఉంది. అందులో మోక్షం ఎలా ఉంటుందో చూపించటానికి సుషుప్తిని ఉదాహరణగా తీసుకుంది

ఉపనిషత్తు. సుషుప్తిలో నేను అద్వైతాన్ని, నేను ఆనందాన్ని. కాకపోతే నేను అద్వైతాన్ని అని నేను లేచాక కాని తెలియదు. అదికాక నేను లేవగానే మాయ యొక్క విక్షేపశక్తి, ఆవరణశక్తి మళ్ళీ నన్ను ఆక్రమిస్తాయి.

**సుషుప్తికాలే** – రెండు ఛానెల్స్ చూసి అలసిపోయాక, అంటే జాగ్రదావస్థలో ఈశ్వరసృష్టిని అనుభవించాక, స్వప్నావస్థలో జీవసృష్టిని అనుభవించాక, నేను అలసిపోయి, సుషుప్తిలోకి జారుకుంటాను. అప్పుడు ఏమవుతుంది?

**సకలే విలీనే** – అన్నీ సుషుప్తిలో లయమవుతాయి. అన్నీ అంటే ఈశ్వర సృష్టి ప్రపంచం, జీవసృష్టి ప్రపంచం; శరీరం, మనస్సు, ఇంద్రియాలు; ప్రమాత, ప్రమాణం, ప్రమేయం అన్నీ. విలీనం అంటే అవి నాశనమవవు, అవ్యక్తంలోకి వెళతాయి. ఎలా తెలుసు? పొద్దున్నే మళ్ళీ నిద్ర లేస్తాను కాబట్టి. లయమయితే ఏమవుతుంది?

**తమోఽభిభూతః** – పూర్తిగా అజ్ఞానంతో కప్పబడతాయి. సుషుప్తిలో అపరావిద్య లేదు, పరావిద్య లేదు. పూర్తి అజ్ఞానమూ ఆనందదాయకమే, పూర్తి జ్ఞానమూ ఆనందదాయకమే. అందువల్ల సుషుప్తిలో ఆనందం అనుభవిస్తాము; పూర్తి జ్ఞానం పొందిన జ్ఞాని కూడా ఆనందాన్ని అనుభవిస్తాడు. జాగ్రద్, స్వప్నావస్థలలోనే సగం అజ్ఞానంలో ఉంటారు.

ఇంగ్లీషులో **ఐ యామ్ బ్రహ్మ** అంటే 'ఐ' చిత్ అంశను, యామ్ సత్ అంశను, బ్రహ్మ ఆనంద అంశను సూచిస్తుంది. మనకు ఐ యామ్ తెలుసు కాని, బ్రహ్మ తెలియదు అంటే మన సత్, చిత్ అంశాలు తెలుసు కాని, మనం ఆనందస్వరూపులమని తెలియదు. ఆనందస్వరూపలమని తెలియదని ఎలా తెలుసు? దిగులుగా ఉన్న మొహం చూస్తే తెలుస్తుంది.

**సుఖరూపమేతి** – సుషుప్తిలో అజ్ఞానంతో నిండటం వల్ల, ఆనందాన్ని అనుభవిస్తాము. కాని ఆనందాన్ని అనుభవిస్తున్నట్టు సుషుప్తిలో ఉండగా తెలియదు. అందువల్ల జీవాత్మ మూడు అవస్థలలోనూ సంసారాన్ని అనుభవిస్తుంది.

**పునశ్చ జన్మాంతరకర్మయోగాత్ ।**

**స ఏవ జీవః స్వపితి ప్రబుద్ధః ॥**

**పురత్రయే క్రీడతి యశ్చ జీవః ।**

**తతస్తు జాతం సకలం విచిత్రం ॥**

**ఆధారమానందమఖండబోధం ।**

**యస్మిన్ లయం యాతి పురత్రయం చ ॥** 14

సుషుప్తిలో జీవాత్మ గాఢనిద్ర పోయినా; మహాస్వప్నం నుంచి అల్పస్వప్నం నుంచి ఉపశమనం పొందినా, అది తాత్కాలికమే. దాన్నించి లేవక తప్పదు. శాశ్వతనిద్ర అంటూ లేదు. మరణాన్ని కూడా దీర్ఘనిద్ర అంటారు. ఎందుకు? మరణం తర్వాత ఇంకొక శరీరంలో లేవక తప్పదు జీవాత్మకు. ఈ నిద్ర నుంచి లేపేదెవరు? జన్మాంతర కర్మలు అంటున్నది ఉపనిషత్తు. జీవాత్మ చేసుకున్న పుణ్యపాపాల వల్ల ఒక దేహం పొందింది. ఆ పుణ్యపాపాలు క్షయమవాలంటే రెండు ఉండాలి. దేహం, బాహ్యప్రపంచం. సుషుప్తిలో ఈ రెండూ లయమవుతాయని చూశాము. అందువల్ల జాగ్రదావస్థలోనో, స్వప్నావస్థలోనో ఉండాలి.

**పునశ్చ** – మళ్ళీ; **స ఏవ జీవః** – నిద్రపోతున్న జీవాత్మ. ఈ జీవాత్మ ఎవరో కాదు పరమాత్మే అని చూశాము.

**స్వపితి** – స్వప్నప్రపంచంలోకి అడుగు పెడుతుంది. స్వప్నం పశ్యతి ఇతి స్వపితి. స్వప్నాన్ని అల్పస్వప్నం అంటారని; దీన్ని జీవసృష్టి అంటారని చూశాము. ఇందులో మనస్సు సగం విచ్చుకుని ఉంటుంది. అర్ధవికాసం అంటారు.

**ప్రబుద్ధః** – లేదా మహాస్వప్నంలోకి లేస్తాడు. అంటే జాగ్రదావస్థలోకి వస్తాడు. అంటే ఈశ్వరసృష్టి ప్రపంచాన్ని చూస్తాడు. మామూలుగా చెప్పాలంటే సుషుప్తి నుంచి స్వప్నంలోకి వెళతాడు లేదా మేలుకుంటాడు. వేదాంత పరిభాషలో అల్పస్వప్నంలోకి లేదా మహాస్వప్నంలోకి వెళతాడు. ఏ స్వప్నంలోకి ఎప్పుడు వెళ్ళాలి అని ఎవరు నిర్ణయిస్తారు?

**జన్మాంతర కర్మయోగాత్** – జన్మాంతర అంటే పూర్వజన్మ. కర్మ అంటే పుణ్యపాపకర్మలు. పూర్వజన్మలో చేసుకున్న పుణ్యపాపకర్మలు ఏ స్వప్నంలోకి ఎప్పుడు వెళ్ళాలో నిర్ణయిస్తాయి. మొదటి జన్మకు పూర్వజన్మ లేదు కదా అనే సందేహం రావచ్చు. కాని సృష్టిని ఒక వృత్తంతో పోలుస్తారు. వృత్తానికి ఆది, అంతాలు ఉండవు. అది అనాది అవుతుంది. ఈ వృత్తాన్ని ఛేధించటానికి ఒకటే మార్గం. లక్షణంగా ఆత్మజ్ఞానం పొంది మోక్షం పొందటమే. లేకపోతే అవస్థాత్రయాలలో తిరుగుతూ, జన్మజన్మలు పొందుతూ ఉండక తప్పదు.

అల్పస్వప్నానికీ, మహాస్వప్నానికీ మధ్య రెండు ముఖ్యమైన భేదాలున్నాయి.

1. **నిద్ర లేవటం** – అల్పస్వప్నంలో నిద్రనుంచి లేవటం సహజంగా జరిగిపోతుంది. స్వప్నం నుంచి లేవటానికి నేనేమీ సాధన చేయనవసరం లేదు. నేను కర్మయోగం, ఉపాసనయోగం, శ్రవణ, మననాలు లాంటివి ఏమీ చేయనసవరం లేదు. నా ప్రారబ్ధకర్మ క్షయమయితే స్వప్నంనుంచి లేస్తాను. ఎందుకంటే నేను ఎటువంటి కలను కనాలో, ఎంతసేపు కలను కనాలో నా ప్రారబ్ధకర్మ నిర్ణయిస్తుంది. పాపప్రారబ్ధకర్మ ఎక్కువ ఉంటే పీడకలలు వస్తాయి; పుణ్యప్రారబ్ధకర్మ ఎక్కువ ఉంటే మంచికలలు వస్తాయి. అందువల్ల స్వప్నప్రారబ్ధం ఎప్పుడు ముగిస్తే అప్పుడు స్వప్నం నుంచి లేస్తాను.

కాని మహాస్వప్నంలో అలాకాదు. నేను ప్రయత్నపూర్వకంగా లేవకపోతే మహాస్వప్నం నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. నేను అల్పస్వప్నంలోకి, సుషుప్తిలోకి జారుకున్నా కూడా, మళ్ళీ మహాస్వప్నంలోకి వస్తాను. అందువల్ల మహాస్వప్నం నుంచి మేలుకోవటానికి ప్రయత్నం చేయాలి.

**ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్య వరాన్ నిబోధత** – కఠ 1.3.14

లేవండి, మేలుకోండి అంటున్నది ఉపనిషత్తు. అంటే మనం స్వప్నంలో ఉన్నామని స్పష్టమవుతున్నది.

ఎలా మేలుకోవాలి? ఉపనిషత్తు స్పష్టంగా చెపుతున్నది. నా పరమాత్మ స్వరూపాన్ని తెలుసుకోవాలి అంటున్నది. అది కూడా శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ

అయిన గురువు దగ్గర వేదాంత విచారణ చేసి తెలుసుకోవాలి. వేదాంత విచారణ అంటే శ్రవణ, మనన, నిదిధ్యాసనలు. దానికి ముందు కర్మ, ఉపాసనలు చేయాలి. అంటే మహాస్వప్నం నుంచి మహాజాగ్రదావస్థకు రావాలంటే కర్మచేసి చిత్తశుద్ధి పొంది, ఉపాసన చేసి చిత్తఏకాగ్రత పొంది, జ్ఞానానికి వచ్చి గురువు ద్వారా శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి.

2. **ప్రపంచం ఉనికి –** స్వప్నప్రపంచంలో ఉన్నంతసేపూ, స్వప్నప్రపంచం స్వాప్నికుడిని బాధిస్తుంది. అతను సృష్టికర్త అని తెలియక, అందులో ఒక జీవిగా బాధపడతాడు. కాని, నిద్రలేచాక, అది నిజం కాదనీ, స్వప్నమనీ తెలుసుకుంటాడు. అంటే నిద్రాశక్తి యొక్క విక్షేపశక్తి, ఆవరణశక్తి రెండూ మటుమాయమవుతాయి. నిద్ర నుంచి లేచాక, స్వప్నప్రపంచం నానుంచే పుట్టి, నాలోనే స్థితి పొంది, నాలోనే లయమవుతుంది అని తేలికగా చెప్పగలను. స్వప్నప్రపంచంలోని వస్తువులు, మనుష్యులు నా మనస్సులోని వాసనల వల్ల వచ్చిన ఊహాజనితమైనవని అర్థమవుతుంది. ఈ జ్ఞానం కలగగానే, స్వప్నప్రపంచం ఇంక ఏమాత్రం బాధ కలిగించదు.

కాని మహాస్వప్నం విషయంలో అలాకాదు. నిద్రనుంచి లేవగానే అల్ప స్వప్నం ముగిసినట్టుగా, ఆత్మజ్ఞానం పొంది మహానిద్ర నుంచి లేచినా కూడా ఈ జాగ్రద్ప్రపంచం మటుమాయమవదు. అంటే మాయ యొక్క ఆవరణశక్తి మాయమవుతుంది కాని విక్షేపశక్తి మాయమవదు. అంటే నా అజ్ఞానం తొలుగుతుంది కాని, విక్షేపశక్తి వల్ల ఏర్పడిన జాగ్రద్ప్రపంచం తొలగదు. కాని ఈ జాగ్రద్ప్రపంచం మహాస్వప్నం అని తెలుసుకోవటం వల్ల జీవన్ముక్తి పొందుతాను. ఈ మహాస్వప్నాన్ని మహాస్వప్నంగా తెలుసుకుంటాను. ఆ విధంగా ఈ మహాస్వప్నం మాయమవకపోయినా, దాని మిథ్యాత్వం తెలుస్తుంది. ఎప్పుడైతే నేను నా ఉన్నతస్థితి అయిన మహాజాగ్రద్ పురుషుడిని అని తెలుసుకుంటానో అప్పుడింక ఈ జాగ్రద్ప్రపంచం నన్ను బాధించదు.

**పురత్రయే క్రీడతి యః చ జీవః –** ఈ జీవాత్మ, మహానిద్ర మాయలో పడి, మూడు అవస్థల్లో పడి కొట్టుమిట్టాడుతున్నది.

మూడు పురాలను మూడు అవస్థలుగా తీసుకోవచ్చు. జాగ్రదావస్థ (మహాస్వప్నం), స్వప్నావస్థ, సుషుప్తి అవస్థ. ఈ జీవాత్మ ఎవరో కాదు– మహానిద్ర మాయలో పడ్డ పరమాత్మే అని గుర్తుంచుకోవాలి.

ప్రతిజీవీ ఒక శివుడు. శివుడు ఎలాగైతే తన మూడవకన్ను తెరిచి మూడు పురాలను దహించాడో, అలా ప్రతిజీవుడూ తన మూడవకన్ను అయిన జ్ఞాననేత్రం తెరిచి, అజ్ఞానకారణమైన మూడు అవస్థలను దగ్ధం చేయాలి.

ఉన్నట్టుండి ఉపనిషత్తు వ్యష్టి నుంచి సమష్టికి మారింది. దీన్నిబట్టి జీవాత్మ, పరమాత్మలు వేరు కాదు, ఒకే ఆత్మ యొక్క రెండు రూపాలని తెలుస్తుంది. ఒక నాటకంలో రాజుగాను, బీదవానిగాను వేషం వేస్తున్న వ్యక్తి మధ్యలో గ్రీన్‌రూమ్‌లోకి వెళ్ళి వేషం మార్చుకు వచ్చినట్టుగా, ఒకే ఆత్మ వేషం మార్చుకుంటున్నది. ఆ భేదం ఉపాధి భేదం వల్ల కలుగుతున్నది. వ్యష్టి ఉపాధిలో జీవాత్మగా ఉన్నప్పుడు కార్యం అయితే, సమష్టి ఉపాధిలో పరమాత్మగా ఉన్నప్పుడు కారణం అవుతుంది. కాని నిర్గుణ ఆత్మ ఏమిటి? శుద్ధ చైతన్యం.

**కార్యకారణ విలక్షణ బ్రహ్మ**

**తతః తు** – సమష్టి ఉపాధిలో ఉన్న (ఇది మనం కలుపుకోవాలి) అదే ఆత్మనుంచి;

**సకలం విచిత్రం జాతం**– మొత్తం సృష్టి వచ్చింది. మహానిద్ర నుంచి లేవగానే, నేను జ్ఞానిని అవుతాను. వేదాంత పరిభాషలో మహాజాగ్రద్ పురుషుడిని అవుతాను. జ్ఞాని కానివారు అల్పస్వప్నంలోనో, మహాస్వప్నంలోనో, సుషుప్తిలోనో తిరుగుతూ ఉంటారు. ఈ మంత్రం మహావాక్య మంత్రం.

ఈ జీవాత్మ వేరే ఎవరో కాదు– సాక్షాత్తూ ఆ పరమాత్మే. అంటే ఏకాత్మ. ఏకాత్మ ఎవరు? మహానిద్ర, అల్పనిద్రల మాయనుంచి బయటపడినది. నేను అల్పనిద్ర నుంచి తేలిగ్గా బయటపడగలను; కాని మహానిద్ర నుంచి బయటపడాలంటే వేదాంతం యొక్క ఐదు సూత్రాలను జీర్ణించు కోవాలి.

1. నేను సర్వవ్యాపకమైన చైతన్యాన్ని
2. శాంతి, ఆనందం, భద్రతలు పొందే మార్గాన్ని నేనే
3. కేవలం నా ఉనికి వల్లే నా భౌతిక శరీరానికి జీవం ఏర్పడి, ఈ జగత్తులో వ్యవహారం నడుపగలుగుతున్నది
4. ఈ జగత్తులో ఏం జరిగినా అది నాకు అంటదు
5. నా అసలు స్వరూపాన్ని నేను మర్చిపోయి నా జీవితాన్ని భారంగా చేసుకుంటున్నాను. జ్ఞానయోగమనే విలువిద్యను సరిగ్గా సాధన చేసి, జీవితాన్ని ఒక ఆటగా మలుచుకుంటాను.

**ఆధారం** – జీవాత్మ అయిన పరమాత్మ, అంటే ఏకాత్మ, సృష్టి కారణమే కాదు. స్థితి కారణం కూడా.

**యస్మిన్ పురత్రయం లయం యాతి చ** – యస్మిన్ అంటే ఏకాత్మ అయిన నాలో పురత్రయాలు లయమవుతాయి. త్రయం అంటే మూడుగా ఉన్నవన్నీ తీసుకోవచ్చు.

మూడు అవస్థలు – జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలు

మూడు లోకాలు – భూలోక, భువర్లోక, సువర్లోకాలు

మూడు శరీరాలు – స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు

మూడు ప్రపంచాలు – స్థూల, సూక్ష్మ, కారణ ప్రపంచాలు

ఆ విధంగా ఏకాత్మ అయిన నేను సృష్టి స్థితి లయ కారణాన్ని. కాని నిర్గుణబ్రహ్మగా చూస్తే ఇవేవీ కాదు.

**అఖండబోధం** – నేను శుద్ధచైతన్యాన్ని, నిర్గుణబ్రహ్మను. నేను కార్యం కాదు, కారణం కాదు. నాకు త్రిగుణాలు లేవు. నా స్వరూపం ఏమిటి?

**ఆనందం** – ఆనందాన్ని వేదాంతంలో హ్యాపీనెస్‌గా అనువదించకూడదు. ఆనందం అంటే అనంతం, పూర్ణత్వం. నాకు కొరత లేదు, కోరికలు లేవు.

నేను స్వప్నంలో ఉండగా, స్వప్న ప్రపంచాన్ని అనుభవిస్తున్న ఒక జీవిని. నేను స్వప్నం నుంచి లేచాక మొత్తం పరిస్థితి తారుమారు అవుతుంది.

నేను స్వప్నప్రపంచంలో ఉన్నాననే బదులు స్వప్నప్రపంచం నాలో ఉంది అంటాను. అలాగే మహానిద్ర నుంచి లేస్తే నేను జాగ్రద్ప్రపంచంలో ఉన్నాననే బదులు జాగ్రద్ప్రపంచం నాలో ఉంది అంటాను.

**పురత్రయే క్రీడతి యశ్చ జీవః** – నేను మూడు అవస్థల్లో తిరుగుతాను.

**యస్మిన్ పురత్రయం లయం యాతి చ** – నాలో మూడు అవస్థలు లయమవుతాయి.

నేను జీవాత్మ అనే అజ్ఞానంలో ఉంటే నేను మూడు అవస్థల్లో తిరుగుతాను, నేను పరమాత్మను అని తెలుసుకుంటే నాలో మూడు అవస్థలు లయమవుతాయి. కాకపోతే ఆ నేను అనేది ఎవరో ఎన్నడూ మర్చిపోకూడదు. నేను శరీరం కాదు, ఇంద్రియాలు కాదు, మనస్సు కాదు, నేను సాక్షి చైతన్యాన్ని. జీవాత్మలో జీవఉపాధి, పరమాత్మలో పరమఉపాధి తీసేస్తే నేను ఆత్మను. శుద్ధచైతన్యాన్ని. ఆ విధంగా జీవాత్మ అయిన నేను, పరమాత్మ ఒకటే. **ఇది భాగత్యాగలక్షణం.**

**ఏతస్మాజ్జాయతే ప్రాణో మనః సర్వేన్ద్రియాణి చ।**
**ఖం వాయుర్జ్యోతిరాపశ్చ పృథ్వీ విశ్వస్య ధారిణీ॥** 15

అక్షరాలా ఇదే మంత్రం ముండకోపనిషత్తులో కూడా వస్తుంది. ఈ మంత్రంలో సృష్టి ప్రకరణం వస్తుంది. మొత్తం సృష్టికాదు. ముఖ్యమైనవి మాత్రం చెప్పబడ్డాయి. సృష్టి చేసినది బ్రహ్మ+మాయ అయిన ఈశ్వరుడు అన్న విషయం గుర్తుంచుకోవాలి. సృష్టిని స్వప్న ప్రపంచంతో పోలుస్తుంది శాస్త్రం. చేతనమైన మనం, అచేతనమైన మన మనసుతో స్వప్న ప్రపంచాన్ని సృష్టిస్తాము. అలాగే చేతనమైన బ్రహ్మ, అచేతనమైన మాయతో జాగృత్ ప్రపంచాన్ని సృష్టిస్తాడు. మన స్వప్నం మన కర్మల మీద ఆధారపడి ఉంటే, జాగృత్ ప్రపంచం– సమష్టి కర్మల మీద ఆధారపడి ఉంది. ముందు రెండవ పాదం చూద్దాం.

**ఖం వాయుర్జ్యోతిరాపశ్చ పృథ్వీ–** వరుసక్రమంలో ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, భూమి అన్నీ ఈశ్వరుడి నుంచి ఉద్భవించాయి. అవి కూడా

రెండు దశల్లో – సూక్ష్మ పంచభూతాలు, స్థూల పంచభూతాలు. స్థూల పంచభూతాల విషయం చూస్తే –

| | |
|---|---|
| పంచభూతాలు | – పంచేంద్రియాలు |
| ఆకాశం | – శబ్దం |
| వాయు | – శబ్దం, స్పర్శ |
| అగ్ని | – శబ్దం, స్పర్శ, రూపం |
| నీరు | – శబ్దం, స్పర్శ, రూపం, రసం |
| భూమి | – శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం |

అన్నింటిలోకీ ఆకాశం సూక్ష్మమైనది. భూమి స్థూలమైనది. భూమి పూర్తిస్థాయి వ్యక్తరూపంలో ఉంది. పంచేంద్రియాల ద్వారా భూమిని గ్రహించవచ్చు.

**విశ్వస్య ధారిణీ** – భూమికి విశేషణం ఇది. జీవరాసులన్నింటిని అది ధరిస్తోంది. భూమి ఎంతో అద్భుతమైనది కాని మనం దానిని పట్టించుకోము.

ముందు సూక్ష్మ పంచభూతాలు ఏర్పడ్డాయి. అవి స్థూల పంచభూతాలు అయ్యేముందు పంచీకృతం అవుతాయి. అంటే ఉదాహరణకు భూమిని తీసుకుంటే భూమిలో సగం మేరకు భూమి ఉంటుంది. మిగతా సగంలో తక్కిన నాలుగుభూతాల మిశ్రమం ఉంటుంది. అంటే తక్కిన నాలుగు భూతాల్లోంచి ఎనిమిదోవంతు కలుస్తాయి. అవన్నీ కలిసి ఒక సగం అవుతాయి.

దీనివల్ల ఆకాశం కూడా కార్యం అని తెలుస్తోంది. ప్రళయంలో అది కూడా లేదు. కాలతత్వం కూడా ఈశ్వరుని నుంచే వచ్చింది. ఇప్పుడు మొదటి పాదంకి వెళదాము. సూక్ష్మశరీరంలో ఉన్న అంశాల వివరణ వస్తుంది ఇందులో.

**ప్రాణో మనః సర్వేన్ద్రియాణి చ** – ప్రాణః అంటే పంచప్రాణాలు, మనః అంటే నాలుగు అంతఃకరణాలు. సర్వేంద్రియాణి చ అంటే పంచ

జ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు. మొత్తంగా దశ ఇంద్రియాలు, పంచప్రాణాలు, నాలుగు అంతఃకరణాలు ఉద్భవించాయి.

పంచభూతాలు మాయ నుంచి పుట్టాయి కాబట్టి, మాయలో ఉన్న లక్షణాలు వీటికి కూడా ఉంటాయి. కారణం నుంచి పుట్టిన కార్యానికి కారణలక్షణాలు ఉంటాయన్నది సూత్రం.

ఆ మూడు గుణాలు సత్త్వ, రజ, తమో గుణాలు. సత్త్వగుణంలో నేర్చుకునే శక్తి, రజోగుణంలో పనిచేసే శక్తి, తమోగుణంలో విశ్రాంతి తీసుకునే శక్తి ఉంటాయి. మన జీవితమంతా మనం ఈ మూడింటిలో ఏదో ఒకటి, మార్చి మార్చి నిరంతరం చేస్తూనే ఉంటాము. జీవితమంతానేర్చుకుంటూ, పనిచేస్తూ, విశ్రాంతి తీసుకుంటూ గడుపుతాము. కొందరిలో ఒక్కొక్కటి కొంచెం ఎక్కువగానూ, తక్కిన రెండూ తక్కువగానూ ఉంటాయి.

మనకు ఈ శక్తి ఎక్కడ్నుంచి వచ్చింది? మాయాశక్తి నుంచి. మాయకు శక్తినెవరు ఇచ్చారు? బ్రహ్మ. బ్రహ్మ ఎవరు? శుద్ధ చైతన్యం. ఎలా ఇచ్చాడు? సంకల్పం చేత – ఒక అయస్కాంతం తాను కదలకుండా, తన దగ్గరికి ఇనుప ముక్కలను ఆకర్షించినట్టుగా, బ్రహ్మ ఉనికి వల్లనే మాయ శక్తిని పొంది ఈ జగత్తును సృష్టించింది. కర్మ సిద్ధాంతం వల్ల సృష్టించింది. ప్రళయంలో అన్నీ మాయలో లయమవుతాయి. మాయ కూడా బ్రహ్మలో లయమవుతుంది. స్వప్న ప్రపంచం మనలో ఎలా లయమవుతుందో అలా జాగృత్ ప్రపంచం బ్రహ్మలో లయమవుతుంది.

మొదటి సృష్టి ఎప్పుడు జరిగింది? సృష్టి అన్నది ఒక వృత్తంలాంటిది. అవ్యక్తం నుంచి వ్యక్తంలోకి, వ్యక్తంలోంచి అవ్యక్తంలోకి మారుతూ ఉంటుంది. అందుకని సృష్టికి ఆదిలేదు. ఇంకో ప్రత్యేకత, జగత్తులో ఉండే మార్పులు, మలినాలు బ్రహ్మకు అంటవు. ఆ అసంగమైన బ్రహ్మ నువ్వే అంటుంది వేదాంతం. నీలోనే ఆ మాయ ఉంది. నువ్వే కల సృష్టించి అందులోకి వెళ్లి, నువ్వే సృష్టించినట్టు మర్చిపోయావు. అందుకని ఉత్తిష్ఠత జాగ్రత అంటుంది. ఇది ఉపనిషత్తు సారం.

సృష్టి నిజంగా జరగలేదు. ఇది పరమాత్మ కల. కాని నేను దాన్ని కలగా తీసుకోలేను అని మనమంటే వేదాంతం నీ స్వప్న ప్రపంచంలో నువ్వు ఉన్నంతసేపు నువ్వు అది నిజమనే అనుకుంటావు. కలలో పులి వేటాడితే భయపడతావు. కాని ఆ భయం ఎప్పుడు పోతుంది? ఆ కల నుంచి లేస్తే. మనం స్వప్నం నుంచి బయటకి వస్తేనే, స్వప్నం నిజం కాదని తెలుస్తుంది. అలాగే ఈ సృష్టిని పారమార్థిక స్థాయి నుంచి చూస్తే ఇది ఈశ్వర కల అని తెలుస్తుంది. పారమార్థిక స్థాయి అంటే బ్రహ్మ దృష్టి నుంచి. ఇప్పుడు మనం భ్రమ దృష్టిలో ఉన్నాము.

**16-23 మంత్రాలు - మహావాక్యాలు**

ఇవన్నీ మహావాక్య మంత్రాలు. కైవల్యోపనిషత్తు చిన్నదైనా, ఈ మహా వాక్యమంత్రాలు ఎన్నో ఉండటం వల్ల దీనికింత ప్రాముఖ్యత వచ్చింది. జీవాత్మ కార్యం, పరమాత్మ కారణం. కార్యం జీవాత్మ, కారణం పరమాత్మతో ఎలా సమానం?

## మహావాక్యవిచారణ

పంచదశిలో మహావాక్యవివేక ప్రకరణం ఉంది. అందులో మహా వాక్య నిర్వచనం వస్తుంది. మహావాక్యం అంటే ఏమిటి?

**జీవాత్మ పరమాత్మ ఐక్యబోధక వేద వాక్యం**

జీవాత్మ, పరమాత్మల ఐక్యం గురించి చెప్పే వేదవాక్యాన్ని మహావాక్యం అంటారు. ఐక్యం అనేటప్పుడు స్వరూప ఐక్యం అనాలి. ఇది చాలా ముఖ్యం. ఎందుకంటే జీవాత్మ, పరమాత్మల వాచ్యార్థం తీసుకుంటే చాలా భేదాలు ఉన్నాయి.

పూజ్యస్వామీజీ, సమీకరణం (ఈక్వేషన్) లక్షణాలను అద్భుతంగా విశ్లేషిస్తారు. ఈక్వేషన్‌కి అటూ, ఇటూ ఉన్నవి పూర్తిగా భిన్నంగా ఉంటే ఈక్వేషన్ కుదరదు. 8=9 అనలేము.

ఈక్వేషన్‌కు అటూ ఇటూ ఉన్నవి స్పష్టంగా, సమానంగా ఉంటే, ఈక్వేషన్ అవసరం లేదు.

8=8 అని మనం ప్రత్యేకించి చెప్పనవసరం లేదు.

మరి ఈక్వేషన్ ఎప్పుడు కుదురుతుంది? రెండు వైపులా చూడటానికి భిన్నంగా ఉన్నా, స్వరూపరీత్యా ఒకటే అయి ఉన్నప్పుడు కుదురుతుంది.

5+3=9-1

రెండు వైపులా చూస్తే, అవి చూడటానికి భిన్నంగా ఉన్నాయి. రెండు వైపులా ఉన్న అంకెలు వేరు; రెండు వైపులా ఉన్న గుర్తులు వేరు (+,-). కళ్ళు వాటి మధ్య ఉన్న భిన్నత్వాన్ని తెలియజేస్తాయి. కాని బుద్ధి అర్థం చేసుకుంటుంది.

5+3 = 8; 9-1 = 8.

అందువల్ల రెండింటి నుంచి వచ్చే అంకె ఒకటే. అది అక్కడ ఇవ్వక పోయినా అర్థం చేసుకుంటుంది.

ఇప్పుడు జీవాత్మ, పరమాత్మల విషయానికి వస్తే రెండూ స్పష్టంగా ఒకటే అని తెలిస్తే కర్మయోగం, ఉపాసనాయోగం, జ్ఞానయోగాలు అవసరం లేదు.జ్ఞానయోగంలో కష్టపడి శ్రవణ,మనన, నిదిధ్యాసనలు చేయనవసరం లేదు. అలాగే జీవాత్మ, పరమాత్మలు ఒకదానికొకటి పూర్తి భిన్నంగా ఉంటేనూ మహావాక్యం కుదరదు. ఎప్పుడు కుదురుతుంది? రెండూ చూడటానికి భిన్నంగా ఉన్నా, స్వరూపరీత్యా ఒకటే అయి ఉన్నప్పుడు కుదురుతుంది. ఆ స్వరూపాన్ని వివరించటానికి కష్టపడాలి. అలా నిరూపించేది మహావాక్యం. దాన్ని ఇలా అంటారని చూశాము.

**జీవాత్మ పరమాత్మ ఐక్యబోధక వేదవాక్యం**

ఇలా కూడా అనవచ్చు - **జీవాత్మ పరమాత్మ అభేదబోధక వేదవాక్యం**

వేదపూర్వభాగం, వేద అంతభాగాల్లో కూడా, ఇది తాత్పర్యం. తక్కిన వాక్యాలన్నీ దానికి సంసిద్ధం చేసే వాక్యాలు. మహావాక్యమే అంతిమ లక్ష్యం.దీని సారాంశం, ఇది మోక్షాన్నిచ్చే జ్ఞానం. ఈ ఐక్యజ్ఞానమే వేదం యొక్క తాత్పర్యం.

ఐక్యజ్ఞానమే వేదం యొక్క తాత్పర్యం అని ఎలా చెప్పగలము? అన్ని ఉపనిషత్తులూ ఐక్యం గురించే చెపుతున్నాయని నిరూపించటం ద్వారా. దానికి అవి వాడే పద్ధతులు భిన్నంగా ఉండవచ్చు. పంచకోశం, అవస్థాత్రయం, సృష్టిప్రకరణం – అలా ఏదైనా తీసుకుని నిరూపించవచ్చు. కాని 12 మంత్రాలే ఉన్న అతి చిన్నదైన మాండూక్యోపనిషత్తు నుంచి ఐదువందల పైనే మంత్రాలు ఉన్న ఛాందోగ్యోపనిషత్తు వరకూ, అన్నింటిలోనూ బోధ ఒకటే – ఇది నిరూపించటానికి మన సాంప్రదాయం నాలుగు వేదాల నుంచి ఉదాహరణకు నాలుగు మహావాక్యాలను తీసుకుంది.

| **వేదం** | **ఉపనిషత్తు** | **మహావాక్యం** |
|---|---|---|
| ఋగ్వేదం | ఐతరేయోపనిషత్తు | ప్రజ్ఞానం బ్రహ్మ |
| యజుర్వేదం | బృహదారణ్యకం | అహం బ్రహ్మ అస్మి |
| సామవేదం | ఛాందోగ్యోపనిషత్తు | తత్త్వమసి |
| అథర్వణ వేదం | మాండూక్యోపనిషత్తు | అయమాత్మా బ్రహ్మ |

ఈ నాలుగు మహావాక్యాల గురించి వినగానే, నాలుగే మహావాక్యాలు ఉన్నాయి అనుకోకూడదు. ఎన్నో మహావాక్యాలు ఉన్నాయి. అందువల్ల నాలుగు ముందు ఉదాహరణకు అనే పదం వాడాము .

**స యశ్చాయం పురుషే యశ్చాసావాదిత్యే స ఏకః – తైత్తిరీయం**

పంచదశిలో మహావాక్య వివేక ప్రకరణంలో పైన చెప్పిన వరుసక్రమంలో మహావాక్యాలను తీసుకుని, ఒక్కొక్కదాన్ని రెండేసి శ్లోకాలలో, వెరసి 8 శ్లోకాలలో వివరిస్తారు విద్యారణ్యుల వారు. ఆ నాలుగు మహావాక్యాల అర్థాలని విశ్లేషిస్తే ఈ సందేశం అర్థమవుతుంది.

| **జీవాత్మ – వ్యష్టి** | **పరమాత్మ – సమష్టి** |
|---|---|
| 1. స్థూల శరీరం | స్థూల ప్రపంచం |
| 2. సూక్ష్మ శరీరం | సూక్ష్మ ప్రపంచం |

3. కారణ శరీరం         కారణ ప్రపంచం

4. చిదాభాస         చిదాభాస

5. చిత్         చిత్

స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు ప్రతిబింబ మాధ్యమాలు. అవి ప్రతిబింబింప చేసిన ప్రతిబింబ చైతన్యం – చిదాభాస, బింబ చైతన్యం – చిత్. ఇది వ్యష్టిపరంగా. స్థూల, సూక్ష్మ, కారణ ప్రపంచాలు ప్రతిబింబ మాధ్యమాలు. అవి ప్రతిబింబింపచేసిన ప్రతిబింబ చైతన్యం చిదాభాస. బింబ చైతన్యం చిత్. ఇప్పుడు ఈ రెండింటినీ పోల్చి ఎక్కడ పోలిక ఉందో, ఎక్కడ భేదం ఉందో చూసి, ఐక్యాన్ని చక్కగా, లక్షణంగా ఒప్పుకోవాలి.

వ్యష్టికి అల్పవ్యాపిత్వం కాబట్టి వ్యష్టి మూడు శరీరాలు చిన్నవి. సమష్టి మూడు ప్రపంచాలూ చాలా పెద్దవి. అందువల్ల మూడు శరీరాలకు మూడు ప్రపంచాలతో ఐక్యం కుదరదు. భేదమే ఉంది. వ్యష్టి కారణ శరీరాన్ని అవిద్య అంటే సమష్టి కారణ ప్రపంచాన్ని మాయ అంటారు. అవిద్య వ్యష్టి యొక్క సంచిత కర్మ వల్ల వ్యష్టి తక్కిన శరీరాలను సృష్టి చేస్తే, మాయ సమష్టి సంచిత కర్మల వల్ల జగత్తును సృష్టి చేస్తుంది.

ప్రతిబింబాన్ని ప్రతిబింబింపచేసే శరీరాల్లో, అంటే ప్రతిబింబ మాధ్యమంలో భేదం ఉన్నప్పుడు, అవి ప్రతిబింబింపచేసే ప్రతిబింబాల్లో కూడా భేదం ఉంటుంది. చిన్న మాధ్యమం చిన్న ప్రతిబింబాన్ని చూపిస్తే, పెద్ద మాధ్యమం పెద్ద ప్రతిబింబాన్ని చూపిస్తుంది. జీరోవాల్ట్ బల్బ్‌కూ, హండ్రెడ్ వాల్ట్ బల్బ్‌కూ మధ్య ఉన్నంత తేడా ఉంటుంది ఈ రెండింటికీ మధ్య.

ఉన్న ఐదు అంశాల్లో నాలుగు అంశాలు భిన్నంగా ఉన్నాయి. అయినా ఐక్యం ఉంది అంటే అదృష్టం బాగుండి ఐదవ అంశం వల్ల అది సాధ్యం. కాని దురదృష్టం ఏమిటంటే మనం అది గమనించము. ఎంతసేపూ నాలుగు భేదాలనే చూస్తాము. చిత్‌ను వ్యష్టిలో సాక్షి అని, సమష్టిలో ఈశ్వరసాక్షి అని అంటాము. కాని రెండూ ఒకటే. చిత్ గుణాలు ఏమిటి? వ్యష్టిలో

చిన్న చిత్, సమష్టిలో పెద్ద చిత్ ఉన్నాయి అనకూడదు. చిత్ లేదా చైతన్యం (ఒరిజినల్ కాన్షస్‌నెస్) సర్వవ్యాపకం. దానికి భాగాలు లేవు. అందువల్ల చైతన్యాన్ని ఆకాశంతో పోలుస్తారు. **చైతన్యం అఖండం, నిరవయవం, నిష్కలం.** జీవాత్మ పరమాత్మల్లో ఉన్న చైతన్యం ఒకటే అవటం వల్ల జీవాత్మ, పరమాత్మల ఐక్యం చెప్పటం జరుగుతుంది.

ఇక్కడ ఒక ప్రశ్న ఉదయిస్తుంది. ఉన్న ఐదు అంశాల్లో నాలుగు అంశాలు భేదాన్ని సూచిస్తే ఒక్క అంశమే అభేదాన్ని సూచిస్తున్నది. ఎన్నికల్లో ఇద్దరు అభ్యర్థుల మధ్య పోటీ ఉన్నప్పుడు, నాలుగు ఓట్లు వచ్చినతను గెల్చినట్లా, ఒక్క ఓటు వచ్చినతను గెలిచినట్లా? నాలుగు ఓట్లు వచ్చిన వ్యక్తే! అలాంటప్పుడు వేదం అభేదాన్ని ఎలా తాత్పర్యంగా చెప్పగలదు? దాసోహం ఉండాలి. కాని సోహం కాదు. ద్వైతం ఉండాలి కాని అద్వైతం కాదు అని అడుగుతారు.

శంకరాచార్యులు ఈ ప్రశ్నకు జవాబుతో సిద్ధంగానే ఉన్నారు. నాలుగు అంశాలు భిన్నంగా ఉన్నాయని నేను చూడలేదనుకున్నారా అని ఎదురు ప్రశ్నిస్తారు. శంకరుల వారి జవాబు చూసే ముందు, మనం మూడు రకాల సత్యాన్ని ఒకసారి గుర్తుతెచ్చుకోవాలి. ఈ మూడు సత్యాలను గుర్తుంచుకోకపోతే, అద్వైతం పనిచేయదు. ఏమిటవి?

1. ప్రాతిభాసిక సత్యం – స్వప్న ప్రపంచం
2. వ్యావహారిక సత్యం – జాగ్రద్ ప్రపంచం
3. పారమార్థిక సత్యం – అద్వైత బ్రహ్మ

మూడుకాలాల్లోనూ ఉంటుంది పారమార్థిక సత్యం.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః**

జగత్తును వ్యావహారిక సత్యం అంటారని చూశాము. వ్యావహారిక సత్యం మూడు కాలాల్లోనూ ఉండదు. ఒక కాలంలో వచ్చి ఇంకో కాలంలో వెళ్లిపోతుంది. పైగా దానికి విడిగా ఉనికి లేదు.

మట్టి లేకుండా కుండకు విడిగా ఉనికి లేదు. అది నామరూపాత్మకం మాత్రమే. అందువల్ల దాన్ని మిథ్య అంటారు. అలాగే కారణం లేకుండా జగత్తుకు విడిగా ఉనికి లేదు. అది కేవలం నామరూపాత్మక జగత్తు. అందువల్ల దాన్ని మిథ్య అంటారు. మిథ్యను పట్టించుకోనవసరం లేదు.

నాలుగు అంశాలు కలిగియున్నా కూడా ఆ నాలుగు అంశాలూ, వ్యావహారిక స్థాయికి చెందినవి; అందువల్ల అవిమిథ్య. అవి ఎన్ని అంశాలు ఉన్నా లాభం లేదు. ఉదాహరణకు ఎగ్జిబిషన్‌లలో అద్దాల గది అని ఒక గది పెడతారు. అందులో అద్దాలు ప్రత్యేకంగా ఉంటాయి. వాటివల్ల మనం ఒకదాంట్లో మరుగుజ్జుగా, ఇంకో దాంట్లో చాలా పెద్దగా, మరో దాంట్లో బక్కపీచుగా, మరో దాంట్లో రుబ్బురోలులా, అలా అనేక ఆకారాల్లో, రూపాల్లో కనిపిస్తాము. అందులోకి సరదాగా వెళ్ళి నవ్వుకుని బయటకు వస్తాము కాని నేను మారిపోయానని బాధపడుతూ కూర్చోము. వ్యవహారం కోసం ఈ నాలుగు అంశాలనూ తీసుకుంటాము కాని, అవి మిథ్య అని మర్చిపోము.

అందువల్ల మనం అభేదం మీద దృష్టిపెట్టాలి. దీన్ని **భాగత్యాగ లక్షణం** అంటారు. కొన్ని అంశాలను పక్కన పెట్టి అవసరమైనదే తీసుకోవాలి. వేదాంత బోధను జీర్ణించుకోవటానికి మూడు దశల్లో నేర్చుకోవాలి. శ్రవణం, మననం, నిదిధ్యాసనం.

**యత్పరం బ్రహ్మ సర్వాత్మా । విశ్వస్యాయతనం మహత్ ॥**
**సూక్ష్మాత్సూక్ష్మతరం నిత్యం । తత్త్వమేవ త్వమేవ తత్ ॥** 16

ఇది కూడా మహావాక్య మంత్రం.

**యత్ పరం బ్రహ్మ** – ఉపనిషత్తులు పరమాత్మను జగత్‌కారణంగా అభివర్ణిస్తాయి.

**యతో వా ఇమాని భూతాని జాయంతే ఏన జాతాని జీవన్తి – తైత్తిరీయం**

**విశ్వస్య ఆయతనం** – సృష్టికారణమే కాదు, స్థితి కారణం కూడా. విశ్వమంతటికీ ఆధారం.

**మహత్ –** శ్రేష్ఠమైనది. విశ్వంలో ఆకాశం కూడా వస్తుంది. అందువల్ల బ్రహ్మ ఆకాశం కన్నా శ్రేష్ఠం. ఆకాశం బ్రహ్మనుంచి పుట్టి, ప్రళయంలో బ్రహ్మలో లయమవుతుంది. అందువల్ల బ్రహ్మ ఆకాశానికి కూడా ఆధారం.

**సర్వ ఆత్మ –** అది మొత్తం సృష్టికి అధిష్ఠానం. అన్ని జీవుల్లోనూ సత్, చిత్ రూపాల్లో ఉంది.

**నిత్యం –** శాశ్వతం. అంటే కాలం లయమయినా కూడా బ్రహ్మ ఉంటుంది. విశ్వం ప్రళయంలో లయమయినప్పుడు, కాలం, ఆకాశం (ప్రదేశం) కూడా లయమవుతాయి. అన్నీ కాలంలో ఉన్నాయి కాని, కాలం కూడా బ్రహ్మలో ఉంది.

ఈ సందర్భంలో కాలం, ప్రదేశం గురించి కొంచెం చూద్దాము. ప్రదేశం అంటే రెండు వస్తువుల మధ్యనున్న ఖాళీ ప్రదేశం. అందువల్ల ప్రదేశానికి ద్వైతం కావాలి. ద్వైతం లయమయితే, ప్రదేశం కూడా లయమవుతుంది. అలాగే కాలం కూడా. కాలాన్ని కూడా రెండు సంఘటనల మధ్యనున్న సమయం అంటారు. ద్వైతం లయమయిపోయి, సంఘటనలు లయమయి పోతే, కాలానికి విడిగా ఉనికిలేదు. సుషుప్తిలో ద్వైతం లేదు కాబట్టి, అందులో ప్రదేశం, కాలం కూడా లయమవుతాయి. కాలాతీత, దేశాతీత, శుద్ధ చైతన్యం మాత్రమే ఉంటుంది సుషుప్తిలో. అందువల్ల నిత్యం అంటే కాలాతీత, దేశాతీత ఆత్మ.

**సూక్ష్మాత్ సూక్ష్మతరం –** అత్యంత సూక్ష్మమైన దానికన్నా అత్యంత సూక్ష్మమైనది. శాస్త్రంలో ఒక వస్తువు యొక్క సూక్ష్మతత్వాన్ని దానికున్న గుణాల సంఖ్యను బట్టి నిర్ణయిస్తారు. ఎక్కువ గుణాలుంటే అది స్థూలతమం. ఒక్కటే గుణముంటే సూక్ష్మతమం. అంతకుముందు చూసినట్టుగా పృథివీకి ఐదు గుణాలు ఉన్నాయి కాబట్టి అది స్థూలతమం. ఆ గుణాలు తగ్గుతూ వచ్చి ఆకాశానికి ఒకటే గుణం ఉందని చూశాము. అది శబ్దగుణం అని కూడా చూశాము. అందువల్ల ఆకాశం సూక్ష్మతమం. అది ఒక్క శ్రోత్రేంద్రియానికి మాత్రమే అందుతుంది. బ్రహ్మకు ఆ గుణం కూడా లేదు. అందువల్ల అది

సూక్ష్మతమమైన ఆకాశం కన్నా సూక్ష్మం.

**అశబ్దం, అస్పర్శం, అరూపం, అరసం, అగంధం**

అందువల్ల బ్రహ్మ పంచేంద్రియ అగోచరం. దాన్ని వస్తువుగా ఏ ప్రమాణంతోనూ తెలుసుకోలేము కాబట్టి బ్రహ్మ అప్రమేయం.

వస్తువుగా ఏ ప్రమాణంతోనూ తెలుసుకోలేము అంటే అసలు బ్రహ్మ ఉందా? ఉంది అని ఖచ్చితంగా చెపుతున్నది ఉపనిషత్తు. ఉనికి ఉండి, వస్తువుగా తెలుసుకోలేనిది ఏమిటి? **తెలుసుకోగోరే నువ్వే అది. తత్ ఏవ త్వం –** ఆ (బ్రహ్మ) నువ్వే. ఈ ఉపనిషత్తు బోధిస్తున్న గురువు బ్రహ్మ అని చూశాము. చతుర్ముఖ బ్రహ్మ అన్నింటినీ ఆబ్జెక్టుగా చూసే సబ్జెక్టు అయిన నువ్వే బ్రహ్మవు అంటున్నాడు.

సబ్జెక్టుగా నేను జగత్తులో ఉన్న అన్నింటినీ చూస్తాను. నా మనశ్శరీరాలను కూడా ఆబ్జెక్టుగా చూస్తాను. వాటి ద్వారా జగత్తును చూస్తాను. అంటే మనస్సును తీసుకుంటే –

**మనస్సు ద్వారా నేను బాహ్యప్రపంచాన్ని చూస్తాను.**

**సాక్షిగా నేను మనస్సును చూస్తాను.**

అంటే మనస్సు నాకు ఒక ప్రమాణంలా పని చేస్తున్నది, మనస్సును నేను ఆబ్జెక్టుగా (ప్రమేయంగా) చూస్తున్నాను. కాని నేను ప్రమాణమూ కాదు, ప్రమేయమూ కాదు. నేను ప్రమాతను.

ఇంతకుముందు వేదాంతం యొక్క ఐదు సూత్రాలను చూశాము. ఇప్పుడు అందులో మూడవసూత్రాన్ని గుర్తు తెచ్చుకుందాము. ఏమిటది?

3. కేవలం నా ఉనికి వల్లే నా భౌతిక శరీరానికి జీవం ఏర్పడి, ఈ జగత్తులో వ్యవహారం నడుపగలుగుతున్నది.

ఈ సూత్రాన్ని మనస్సుకు కూడా వర్తింపజేస్తాము. నేను చూసే ప్రపంచాన్ని కాను, శరీరాన్ని కాదు, మనస్సును కూడా కాను. నేను సాక్షి చైతన్యాన్ని. నేను బ్రహ్మను.

**త్వం ఏవ తత్** – నువ్వే ఆ బ్రహ్మవు. ముందేమన్నాడు? ఆ బ్రహ్మవు నువ్వే అన్నాడు. ఇప్పుడు నువ్వే ఆ బ్రహ్మవు అన్నాడు. దీనికి ఎప్పుడూ చూసే ఉదాహరణ అల–సముద్రం.

**నామరూపాలతో చూస్తే అల చిన్న అల, సముద్రం పెద్ద సముద్రం**

**అధిష్ఠానం అయిన నీరుగా చూస్తే చిన్న అలా నీరే, పెద్ద సముద్రమూ నీరే.** అలాగే ఉపాధిపరంగా చూస్తే –

**జీవాత్మ – నికృష్టగుణవిశిష్ట చైతన్యం**

**పరమాత్మ – ఉత్కృష్టగుణవిశిష్ట చైతన్యం**

ఉత్కృష్టం అంటే పరమం. జీవాత్మను పరమం కాని ఆత్మ అనవచ్చు. అంటే పరమం కానిది. పరమం కానిది ఎప్పుడు? ఉపాధిపరంగా. అధిష్టానం అయిన ఆత్మగా చూస్తే నికృష్టజీవాత్మా చైతన్యమే, ఉత్కృష్టమైన పరమాత్మా చైతన్యమే.

**అహం జీవాత్మా పరమాత్మా అస్మి**

త్వమేవ తత్ అంటే సోహం అహం సః – వేదాంతంలో అహం సః ను కుదించి హంసః అంటారు. అంటే నేను ఆ పరమాత్మ.

**తత్వమేవ త్వమేవ తత్** – ఆ బ్రహ్మవు నువ్వే. నువ్వే ఆ బ్రహ్మవు అని మళ్ళీ తిరగేసి చెప్పటంలో రెండు సూక్ష్మమైన వివరణలున్నాయి.

1. కొన్ని వాక్యాలను తిరగేసి చెప్పలేము. ఉదాహరణకు **భారతదేశంలో పుట్టిన ప్రతి ఆంధ్రుడూ భారతీయుడే.** ఈ వాక్యాన్ని తిరగేసి చెప్పలేము. ప్రతి ఆంధ్రుడూ భారతీయుడు అవుతాడు కాని ప్రతి భారతీయుడూ ఆంధ్రుడు కాడు. తమిళుడు కావచ్చు, పంజాబీ కావచ్చు, గుజరాతీ కావచ్చు, మరేదైనా రాష్ట్రానికి చెందిన వాడు కావచ్చు.

2. జీవాత్మ పరమాత్మ అంటే అది అంశ, అంశి సంబంధం కావచ్చు. అంటే జీవాత్మ పరమాత్మలో ఒక భాగం అని పొరపడే అవకాశముంది. అంశ అంశి భావాన్ని నిరాకరించడం కోసం చెప్పబడింది.

ఇలా తిరగేసి చెప్పటంలో ఇంకో అంతరార్థం జీవాత్మ, పరమాత్మ పూర్తిగా ఒకటే అని చెప్పటం.

**జాగ్రత్ స్వప్న సుషుప్త్యాది । ప్రపంచం యత్ ప్రకాశతే ।**

**'తద్ బ్రహ్మాహ' మితి జ్ఞాత్వా । సర్వబంధైః ప్రముచ్యతే ॥** 17

ఇది కూడా ఒక మహావాక్య మంత్రం. నిజానికి ఈ మహావాక్య మంత్రాలన్నిటినీ నిదిధ్యాసనానికి వాడవచ్చు. నిదిధ్యాసనం అంటే నిర్వికల్ప సమాధి కాదు అని చూశాము. నిదిధ్యాసనం అంటే వేదాంతబోధలోని వేదాంత సారాన్ని తీసుకుని వాటి మీద ధ్యాస నిలపటం. నేను మహాజాగ్రద్ పురుషుడిని, నేను తండ్రిగా, భర్తగా అనేక వేషాలు వేసుకున్నాను అని నిదిధ్యాసనంలో జీర్ణించుకుంటే సంసారం నన్ను బాధించదు. లేకపోతే కష్టపడకుండా **యంబిబియస్** పొందుతాను. అంటే జీవితం **మీ**నింగ్‌లెస్, **బ**ర్డెన్‌సమ్, **బో**రింగ్ **స్ట్ర**గుల్ అవుతుంది. అంటే జీవితం అర్థంలేని, భారమైన, విసుగు పుట్టించే అవస్థ అవుతుంది. నా మహాస్వప్నం మహానిజమై కూర్చుంటుంది.

ఈ మహావాక్య మంత్రాలను ఉపయోగించి, నిదిధ్యాసనం ఎలా చేయాలి?

**తత్ బ్రహ్మ అహం** – నేను ఆ బ్రహ్మను. అంటే నేను సృష్టికర్తను, సృష్టించబడిన జీవిని కాను. ఇది ఒక మహావాక్యం. ఇందులో విభక్తి లేదు. మహావాక్యం యొక్క సాంకేతిక నిర్వచనం ఇది – విభక్తిని ఉపయోగించ కుండా జీవాత్మ పరమాత్మల ఐక్యం గురించి చెప్పేది. ఉదాహరణకు 'నేను పరమాత్మ నుంచి వచ్చాను', 'నేను పరమాత్మలో ఉన్నాను' లాంటి వాక్యాలు ఐక్యబోధక వాక్యాలు కావు. ఎప్పుడైతే ఒక విభక్తి వాడతామో అప్పుడే మనం ద్వైతాన్ని సృష్టిస్తున్నాము. **భేదక విభక్తి అభావః** మహావాక్యంలో భేదాన్ని సృష్టించే విభక్తి ఉండదు. తద్ బ్రహ్మ అహం అస్మి – ఆ బ్రహ్మను నేను.

**యత్ ప్రకాశతే** – నేను కార్యకరణ సంఘాతమైన శరీరంలో ఉన్న జీవాత్మగా, నేను వీటిని ప్రకాశింపజేస్తాను. వేటిని?

**జాగ్రత్ స్వప్న సుషుప్తి ఆది ప్రపంచం –** జీవాత్మ వేషం వేసుకున్న పరమాత్మ అయిన నేను, ప్రపంచత్రయంలో ఉన్న మూడు అవస్థలను సాక్షిగా చూస్తాను. అవి జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలు.

జాగ్రదావస్థలో మనస్సు, ఇంద్రియాల ద్వారా బాహ్యప్రపంచంతో వ్యవహారం నడుపుతుంది.

స్వప్నావస్థలో మనస్సు అంతర్ముఖమయి, వాసనల ద్వారా స్వప్న ప్రపంచాన్ని చూస్తుంది. సుషుప్తి అవస్థలో మనస్సు, ఇంద్రియాలు, శరీరంతో సహా అవ్యక్తంలోకి వెళ్ళిపోతుంది.

సుషుప్తిని మాయ అనీ, అవిద్య అనీ కూడా అంటారు. సుషుప్తిలో ఉన్న శూన్యాన్ని నేను చూస్తాను. శూన్యం అంటే నిజంగా శూన్యం కాదు. **అవ్యక్త అవస్థ** అంటుంది శాస్త్రం. ఈ మూడు అవస్థలూ అంతఃకరణ ధర్మాన్ని సూచిస్తాయి.

నేను మనస్సును, ఈ మూడు అవస్థలనూ కూడా సాక్షిగా చూస్తాను. శరీరానికి అనారోగ్యం వస్తే నాకు వచ్చినట్టు కాదు; అలాగే మనస్సుకు కోపం వస్తే నాకు కోపం వచ్చినట్టు కాదు. నేను **అవస్థాత్రయ సాక్షిచైతన్యాన్ని.** అందువల్ల సంసారంలోని అవస్థలు అవస్థాత్రయానికి చెందుతాయి కాని, సాక్షినైన నాకు కాదు. నేను సంసార విలక్షణం అనుకోగలగటం సాక్షీభావం.

**ఆది –** అవస్థలను అవస్థాత్రయం అంటారు అనీ, అవి జాగ్రత్, స్వప్న, సుషుప్తి అనీ మనకు తెలుసు. కాని ఇక్కడ ఉపనిషత్తు ఆది పదం వేసింది. ఎందుకు? అంటే వీటి మధ్యలో ఇంకో అవస్థ ఉంది.

**న బహిప్రజ్ఞం న అంతః ప్రజ్ఞం న ఉభయతః ప్రజ్ఞం – మాండూక్య**

ఉదాహరణకు సాయంకాలానికి, రాత్రికి మధ్యలో ఉన్న సమయాన్ని **సాయంసంధ్య** అంటారు. అలా ఒక్కోసారి మనం జాగ్రదావస్థకీ, స్వప్నావస్థకీ మధ్యలో ఉంటాము. ఉదాహరణకు శివరాత్రికి రాత్రంతా జాగరణ చేశాక, ప్రొద్దున్న పని చేస్తున్నప్పుడు ఏం చేస్తున్నామో మనకే తెలియని అయోమయ పరిస్థితిలో ఉంటాము.

సాక్షిగా చూసే నేను, నేను చూసే దానివల్ల అశుద్ధమవుతానా? సూర్యుడు ఎలా దేనిమీద ప్రకాశించినా, దాని మలినం ఎలా సూర్యునికి అంటదో అలా నాకు ఏ మలినమూ అంటదు.

**సూర్యో యథా సర్వలోకస్య చక్షుః**
**న లిప్యతే చాక్షుషైర్బాహ్యదోషైః।**
**ఏకస్తథా సర్వభూతాన్తరాత్మా**
**న లిప్యతే లోకదుఃఖేన బాహ్యః॥ కఠ 2.2.11**

అనుభవం దీనికి భిన్నంగా చూపిస్తుంటే, నన్నేమీ బాధించవు అని ఎలా చెప్పగలరు అంటారు కొందరు. భార్య, పిల్లలు, అధికారి ఎవరో ఒకరు మనను బాధిస్తూనే ఉంటే, నేను ఆనందస్వరూపమెలా అవుతాను అంటారు వాళ్ళు. మనం చాలాసార్లు చూశాము. నేను సాక్షిచైతన్యాన్ని, నేను ఆనందస్వరూపుడిని అంటే ఆ నేను ఎవరో ఎన్నడూ మర్చిపోకూడదు. ఈ బాధలన్నీ మనస్సుకు చెందినవి, నేను మనస్సు కాను, నా ఉన్నత స్వభావం ఆత్మ. ఇది తెలుసుకుని, మహాజాగ్రద్ పురుషుని స్థాయికి ఎదిగితే, ఇవేమీ నన్ను బాధించవు.

**ప్రకాశం చ ప్రవృత్తిం చ మోహమేవ చ పాండవ ।**
**న ద్వేష్టి సంప్రవృత్తాని న నివృత్తాని కాంక్షతి ॥ – గీత 14.22**

ఓ పాండవా! ప్రకాశం, ప్రవృత్తి, మోహం వచ్చినా జ్ఞాని బాధపడడు. అవి తొలగిపోయినా వాటిని కోరడు.

జ్ఞాని మనస్సులో కలిగే వికారాలను స్వీకరిస్తాడు. ఎందుకంటే మనస్సు మూడు గుణాలకు లోబడి ఉంటుందని అతనికి తెలుసు. అది తెలుసుకుని మనస్సు నుంచి విడవడి, దాన్ని సాక్షీభూతంగా చూస్తాడు. ఒక్కముక్కలో చెప్పాలంటే **తను బ్రహ్మను అని తెలుసుకుంటాడు**.

ఆ బ్రహ్మను నేను అంటే ఇక్కడ బ్రహ్మ అంటే సర్వవ్యాపకమైన శుద్ధ సత్. ఇంతవరకూ చైతన్యం గురించి చెప్పి ఇప్పుడు సత్ గురించి ఎందుకు చెపుతున్నది? ఎందుకంటే ఆత్మ అంటే చైతన్యం మాత్రమే అనుకుంటే,

ఆత్మకు పరిమితి ఉంది అనుకుంటాము. ఆత్మ మనస్సులోనే ఉంది అనుకుంటాము. అదే సత్ విషయానికి వస్తే సత్‌కు పరిమితి లేదు. అది సర్వవ్యాపకం. అందువల్ల నేను చిత్‌ను, నేను సత్‌ను అంటే అది జీవాత్మ పరమాత్మ ఐక్యం అవుతుంది.

ఈ ఐక్యాన్ని ఇంకోరూపంలో చెప్పాలంటే, త్రిపుటి నుంచి ద్విపుటికి రావటం. త్రిపుటిలో జీవుడు, జగత్తు, ఈశ్వరుడు ఉంటే, ద్విపుటిలో రెండే ఉంటాయి. ఆత్మ–అనాత్మ. నేను సత్–చిత్ ఆత్మను కాబట్టి, అనాత్మకు ఉనికి నానుంచే వస్తుంది. ఎలాగైతే స్వప్నప్రపంచానికి ఉనికి జాగ్రద్‌పురుషుని నుంచి వస్తుందో, అలాగే జాగ్రద్ ప్రపంచానికి ఉనికి మహాజాగ్రద్ పురుషుని నుంచి వస్తుంది. స్వయంగా ఉనికి లేని అనాత్మ మిథ్య, నేను సత్యం.

**ఇతి జ్ఞాత్వా** – ఈ ద్విపుటిని అర్థం చేసుకుని నేను సత్యం, జగత్తు మిథ్య అని నేను ఎప్పుడైతే తెలుసుకుంటానో అప్పుడు నేను అసంగసాక్షిని అవుతాను.

**సర్వబంధైః ప్రముచ్యతే** – అన్ని బంధాల నుంచి విడివడతాను. నేను నా ప్రతిబింబాన్ని అద్దంలో చూసుకుని, నా ప్రతిబింబం మీద అభిమానం పెంచుకుంటే ఏమవుతుంది? అద్దం నాశనమయితే, నా ప్రతిబింబం కూడా నాశనమవుతుంది. అద్దాన్ని నా ప్రతిబింబాన్ని చూడటానికి ఉపయోగించుకోవాలి కాని దానితో మమేకం చెందకూడదు. నేను బింబముఖాన్ని– నా ముఖం నా భుజాల మీదే భద్రంగా ఉంది.

**న జాయతే మ్రియతే వా కదాచిత్**
**నాయం భూత్వా భవితా వా న భూయః ।**
**అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో**
**న హన్యతే హన్యమానే శరీరే ॥ – గీత 2.20**

ఈ ఆత్మకు చావు, పుట్టుకలు లేవు. శరీరం చంపబడినా ఇది చావదు. నా ప్రతిబింబ చైతన్యం పోయినా, బింబచైతన్యమైన నేను ఎప్పుడూ ఉంటాను.

ఇది తెలిస్తే జీవితం ఒక ఆట. తెలియకపోతే ఒక బాధ. ఎందుకు?

తెలియకపోతే కర్మ నా విధిని నిర్ణయిస్తుంది. కర్మ వల్ల నేను ఎప్పటికీ జనన మరణాల వృత్తిలో పడి తిరుగుతూ ఉంటాను. చాలామంది భక్తితో వాళ్ళ కర్మ నుంచి తప్పించుకో గలమనుకుంటారు. భక్తితో కర్మను తప్పించు కోగలరు కాని ఎప్పుడు? భగవంతుని ద్విపుటిలోకి తీసుకువస్తే! తెలివైన భక్తుడు ఒకొక్క ప్రారబ్ధకర్మకూ భగవంతుని వేడుకోడు. ఎందుకంటే ఇది శాశ్వతమైన పరిష్కారం కాదు. ఒక సమస్య నుంచి ఇంకో సమస్యకు ప్రయాణిస్తూనే ఉంటాడు. అందువల్ల తెలివైన భక్తుడు భగవంతుడే స్వయంగా ఇచ్చిన శాస్త్రాన్ని పట్టుకుని, త్రిపుటి నుంచి ద్విపుటికి రావాలి. ఆర్తభక్తి నుంచి అర్థార్థిభక్తి నుంచి జిజ్ఞాసభక్తికి ఎదిగి దాన్నించి జ్ఞానభక్తికి ఎదగాలి.

**త్రిషు ధామసు యద్భోగ్యం । భోక్తా భోగశ్చ యద్భవేత్ ॥**
**తేభ్యో విలక్షణః సాక్షీ । చిన్మాత్రోఽహం సదాశివః ॥** 18

17వ మంత్రం వరకూ గురువు శిష్యునికి మహావాక్య ఉపదేశం చేశాడు. **తత్త్వమసి** అన్నాడు. 18 నుంచి 22 వరకు శిష్యుడు తను అందుకున్న బోధను మహావాక్యరూపంలో చెపుతాడు. **అహం బ్రహ్మ అస్మి** అంటాడు శిష్యుడు. నువ్వు బ్రహ్మవు అని గురువు చెపితే, నేను బ్రహ్మను అని శిష్యుడు అర్థం చేసుకుంటాడు. గురువు బోధను **ఉపదేశరూప మహావాక్యం** అంటే శిష్యుడు వల్లించినదాన్ని **అనుభవరూప మహావాక్యం** అంటారు. ఇందులో శిష్యుడు తను త్రిపుటి నుంచి ద్విపుటికి వచ్చానని ప్రకటిస్తాడు.

ఇదే భావాన్ని శంకరులవారు అద్భుతంగా తన అద్వైత పంచకంలో వర్ణించారు. దాన్ని అద్వైత పంచరత్నాలు అని కూడా అంటారు. ఈ ఐదు శ్లోకాలు నిదిధ్యాసన శ్లోకాలు. **అహం బ్రహ్మ అస్మి । అహం సత్యం । మద్ వ్యతిరిక్తం । సర్వం మిథ్యా । మత్తో నాన్యః కించిత్.**

నేను సత్యం. తక్కినదంతా మిథ్య. బాహ్యప్రపంచాన్ని నా మాయాశక్తి వల్ల సృష్టించాను. నేను స్వయంప్రకాశక ఆత్మను.

ఈ మంత్రంలో జీవాత్మ నిర్వచనం చూస్తాము. **తత్త్వమసి** మహావాక్యంలో **త్వం పదార్థం** సరిగ్గా అర్థం అవ్వాలి. ఒక అల నేను సముద్రాన్ని అని ఎప్పుడు చెప్పగలదు? తనను నామ, రూపంగా చూడకుండా, నీరుగా చూసినప్పుడు మాత్రమే.

సూర్యుని కాంతి ఉదాహరణ చూద్దాము. సూర్యుని కాంతిని బింబకాంతి అందాము. దాన్ని ఒకచోట అద్దం ప్రతిబింబింప చేస్తుంది. అప్పుడు అద్దం ప్రతిబింబ మాధ్యమం అవుతుంది; దాని ద్వారా ఏర్పడిన కాంతి ప్రతిబింబ కాంతి అవుతుంది.

ఈ వేదప్రతిపాదనని అర్థం చేసుకోవటానికి ఒక ఉదాహరణ చూద్దాం. ఒక చీకటి గది ఉందనుకుందాం. అందులో తలుపులు, కిటికీలు మూసి ఉన్నాయి. దీపం లేదు. కాని మనకు చీకటి గదిని వెలుగుతో నింపాలని ఉంది. మన దగ్గర టార్చ్ లైటు లేదు. అగ్గిపుల్ల కూడా లేదు. కాని ఒక అద్దం ఉంది.

ఇప్పుడు అద్దాన్ని తీసుకుంటే, దానికి స్వతహాగా ప్రకాశించే శక్తి లేదు. అంతేకాదు అది వెలుతురుని యిచ్చే వస్తువు కాదు. ప్రకాశించే వస్తువు కాదు. ఇప్పుడు మనం మన బుద్ధిని ఉపయోగించి, ఒక ప్రయోగం చేస్తాము. మనం ఆ గది తలుపునో, కిటికీనో తెరిచి, అద్దాన్ని ప్రత్యేకంగా ఒకచోట పెడతాము. పైన ఆకాశంలో ఉన్న అసలు సూర్యుడి కాంతిని అద్దంలో ప్రతిబింబించేలా పెడతాము.

ఇప్పుడు అద్దంలో సూర్యుని ప్రతిబింబం కనిపిస్తుంది. అద్దం సూర్యుని కాంతి పొందేసరికి, ఆ అద్దం కూడా ప్రకాశిస్తుంది. అదే సమయంలో, అది కాంతిని వెదజల్లే వస్తువు అవుతుంది. స్వతహాగా ప్రకాశం లేని అద్దం ప్రకాశించే అద్దం అవుతుంది. సూర్యుని ప్రకాశానికీ, అద్దం ప్రకాశానికీ మధ్య తేడా ఏమిటి? సూర్యుని కాంతి సహజమైనది అంటే బింబ సూర్యుడు, కాని అద్దాన్ని తీసుకుంటే అది అరువు తీసుకున్న కాంతితో ఇప్పుడు కొత్త హోదాని పొందింది. అది చీకటి గదిని కాంతివంతం చేసింది.

ఈ ప్రతిబింబ సూర్యకాంతిని ఎటన్నా తిప్పచ్చు, అద్దం పెట్టిన కోణాన్ని మార్చటం ద్వారా. ఈ ప్రతిబింబ సూర్యుడినుంచే పౌర్ణమిరాత్రి చంద్రుడు వెన్నెల కాంతిని యిస్తాడు. ఇందులో మనం మూడు విషయాలని గ్రహించాలి – 1. అసలు సూర్యుడు, 2. ప్రతిబింబించే మాధ్యమం, 3. ప్రతిబింబ సూర్యుడు.

ఎన్ని ప్రతిబింబ మాధ్యమాలు ఉంటే అన్ని ప్రతిబింబ సూర్యులు ఉంటారు. కాని అసలు సూర్యుడు ఎప్పుడూ ఒక్కడే.

మరి అన్ని ప్రతిబింబసూర్యులు ఉంటే, వాటి ప్రతిబింబ నాణ్యతలో ఏమైనా తేడా ఉందా? ఉంది! మాధ్యమ లక్షణాన్ని బట్టి, ప్రతిబింబ లక్షణం ఉంటుంది. చిన్న మాధ్యమం చిన్న ప్రతిబింబాన్నీ, పెద్ద మాధ్యమం పెద్ద ప్రతిబింబాన్నీ చూపిస్తాయి. ఈ ప్రతిబింబాల్లో చూడటానికి తేడా ఉన్నా, వాటిని ప్రతిబింబింప చేసే బింబ సూర్యుడు ఒక్కడే.

ఎవరన్నా వచ్చి చంద్రకాంతి, చంద్రుని నుంచి వచ్చేది కాదు, అది సూర్యకాంతి అంటే మనకు వినటానికి వింతగా ఉండవచ్చు. కాని విజ్ఞాన శాస్త్రంలోకి వెళితే, అది నిజమని తెలుస్తుంది. దీన్ని విచారణ అంటారు. మనకొక బంధువు మనీఆర్డరు పంపారనుకోండి. అది మనకెలా వస్తుంది? పోస్టుమాన్ ద్వారా వస్తుంది. అంటే పోస్ట్‌మాన్ మనకు తన సొంత డబ్బిచ్చినట్టా? కాదు. అలాగే చంద్రుడు పోస్ట్‌మాన్‌లా పనిచేస్తాడు. సూర్యకాంతిని భూమ్మీదకి రాత్రి సమయంలో చంద్రుడు ప్రసరింపజేస్తాడు.

ఇంకోమాటలో చెప్పాలంటే చంద్రుని కాంతి, నిజానికి సూర్యకాంతే. అందువల్ల ప్రతిబింబిస్తున్న సూర్యకాంతులు వాటి మాధ్యమాల తేడా వల్ల విభిన్న కాంతులని వెదజల్లుతున్నా వాటికి కాంతి నిచ్చేది సూర్యుడొక్కడే.

ఇప్పుడు ఈ ఉదాహరణని జీవ ఈశ్వర ఐక్యంకి అన్వయిద్దాము. అసలు సూర్యుడు సర్వవ్యాపకమైన చైతన్యం. మనకి ప్రతిబింబ మాధ్యమాలు రెండు ఉన్నాయి. మొదటిది శరీరత్రయం. దీన్ని చిన్న అద్దంతో పోల్చవచ్చు. రెండోది ప్రపంచత్రయం. దీన్ని పెద్ద అద్దంతో పోల్చవచ్చు.

శరీర త్రయంలో ప్రతిబింబించిన చైతన్యాన్ని జీవుడు అంటారు. ప్రపంచత్రయంలో ప్రతిబింబించిన చైతన్యాన్ని ఈశ్వరుడు అంటారు. వ్యష్టిలోని ప్రతిబింబ చైతన్యాలను వరుసగా విశ్వ, తైజస, ప్రాజ్ఞ అంటారు. సమష్టిలోని ప్రతిబింబ చైతన్యాలను విరాట్, హిరణ్యగర్భ, ఈశ్వర అంటారు. (ఇదంతా 140 పుటలోని పట్టికలో చూడవచ్చు)

పైపైన చూస్తే జీవ – ఈశ్వరుల మధ్య తేడా కనిపిస్తుంది. ఎందుకంటే ప్రతిబింబ మాధ్యమంలో తేడా ఉంది, వాటి ద్వారా కనిపిస్తున్న ప్రతిబింబాల్లో తేడా ఉంది. ఒక వ్యక్తి శరీరత్రయం వెనుకనుంచి పనిచేసే జీవాత్మశక్తి అల్పంగా కనిపిస్తుంది. అతని జ్ఞానం అల్పం. అతను ఆక్రమించే ప్రదేశం అల్పం. అదే ఈశ్వరుని విషయానికొస్తే, అతను మొత్తం ప్రపంచత్రయం ద్వారా పనిచేస్తాడు. అతను సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, సర్వవ్యాపి. ప్రకృతి శక్తులన్నీ అతనివే.

అందువల్ల పైపైన చూస్తే, జీవ ఈశ్వరుల మధ్య భేదం ఉండటమే కాదు, అవి పూర్తిగా విభిన్నంగా ఉన్నాయి, జీవుడు దాసుడైతే ఈశ్వరుడు స్వామి; జీవుడు జీవరాశి అయితే, ఈశ్వరుడు సృష్టికర్త.

వేదపూర్వభాగం అంటే వేదాల్లో మొదటి భాగం, ఈ పైపై తేడాలకి ప్రాముఖ్యతనిస్తుంది. పూజలు, యజ్ఞయాగాదులు, ప్రాయశ్చిత్తకర్మలు జీవ–ఈశ్వర భేదాన్ని దృష్టిలో పెట్టుకుని ఏర్పరచిన ప్రార్థనలు. కాని వేద అంత భాగం కొచ్చేసరికి, ఉపనిషత్తులు జీవుడిలోని చైతన్యం, ఈశ్వరుని లోని చైతన్యం రెండూ ఒకటే, అది బింబ చైతన్యం అని చెప్తాయి.

మరి ఈ తేడా ఎందుకు వచ్చింది? దాన్ని ప్రతిబింబించే మాధ్యమం వల్ల వచ్చింది. అలా జీవ ఈశ్వరులు ఒకటే చైతన్యం ప్రతిరూపాలు కాబట్టి స్వరూపరీత్యా అవి రెండూ ఒకటే. ఈ విషయాన్ని గ్రహించటమే జీవ ఈశ్వర ఐక్యజ్ఞానం అంటారు. అన్ని ఉపనిషత్తుల సారాంశం ఒకటే. అది ఈ ఐక్యత గురించి చెప్తుంది. వీటి ఐక్యత గురించి చెప్పే ఏ వాక్యాన్నైనా మహావాక్యం అంటారు. వేదాల్లో అలాంటి మహా వాక్యాలు ఎన్నో ఉన్నాయి,

కాని ఒక్కొక్క వేదం నుంచి ఒక్కొక్క మహావాక్యాన్ని ఉదాహరణ కింద తీసుకుంటారని ఇంతకు ముందే చూశాము. ఈ నేపథ్యంతో మంత్రాన్ని చూద్దాము.

**అహం సాక్షీ (అస్మి)** – నేను చిత్ రూపాన్ని, బింబ చైతన్యాన్ని. నన్ను సాక్షి చైతన్యం కూడా అంటారు. నేను మూడు అవస్థల్లో విశ్వ, తైజస, ప్రాజ్ఞగా వ్యవహారం నడుపుతాను. విశ్వగా జాగ్రదావస్థలో, తైజసగా స్వప్నావస్థలో, ప్రాజ్ఞగా సుషుప్తిలో వ్యవహారం నడుపుతాను.

**త్రిషు ధామసు** – ఈ మూడు అవస్థల్లో అంటే జాగ్రద్, స్వప్న, సుషుప్తి అవస్థల్లో;

**యద్భోగ్యం** – మూడు ప్రపంచాలను అనుభవిస్తాను. జాగ్రదావస్థలో స్థూల ప్రపంచాన్ని, స్వప్నావస్థలో సూక్ష్మ ప్రపంచాన్ని, సుషుప్తి అవస్థలో కారణ ప్రపంచాన్ని అనుభవిస్తాను.

**భోక్తా** – మూడు వేషాల్లో అనుభవిస్తాను. అంటే చిదాభాసగా విశ్వ, తైజస, ప్రాజ్ఞగా అనుభవిస్తాను.

**భోగః** – భోగః అనే పదంకు రెండు అర్థాలున్నాయి. అనుభవం, అనుభవించే కరణం. ఇక్కడ కరణం తీసుకుంటాము – దీన్ని ఇన్స్ట్రుమెంట్ అంటారు.

ఏదైనా అనుభవించాలంటే మూడు విషయాలుండాలి: భోక్తా (సబ్జెక్ట్), భోగ్యం (ఆబ్జెక్ట్), భోగః (ఇన్స్ట్రుమెంట్). ఈ మూడింటినీ కలిపి త్రిపుటి అంటారు.

**తేభ్యః విలక్షణః** – నేను వీటన్నిటికీ విలక్షణంగా ఉన్నాను. అంటే నేను అనుభవించే దేనినుంచైనా భిన్నంగా ఉన్నాను. ఒక ప్రాథమిక సూత్రం ఏమిటంటే అనుభవించే వ్యక్తి తను అనుభవించే వస్తువుకు భిన్నంగా ఉంటాడు. అంటే సబ్జెక్టు వేరు, ఆబ్జెక్టు వేరు. ఉదాహరణకు కెమెరా తీయబడిన ఫోటోకన్నా భిన్నంగా ఉంటుంది. అంటే కెమెరా తీసిన ఫోటోలో కెమెరా కనపడదు.

నేను సబ్జెక్టునా, సబ్జెక్టుకు భిన్నంగా ఉన్నానా? చైతన్యమైన నేను సబ్జెక్టు కాదు, ఆబ్జెక్టు కాదు. నేను ఏదైనా అనుభవిస్తుంటే, ఆ అనుభవించబడే వస్తువు ఆబ్జెక్టు అవుతుంది. ఆ ఆబ్జెక్టును అనుభవించటానికి నాకు తాత్కాలికంగా సబ్జెక్టు హోదా వస్తుంది. ఆబ్జెక్టు లేకపోతే సబ్జెక్టు హోదా లేదు. ఒక గురువు బోధ చేస్తున్నప్పుడు శిష్యులు ఆబ్జెక్టు అవుతారు; గురువు సబ్జెక్టు అవుతాడు.

**అయామ్ ఎవర్ ది సబ్జెక్ట్ నెవ్వర్ ది ఆబ్జెక్ట్**

గురువుకు శిష్యులు ఉన్నంతసేపు **గురుత్వం** ఉంటుంది. శిష్యులు వెళ్ళిపోయాక, గురుత్వం పోయి ఒక వ్యక్తిగా మిగులుతాడు. అంటే ఈ సబ్జెక్ట్ హోదా ఆబ్జెక్ట్ ఉన్నంతవరకే. ఆబ్జెక్ట్ లేకపోతే సబ్జెక్ట్ కూడా లేదు. మరి అయితే నా స్వరూపం ఏమిటి?

**చిన్మాత్రాః** – నేను శుద్ధ చైతన్యాన్ని. రాగద్వేషాలు నాకు చెందవు. నా మనస్సుకు చెందుతాయి.

**న మే రాగద్వేషౌ న మే లోభమోహౌ**
**మదోనైవ మే నైవ మాత్సర్యభావః।**
**న ధర్మో నచార్థో న కామో న మోక్షః**
**చిదానందరూపశ్శివోహం శివోహం॥**

మనస్సు నా ప్రతిబింబాన్ని ప్రతిబింబింపచేసే మాధ్యమం. మన దగ్గర మంచి సీ.డీ. ఉన్నా, దాన్ని ప్లే చేసే సీడీ ప్లేయర్ బాగా లేకపోతే, శబ్దం సరిగ్గా రాదు. గరగరలాడుతుంది. అలాగే నేను శుద్ధ చైతన్యాన్ని అయినా కూడా నన్ను ప్రతిబింబింపచేసే కార్యకరణ సంఘాతమైన మనశ్శరీరాల వల్ల నేను అల్పంగా కనిపిస్తున్నాను. ఇది జీవాత్మ నిర్వచనం.

**సదాశివః** – జీవాత్మగా వ్యష్టిలో ఉన్న చైతన్యమైన నేను వేరే ఎవరో కాదు, సమష్టిలో ఉన్న చైతన్యమైన పరమాత్మను.

**శివ ఏవ సదాజీవః జీవ ఏవ సదాశివః** – అద్వైత అనుభూతి


**మయ్యేవ సకలం జాతం । మయి సర్వం ప్రతిష్ఠితమ్ ।**

**మయి సర్వం లయం యాతి । తద్బ్రహ్మాద్వయమస్మ్యహమ్ ॥** 19

ఇది ఒక అద్భుతమైన మంత్రం. వేరే ఏ ఉపనిషత్తులోనూ ఇటువంటి మంత్రాన్ని చూడము. నేను కలలో ఉండగా అందులో ఒక జీవిని అనుకుంటాను. కాని కల నుంచి లేచాక నేనే ఆ కలకు సృష్టి, స్థితి, లయ కారకుడిని అని తెలుసుకుంటాను. కాని కలలో ఉండగా చెప్పలేను. కల నుంచి లేచాకే చెప్పగలను. అలాగే ఈ జాగ్రద్ ప్రపంచంలో ఉన్నంతసేపు అది నిజమనుకుంటాను. దాన్నించి శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా లేచాక, అది కూడా ఒక స్వప్నమే అని తెలుసుకుంటాను. అసలు స్వప్నం అల్పస్వప్నం అయితే, ఇది మహాస్వప్నం అని చూశాము. నేను మహాజాగ్రద్ పురుషుడిని అయితేనే, ఈ జాగ్రద్ ప్రపంచం నానుంచి పుట్టి, నావల్ల స్థితి పొంది, నాలో లయమయ్యే మహాస్వప్నం అని తెలుసుకుంటాను. ఈ మహా స్వప్నానికి నేనే సృష్టి, స్థితి, లయ కారకుడిని అని చెప్పగలిగితే, నాకు వేదాంతసారం బాగా అర్థమయినట్టు అర్థం.

**మయి ఏవ సకలం జాతం –** అంతా నానుంచే పుట్టింది. నేను జాగ్రత్ కారణం బ్రహ్మను. ఇది నిదిధ్యాసన చేసే మంత్రం. కాలం, దేశాలతో సహా అంతా నానుంచే పుట్టింది. కాని ఈ వాక్యం ఎప్పుడు నిజమవుతుంది? ఆ 'నేను' ఎవరో సరిగ్గా అర్థమయినప్పుడు. నన్ను నేను కార్యకరణ సంఘాతగా భావించుకుంటే, ఈ మాటకు అర్థం లేదు. నేను ఎవరో సరిగ్గా అర్థం చేసుకోవాలి.

ఈ మంత్రం మీద నిదిధ్యాసన చేసేముందు నెమ్మదిగా పంచ అనాత్మల నుంచి అంటే వృత్తి, ఆస్తి, కుటుంబం లాంటి వాటినుంచి విడివడి, వాటిని మానసికంగా విశ్వరూప ఈశ్వరునికి అప్పచెప్పేయాలి. దీన్ని **ఆత్మనివేదన రూపభక్తి** అంటారు. ఈ భక్తిలో అహంకార, మమకారాలను మనసారా అప్పచెప్పేస్తాము. బలిచక్రవర్తి కథ దీనికి తార్కాణం. బలిచక్రవర్తి తనకున్నవన్నీ వదులుకున్నాడు. అంటే మమకారాన్ని వదులుకున్నాడు. వామనమూర్తి రెండు పాదాలతో మమకారం పోయింది. కాని అహంకారం


బ్రహ్మ - బింబచైతన్యం
జీవ
విశ్వ
తైజస
ప్రాజ్ఞ
స్థూలశరీరం
ప్రతిబింబ మాధ్యమం 01
ప్రతిబింబ చైతన్యం 01
సూక్ష్మశరీరం
ప్రతిబింబ మాధ్యమం 02
ప్రతిబింబ చైతన్యం 02
కారణశరీరం
ప్రతిబింబ మాధ్యమం 03
ప్రతిబింబ చైతన్యం 03
స్థూలప్రపంచం
ప్రతిబింబ మాధ్యమం 04
ప్రతిబింబ చైతన్యం 04
సూక్ష్మప్రపంచం
ప్రతిబింబ మాధ్యమం 05
ప్రతిబింబ చైతన్యం 05
కారణ ప్రపంచం
ప్రతిబింబ మాధ్యమం 06
ప్రతిబింబ చైతన్యం 06
విరాట్
హిరణ్యగర్భ
అంతర్యామి
ఈశ్వర

ఇంకా మిగిలివుంది. మూడోపాదాన్ని తన తలమీద పెట్టమనటంతో అహంకారం కూడా పోయింది.

చైతన్యం అయిన నానుంచే ఈ సృష్టి వచ్చి కొన్ని క్షణాలు నాట్యం చేస్తున్నది. దాని కాలపరిమితి కొన్ని క్షణాలే అనవచ్చు. కాని వచ్చిన చిక్కేమిటంటే మనం బుడగలాంటి జీవితంతో మమేకం చెంది, ఆ బుడగకు అధిష్టానమైన నీటిని చూడటం లేదు. మనం చైతన్యస్వరూపులం అని తెలుసుకోవటం లేదు.

**మయి సర్వం ప్రతిష్ఠితమ్** – నేను అన్నిటికీ స్థితికారణాన్ని.

**మయి సర్వం లయం యాతి** – చివరికి, అన్నీ నాలో లయమవుతాయి. నేను లయకారణాన్ని. బ్రహ్మను సృష్టి స్థితి లయకారణం అంటారు. ఇక్కడ విద్యార్థి తను సృష్టి స్థితి లయకారణం అంటున్నాడు. అంటే అతను ఏం సూచిస్తున్నాడు?

**తద్ అద్వయం బ్రహ్మ అహం అస్మి** – అతని అసలు స్వరూపాన్ని సూచిస్తున్నాడు. నేను పరమాత్మగా సృష్టి, స్థితి లయకారకుడిని కాని నా అసలు స్వరూపం – కార్యకారణ విలక్షణబ్రహ్మ, నిరుపాధిక బ్రహ్మ అహమస్మి. నేను సృష్టికర్తను అని అహంకారపరంగా చెపితే అది తప్పు కాని సాక్షిపరంగా చెపితే అది గర్వం కాదు; జ్ఞానం. జీవాత్మగా చూస్తే నేను కార్యం, పరమాత్మగా చూస్తే నేను కారణం. నేను కారణబ్రహ్మను. కారణపరమాత్మ అహమస్మి.

**అణోరణీయానహమేవ**

**తద్వన్మహానహం విశ్వమహం విచిత్రమ్ ॥**

**పురాతనోఽహం పురుషోఽహమీశో ।**

**హిరణ్మయోఽహం శివరూపమస్మి ॥** 20

ఈ మంత్రం ముందు మంత్రంలో చెప్పినదానికి ఉపసిద్ధాంతం. నేను కారణ పరమాత్మను అయితే, ఎక్కడుంటాను? కారణం ఎక్కడ ఉంటుంది?

కార్యం అంతటా ఉంటుంది. నిజానికి కారణమే నామరూపాత్మకమైన కార్యంగా భాసిల్లుతుంది. ఒకటే బంగారం అత్యంత చిన్నదైన ముక్కుపుడక లోనూ ఉంటుంది, అత్యంత పెద్దదైన వడ్డాణంలోనూ ఉంటుంది.

**ఏకకారణమేవ అనేక కార్యరూపేణ భాతి**

ఏమిటా కారణం? నేను సృష్టి స్థితి లయకారణమని ముందు మంత్రంలో చూశాము. కారణం కార్యమంతటా ఉంటుందని చూశాము. అందువల్ల కారణమైన నేను కార్యమైన జగత్తు అంతటా ఉంటాను.

**ఇదగ్ం సర్వం యదయమాత్మా – బృహదారణ్యకం**

నేను (ఆత్మగా) ఎక్కడెక్కడ ఉన్నానో ఇందులో వస్తుంది.

**అహం ఏవ అణోరణీయాన్ తద్వత్ మహాన్** – ఇదే భావాన్ని కఠోపనిషత్తులో కూడా చూస్తాము.

**అణోరణీయాన్ మహతో మహీయాన్ – కఠ 1.2.20**

నేను చిన్న అణువుకన్నా చిన్న, పెద్దదైన దానికన్నా పెద్ద. ఇదెలా అర్థం చేసుకోవాలి? నీరు ఉదాహరణ తీసుకుంటే, ఒకే నీరు అత్యంత చిన్నదైన బుడగలోనూ ఉంది, అత్యంత పెద్దదైన సముద్రంలోనూ ఉంది. బుడగ కార్యం, దాని కారణం సముద్రం. వేదాంతం నిజానికి బుడగా లేదు, సముద్రమూ లేదు, ఉన్నది ఒకటే నీరు అంటున్నది. అంటే నీరు కార్యకారణ విలక్షణం.

ఇప్పుడు ఇదే సూత్రాన్ని బ్రహ్మకు వర్తింపజేస్తే, సూక్ష్మమైన అణువులోనూ ఉంది, పెద్దదైన సూర్యునిలోనూ ఉంది. బ్రహ్మే జీవాత్మగాను, పరమాత్మ గానూ ఉంది. సృష్టి అంటే ఏమిటి? బ్రహ్మ+నామరూపాలు. నామరూపాలు తీసేస్తే మిగిలేది ఏమిటి? కార్యకారణ విలక్షణ బ్రహ్మ. ఆ బ్రహ్మను నేనే అని చూశాము. నేనే అంతటా ఉన్నాను అని తెలుసుకోవటం సర్వాత్మభావన

**సర్వం ఆత్మా ఇతి భావః.**

**విచిత్రం విశ్వం అహం అస్మి** – ఈ విశ్వం ఒక అద్భుతం. అందులో

చాలా భిన్నత్వం ఉంటుంది. మోక్షం అంటే మంచి జీవితం పొందటమే కాదు; మోక్షం అంటే వ్యావహారిక ప్రపంచంలో ఉండే సుఖదుఃఖాల లాంటి ద్వంద్వాలను స్వీకరించటమే! ఈ విశ్వమంతటా నేనే ఉన్నాను.

**వాచాఽఽరంభణం వికారో నామధేయం**

ఈ జగత్తు అంతా నామరూపాలతో నిండివుంది. నామరూపాత్మక జగత్తు మిథ్య, నేను సత్యం.

**అహం పురాతనః** – నేను అత్యంత పురాతనం. అనాది. అంటే ఆది లేదు నాకు.

**అహం పురుషః** – పురుషఃకు రెండు అర్థాలున్నాయి. అవి –

**పురి శరీరే శేతే ఇతి పురుషః** – శరీరంలో ఉండేది – జీవాత్మ

**పూరయతి సర్వం ఇతి పురుషః** – సర్వవ్యాపకం – పరమాత్మ

అంటే నేను జీవాత్మ, పరమాత్మను కూడా.

**అహం ఈశః** – నేను కారణబ్రహ్మను. నేను స్వతంత్రం, కార్యం పరతంత్రం. అంటే కారణం లేకుండా కార్యానికి ఉనికి లేదు. బంగారం లేకుండా ఆభరణం లేదు. ఏమిటి నిదర్శనం? బంగారం తీసి చూడండి, ఆభరణం లేదు. బంగారం ఉంటే ఆభరణం ఉంది. బంగారం లేకపోతే ఆభరణం లేదు, అందువల్ల ఆభరణం యొక్క ఉనికికి బంగారమే కారణం. బంగారం ఆభరణం మీద ఆధారపడిలేదు, ఆభరణం ఉన్నా లేకపోయినా బంగారం ఉంది. అంటే బంగారం సత్యం, ఆభరణం మిథ్య.

ఇదే సూత్రాన్ని బ్రహ్మకు, జగత్తుకు వర్తింపజేస్తే, బ్రహ్మ లేనిదే కార్యజగత్తు లేదు. కారణబ్రహ్మ సత్యం, కార్యజగత్తు మిథ్య. అందువల్ల నేను కారణంగా ఈశుడిని అంటే స్వతంత్రుడిని.

నేను జీవాత్మగా, పరమాత్మగా రెండు వేషాలు వేసుకున్నాను. కార్యంగా చూస్తే నేను జీవాత్మను, కారణంగా చూస్తే నేను పరమాత్మను. ఒక పాత్రధారి ద్విపాత్రాభినయం చేస్తే గ్రీన్‌రూమ్‌కి వెళ్ళి వేషాలు మార్చుకున్నట్టుగా, నన్ను

ఉపాధిపరంగా చూస్తే నా వేషం మారుతున్నది. ఉత్కృష్ట ఉపాధిలో ఉంటే నేను పరమాత్మను; నికృష్ట ఉపాధిలో ఉంటే నేను జీవాత్మను. కాని నా అసలు స్వరూపమేమిటి? నేను శుద్ధచైతన్య స్వరూపాన్ని.

**యత్ తదద్రేశ్యమ్ అగ్రాహ్యమ్ అగోత్రమ్ అవర్ణమ్**
**అచక్షుః శ్రోత్రం తదపాణిపాదమ్।**
**నిత్యం విభుం సర్వగతం సుసూక్ష్మం**
**తదవ్యయం యద్భూతయోనిం పరిపశ్యన్తి ధీరాః॥ ముండక 1.1.6**

**హిరణ్మయః అహం** – స్వర్ణవత్ స్వయం ప్రకాశరూపః అస్మి. నేను బంగారంలా స్వయంప్రకాశక చైతన్య స్వరూపాన్ని. హిరణ్మయ అంటే బంగారం. బంగారం లక్షణం ప్రకాశించటం. వేదాంత పరిభాషలో ప్రకాశం అంటే చైతన్యం.

**శివరూపం అహమ్ అస్మి** – శివ అంటే మంగళ స్వరూపం. మంగళ స్వరూపం ఆనందానికి చిహ్నం. దుఃఖం అమంగళం. స్వరూపం అంటే ఆనంద స్వరూపః అహం అస్మి. అంతకుముందు నేను తమిళ ఆళ్ (మనిషి)ని అనుకుంటాను. వేదాంతం అర్థమయ్యాక, నేను పెరుం ఆళ్ అంటే పెరుమాళ్ (పరమాత్మ)ను అని తెలుసుకుంటాను. నేను పరమాత్మనెలా అవుతాను అంటే వేదాంతం ఒక్కటే జవాబు చెపుతుంది. నీ స్వప్నవృత్తాంతం చూడు అంటుంది. స్వప్నంలో స్వప్నప్రపంచం, కాలం, పదార్థం అన్నీ నానుంచే వచ్చాయి కాని నాకు స్వప్నంలో ఉన్నంతవరకూ అది తెలియదు అని చూశాము కదా. స్వప్నం నుంచి లేస్తేనే తెలుస్తుంది. అలాగే ఈ జాగ్రద్ ప్రపంచం నుంచి లేస్తేనే తెలుస్తుంది. జాగ్రద్ ప్రపంచం నుంచి లేవాలంటే ఈ దేహ అభిమానం పోవాలి. దేహ అభిమానం ఎంత ఎక్కువగా ఉంటే, అర్థం చేసుకోవటం అంత కష్టమవుతుంది. నా స్వరూపం తెలుసుకోవాలంటే నాకు రూపం లేదనే మార్పు రావాలి. నేను ఎవరు? ఆనందస్వరూపః అహమస్మి.

చైతన్యం నిర్వచనం ఏమిటి? సత్‌చిత్ ఆనందబ్రహ్మ. ఇంతవరకూ

చైతన్యం యొక్క సత్ అంశనూ, చిత్ అంశనూ చూశాము. ఇప్పుడు గురువు మూడవ అంశాన్ని ప్రవేశపెట్టాడు. ఏమిటది? ఆనంద అంశం. మనం పొందే ఆనందాన్ని ప్రతిబింబ ఆనందం అనీ, కోశానందం అనీ, విషయానందం అనీ వర్ణిస్తాము. ఆ ఆనందానికి రాకపోకలు ఉంటాయి, హెచ్చుతగ్గులు ఉంటాయి. ఈ విషయానందానికి మూడు స్థాయీభేదాలు ఉంటాయి. ప్రియ, మోద, ప్రమోదాలు. వీటిని వివరంగా తైత్తిరీయోపనిషత్తులో చూస్తాము.

ప్రియం అంటే ఒక వస్తువును చూస్తే పొందే ఆనందం. ఉదాహరణకు మీకు మామిడిపండు అంటే ఇష్టం ఉందనుకోండి. ఆ మామిడిపండును బజారులో చూడగానే ఆనందం కలుగుతుంది. దాన్ని ప్రియం అంటారు. దాన్ని కొని తెచ్చుకుని, ఇంట్లో మీముందు పెట్టుకున్నారు. అది మీది. అప్పుడు కలిగే ఆనందం మోదం. తర్వాత దాన్ని తిన్నారు. అది మీలో కలిసింది. అప్పుడు కలిగే ఆనందం ప్రమోదం. కాని నిర్గుణబ్రహ్మస్వరూపం ఆనందం అన్నప్పుడు, ఆ ఆనందం వేరు. అది అనుభవంలోకి వచ్చే ఆనందం కాదు.

వేదాంతం నేర్చుకుంటే, నేను ఆనందస్వరూపుడిని అని తెలుసుకుంటే, నా సమస్యలు తొలగిపోతాయా అని అడగవచ్చు మీరు. సమస్యలు తొలగిపోవు; అవి అలాగే ఉంటాయి కాని వాటి తీవ్రత తగ్గుతుంది. మనస్సులో జ్ఞానమనే వెలుగు వెలగటం వల్ల, ఈ సమస్యల కాంతి తగ్గుతుంది. దీన్ని **అభిభావః** అంటారు. రాత్రిపూట మిలమిల మెరిసే నక్షత్రాలు పగలు కనపడవు. అంటే అవి పగలు ఉండవా? పగలు కూడా ఉంటాయి కాని తేజోమయమైన సూర్యకాంతి ముందు ఈ మిణుకు మిణుకుమనే నక్షత్రాలు వెలాతెలాబోతాయి.

అదే విధంగా జ్ఞానికి కూడా సమస్యలు ఉంటాయి. అతను కూడా అజ్ఞాని ఉన్న ప్రపంచంలోనే ఉన్నాడు కదా! కాని అతను నిదిధ్యాసనం చేసి, జ్ఞాననిష్ఠలో ఉండటం వల్ల, సమస్యల వేడి వీగిపోతుంది. అతనికి

వీటి మిథ్యాత్వం అర్థమవుతుంది. దీన్నే మోక్షం అంటారు. అందువల్ల కేవలం శ్రవణం చేసినంత మాత్రాన చాలదు, జ్ఞాననిష్ఠలో నెలకొని ఉండాలంటే నిదిధ్యాసనం చేయాలి.

శ్రవణంలో మహావాక్యాలు నేర్చుకుంటాడు శిష్యుడు. ఆ మహావాక్యాల మీద నిశ్చయజ్ఞానం ఉంటేనే నిదిధ్యాసనం పనిచేస్తుంది. వేదాంతం యొక్క ఉద్దేశం ప్రపంచాన్ని మార్చటం కాదు; నా మనశ్శరీరాలను మార్చటం కాదు. వేదాంతం యొక్క ఉద్దేశం నేను బ్రహ్మను అని చాలా నిస్సంశయంగా అర్థం చేసుకోవటమే కాదు, ఆ జ్ఞానంతో నేను బాధాతప్త జీవిని, సంసారిని అని నాలో పాతుకుపోయిన అజ్ఞానాన్ని పారద్రోలాలి కూడా. నేను బ్రహ్మను అని అర్థం చేసుకుంటే చాలదు, దానికి సంబంధించిన తక్కిన అన్ని ఆలోచనలను కూడా దానికి తగ్గట్టుగా మార్చుకోవాలి.

ఉదాహరణకు కొన్ని పట్టణాలలో ఉన్న ఉష్ణోగ్రత కొలతను చూపించే పట్టిక ఒకటి నాముందు ఉంది. అది సెంటీగ్రేడ్‌లో ఉందని ఆ పట్టికపైన రాసివుంది. దాంట్లో ముంబై, ఢిల్లీ, చెన్నై, ఎర్నాకులం లాంటి ఊర్లు కొన్ని ఉన్నాయి. నేను ఆ ఉష్ణోగ్రతను సెంటీగ్రేడ్ నుంచి ఫారిన్‌హీట్‌లోకి మార్చాలనుకుంటే, ఆ పట్టికపైన ఫారిన్‌హీట్ అని మాత్రం మారిస్తే చాలదు. ఈ ఊర్లన్నిటికీ సెంటీగ్రేడ్‌లలో ఇచ్చిన కొలతను, తదనుగుణంగా మార్చాలి.

అదేవిధంగా నా గురించిన నా అభిప్రాయం ఒక్కటీ మార్చుకుంటే చాలదు. నా చుట్టూ ఉన్న నా కుటుంబం, ఈ జగత్తు, అందులో జరిగే సంఘటనల గురించిన అభిప్రాయం కూడా మార్చుకోవాలి. అంటే నేను ఆత్మ అని తెలుసుకుంటే చాలదు, తక్కినవి అనాత్మ అని అర్థం చేసుకోవాలి. లేకపోతే వేదాంతబోధలో ఉన్నంతసేపూ **అహం బ్రహ్మ అస్మి** అంటాను, కాని బయటకు రాగానే **అహం జీవోస్మి** అంటాను. అందువల్ల నిదిధ్యాసనం చాలా అవసరం.

ఆత్మ గురించి నేర్చుకున్న పదాలను నిదిధ్యాసనంలో నాకు వర్తింపజేసు కోవాలి. ఆత్మ సర్వగతం అంటే నేను సర్వగతం అని చేయాలి.

**అపాణిపాదోఽహమచింత్యశక్తిః ।**

**పశ్యామ్యచక్షుః స శృణోమ్యకర్ణః ॥**

**అహం విజానామి వివిక్తరూపో**

**న చాస్తి వేత్తా మమ చిత్సదాహమ్ ॥** 21

ఈ మంత్రం కూడా ఆత్మ స్వరూపం గురించి మాట్లాడుతున్నది. రెండు కోణాల్లోంచి ఒకేసారి చెపుతున్నది. అవి సోపాధికం, నిరుపాధికం. అంటే సగుణబ్రహ్మ, నిర్గుణబ్రహ్మ. సగుణబ్రహ్మ వ్యావహారిక స్థాయికి చెందితే, నిర్గుణబ్రహ్మ పారమార్థిక స్థాయికి చెందుతుంది. కాని రెండూ ఒక ఆత్మకు చెందినవే. రెండుకోణాల్లో చూడటం వల్ల రెండు భిన్నప్రవృత్తులుగా కనిపిస్తుంది.

**అహం అపాణిపాదః** – నాకు కాళ్ళు, చేతులు లేవు. నేను నిరవయవం.

**యత్ తదద్రేశ్యమ్ అగ్రాహ్యమ్ అగోత్రమ్ అవర్ణమ్**
**అచక్షుః శ్రోత్రం తదపాణిపాదమ్।**
**నిత్యం విభుం సర్వగతం సుసూక్ష్మం**
**తదవ్యయం యద్భూతయోనిం పరిపశ్యన్తి ధీరాః॥ ముండక 1.1.6**

కాని నేను ప్రతిబింబ చైతన్యంగా ఒక ఉపాధిలో ప్రకటితమయినప్పుడు నాకు కాళ్ళు, చేతులు ఉన్నాయి (ఈ మాట చెప్పలేదు, మనం కలుపుకోవాలి).

**అపాణిపాదో జవనో గ్రహీతా**

ఇది కూడా కలుపుకోవాలి. కాళ్ళు చేతులు లేవు కాని నేను త్వరగా వెళతాను, అన్నీ పట్టుకుంటాను. అంటే సోపాధిక, నిరుపాధిక రూపాలు రెండూ చెప్పబడ్డాయి.

**అచక్షుః** – నిర్గుణబ్రహ్మగా కళ్ళు లేవు కాని; **పశ్యామి** – సగుణబ్రహ్మగా చూస్తాను. **అకర్ణః** – చెవులు లేవు కాని; **శృణోమి** – వింటాను.

**శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనో యద్వాచో హ వాచం స ఉ**

**ప్రాణస్య ప్రాణః। – కేన 1.2**

శ్రోత్రస్య శ్రోత్రం ఏకవాక్యం అర్థం తీసుకుంటే –

1. ఆత్మ వేరు, చెవి వేరు.
2. ఆత్మ చెవి అంతటా వ్యాపించివుంది.
3. ఆత్మ ఉండటం వల్లే చెవిని చెవి అనగలుగుతున్నాము. అంటే చెవితో వినగలుగుతున్నాము.

ఇదే సూత్రం కన్నుకు, తక్కిన ఇంద్రియాలకు, మనస్సుకు, ప్రాణానికి వర్తిస్తుంది.

**అచింత్యశక్తిః** – నేను ఊహించలేనంత శక్తి ఉన్న మాయాసహిత బ్రహ్మను. ఈ మాయాశక్తి వల్ల నేను సృష్టి, స్థితి, లయ కారకుడను.

**నిర్గుణబ్రహ్మ+మాయ=ఈశ్వరుడు; ఈశ్వరుడు–మాయ=నిర్గుణబ్రహ్మ**

ఈ రెండు రూపాలూ నావే.

**అహం విజానామి** – నా స్వస్వరూప దృష్ట్యా నేను అప్రమాతను. సగుణ బ్రహ్మ దృష్ట్యా ప్రమాతను. అప్రమాత అయిన నేను వ్యావహారిక ప్రపంచం లోకి ప్రమాతగా కిందకు దిగాను. కాని వచ్చిన చిక్కేమిటంటే, కిందకు దిగాక, నా పారమార్థికస్థాయిని మర్చిపోయాను. స్వప్నప్రపంచంలో జాగ్రత్ పురుషుడు ఎలా ప్రమాత అవుతాడో, అలా జాగ్రద్ ప్రపంచంలో నిర్గుణబ్రహ్మ అయిన నేను ప్రమాత అవుతాను. ఎటువంటి ప్రమాత?

**వివిక్తరూపః** – అనేక రూపాలను చూసే ప్రమాత. జాగ్రత్ అవస్థలో, స్వప్నావస్థలో అనేక రూపాలను చూస్తాను. నా పంచజ్ఞానేంద్రియాలతో ప్రపంచాన్ని ఐదు రకాలుగా చూస్తాను. ప్రపంచంలో ఉన్న రంగు, రుచి, వాసన, శబ్దం, గంధాలు తెలుసుకుంటాను. ఒక్క శబ్దమే తీసుకున్నా అందులోనే ఎన్నో రకాల శబ్దాలు ఉన్నాయి. ఇలా నేను అన్నీ తెలుసు కుంటున్నా, నన్ను ఎవరూ తెలుసుకోలేరు.

**న తత్ర చక్షుర్గచ్ఛతి నా వాగ్గచ్ఛతి నో మనః – కేన**

అన్నింటినీ చూసే కళ్ళు వాటిని అవి చూసుకోలేవు, ఇంక ఆత్మనైన

నన్ను ఎలా చూడగలవు? వేలికొనతో అన్నిటినీ ముట్టుకోగలను కాని ఆ వేలికొనను ముట్టుకోలేను; అలాగే నా ఫోనుతో అన్ని నెంబర్లకూ ఫోన్లు చేయగలను కాని నా నెంబరుకు చేయలేను.

**మమ న చ అస్తి వేత్తా** – అన్నింటినీ తెలుసుకునే మనస్సుతో, నన్ను నేను తెలుసుకోలేను. అయితే నేనెవరు? నేను ఉన్నానా?

**సదా అహం చిత్ (అస్మి)** – నేను ఎప్పటికీ చైతన్యస్వరూపాన్ని. ప్రపంచంలో ఎన్నటికీ నిరూపించనవసరం లేని వస్తువు ఏదైనా ఉందంటే అది నేనే. నేను స్వయంప్రకాశకం. నేను ఉన్నానని ప్రత్యేకించి నిరూపించనవసరం లేదు. నేను దేనినైనా వెతుకుతున్నానంటే, దేనికోసమో వెతుకుతున్న **నేను** ఉంటేనే అది సాధ్యం.

**ప్రతిబోధవిదితం మతమ్ – కేన**

నాకు కలిగే ప్రతి ఒక్క అనుభవం కూడా ఆత్మ వల్లనే కలుగుతున్నది. అందువల్ల ఆత్మ అనుభవం కోసం అడగకూడదు. ఒక ఫోటో ఉందంటేనే, దాన్ని తీసిన కెమెరా ఉన్నట్టు అర్థం. నాకు ఒక అనుభవం కలుగుతోందంటేనే నాలో చైతన్యం ఉన్నట్టు. నేనా చైతన్యం ఎలా అవాలి? అర్థం లేని ప్రశ్న. నేను నిత్యచైతన్యాన్ని. **సదా అహం చిత్ (అస్మి).**

మారుతున్న ప్రతి అనుభవం వెనుకా ఒక మారనిదేదో ఉంది. ఏమిటది? అదే చైతన్యం. జాగ్రద్, స్వప్నావస్థల్లో జరిగే అనుభవాలు మారతాయి. కాని వాటిని చూసే చైతన్యం మారదు. మనసులో ఆలోచనలు వస్తాయి, పోతాయి. కాని చైతన్యం మారదు. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షీభూతంగా చూస్తుంది చైతన్యం. ఆ చైతన్యం నేను.

**వేదైరనేకైరహమేవ వేద్యో।**
**వేదాంతకృద్వేదవిదేవ చాహమ్ ॥**
**న పుణ్యపాపే మమ నాస్తి నాశో।**
**న జన్మ దేహేంద్రియబుద్ధిరస్తి ॥** **22**

సర్వాత్మ భావన మొదటి రెండు పాదాల్లో కొనసాగుతున్నది. నేనే అంతటా ఉన్నాను. ప్రపంచాన్ని మూడుగా విభజిస్తాము. ప్రమాత, ప్రమేయం, ప్రమాణం. ప్రమాత అంటే తెలుసుకునే నేను; ప్రమేయం అంటే తెలుసుకోబడే వస్తువు; ప్రమాణం అంటే తెలుసుకోవటానికి ఉపయోగపడే కరణం. దీన్ని త్రిపుటి అంటారు. కాని నిర్గుణబ్రహ్మగా నాకు త్రిపుటి లేదు.

**న అంతఃప్రజ్ఞం న బహిఃప్రజ్ఞం విజ్ఞానఘనం**

**అహం ఏవ వేద్యః** – నా గురించే తెలుసుకోవాలి. అంటే నేను ప్రమేయం అవుతాను. ఎలా తెలుసుకోవాలి?

**అనేకైః వేదైః** – వేదాల ద్వారా తెలుసుకోవాలి. అంటే శాస్త్రం ప్రమాణం అని తెలుసుకునేదెవరు?

**వేదవిత్ ఏవ చ అహమ్** – నేను ప్రమాతను. ప్రమాణం ఏది? శాస్త్రం.

**వేదాంతకృత్** – శాస్త్రాన్ని గురువు ద్వారా నేర్చుకోవాలి. గురువు అని ఎందుకన్నాడు? శాస్త్రం అని ఎందుకనలేదు? ఎందుకంటే శాస్త్రం ప్రమాణమే అయినా, శాస్త్రాన్ని గురువు ద్వారానే నేర్చుకోవాలి. స్వంతంగా నేర్చుకోకూడదు.

**అవిద్యయా మృత్యుం తీర్త్వా** – ఈశావాస్య

ఈ వాక్యం అర్థం ఉన్నదున్నట్టు తీసుకుంటే, దీని అర్థం అవిద్య వల్ల మృత్యువును అధిగమిస్తాము అని వస్తుంది. అవిద్య అంటే సామాన్య అర్థం అజ్ఞానం. అజ్ఞానం వల్ల మృత్యువును అధిగమించగలిగితే, కష్టపడి జ్ఞానం పొందటం ఎందుకు? దీని అర్థం గురువే విడమర్చి చెప్పాలి. అందువల్ల గురువు ప్రమాణం అంటే గురువు ద్వారా శాస్త్రం ప్రమాణం అని అర్థం వస్తుంది.

ఇంతవరకూ వ్యావహారిక దృష్ట్యా అంటే చిదాభాస దృష్ట్యా చూశాము. ఇప్పుడు నిర్గుణబ్రహ్మ పరంగా లేదా శుద్ధచైతన్యం పరంగా చూస్తాము.

**న పుణ్య పాపే** – శుద్ధ చైతన్యంగా నాకు పుణ్యపాపాలు లేవు.

**న పుణ్యం న పాపం న సౌఖ్యం న దుఃఖమ్**
**న మన్త్రో న తీర్థమ్ న వేదా న యజ్ఞాః।**
**అహం భోజనం నైవ భోజ్యం న భోక్తా**
**చిదానందరూపః శివో౽హం శివో౽హమ్॥**

ప్రారబ్ధకర్మ కూడా లేదు. పుట్టుక పుణ్యపాపాల మీద ఆధారపడి ఉంటుంది. జన్మనక్షత్రం పుణ్యపాపాన్ని పుట్టించదు. అది మన పుణ్యపాపాలను సూచిస్తుంది.

**న జన్మ దేహేంద్రియబుద్ధిః అస్తి** – నాకు శరీరం లేదు, మనస్సు లేదు, బుద్ధి లేదు. అంటే కార్యకారణ సంఘాతమే లేదు. అయితే ఎప్పుడు పుట్టాను? నాకు జన్మే లేదు. శరీరమే లేకపోతే, పుట్టుక ఎక్కడ్నుంచి వస్తుంది?

**మమ నాస్తి నాశః** – నాస్తి అంటే నఅస్తి. నాకు శరీరం, మనస్సు, బుద్ధి లేకపోతే జన్మలేదు. పుట్టుక లేకపోతే మరణం ఎక్కడ్నుంచి వస్తుంది? పునర్జన్మ మాటేమిటి? పునర్జన్మ పుణ్యపాపాల వల్ల వస్తుంది. శరీరం, మనస్సులు లేకపోతే పుణ్యపాపాల ప్రసక్తి కూడా లేదు.

తరువాత వచ్చే మంత్రంలో సమష్టి ప్రపంచాన్ని త్రోసిపుచ్చుతున్నాము.

**న భూమిరాపో న చ వహ్నిరస్తి ।**
**న చా౽నిలో మే౽స్తి న చాంబరం చ ॥**
**ఏవం విదిత్వా పరమాత్మ రూపం ।**
**గుహాశయం నిష్కల మద్వితీయమ్ ॥** 23

**న భూమిః ఆపః న చ వహ్నిః అస్తి న చ అనిలః మే అస్తి న చ అంబరం అస్తి** – పారమార్థిక స్థాయికి ఎదిగితే, పంచభూతాలు కూడా లేవు. భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం లేవు. నేను వాటిని నా కళ్ళ ముందు చూస్తూ, నేను వాటిని అనుభవిస్తూ ఉంటే, అవి లేవని ఎలా చెప్పగలరు? అవి వ్యావహారిక స్థాయికి చెందినవి.

అన్నీ తిరస్కరిస్తే బ్రహ్మ మాటేమిటి? బ్రహ్మను తిరస్కరించలేము.

ఎందుకంటే బ్రహ్మ జగత్తుకు అధిష్ఠానం. సత్యం లేకుండా మిథ్యకు విడిగా ఉనికి లేదు. కల కనాలంటే కలకు భిన్నంగా ఉండే జాగ్రత్ పురుషుడు ఉండాలి. అలాగే ప్రపంచానికి ఉనికిని ఇవ్వాలంటే నేను ప్రపంచానికి భిన్నంగా ఉండాలి. నేను విశ్వాధారాన్ని.

**మూడు జీవులు**

ఒక వ్యక్తిలో ముగ్గురు జీవులను చూస్తాము. నేను అనే పదం వాడినప్పుడు, అది ఈ ముగ్గురు జీవులలో ఎవరినైనా సూచించవచ్చు. వారికి మూడు పేర్లు ఉన్నాయి.

1. పారమార్థిక జీవుడు – ఒక వ్యక్తిలో ఉండే బింబ చైతన్యం (చిత్)
2. వ్యావహారిక జీవుడు – చిదాభాస 1
3. ప్రాతిభాసిక జీవుడు – చిదాభాస 2

ఆ విధంగా ఒక జీవిలో ఒక చిత్, రెండు చిదాభాసలు ఉన్నాయి.

1. **బింబ చైతన్యం** – బింబ చైతన్యం సర్వవ్యాపకం, అంతటా ఉంది అని చూశాము. దాని ఐదు లక్షణాలు మళ్ళీచూద్దాము.

- చైతన్యం శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని, దానినుంచి ఉత్పత్తి అయిన వస్తువు కాని కాదు.
- అది స్వతంత్ర వస్తువు. అది శరీరం అంతటా వ్యాపించి, దాన్ని ప్రకాశింపజేస్తుంది.
- చైతన్యం శరీరం హద్దులకే పరిమితమవదు.
- చైతన్యం శరీరం నాశనమయితే నాశనమవదు.తదనంతరం కూడా ఉంటుంది.
- చైతన్యం శరీరం లేకపోయినా ఉంటుంది కాని కనపడదు. దాన్ని ప్రతిబింబింపజేసే మాధ్యమం లేదు కాబట్టి అది కనిపించదు. అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

శుద్ధ చైతన్యం అనుభవంలోకి రాదు. వ్యవహారం నడపదు. జ్ఞాని, 'అహం బ్రహ్మ అస్మి' అన్నప్పుడు, నేను అంటే శుద్ధ చైతన్యం లేదా బింబచైతన్యం.

**మయ్యేవ సకలం జాతం** అన్నప్పుడు కూడా, నేను అంటే శుద్ధ చైతన్యం.

**2. చిదాభాస 1 –** మనస్సు సూక్ష్మపంచభూత కార్యం. అందువల్ల జడం. కాని అది జడమైనా ప్రతిబింబింపచేయగలదు. అందువల్ల శుద్ధ చైతన్యాన్ని ప్రతిబింబింపజేయగలదు. అలా ఏర్పడిన ప్రతిబింబాన్ని చిదాభాస అంటారు. ఇది బింబచైతన్యం లాగా సర్వవ్యాపకం కాదు. ప్రతిబింబ మాధ్యమాన్ని బట్టే ఈ ప్రతిబింబం ఏర్పడుతుంది. బల్లలో కూడా సత్‌ఉన్నా, దానిలో ప్రతిబింబ మాధ్యమం (మనస్సు) లేదు కాబట్టి ప్రతిబింబ చైతన్యం ఏర్పడదు. వ్యవహారం నడిపేది చిత్ కాదు చిదాభాస. వ్యావహారిక మనశ్శరీరాలలో ఉండి, వ్యావహారిక జగత్తుతో జాగ్రదావస్థలో వ్యవహారం నడిపే చిదాభాస, మొదటి ప్రతిబింబ చైతన్యం. ఈ మొదటి ప్రతిబింబ చైతన్యాన్ని వ్యావహారిక జీవుడు అంటారు. దీన్ని మనస్సు ప్రతిబింబింప చేస్తుంది కాబట్టి, మనస్సు వ్యవహారం నడుపుతున్నంతసేపూ, వ్యావహారిక జీవుడు కూడా అందుబాటులో ఉంటాడు.

**3. చిదాభాస 2 –** మూడవ జీవుడు స్వప్నంలో అందుబాటులో ఉంటాడు. ఒక వ్యక్తి స్వప్నంలో ఉన్నప్పుడు, అతని నిద్రాశక్తి, అతను ఆ స్వప్నాన్ని అనుభవించటానికి స్వప్న మనశ్శరీరం సృష్టిస్తుంది. స్వప్నంలో ఉన్న జీవికి అది స్వప్నమని తెలియదు.స్వప్న మనస్సులో కూడా చిదాభాస ఏర్పడుతుంది స్వప్న మనశ్శరీరాలలో, జాగ్రద్ పురుషుని మనస్సు నుండి ఏర్పడిన చిదాభాసను ప్రాతిభాసిక జీవుడు అంటారు. ఈ ప్రాతిభాసిక జీవుడు స్వప్న ప్రపంచాన్ని అనుభవిస్తాడు. స్వాప్నిక మనశ్శరీరాలు ఉన్నంతసేపూ ప్రాతిభాసిక జీవుడు ఉంటాడు. ఆ వ్యక్తి నిద్ర లేవగానే, ప్రాతిభాసిక మనశ్శరీరాలు, ప్రాతిభాసిక జీవుడు,స్వప్న ప్రపంచం అన్నీ జాగ్రద్ పురుషునిలో లయమయి పోతాయి. అలాగే వ్యావహారిక మనస్సు సుషుప్తిలో లయమయినప్పుడు, వ్యావహారిక జీవుడు, వ్యావహారిక ప్రపంచం లయమయిపోతాయి.

కాని పారమార్థిక జీవుడు ఎన్నడూ లయమవడు. ఈ పారమార్థిక జీవుడే

అద్వైతబ్రహ్మ. వేదాంత బోధ ఏమిటంటే నేను వ్యావహారిక జీవుడిని కాను, నేను ప్రాతిభాసిక జీవుడిని కాను, నేను పారమార్థిక జీవుడిని అని చెప్పగలగాలి. నేను పారమార్థిక జీవుడిని అని తెలుసుకున్నాక, తక్కిన రెండు జీవులను వదులుకోనక్కరలేదు. ఆ రెండు జీవులు నేను వేసే పాత్రలు అని తెలుసుకుంటే చాలు. మనం ప్రాతిభాసిక జీవుడి నుంచి వ్యావహారిక జీవుడికి తేలికగానే మారుతున్నాము. స్వప్నంలో ఉన్నంతవరకూ అందులోని సుఖదుఃఖాలను అనుభవించినా కూడా, ఒకసారి స్వప్నంనుంచి లేచాక, అది నిజం కాదు మిథ్య అని తెలుసుకోగలుగుతున్నాము. అలాగే వ్యావహారిక సత్యం కూడా ఈశ్వరుని కలే అని తెలుసుకుని, దాన్నుంచి పారమార్థిక సత్యానికి ఎదగాలి.

వ్యావహారిక సత్యం అంటే ఒక కాలంలో ఉండి, ఇంకో కాలంలో లేనిది. జగత్తు ఒక కాలంలో ఉండి, ఇంకో కాలంలో ఉండదు. అలా మూడుకాలాల్లోనూ లేని దాన్ని మిథ్య అనీ, మూడు కాలాల్లోనూ ఉండేదాన్ని సత్యం అనీ అంటారు. మిథ్యకు ఇంకోపేరు వ్యావహారిక సత్యం. వ్యావహారిక సత్యంలో మెదిలే జీవి పేరు వ్యావహారిక జీవుడు. పారమార్థిక సత్యం తెలుసుకున్న జీవి పేరు పారమార్థిక జీవుడు. పారమార్థిక సత్యంతో వ్యవహారం నడిపే జీవుడు అనకూడదు. పారమార్థిక ప్రపంచం ఎప్పుడు లయమవుతుంది అనకూడదు. పారమార్థిక ప్రపంచం లేదు. పారమార్థిక సత్యం అద్వయబ్రహ్మ.

**అవ్యవహారి** – ఎవరైతే ఈ పారమార్థిక సత్యాన్ని తెలుసుకుని, తన పాత్రలను సవ్యంగా పోషిస్తాడో అతన్ని సంసారం బాధించదు. నేను వ్యావహారిక జీవిని అని అనుకోకుండా, నేను పారమార్థిక జీవిని అని తెలుసుకునేలా చేయటానికి తాపత్రాయ పడుతోంది వేదాంతం. అలా తెలుసుకుంటే, నేను నా పాత్రలను నా శాయశక్తులా పోషిస్తాను కాని వాటితో మమేకం చెందను. ఆ విధంగా పారమార్థిక జీవుడు బింబ చైతన్యం; వ్యావహారిక జీవుడు, ప్రాతిభాసిక జీవుడు ప్రతిబింబచైతన్యాలు. ప్రతిజీవి లోనూ ఈ మూడూ ఉంటాయని చూశాము. వీటిలో తానేమిటో తెలుసుకున్న జీవుడు జ్ఞాని.

వ్యవహార సమస్యలు భరించలేనివిగా ఉన్నప్పుడు, అవి మిథ్య అని

గుర్తించగలిగితే, వాటి ప్రభావం నుంచి తప్పించుకోగలము. ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన చోట సమస్యను పరిష్కరించుకోగలము కాని, తప్పించుకోలేని సమస్యలు అంటే వృద్ధాప్యం, అనారోగ్యం, ఎడబాటు, మరణం, వగైరాలు మీద పడ్డప్పుడు ఒక్కటే మార్గముంది. వాటిలో మిథ్యాత్వం చూడాలి.

మిథ్యాత్వం చూడాలంటే, నేను జీవిని కాను, నేను బ్రహ్మను అనే జ్ఞాననిష్ఠలో నిలబడగలగాలి. దానికి నిదిధ్యాసనం కావాలి. ప్రారబ్ధకర్మ బాగున్నప్పుడే, నిదిధ్యాసనం చేయాలి. అప్పుడు విపరీత పరిస్థితులు ఎదురైనప్పుడు తట్టుకోగలము. అది ఆరోగ్యం బాగున్నప్పుడే ఆరోగ్యం గురించి జాగ్రత్త పడటం లాంటిది.

15 నుంచి 23 దాకా బ్రహ్మ స్వరూపాన్ని అధ్యారోప అపవాద న్యాయం ద్వారా గురువు వివరించాడు.

## అధ్యారోప అపవాద న్యాయం

1. ముందు కుండను చూపిస్తాము. కుండ కార్యం అయింది.

2. ప్రతి కార్యానికి వెనుక ఒక కారణం ఉంటుంది. కుండకు కారణం మట్టి అయింది.

**– ఇది అధ్యారోపం**

3. కుండకు ఆధారం ఏమిటి? మట్టి. మట్టి లేకుండా కుండకు విడిగా ఉనికి లేదు. కుండకు ముందూ, కుండ ఉన్నప్పుడూ, కుండ పగిలిపోయాకా – మూడు కాలాల్లోనూ ఉన్నది మట్టే. మూడు కాలాల్లోనూ ఉండేది సత్యం, కుండ మిథ్య. అందుకని కుండని కొట్టిపారేస్తున్నాము.

4. కుండని కొట్టిపారేస్తే, కార్యం లేదు. కార్యం లేకపోతే కారణత్వం లేదు. (కారణం లేదనకూడదు). కుండ ఉంటేనే మట్టికి కారణత్వ హోదా ఉంటుంది. కుండ లేకపోతే, మట్టి ఉంటుంది కాని కారణత్వ హోదా ఉండదు.

**– ఇది అపవాదం**

కార్యకారణ విలక్షణం కుండ అంటాము. దీని అధ్యారోప అపవాదం అంటాము. కుండని అంగీకరించటం అధ్యారోపం, కొట్టి వేయటం అపవాదం. అద్వైతబోధలో ఇది చాలా ముఖ్యమైన అంశం. దీన్ని సాంప్రదాయం అంటారు.

**అధ్యారోపోపవాదాభ్యాం నిష్ప్రపంచం ప్రపంచ్యతే।**
**శిష్యాణామ్ సుఖబోధార్థం తత్త్వజ్ఞానైః కల్పితక్రమః ॥**

క్రమః అంటే బోధనాపద్ధతి.

ఇదే పద్ధతిని జగత్తు, బ్రహ్మకు అన్వయించాలి.

1. ముందు జగత్తుని చూపిస్తాము. జగత్తు కార్యం అయింది.
2. జగత్తనే కార్యానికి బ్రహ్మ కారణం.

ఇది అధ్యారోపం.

3. బ్రహ్మలేకుండా జగత్తుకి విడిగా ఉనికి లేదు. బ్రహ్మ సత్యం, జగత్ మిథ్య. అందుకని జగత్తును కొట్టివేస్తాము.
4. జగత్తనే కార్యం లేకపోతే బ్రహ్మకు కారణత్వం లేదు.

ఇది అపవాదం.

అప్పుడు బ్రహ్మ కార్యకారణ విలక్షణం బ్రహ్మ అవుతాడు. ఈ విషయాన్నే వివేకచూడామణిలో చక్కగా వర్ణిస్తారు శంకరులవారు.

**ఏకమేవ సద్ అనేక కారణం కారణాంతరనిరాస్యకారణం ।**
**కార్యకారణవిలక్షణం స్వయం బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని ॥**

బ్రహ్మను కార్యకారణ విలక్షణం అని చెప్పాక, 'ఆ బ్రహ్మవి నువ్వే', అంటుంది ఉపనిషత్తు. **ఐతదాత్మ్యమిదగ్ం సర్వం తత్సత్యగ్ం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో.** ఆ కార్యకారణ విలక్షణ బ్రహ్మ ఎక్కడుంది? సాక్షి చైతన్యమైన నువ్వే అది.

చతుర్ముఖ బ్రహ్మ తన మహావాక్య ఉపదేశాన్ని ఇక్కడితో ముగిస్తున్నాడు. శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా ఈ బోధను జీర్ణించుకోవాలి. శ్రవణ,

మననాల ద్వారా నేను జీవిని కాను, నేను బ్రహ్మను అనే నిశ్చయజ్ఞానాన్ని పొందుతాను. నిదిధ్యాసనంలో పాతవాసనలు పోగొట్టుకుని మనస్సును కొత్త జ్ఞానంలో నిలబెట్టాలి. కొత్త జ్ఞానం + కొత్త దృక్పథం = జ్ఞాననిష్ఠ.

**ఏవం విదిత్వా** – ఈ ఆత్మజ్ఞానాన్ని శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా పొందాక; ఏమిటా జ్ఞానం – కార్యకారణ విలక్షణ బ్రహ్మ అహమస్మి జ్ఞానం. నా స్వరూపం ఏమిటి?

**గుహాశయం** – మనస్సులో ఉన్నాను; ఆలోచనగా కాదు; ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును చూస్తున్నాను.

**నిష్కలం** – ఆకాశంలాగా నాకు భాగాలు లేవు, విభజనలు లేవు. అందువల్ల నేను నిర్గుణం, సర్వవ్యాపకం.

**అద్వితీయం** – ఉన్నది ఒకటే చైతన్యం. అందువల్ల నాకు భిన్నంగా ఇంకోటి లేదు.

**24, 25 మంత్రాలు – ఉపసంహారం**

**సమస్తసాక్షిం సదసద్విహీనం ।**

**ప్రయాతి శుద్ధం పరమాత్మరూపమ్ ॥** 24

**సమస్త సాక్షిం** – నేను అన్నింటినీ సాక్షీభూతంగా చూస్తాను. అన్నింటినీ అంటే జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలనూ, ప్రపంచాన్నీ చూస్తాను.

**సదసద్విహీనం** – ఇక్కడ సత్ అంటే కార్యం, అసత్ అంటే కారణం. అందువల్ల నేను కార్యకారణ విలక్షణ బ్రహ్మను. మాయ కారణం, ప్రపంచం కార్యం. నేను మాయకు, ప్రపంచానికి అతీతంగా ఉన్నాను.

**శుద్ధం** – నేను మాయకు, ప్రపంచానికి అతీతంగా ఉన్నాను. అవి మిథ్య. నన్ను కలుషితం చేయటానికి రెండో వస్తువు లేదు కాబట్టి నేను శుద్ధం.

**పరమాత్మరూపమ్** – నేను పరమాత్మను. నేను జీవాత్మను కాను. ఇది చాలా ముఖ్యమైన వాక్యం. ఈ విధంగా అర్థం చేసుకుంటే నాకు కలిగే ఫలమేమిటి?

**పరమాత్మరూపం ప్రయాతి** – పరమాత్మ గురించి తెలుసుకున్న వ్యక్తి, పరమాత్మతో ఐక్యం పొందుతాడు. పరమాత్మ రూపం విదిత్వా పరమాత్మ రూపం ప్రయాతి ఇదే భావం ముండకంలో కూడా చూస్తాము.

**బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి** – ముండక

బ్రహ్మ గురించి తెలుసుకున్న వ్యక్తి బ్రహ్మ అవుతాడు. పరమాత్మ అవుతాడు అంటే, నేను జీవాత్మను అనే అపోహను వదులుకుంటాడు. అవుతాడు అంటే అందులో ఏమీ తతంగం లేదు. జీవాత్మ అంతకు ముందు, ఇప్పుడు, తర్వాత కూడా పరమాత్మే. బుద్ధిలో మార్పు వస్తుంది. జ్ఞానం బుద్ధిలో ఏర్పరచుకున్న దూరాన్ని తొలగిస్తుంది.

అంతకు ముందు నేను పరమాత్మకు భిన్నంగా ఉన్నాను అనుకున్నాను. ఇప్పుడు జ్ఞానం పొందాక నేను పరమాత్మను అని తెలుసుకున్నాను (అనుకుంటున్నాను అనకూడదు). అందువల్ల ఐక్యం అనేది బుద్ధికి సంబంధించినది. అంతకు ముందు అజ్ఞానం బుద్ధికి సంబంధించినది కాబట్టి, జ్ఞానం కూడా బుద్ధికి సంబంధించినదే. అందువల్ల జ్ఞానికి మార్పు అంతర్గతంగా కలుగుతుంది. అది బాహ్యంగా తెలియదు. మోక్షం అంటే జ్ఞానం వల్ల దృక్పథంలో కలిగిన మార్పు.

ఈ మంత్రంతో జ్ఞానఫలం కూడా అయిపోయింది. కైవల్యం గురించిన బోధ అయిపోయింది. కాని ఇది చాలా సూక్ష్మమైన పారాయణం. ఇది అందరూ తేలికగా అర్థం చేసుకోలేరు. బ్రహ్మ సత్యం అర్థమవచ్చు; సచ్చిదానంద ఆత్మ అర్థం అవచ్చు కాని ఆ బ్రహ్మవు నువ్వే అంటే తేలికగా స్వీకరించలేరు. అంతేకాదు కంటికి అక్షరాలా కనిపిస్తున్న జగత్తు మిథ్య అన్నా జీర్ణించుకోలేరు. నన్ను బాధపెట్టేది లేదా నన్ను ఆనందపరిచేది నా ఎదురుగా ఉంటే, అది లేనేలేదని ఎలా అనగలను అనుకుంటారు. చాలా మందికి జ్ఞానమార్గం తర్కానికి అందనట్టుగా అనిపిస్తుంది; మరికొంత మందికి ఒకవేళ తర్కానికి అందినా, ఆచరణయోగ్యం కాదనిపిస్తుంది.

అంటే ఆటంకం ఎక్కడుంది? శిష్యుని మనస్సులో ఉంది. బోధలో

లేదు. బోధలో లోపం లేదు అని ఎలా చెప్పగలము? ఈ బోధను అర్థం చేసుకుని అంతకుముందు ఎందరో ముక్తిని పొందారు. అందువల్ల జ్ఞానకాండ కష్టం అనిపిస్తే కర్మకాండకు, వెనక్కు, వెళ్ళమంటున్నది ఉపనిషత్తు.

మతపరమైన జీవితం ఉండితీరాలి. మతం మన జీవితంలో మనకు తెలయకుండానే ఎన్నో ప్రాయశ్చిత్తకర్మలను చొప్పించింది. వాటిలో ఒక రకం పంచమహాయజ్ఞాలు. అవి దైవయజ్ఞం, పితృయజ్ఞం, బ్రహ్మయజ్ఞం, మనుష్యయజ్ఞం, భూతయజ్ఞం. ఈ ఉపనిషత్తు వాటిలో బ్రహ్మయజ్ఞాన్ని సూచిస్తున్నది.

## పంచమహాయజ్ఞాలు

ఎ. **దైవయజ్ఞం** – దేవునికి చేసే పూజ. ఈశ్వర ఆరాధనం.తేలిగ్గా చేయవచ్చు. లేదా వివరంగా చేయవచ్చు. నామజపం, పారాయణం, ధ్యానం, సహస్రనామస్తోత్రం ఇవన్నీ వస్తాయి ఇందులో. శాస్త్రం ఎప్పుడూ ఇంత చేయి అని చెప్పదు.

పత్రం, పుష్పం, ఫలం, తోయం ఇస్తే చాలు అంటుంది. అది కూడా ఇవన్నీ అనటం లేదు. వీటిలో ఏదైనా చాలు అంటోంది. భక్తి ముఖ్యం. చాలామంది మానవసేవయే మాధవసేవ, అందుకని మాధవసేవ చేయనక్కరలేదు అనుకుంటారు. కాని అదొక అపోహ. వాళ్ళు ఈక్వేషన్‌కి రెండోవైపు చూడటం లేదు. **మానవసేవ = మాధవసేవ** అయితే, **మాధవసేవ = మానవసేవ** అవ్వాలి కదా. దేవునికి అర్పించింది, ఇంకా రెట్టింపయి మానవాళికి అందుతుంది.

బి. **పితృయజ్ఞం** – తల్లిదండ్రులు జీవించి ఉండగా వారిపై భక్తిశ్రద్ధలతో మెలగటం, వారి తదనంతరం, వాళ్ళకి శ్రాద్ధకర్మలు చేయటం.వాళ్ళు ముక్తి పొందినా, పొందకపోయినా చేయాలి. వాళ్ళు ఇక్కడ ఉండగా అంత గొప్పవారు (ప్రవర్తనాపరంగా) కాకపోయినా, పితృదేవతలు అయ్యాక వాళ్ళకు శక్తి పెరిగి, మనను దీవిస్తారు. వాళ్ళ అండదండలు మనకు లభిస్తాయి. ఇదికాక శ్రాద్ధకర్మలు పెట్టేటప్పుడు, ఒక మంత్రం

శ్రాద్ధకర్మలు పొందనివారికి కూడా చెందాలని వస్తుంది. అలా పితృదేవతలను తృప్తిపరచి నట్టవుతుంది.

సి. **బ్రహ్మయజ్ఞం** – మన ఆచార్యులు సనాతన ధర్మం కోసం ఎంతో పాటు పడ్డారు. శౌనక, అంగీరస ఋషులు లేకపోతే ముండక ఉపనిషత్తు మనకు ఉండేది కాదు. అందుకని ఉపనిషత్తులను నేర్చుకోవటం (ఉపనిషత్తు క్లాసుకి వెళ్లటం) ఆచార్యులను స్తుతించటం, గీతాపారాయణం చేయటం ఋషియజ్ఞంలోకి వస్తుంది. మనం స్వాధ్యాయనం ప్రతిరోజూ చేయాలని శాస్త్రం నిర్దేశిస్తుంది. అది – రుద్రం (నమకం, చమకం), పురుషసూక్తం, విష్ణుసహస్రనామం, భగవద్గీత పారాయణం (రోజుకో అధ్యాయం), తైత్తిరీయ ఉపనిషత్తు (రోజుకోవల్లీ) చదవాలి. అలా రోజూ చదివితే అనూహ్యమైన మార్పు కలుగుతుందని ఆచార్యులు చెప్తారు.

డి. **మనుష్యయజ్ఞం** – ఇందాక చూసిన మానవసేవ. అది కూడా లక్షలు లక్షలు గుమ్మరించమనో, వెట్టిచాకిరీ చేయమనో చెప్పదు వేదం. ఏమీ చేయలేకపోయినా మన నిత్యపూజ తర్వాత భక్తిగా కళ్ళు మూసుకుని సర్వేభవంతు సుఖినః అని మనస్ఫూర్తిగా కోరుకున్నా చాలు.

ఇ. **భూతయజ్ఞం** – ప్రకృతి ఆరాధన. పశుపక్ష్యాదులను, చెట్లు, చేమలను గౌరవపూర్వకంగా చూడటం. అందుకే మన సాంప్రదాయంలో ఆవుని, చెట్టుని పూజించటం ఉంది. ఈ రెండూ పశువులకు, వృక్షాలకు ప్రతీకలు. వాటిని హింసించకుండా, ఆరాధించాలి.

**యశ్శతరుద్రీయమధీతే ।**
**సోఽగ్నిపూతో భవతి । సురాపానాత్ పూతో భవతి ।**
**సబ్రహ్మహత్యాయాః పూతో భవతి ।**
**స సువర్ణస్తేయాత్పూతో భవతి।**
**కృత్యాకృత్యాత్ పూతో భవతి ।**
**తస్మాదవిముక్తమాశ్రితో భవతి ।**
**అత్యాశ్రమీ సర్వదా సకృద్వా జపేత్ ॥** 25

పంచమహాయజ్ఞాల్లో బ్రహ్మయజ్ఞం ఒకటని చూశాము. బ్రహ్మయజ్ఞం

అంటే శాస్త్ర పారాయణం అంటే వేద అధ్యయనం. వేదంలో చెప్పబడినది. ఏదైనా పారాయణం చేయవచ్చు. ఇందులో శ్రీరుద్ర పారాయణం సూచించ బడింది. అది యజుర్వేదానికి చెందినది, ఈ ఉపనిషత్తేమో అథర్వణ వేదానికి చెందినది. అయినా అదే ఎందుకు చెప్పిందంటే ఏకరూప ధ్యానం గురించి వచ్చినప్పుడు, శివుని కొలవమని చెప్పింది.

**ఉమా సహాయం పరమేశ్వరం ప్రభుం** – 7

కాని రుద్రం పారాయణం అంటే రుద్రమే పారాయణం చేయాలని లేదు. ఏదైనా చేయవచ్చు. కాని రుద్రాన్ని ప్రాయశ్చిత కర్మల్లో గొప్పగా కీర్తిస్తారు. ఇంట్లో చేస్తే కుటుంబంలో పాపాలు తొలగుతాయి. గుడిలో సామూహికంగా చేస్తే సామూహిక పాపాలు తొలగుతాయి. ఆ పాపాలేమిటో ఇందులో ఒక పెద్ద పట్టిక వస్తుంది. ఈ నేపథ్యంతో మంత్రం చూద్దాము.

**యః శతరుద్రీయం అధీతే** – రుద్ర పారాయణం కర్మయోగం, ఉపాసన యోగాలలో ఒక భాగం. అది చిత్తశుద్ధిని కలుగజేస్తుంది. రుద్రం యొక్క అర్థం తెలిసినా, తెలియకపోయినా నిత్యపారాయణం చేస్తే పుణ్యం కలుగుతుంది. అర్థం తెలుసుకుని పారాయణం చేస్తే పుణ్యఫలితం ఇంకా ఎక్కువగా ఉంటుంది.

**సః అగ్నిపూతో భవతి** – ఇక్కడ అగ్ని అంటే యజ్ఞాలకు సంబంధించిన అగ్ని. అగ్నిహోత్రానికి అగ్నిని వెలిగించటం హిందువుగా మన ప్రాథమిక కర్తవ్యం. కనీసం వంట చేయటానికి అగ్ని రాజేసేముందు, దీపం వెలిగించాలి. ఈ కర్తవ్యం నెరవేర్చకపోతే ప్రత్యవాయ పాపం చుట్టు కుంటుంది. మంట రాజేయటం కూడా ఒక పద్ధతిలో చేయాలి. మంట రాజేయటానికి నోటితో ఊదకూడదు. అది ఒక పాపం. అలా చేయాల్సిన కర్మ చేయకపోతే ఒక పాపం. చేయాల్సిన కర్మను చేయాల్సిన విధానంలో చేయకపోతే ఇంకోపాపం. అగ్నికి సంబంధించిన పాపాలన్నిటినుంచి తప్పించుకుంటాడు. ఈ పాపాలన్నీ ఆధ్యాత్మిక ఎదుగుదలకు ఆటంకం అవుతాయి. రుద్రపారాయణం చేస్తే ఈ పాపాలు తొలగిపోతాయి.

**సురాపానాత్ పూతః భవతి** – శాస్త్రం సురాపానం చేయటమే కాదు, దాని వాసన కూడా చూడకూడదంటుంది. అందువల్ల మద్యం సేవించినా, మాంసం భక్షించినా నిస్సందేహంగా పాపం కలుగుతుంది. అది ఆధ్యాత్మిక ఎదుగుదలకు అడ్డం పడుతుంది. వీటికి ప్రాయశ్చిత్తకర్మలు చేయాలి. రుద్ర పారాయణం గొప్ప ప్రాయశ్చిత్త కర్మ.

**బ్రహ్మహత్యాయాః పూతః భవతి** – బ్రహ్మ హత్యాదోషం నుంచి తప్పించు కుంటాడు. బ్రహ్మ అంటే బ్రాహ్మణుడు. బ్రాహ్మణుడు అంటే వేదాలను అనుసరించేవాడు. పంచమహా పాపాలలో బ్రహ్మహత్యా పాపం ఒకటి.

**కృత్య అకృత్యాత్ పూతః భవతి** – కృత్యం అంటే ధర్మం. అంటే కొన్ని విహిత కర్మలు ఉంటాయి. అకృత్యం అంటే కొన్ని నిషేధకర్మలుంటాయి. విహిత కర్మలు మానితే పాపం; నిషిద్ధకర్మలు చేస్తే పాపం. రుద్ర పారాయణం ఈ రెండు పాపాల నుంచి రక్షిస్తుంది. పాపం కంటికి కనబడదు. అలాంటప్పుడు నేను నిషిద్ధకర్మలు చేస్తే పాపం వస్తుందని ఎలా తెలుస్తుంది? ఎలాగంటే, ఆ పాపం నాకు శాస్త్రం నేర్చుకోవటానికి గురువు దొరకకుండా అడ్డు పడుతుంది. అందువల్ల, ఆధ్యాత్మికంగా ఎదగాలంటే ఈ పాపాలను తొలగించుకోవటానికి రుద్రపారాయణం చేయాలి. అలా చిత్తశుద్ధి కలిగాక, ఏమవుతుంది?

**తస్మాత్ అవిముక్తం ఆశ్రితః భవతి** – అటువంటి వ్యక్తి ఈశ్వరుని కృప పొందుతాడు. కాశీ విశ్వేశ్వరుడిని అవిముక్తేశ్వరుడు అంటారు. విముక్తః అంటే పశువు.పశువులకు నియమ నిబంధనలుండవు కాబట్టి విముక్తః పేరు వచ్చింది. అవిముక్తః అంటే పశుపతి. ఈశ్వరుడు పశుపతి. అందువల్ల కాశీని అవిముక్తేశ్వర క్షేత్రం అంటారు. అందువల్ల రుద్రపారాయణం చేస్తే ఈశ్వరుడు సదా రక్షిస్తాడు.

**అత్యాశ్రమీ సర్వదా సకృద్వా జపేత్** – అత్యాశ్రమీ అంటే సన్న్యాసి. అతను గృహస్థులాగా యజ్ఞయాగాదులు చేయకూడదు. కాబట్టి అతనికి చిత్తశుద్ధి పొందటానికి రుద్రపారాయణం అద్భుతమైన సాధన. నిజానికి చిత్తశుద్ధి

పొందిన వ్యక్తే సన్న్యాసం స్వీకరిస్తాడు. కాని, ఒకవేళ పూర్తిగా చిత్తశుద్ధి పొందకుండా ఎవరైనా సన్న్యాసం స్వీకరిస్తే, అతను రుద్రపారాయణం ద్వారా చిత్తశుద్ధి పొందవచ్చు. రోజంతా రుద్రపారాయణం చేయాలి. అలా చేయలేకపోతే కనీసం రోజుకొక సారైనా చేయాలి. సన్న్యాసులే కాదు. గృహస్థులు కూడా చేయాలి. అలా చేస్తే ఏమవుతుంది?

గ్రంథ ఉపసంహార మంత్రము –

**అనేన జ్ఞానమాప్నోతి । సంసారార్ణవనాశనమ్ ।**

**తస్మాదేవం విదిత్వైనం కైవల్యం**

**పదమశ్నుతే – కైవల్యం పదమశ్నుత ఇతి ॥**

**అనేన జ్ఞానం ఆప్నోతి** – అనేన అంటే అనేన కర్మయోగేన. అంటే రోజూ రుద్రపారాయణం చేయటం వల్ల సాధకుడు జ్ఞానం పొందుతాడు. అంటే ప్రత్యక్షంగా కాదు. మొదట్లో చూసినట్టుగా సహకారీ సాధన అవుతుంది. అంటే రుద్రపారాయణం చేయటం వల్ల చిత్తశుద్ధి ఏర్పడి, జ్ఞానయోగ్యతా ప్రాప్తి, గురు ప్రాప్తి కలుగుతుంది. మనస్సు సూక్ష్మంగా తయారవుతుంది. అంతకుముందు కష్టంగా అనిపించింది, తర్కానికి భిన్నంగా అనిపించింది ఇప్పుడు సత్యంగా, ఆచరణయోగ్యంగా, అర్థవంతంగా అనిపిస్తుంది. దానివల్ల గురువు ఇప్పుడు బాగా చెపుతున్నాడు అంటారు. అంటే వాళ్ళకు విషయం బాగా అర్థమవుతున్నదని అర్థం. అలా రుద్రపారాయణం వల్ల గురుప్రాప్తి, శ్రవణప్రాప్తి కలుగుతుంది. దానివల్ల జ్ఞానం కలిగి, త్రిపుటి నుంచి ద్విపుటికి మారతారు. ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. రుద్రం అంటే రుద్రమే పారాయణం చేయాలని లేదు. అది విష్ణుసహస్రనామం అవవచ్చు, లలితా సహస్రనామం అవవచ్చు, లేదా ఏదైనా రోజువారీ పూజ కూడా అవవచ్చు. జ్ఞానం పొందితే కలిగే ఫలం ఏమిటి?

**సంసార అర్ణవ నాశనమ్** – సంసారమనే సముద్రాన్ని నాశనం చేస్తుంది. అర్ణవం అంటే సముద్రం.

**తస్మాత్ ఏనం ఏవం విదిత్వా** – ఈ విధంగా బ్రహ్మను తెలుసుకుంటే – ఈ విధంగా అంటే ఏ విధంగా? బ్రహ్మ ఉన్నాడని తెలుసుకుంటే చాలదు; నేను ఆ బ్రహ్మను అని అర్థం చేసుకుని, దాన్ని జీర్ణించుకోవాలి. అలా చేస్తే ఏమవుతుంది?

**కైవల్యం పదం అశ్నుతే** – కైవల్యం పొందుతాడు. అంటే నాకు భిన్నంగా ఏదీలేదు భావనను పొందుతాడు. జీవించివుండగా జీవన్ముక్తి, మరణించాక విదేహముక్తి పొందుతాడు. ఈ వాక్యం రెండుసార్లు చెప్పటం వల్ల ఇక్కడితో ఈ బోధ ముగిసిందని తెలుస్తుంది. ఈ బోధను ఆశ్వలాయన ఋషికి ప్రజాపతి చేశాడు. కైవల్యం పదంతో ఈ ఉపనిషత్తు ముగిసింది కాబట్టి ఈ ఉపనిషత్తుకు కైవల్యోపనిషత్ అని పేరు వచ్చింది.

# కైవల్యోపనిషత్ - సారాంశము

కైవల్యోపనిషత్తు అథర్వణ వేదానికి చెందినది. ఇందులో 25 మంత్రాలే ఉన్నాయి. ఇది చిన్న ఉపనిషత్తు అయినా, ఇది శంకరాచార్యుల వారు భాష్యం రాసిన దశ ఉపనిషత్తులలో లేకపోయినా, ఇది ఒక సమగ్రమైన ఉపనిషత్తు. అందువల్ల చాలా ముఖ్యమైన ఉపనిషత్తు. వేదాంతసారమంతా వచ్చిన ఒక పరిపూర్ణ ఉపనిషత్తు. అదీకాక ఇందులో ఎన్నో మహావాక్యాలున్నాయి. ప్రతి ఉపనిషత్తు బోధలోనూ తలచుకునే అతి ముఖ్యమైన మంత్రం ఇందు లోనిదే.

**మయ్యేవ సకలం జాతం మయి సర్వం ప్రతిష్ఠితమ్।**
**మయి సర్వం లయం యాతి తద్బ్రహ్మాద్వయమస్మ్యహమ్** 19

అంతేకాదు, జ్ఞానం వల్లనే మోక్షం పొందగలమని కూడా ఇదే ఢంకా మ్రోగించి మరీ చెపుతుంది.

**నాన్యః పంథా విముక్తయే - 9 నాన్యేన హేతునా - 10**

అందువల్ల ఈ ఉపనిషత్తు కూడా నేర్చుకుంటారు.

కైవల్యం అంటే మోక్షం. కైవల్యం అంటే అద్వైతం.

**కేవలస్య అద్వయస్య భావః కైవల్యం**

నన్ను పరిమితి చేసే రెండో వస్తువు లేదు. దేశ కాల వస్తు పరిమితులు లేవు. ఈ బోధ కైవల్యాన్ని ఇస్తుంది కాబట్టి దీన్ని కైవల్యోపనిషత్తు అన్నారు. అంతేకాక, కైవల్యం పదం ఈ ఉపనిషత్తు చివర్లో వస్తుంది.

కైవల్యోపనిషత్తు అథర్వణ వేదానికి చెందినది అవటం వల్ల, దీన్ని శాంతి పాఠం **భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః**. ఈ శాంతిపాఠాన్ని కరణయోగ్యత కోసం, విఘ్న నివృత్తి కోసం జపిస్తాము. శరీరం, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి బాగా పనిచేయాలని, ఈ బోధ నేర్చుకుంటున్నంతసేపూ విఘ్నాలు కలగకూడదని ప్రార్థిస్తాము.

**అధీహి భగవన్ । బ్రహ్మవిద్యాం వరిష్ఠాం ।**
**సదా సద్భిః సేవ్యమానాం నిగూఢామ్ ।**
**యయా–చిరాత్ సర్వపాపం వ్యపోహ్య ।**
**పరాత్పరం పురుషం యాతి విద్వాన్ ॥** 1

మొదటి మంత్రం ఉపోద్ఘాత మంత్రం. జ్ఞానబోధకు ఇది దారితీస్తుంది. ఇందులో గురుశిష్యులను చూస్తాము. శిష్యుడు ఆశ్వలాయన ఋషి, గురువు వేరే ఎవరో కాదు– సాక్షాత్తూ చతుర్ముఖబ్రహ్మ! ఆశ్వలాయన ఋషికి తన లక్ష్యం ఏమిటో స్పష్టంగా తెలుసు. అతనికి స్పష్టంగా తెలుసు అని మనకు ఎలా తెలుసు? అతనికి నాలుగు అంశాలు స్పష్టంగా తెలుసు –

1. తనకు మోక్షం కావాలని తెలుసు
2. మోక్షం ఆత్మజ్ఞానం వల్లనే కలుగుతుందని తెలుసు
3. జ్ఞానం శాస్త్రవిచారణ వల్లనే కలుగుతుందని తెలుసు
4. శాస్త్రవిచారణ ఆచార్యుని ద్వారానే చేయాలని తెలుసు

అంటే మోక్షం, మోక్షార్థం జ్ఞానం, జానార్థం శాస్త్రం, శాస్త్రార్థం శ్రవణం – ఇవీ దశలు. అందువల్ల అతను బ్రహ్మవిద్య అడిగాడు ప్రత్యక్షంగా. బ్రహ్మ అతన్ని చూసి మురిసిపోయి ఉంటాడు.

**2–4 మంత్రాలు – జ్ఞానసాధనలు, జ్ఞానఫలం**

జ్ఞానసాధనలు రెండున్నాయి. అవి సాక్షాత్ కారణం, సహకారి కారణం. ఉదా – మామిడిచెట్టు పెరగాలంటే మామిడిటెంకని పాతాలి. అది సాక్షాత్ కారణం. నేల, నీరు, వాతావరణం లాంటివి సహకారి కారణాలు.

వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలు సాక్షాత్ కారణాలు.

**శ్రవణం** – ఒక క్రమపద్ధతిలో క్రమం తప్పకుండా కొన్ని సంవత్సరాల పాటు ఒక సమర్థవంతమైన గురువు వద్ద వేదాంతవిద్యను అధ్యయనం చేయటం. దీన్ని జ్ఞానం పొందటం అంటారు.

**మననం** – పొందిన జ్ఞానాన్ని సంశయరహితంగా మలుచుకోవటం. దీన్ని నిశ్చయజ్ఞానం అంటారు.

**నిదిధ్యాసనం** – ఎన్నో జన్మలుగా మనలో కూరుకుపోయిన తప్పుడు భావాలను పారద్రోలటం. ఆనందం, శాంతి, భద్రతలు బాహ్యప్రపంచంలో లేవు, నాలోనే ఉన్నాయని తెలుసుకోవాలి. అవి పరిస్థితుల వల్ల రావు, పరిస్థితులు బాగుండకపోయినా వస్తాయి అని తెలుసుకోవాలి. దీన్ని జ్ఞాననిష్ఠ అంటారు.

శ్రవణం జ్ఞానం పొందటానికి, మననం బుద్ధిలో సందేహాలు పోగొట్ట టానికి, నిదిధ్యాసనం రాగద్వేషాలను పోగొట్టటానికి ఉపయోగపడతాయి. ఈ మూడింటినీ కలిపి జ్ఞానయోగం లేదా వేదాంతవిచారణ అంటారు. ఇవి సాక్షాత్ కారణం. దీన్ని బ్రహ్మ కొత్త భాషలో పరిచయం చేశాడు –

**శ్రద్ధా భక్తి ధ్యానయోగాదవైహి – 2**

శ్రద్ధ–శ్రవణం; భక్తి–మననం; ధ్యానయోగం–నిదిధ్యాసనం.

తర్వాత సహకారీ సాధనం గురించి చెప్పాడు. శాస్త్రాల్లో చెప్పిన విలువలన్నీ వస్తాయి దీనిక్రింద. బ్రహ్మ వాటిలో ఒకటి ఎన్నుకున్నాడు. అది చాలా ముఖ్యమైనది.

**త్యాగేనైకే అమృతత్వమానశుః – 3**

నిదానంగా ఆధారపడటం వదులుకోవటం. మనం ఆధారపడటం ఎక్కువైన కొద్దీ మనం స్వంతంగా ఏమీ చేయలేము. ఒంటరితనం పోగొట్టుకోవటానికి చాలా పనులు చేస్తాము. అందువల్ల అప్పుడప్పుడూ ఏకాంతంగా ఉండటం అలవాటు చేసుకోవాలి. ఒంటరిగా వాకింగ్‌కి వెళ్ళాలి; ఇంట్లో ఒంటరిగా కొంతసేపు గడపాలి; ఒక ఆశ్రమానికి వెళ్ళి కొన్నిరోజులు ఒంటరిగా ఉండాలి. ఇలా ఆధారపడటం తగ్గించుకోగలగటాన్ని త్యాగం అంటారు. మన కాళ్ళ మీద మనం నిలబడగలగాలి. ఇటువంటి శిక్షణ వల్ల కలిగే లాభమేమిటి?

దీనివల్ల కలిగే అత్యంత గొప్పలాభం ఒకటుంది. ఎప్పుడైనా, ఏదైనా పోగొట్టు కోవటానికి సిద్ధపడతాను. దీన్నే త్యాగం అంటాము. ఏదీ ఇచ్చివేయనవసరం లేదు. కాని అవసరమైతే ఇవ్వటానికి సిద్ధంగా ఉండాలి. ఈ అంతర్గత సంసిద్ధతను సన్న్యాసం అంటారు. అటువంటి అతనే నిజమైన సన్న్యాసి. అతను కాషాయ వస్త్రాలు ధరించకపోయినా కూడా సన్న్యాసే. ఇది వివేకం వల్ల కలగవచ్చు లేదా భక్తి వల్ల కలగవచ్చు.

**అనన్యా శ్చింతయంతో మామ్ – గీత 9–22**

శంకరాచార్యుల వారు పదేపదే చెపుతారు – **సన్న్యాస సహిత జ్ఞానం** మాత్రమే మోక్షాన్ని ఇస్తుంది అని. సన్న్యాసం అంటే భయపడనవసరం లేదు. అది అంతర్గత సన్న్యాసం. దానికి ఎన్ని సంవత్సరాలు పట్టినా ఫర్వాలేదు.

**జ్ఞానఫలం - పరామృతాః పరిముచ్యన్తి సర్వే**

జ్ఞానఫలం మోక్షం. అది రెండుగా వస్తుంది - జీవన్ముక్తి, విదేహముక్తి. జీవన్ముక్తి అంటే అహంకార మమకారాల నుంచి విడివడటం. విదేహముక్తి అంటే పునరపి జననం, పునరపి మరణం వృత్తం నుంచి విడివడటం.

**వైరాగ్యసహిత వేదాంత విచారణ - సాధన**

**జీవన్ముక్తి, విదేహముక్తి - ఫలం**

**5-11 మంత్రాలు - ధ్యానం**

ఈ మంత్రాలు గీతలో ఆరవ అధ్యాయానికి మూలం. ఇక్కడ మూడు అంశాలు చెప్పాడు బ్రహ్మ. ధ్యానసాధనలు, సగుణ ధ్యానం, నిర్గుణ ధ్యానం

**ధ్యానసాధనలు** - దేశం, కాలం, ఆసనం, శరీరస్థితి.

**దేశం** - శుభ్రంగా, నిర్జనంగా, ఆధ్యాత్మికతను ప్రేరేపించే ప్రదేశం.

**కాలం** - (ఇక్కడ చెప్పలేదు) మనస్సు సాత్త్వికంగా ఉండాలి. అంటే పరుగులు పెట్టని, నిద్రపోని మనస్సు ఉండాలి. అలా ఉండక పోతే, ఒక సమయాన్ని ఎన్నుకుని సాత్త్వికంగా ఉండేలా శిక్షణ ఇచ్చుకోవాలి. సాధారణంగా తెల్లవారుఝాము అనుకూలమైన సమయం.

**ఆసనం** - మరీ ఎత్తుగా ఉండకూడదు, మరీ కిందకి ఉండ కూడదు. మరీ గట్టిగా ఉండకూడదు, మరీ మెత్తగా ఉండకూడదు (భగవద్గీతలో కృష్ణపరమాత్మ చెప్పాడు).

**శరీరస్థితి** - స్థూలశరీరం, ఇంద్రియాలు, శ్వాస, మనస్సు, బుద్ధి - అన్నీ ధ్యానం చేయటానికి అనుకూలంగా ఉండాలి.

గీతలో చెప్పని రెండు అంశాలు ఉపనిషత్తు చెప్పింది.

**అత్యాశ్రమస్థ** - సన్న్యాసి లాగా ధ్యానం చేయాలి. గృహస్థుగా చేస్తే అనేక బెంగలు ఉంటాయి. మనం ఏ పాత్రలో ఉన్నా బెంగలుంటాయి. అందువల్ల ధ్యానం చేసేటప్పుడు అసంగత్వం అలవరచుకోవాలి. అంటే నేను భర్తను కాదు, తండ్రిని కాదు వగైరా అనుకోవాలి. అంతగా సంగత్వం పెంచుకోవాలంటే గురువుతో లేదా దైవంతో పెంచుకోవాలి.

**విరుద్ధ్యభక్త్యా స్వగుణం ప్రణమ్య –** గురువును తలుచుకోవాలి. గురువును తలుచుకుంటే గురువు బోధ కూడా గుర్తుకు వస్తుంది.

**సగుణ ఈశ్వర ధ్యానం –** దీన్నే ఇష్టదేవతా ధ్యానం అంటారు. కైవల్యోపనిషత్తు సూచించిన ఇష్టదైవం – శివుడు.

**ఉమాసహాయం పరమేశ్వరం ప్రభుం –** 7

కాని శివుడు అని చెపితే, శివుడి మీదే ధ్యానం చేయాలని లేదు. ఒక దేవుడిని ఉదాహరణగా చెప్పింది ఉపనిషత్తు మీ ఇష్టదేవతను మీరు ఎన్నుకోవచ్చు.

ఈ ఇష్టదేవతను రెండు రూపాల్లో కొలవవచ్చు – ఏకరూప ఇష్టదేవత, అనేకరూప ఇష్టదేవత లేదా విశ్వరూప ఇష్టదేవత.

**నిర్గుణ ఈశ్వర ధ్యానం**

**ఆది మధ్యాన్త విహీనమేకం –** 6

ఇది నిర్గుణ ఈశ్వర ధ్యానం. నిర్గుణబ్రహ్మకు రూపం, గుణం లేవు. ఏకరూప ఈశ్వరుడు, అనేకరూప ఈశ్వరుడు, అరూప ఈశ్వరుడు. ఈ మూడింటిలో దేని మీద ధ్యానం చేయాలి? అది మీరు ఏ దశలో ఉన్నారో దాన్నిబట్టి చేయాలి.

మీరు వేదాంత శ్రవణ మననాలకు రాకముందు సగుణ ఈశ్వరధ్యానం చేయాలి. అది మీకు జ్ఞానయోగ్యతా ప్రాప్తిని ఇచ్చి, జ్ఞానం పొందేందుకు తోడ్పడు తుంది. ఒకవేళ మీరు ఇప్పటికే వేదాంత శ్రవణ, మననాలు చేసివుంటే నిర్గుణ ఈశ్వరధ్యానం చేయాలి. సగుణ ధ్యానాన్ని ఉపాసన అంటారు, నిర్గుణ ధ్యానాన్ని నిదిధ్యాసనం అంటారు. ఉపాసన, జ్ఞానం పొందకముందు చేస్తే, నిదిధ్యాసనం జ్ఞానం పొందాక చేయాలి.

**ధ్యానఫలం –** సగుణ ధ్యానం చేస్తే మోక్షం రాదు కాని ఇది **జ్ఞానయోగ్యతా ప్రాప్తిని** ఇస్తుంది. నిర్గుణ జ్ఞానానికి సంసిద్ధులను చేస్తుంది. నిర్గుణ ధ్యానం చేస్తే జ్ఞాననిష్ఠ కలుగుతుంది. నా అణువణువులోనూ **అహం బ్రహ్మ అస్మి** జ్ఞానం జీర్ణించుకు పోతుంది. నేను ముక్తపురుషుడిని అనే విషయం అప్రయత్నంగా ఉంటుంది నాలో. లేకపోతే ఎవరైనా, నువ్వు ముక్తపురుషుడివా అని అడిగితే ఆలోచిస్తాను.

ఏమని చెప్పాలి, నేను ముక్తపురుషుడిని అయ్యే స్థితిలో ఉన్నాను అనాలా, ఇప్పుడే కాదు బ్రహ్మసూత్రాలు నేర్చుకున్నాక అవుతాను అనాలా – ఇలాంటి ఆలోచనలు కలుగుతాయి. నేను ముక్తపురుషుడిని అనే సత్యం నాకు కరతలామలకంగా ఉంటుంది.

అద్వైతమకరందంలో నేను బ్రహ్మ కాకుండా ఎలా ఉంటాను అంటాడు శ్రీలక్ష్మీధరకవి. అందరూ నేనేమిటి, బ్రహ్మ అవటమేమిటి అంటారు. ఈ కవి బ్రహ్మ సత్ చిత్ ఆనంద స్వరూపం, నేను కూడా సత్ చిత్ ఆనంద స్వరూపాన్ని. అలాంటప్పుడు నేనూ, బ్రహ్మ ఒకటి కాకుండా ఎలా ఉంటాము అంటాడు.

రమణమహర్షి అంటారు – వందమంది కలిసి నన్ను గాడిద అన్నా కూడా నాకు నేను గాడిదనేమో, మనిషిని కానేమో అనే సందేహం రానేరాదు. అదే విధంగా వందమంది నువ్వు సంసారివి అన్నా కూడా, నేను అసంసారిని అనే సత్యంలో నాకు సందేహం లేదు అనగలగాలి. దీన్ని జ్ఞాననిష్ఠ అంటారు. ఇది ధ్యానఫలం.

**12-15 మంత్రాలు – వేదాంత విచారణ**

శ్రవణ, మననాలు ఇందులో వివరించబడ్డాయి. దీనికి అరణి మథనం దృష్టాంతం ఇవ్వబడింది! వేదాంత శాస్త్రాన్ని మనస్సు సహాయంతో మథనం చేయాలి. ఇందులో ఏది విశ్లేషిస్తాము? జీవ స్వరూపం, ఈశ్వర స్వరూపం. జీవ, ఈశ్వర స్వరూపాలను విశ్లేషిస్తే రెండింటిలోనూ ఉన్నదొక్కటే చైతన్యం అని తెలుసుకుంటాము. ఒకటే చైతన్యం రెండుగా రెండు ఉపాధిలలో ప్రతిబింబిస్తోంది. వ్యష్టి ఉపాధిలో జీవిగా, సమష్టి ఉపాధిలో ఈశ్వరునిగా ప్రతిబింబిస్తోంది. వ్యష్టి శరీరత్రయం చిన్న ఉపాధి అయితే, సమష్టి ప్రపంచ త్రయం పెద్ద ఉపాధి. రెండు ప్రతిబింబ మాధ్యమాలలోనూ ప్రతిబింబిస్తున్నది ఒకటే బింబచైతన్యం. మాధ్యమాల వల్ల దానిలో ఏమార్పు ఉండదు. కాని ఉపాధులలోని వ్యత్యాసం వల్ల చైతన్యంలో వ్యత్యాసం ఉన్నట్టుగా అనిపిస్తుంది. ఉదాహరణకు ఒకే వ్యక్తి ఒకరకమైన అద్దంలో చాలా పొడుగ్గా, సన్నగాను; ఇంకో రకమైన అద్దంలో చాలా పొట్టిగా, లావుగాను కనిపిస్తాడు. కాని అది నిజం కాదని మనకు తెలుసు.

నికృష్ట ఉపాధిలో విశేషణాలు కూడా నికృష్ణ గుణాలను సూచిస్తాయి. అశుద్ధం, పరిచ్ఛిన్నం, కర్తృత్వం, భోక్తృత్వం, అవస్థాత్రయం వగైరా. ఉత్కృష్ట ఉపాధిలో కూడా గుణాలు ఆపాదించబడతాయి. అవి ఉత్కృష్ట గుణాలు అవుతాయి. సర్వజ్ఞత్వం, సర్వశక్తిమత్వం, సర్వవ్యాపకత్వం వగైరా. ఒకరు దాసుడు అయితే, ఇంకొకరు స్వామి; ఒకరు కార్యం అయితే ఇంకొకరు కారణం; ఒకరు కర్మఫలభోక్త అయితే ఇంకొకరు కర్మఫలదాత. ఇలా భిన్న గుణాలు ఉన్నాయి.

శుద్ధ చైతన్యానికి ఏ గుణాలు ఉన్నాయి? – ఉత్కృష్ట గుణాలా, నికృష్ట గుణాలా? శుద్ధ చైతన్యానికి సర్వజ్ఞత్వమూ లేదు, అల్పజ్ఞత్వమూ లేదు. ఈ రెండు రూపాలూ ఆపాదించబడిన గుణాలు. ఈ తేడాలు ఉపాధి వల్ల వచ్చాయి. జ్ఞానం ఏమిటంటే జీవుడిని తీసుకుని, బుద్ధిలో జీవుని గుణాలను విడదీసి, నిర్గుణ చైతన్యంగా చూడగలగటం. భిన్న అద్దాలలో భిన్న రూపాలు నిజం కాదని తెలిసినట్టుగా, భిన్న ఉపాధులలో భిన్నరూపాలు నిజం కాదని తెలుసుకోవాలి. అలాగే పరమాత్మను కూడా గుణాలను విడదీసి, శుద్ధ చైతన్యంగా చూడాలి. ఈశ్వరుని కారణత్వం, జీవుని కార్యత్వం – రెండూ కూడా ఆరోపించబడినవే.

ఒకటే చైతన్యం రెండుగా కనిపిస్తున్నది. అది 14వ మంత్రంలో చూస్తాము.

**పురత్రయే క్రీడతి యశ్చ జీవః – జీవాత్మ**
**ఆధారమానందమఖండబోధం**
**యస్మిన్ లయం యాతి పురత్రయం చ – పరమాత్మ**

పరమాత్మగా కారణం – జీవాత్మ పురత్రయాలలో అవస్థ పడుతుంటే, పరమాత్మ పురత్రయాలను తనలో లయం చేసుకుంటాడు.

జీవాత్మగా కార్యం; కాని శుద్ధ చైతన్యం ఏమిటి?

**కార్యకారణ విలక్షణం**

జీవుడు ఏమిటి? – చైతన్యం
ఈశ్వరుడు ఎవరు? – చైతన్యం
తేడాలు ఏమిటి? – ఆరోపించబడ్డాయి

ఇది వేదాంత విచారణ. ఇదిభాగత్యాగ లక్షణం ద్వారా తెలుసు కోవాలి. గుణాలను విడగొట్టి, చైతన్యాన్ని మాత్రమే చూడాలి. అలా చేయగలిగితే, జీవాత్మ, పరమాత్మ ఐక్యం చూడగలుగుతాము.

**16-23 మంత్రాలు - మహావాక్యాలు**

జీవాత్మ పరమాత్మ ఐక్యాలను సూచిస్తాయి. వీటిని మహావాక్యాలు అంటారు.

**సూక్ష్మాత్సూక్ష్మతరం నిత్యం తత్త్వమేవ త్వమేవ తత్ - 16**

మహావాక్యం ఉద్దేశం ఏమిటి? జీవాత్మ, పరమాత్మల్లో సమానంగా ఉన్న పదమేమిటి? **ఆత్మ.** నికృష్ట ఉపాధి వాడితే జీవాత్మ అయింది, ఉత్కృష్ట ఉపాధి వాడితే పరమాత్మ అయింది. ఉపాధులు లేకుండా చూస్తే ఉన్నది ఏమిటి? ఒకటే ఆత్మ.

అల నుంచి నామరూపాలు తీసేస్తే ఏముంది? నీరు! సముద్రం నుంచి నామరూపాలు తీసేస్తే ఏముంది? నీరు. అల, సముద్రాలు నామరూపాలు మాత్రమే. నామరూపాలు  లేకపోతే ఉన్నదంతా నీరే. ఇదే **అహం బ్రహ్మ అస్మి జ్ఞానం.**

**ఫలం - అహం బ్రహ్మ అస్మి జ్ఞానం** వెంటనే మోక్షాన్ని ఇస్తుంది. అలకు తను అల కాదు అని తెలియగానే, మరణభయం పోతుంది. నీటిగా తనకు మరణం లేదని తెలుసుకుంటుంది.

**24, 25 మంత్రాలు - ఉపసంహారం**

ఎవరికైనా ఈ జ్ఞానం అర్థం కాకపోతే, వాళ్ళు అదనంగా శిక్షణ తీసు కోవాలి. అది కర్మ, ఉపాసన. అనేక కర్మ, ఉపాసనలున్నాయి. అందులో ఒకటి శాస్త్ర పారాయణం. కైవల్యోపనిషత్తు పారాయణం చేస్తే జ్ఞానయోగ్యతా ప్రాప్తి వస్తుంది. కైవల్యోపనిషత్తు అర్థం చేసుకుంటే జ్ఞానం వస్తుంది. పారాయణం ఏ దేవుని మీద పారాయణం అయినా ఫర్వాలేదు. ఆధ్యాత్మిక సాధనలో ఆటంకాలను దురితం అంటారు. ప్రార్థన చేసేముందు ఇలా అంటాము -

**మమోపాత్త దురితక్షయద్వారా**

విహిత కర్మలను చేస్తే దురితం పోయి, జ్ఞానయోగ్యత వస్తుంది. అప్పుడు మళ్ళీ కైవల్యోపనిషత్తుకు రావాలి.

**అనేన జ్ఞానమాప్నోతి సంసారార్ణవనాశనం**

కాకపోతే ఇక్కడ శ్రీరుద్రమంత్రం గురించి ప్రత్యేకంగా చెప్పాడు గురువు. అంతకుముందు అర్థం కానిది బాగా అర్థమవుతుంది; అంతకుముందు స్పష్టంగా అర్థమైనదాని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. గురువు అప్పుడూ, ఇప్పుడూ ఒక్కలాగే చెపుతాడు, కాని దాని ప్రభావం ఇప్పుడు ఎక్కువగా ఉంటుంది. ఈ జ్ఞానం పొంది, దాన్ని జీర్ణించుకున్నాక, కైవల్యం పొందుతాడు. అంటే జీవన్ముక్తి, విదేహముక్తి పొందుతాడు. అది కైవల్యం ఇస్తుంది కాబట్టి దీన్ని కైవల్యోపనిషత్ అంటారు.

శాంతి పాఠం మళ్ళీ పఠించాలి.

**ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః। భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః।**
**స్థిరైరంగైస్తుష్టువాగ్ంసస్తనూభిః। వ్యశేమ దేవహితం యదాయుః।**
**స్వస్తిన ఇన్ద్రో వృద్ధశ్రవాః। స్వస్తి నః పూషా విశ్వవేదాః।**
**స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః। స్వస్తి నో బృహస్పతిర్దధాతు॥**
**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

అంతకుముందు విఘ్నాలు తొలగించమని ప్రార్థిస్తే, ఇప్పుడు విఘ్నాలు తొలగి, నిర్విఘ్నంగా కైవల్యోపనిషత్తుని పూర్తిచేసినందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ పఠిస్తున్నాము.

**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

# కైవల్యోపనిషత్-మంత్రములు

## శాంతిపాఠం

ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః । భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః ।

స్థిరైరంగైస్తుష్టువాగ్ంసస్తనూభిః । వ్యశేమ దేవహితం యదాయుః ।

స్వస్తి న ఇన్ద్రో వృద్ధశ్రవాః । స్వస్తి నః పూషా విశ్వవేదాః ।

స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః । స్వస్తి నో బృహస్పతిర్దధాతు ॥

ఓం శాంతిః శాంతిః శాంతిః॥

అథాశ్వలయనో భగవంతం పరమేష్ఠినముపసమేత్యోవాచ

అధీహి భగవన్ । బ్రహ్మవిద్యాం వరిష్ఠాం ।

సదా సద్భిః సేవ్యమానాం నిగూఢామ్ ।

యయాఽచిరాత్ సర్వపాపం వ్యపోహ్య ।

పరాత్పరం పురుషం యాతి విద్వాన్ ॥ 1

తస్మై స హెూవాచ పితామహశ్చ ।

శ్రద్ధా భక్తి ధ్యానయోగాదవైహి ॥ 2

న కర్మణా న ప్రజయా ధనేన । త్యాగేనైకే అమృతత్వమానశుః ॥

పరేణ నాకం నిహితం గుహాయాం । విభ్రాజతే యద్యతయో విశన్తి ॥ 3

వేదాంతవిజ్ఞానసునిశ్చితార్థాః । సంన్యాసయోగాద్యతయః శుద్ధసత్వాః ।

తే బ్రహ్మలోకేషు పరాన్తకాలే । పరామృతాః పరిముచ్యన్తి సర్వే ॥ 4

వివిక్తదేశే చ సుఖాసనస్థః । శుచిః సమగ్రీవశిరః శరీరః ।

ఆత్యాశ్రమస్థః సకలేంద్రియాణి నిరుధ్య । భక్త్యా స్వగురుం ప్రణమ్య । 5

హృత్పుండరీకం విరజం విశుద్ధం । విచిన్త్య మధ్యే విశదం విశోకమ్ ॥

అచిన్త్యమవ్యక్తమనన్తరూపం। శివం ప్రశాంతమమృతంబ్రహ్మయోనిమ్ ।

తథాదిమధ్యాన్తవిహీనమేకం। విభుం చిదానందమరూపమద్భుతమ్ ॥ 6

ఉమాసహాయం పరమేశ్వరం ప్రభుం। త్రిలోచనం నీలకంఠం ప్రశాంతమ్ ।
ధ్యాత్వా మునిర్గచ్ఛతి భూతయోనిం। సమస్తసాక్షిం తమసః పరస్తాత్ ॥ 7
స బ్రహ్మా స శివః సేంద్రః । సోఽక్షరః పరమః స్వరాట్ ।
స ఏవ విష్ణుః స ప్రాణః । స కాలోఽగ్నిః స చంద్రమాః । 8
స ఏవ సర్వం యద్భూతం । యచ్చ భవ్యం సనాతనమ్ ।
జ్ఞాత్వా తం మృత్యుం అత్యేతి । నాన్యః పంథా విముక్తయే ॥ 9
సర్వభూతస్థమాత్మానం । సర్వభూతాని చాత్మని ॥
సంపశ్యన్ బ్రహ్మ పరమం। యాతి నాన్యేన హేతునా ॥ 10
ఆత్మానమరణిం కృత్వా । ప్రణవం చోత్తరారణిమ్ ।
జ్ఞాననిర్మథనాభ్యాసాత్ । పాశం దహతి పండితః ॥ 11
స ఏవ మాయా పరిమోహితాత్మా । శరీరమాస్థాయ కరోతి సర్వమ్ ॥
స్త్రియన్నపానాది విచిత్రభోగైః । స ఏవ జాగ్రత్ పరితృప్తిమేతి ॥ 12
స్వప్నే స జీవః సుఖదుఃఖభోక్తా । స్వమాయయా కల్పితజీవలోకే ।
సుషుప్తికాలే సకలే విలీనే । తమోఽభిభూతః సుఖరూపమేతి ॥ 13
పునశ్చ జన్మాంతరకర్మయోగాత్ । స ఏవ జీవః స్వపితి ప్రబుద్ధః ॥
పురత్రయే క్రీడతి యశ్చ జీవః । తతస్తు జాతం సకలం విచిత్రం ॥
ఆధారమానందమఖండబోధం । యస్మిన్ లయం యాతి పురత్రయం చ ॥ 14
ఏతస్మాజ్జాయతే ప్రాణో మనః సర్వేన్ద్రియాణి చ।
ఖం వాయుర్జ్యోతిరాపశ్చ పృథ్వీ విశ్వస్య ధారిణీ॥ 15
యత్పరం బ్రహ్మ సర్వాత్మా । విశ్వస్యాయతనం మహత్ ॥
సూక్ష్మాత్సూక్ష్మతరం నిత్యం । తత్త్వమేవ త్వమేవ తత్ ॥ 16
జాగ్రత్ స్వప్న సుషుప్త్యాది । ప్రపంచం యత్ ప్రకాశతే ।
'తద్ బ్రహ్మాహ' మితి జ్ఞాత్వా । సర్వబంధైః ప్రముచ్యతే ॥ 17

త్రిషు ధామసు యద్భోగ్యం । భోక్తా భోగశ్చ యద్భవేత్ ॥
తేభ్యో విలక్షణః సాక్షీ । చిన్మాత్రోఽహం సదాశివః ॥ 18
మయ్యేవ సకలం జాతం । మయి సర్వం ప్రతిష్ఠితమ్ ।
మయి సర్వం లయం యాతి । తద్బ్రహ్మాద్వయమస్మ్యహమ్ ॥ 19
అణోరణీయానహమేవ తద్వన్మహానహం విశ్వమహం విచిత్రమ్ ॥
పురాతనోఽహం పురుషోఽహమీశో । హిరణ్మయోఽహం శివరూపమస్మి ॥ 20
అపాణిపాదోఽహమచింత్యశక్తిః । పశ్యామ్యచక్షుః స శృణోమ్యకర్ణః॥
అహం విజానామి వివిక్తరూపో న చాస్తి వేత్తా మమ చిత్సదాహమ్॥ 21
వేదైరనేకైరహమేవ వేద్యో। వేదాంతకృద్వేదవిదేవ చాహమ్ ॥
న పుణ్యపాపే మమ నాస్తి నాశో। న జన్మ దేహేంద్రియబుద్ధిరస్తి ॥ 22
న భూమిరాపో న చ వహ్నిరస్తి । న చాఽనిలో మేఽస్తి న చాంబరం చ ॥
ఏవం విదిత్వా పరమాత్మ రూపం ।
గుహాశయం నిష్కల మద్వితీయమ్ ॥ 23
సమస్తసాక్షిం సదసద్విహీనం ।
ప్రయాతి శుద్ధం పరమాత్మరూపమ్ ॥ 24
యశ్శతరుద్రీయమధీతే । సోఽగ్నిపూతో భవతి । సురాపానాత్ పూతో భవతి।
సబ్రహ్మహత్యాయాః పూతో భవతి। స సువర్ణస్తేయాత్పూతో భవతి।
కృత్యాకృత్యాత్ పూతో భవతి । తస్మాదవిముక్తమాశ్రితో భవతి ।
అత్యాశ్రమీ సర్వదా సకృద్వా జపేత్ ॥ 25
అనేన జ్ఞానమాప్నోతి । సంసారార్ణవనాశనమ్ ।
తస్మాదేవం విదిత్వైనం కైవల్యం
పదమశ్నుతే - కైవల్యం పదమశ్నుత ఇతి ॥

***